సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00   సంపుటి: 18 సంచిక: 140

SUNDAY Special   ఆదివారం 10-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



సంతాన నియంత్రణకు మేల్‌పిల్..

పురుషులకూ సంతాన నియంత్రణ మాత్రలు రాబోతూ ఉండటం వల్ల... ఇప్పుడు మహిళలకు ఎంతోకాలంగా మోస్తున్న భారం నుంచి విముక్తి దొరికేందుకు ఆస్కారముంది. - 13లో



మూడో రౌండ్‌లో అర్జున్ విజయం

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ 'మాస్టర్స్' కేటగిరీలో తెలంగాణ ప్లేయర్ అర్జున్ ఇరిగేశి రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మూడో రౌండ్‌లో అర్జున్ అమెరికా ఆటగాడు రే రాబ్సన్‌ను ఓడించాడు. - 14లో



5 పాక్ యుద్ధ విమానాలు కూల్చేశాం

ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వైమానిక దళాన్ని భారీగా దెబ్బకొట్టామని ఐఏఎఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ చెప్పారు. - వివరాలు 6లో



15న పుతిన్, ట్రంప్ భేటీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ ఈ నెల 15న అలస్కాలో భేటీ కానున్నారు. - వివరాలు 6లో



నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంలో శుక్రవారం రాత్రి నుంచి కొనసాగుతున్న భీకర ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఆర్మీ జవాన్లు నేలకొరిగారు. వివరాలు 6లో



కృష్ణ బిలాల రహస్యాల ఛేదన

నానోక్రాఫ్ట్‌తో కృష్ణ బిలాల మిస్టరీలను ఛేదించవచ్చని ప్రముఖ ఆస్ట్రో ఫిజిసిస్ట్ కాసిమో బాంబి అంచనా వేస్తున్నారు.- వివరాలు 6లో

కోటి ఎకరాల్లో సాగు

రాష్ట్రంలో 25% లోటు వర్షపాతం ఉన్నా 1.02 కోట్ల ఎకరాల్లో పంటలు


ఈ సీజన్‌లో సాగు లక్ష్యాన్ని 1.32 కోట్ల ఎకరాలుగా అంచనా వేసిన వ్యవసాయ శాఖ

అందుకు అనుగుణంగానే వివిధ పంటలను సాగు చేస్తున్న రైతాంగం

ఇప్పటికే 45 లక్షల ఎకరాల్లో పత్తి, సుమారు 32 లక్షల ఎకరాల్లో వరి సాగు

సుమారు 14 లక్షల ఎకరాల్లో సాగవుతున్న మొక్కజొన్న, కంది, సోయాబీన్

నెలాఖరుకు మరో 30 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేసే అవకాశం



పూర్తిస్థాయిలో పత్తి, మొక్కజొన్న

రాష్ట్రంలో వర్షాకాల పంటల్లో కీలకమైన పత్తి, మొక్కజొన్న వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగా సాగయ్యాయి. ఈ సంవత్సరం పత్తి 48.93 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ శాఖ లెక్కలు వేయగా ఇప్పటివరకు 45 లక్షల ఎకరాల్లో సాగైంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 5.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగవ్వగా, ఆ తర్వాతి స్థానంలో 4.3 లక్షల ఎకరాలతో ఆదిలాబాద్ ఉంది. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, మంచిర్యాల, నిర్మల్, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అధిక విస్తీర్ణంలో పత్తి సాగైంది. మొక్కజొన్న 5.21 లక్షల ఎకరాల సాధారణ సాగును దాటి 5.55 లక్షల ఎకరాల్లో సాగయింది. కంది 4.44 లక్షల ఎకరాల్లో సాగవగా సోయాబీన్‌ను 3.57 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఈ సీజన్‌లో కోటి ఎకరాలకుపైగా వివిధ పంటలు సాగవుతున్నాయి. ముమ్ముందు వరుణుడు కరుణిస్తాడన్న నమ్మకంతో వ్యవసాయ శాఖ అంచనాలకు అనుగుణంగానే రైతాంగం వివిధ పంటలను సాగు చేస్తోంది. వానాకాలం సీజన్‌లో నీరు తక్కువ అవసరమైన పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, కంది పంటలను ఇప్పటికే భారీగా సాగు చేసిన రైతులు.. వరిని ఆచితూచి సాగు చేస్తున్నారు. ఉత్తర తెలంగాణలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే నాట్లు పడాల్సిన పల్లెల్లో కొంత ఆలస్యమైంది. ఆరు జిల్లాల్లోని 170 మండలాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే నెలకొని ఉండటం గమనార్హం. అయితే ఆగస్టు మూడో వారం దాటితే వరిసాగుకు గడువు ముగుస్తుందనే కారణంతోపాటు సెప్టెంబర్ దాకా వర్షాలు కురిసి గోదావరి నిండుతుందన్న నమ్మకంతో రైతులు పొలాల బాట పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 25 శాతం వరకు లోటు వర్షపాతం ఉన్నప్పటికీ వానాకాలం సీజన్ పంటల సాగు కోటి ఎకరాలు దాటింది. వ్యవసాయ శాఖ ఈ సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా ఇప్పటికే 1.02 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో వరి సాగు విస్తీర్ణం సుమారు 32 లక్షల ఎకరాలుగా ఉంది. ఈ నెలాఖరు వరకు మరో 30 లక్షల ఎకరాల్లో వరిసాగు విస్తీర్ణం పెరుగుతుందని

మిగతా 5వ పేజీలో ▶



ఐ లవ్ యూ పీఎం..

శనివారం ఢిల్లీలో రక్షాబంధన్ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో చిన్నారితో సరదాగా ముచ్చటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

హిమాయత్‌సాగర్ వద్ద గేట్‌వే ఆఫ్ హైదరాబాద్

నగరానికి ముఖద్వారంగా ఎత్తయిన ఐకానిక్ టవర్

అద్భుత పర్యాటక ప్రాంతంగా బాపూఘాట్ పరిసరాలు

బహుళ ప్రయోజనాలుండేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు

అధ్యయనం, డిజైన్ల పనులు వేగవంతం చేయండి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును బహుళ ప్రయోజనాలు ఉండేలా రూపకల్పన చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌కు ముఖద్వారంగా ఉన్న హిమాయత్ సాగర్ గాంధీ సరోవర్ వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై గేట్ వే ఆఫ్ హైదరాబాద్ పేరిట ఐకానిక్ టవర్‌ను నిర్మించాలని సూచించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై సీఎం శనివారం పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ఉండాలని తెలిపారు. ఓఆర్‌ఆర్‌కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివృద్ధి చేసి, మరో వైపు బాపూఘాట్ దిక్కున భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని ఆదేశించారు. అందుకు తగిన డిజైన్లు రూపొందించాలని సూచించారు. బాపూఘాట్ చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అందరినీ ఆకట్టుకునేలా డిజైన్ చేయాలని చెప్పారు. హిమాయత్ సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని.. గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్‌లా ఉండాలని తెలిపారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తయిన టవర్‌గా ఉండాలని సీఎం సూచించారు. ఐకానిక్ టవర్ తదితర వాటికి డిజైన్లు రూపకల్పన చేసి, రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

అధ్యయనం చేయండి

తాగు నీటితోపాటు వరద నీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ఉండాలని సీఎం అన్నారు. వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్టుల నమూనాలు పరిశీలించాలని పురపాలక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ తాగు నీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. స్థలం వృథా కాకుండా మూసీ పరీవాహక ప్రాంతం ఇరువైపులా భూగర్భంలో భారీగా వాటర్ స్టోరేజ్ సంప్‌లు నిర్మించి.. అక్కడి నుంచి నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

'ఓట్ల చోరీ'పై ప్రజల్లోకి

ఈ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని టీపీసీసీ సూత్రప్రాయ నిర్ణయం

బీజేపీ ఎలక్టోరల్ మోసాలకు పాల్పడుతోందని ఆరోపణ

నియోజకవర్గాల్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లకు యోచన



శనివారం గాంధీభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను చూస్తున్న పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్ గౌడ్, వీహెచ్, జూపల్లి కృష్ణారావు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఈ అంశాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లనుంది. ఇప్పటికే లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బీజేపీని, ఎన్నికల సంఘాన్ని తూర్పారబడుతున్న నేపథ్యంలో పార్టీ కేడర్‌తోపాటు ప్రజలకు కూడా దీనిపై అవగాహన కల్పించాలని టీపీసీసీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. త్వరలోనే ఏఐసీసీ నుంచి అందే మార్గదర్శకాల ప్రకారం కార్యాచరణ రూపొందిస్తామని పీసీసీ నేతలు చెబుతున్నారు.

ప్రజెంటేషన్లు.. శిక్షణ తరగతులు

బీజేపీ ఓట్ల చోరీకి ఎలా పాల్పడుతోందన్న అంశాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా ప్రజలకు వివరించాలని టీపీసీసీ భావిస్తోంది. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఎలాంటి కార్యక్రమాలను రూపొందించాలన్న విషయమై కసరత్తు చేస్తోంది. ప్రజెంటేషన్లకు తోడు కొత్త ఓటర్ల నమోదు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అనుబంధ సంఘాలకు శిక్షణ తరగతులు నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఓటర్ల నమోదు కార్యక్రమం పూర్తయ్యాక ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో డిజిటల్ ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘానికి ఎక్కడికక్కడ విజ్ఞప్తులు చేయడం ద్వారా వెంటనే ఓటరు జాబితాను పరిశీలించే అవకాశం ఉంటుందని భావిస్తోంది. అందుకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టనుంది. 'బీజేపీ ఎలక్టోరల్ మోసాలకు పాల్పడి గెలుస్తోందనే విషయం అందరికీ తెలుసు. అయితే ఈ అంశాన్ని ఏ రాజకీయ పార్టీ కూడా సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు రాహుల్ గాంధీ దీనిపై కొట్లాడాలని

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

334 రాజకీయ పార్టీలపై వేటు




దేశంలో 334 రాజకీయ పార్టీలపై ఈసీ వేటు వేసింది. 2019 నుంచి ఇప్పటి వరకు అంటే ఆరేళ్ల కాలంలో జరిగిన ఏ ఒక్క ఎన్నికల్లోనూ ఈ పార్టీలు పోటీ చేయలేదని స్పష్టం చేసింది. అందుకే ఆయా పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు పేర్కొంది. -6లో

20% రిటర్న్ టికెట్‌పై రాయితీ..



దీపావళి, ఛత్ పండుగల రద్దీని తగ్గిస్తూ ప్రయాణికులకు సౌలభ్యం కల్పించేందుకు రైల్వే శాఖ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్' పేరుతో ప్రవేశపెట్టిన ఈ స్కీమ్‌లో రిటర్న్ టికెట్ ప్రాథమిక ధరపై 20 శాతం రాయితీ లభిస్తుంది. -6లో

ఆర్టీసీకి అనువైన చోటు.. పోలీస్ శాఖకు



హైదరాబాద్ ఆరాంఘర్‌లో ఆర్టీసీకి అనువైన స్థలాన్ని పోలీస్‌శాఖకు కేటాయించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. శాస్త్రీయ అధ్యయనం లేకుండా, సర్వే చేయకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. - 2లో

కోట్ల విలువైన.. కొమ్ము గుర్రాలు



ఒక బిలియన్ డాలర్ల మార్కెట్ విలువున్న స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. ఇవేకాదు.. ఇందులో ఇంకా డెకాకార్న్, హెక్టాకార్న్ వంటివీ ఉన్నాయి. యూనికార్న్ స్థాయికి చేరడానికి సిద్ధంగా ఉన్న 'జింక'లూ, 'చిరుత'లూ కూడా ఉన్నాయి. - 16లో

అటు బనకచర్ల.. ఇటు ఎమ్మెల్సీలు



సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు

ఎమ్మెల్సీల అనర్హతపై సోమవారం కేటీఆర్ పిటిషన్ దాఖలు

బనకచర్లపై సుప్రీం న్యాయవాదులతో హరీశ్ మంతనాలు

3లో

బీజేపీ 'ఆకర్ష్' వేగిరం



నేడు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరిక

మరో ఇద్దరు ముగ్గురు మాజీలూ అదే దారిలో..

బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

స్థానిక ఎన్నికపై దృష్టి.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి అసంతృప్తులను చేర్చుకునే వ్యూహం

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



పనిలోపని ఆ పార్టీని కూడా తీసేస్తే పోలా!



సూపర్ ఏజర్.. వీళ్ల జ్ఞాపకశక్తీ సూపర్

- మనిషి మెదడు వృద్ధాప్యంలో కుచించుకుపోతుంది. జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుంది. అయినప్పటికీ, 'సూపర్ ఏజర్స్' అని శాస్త్ర పరిశోధకులు పేర్కొంటున్న కొందరిలో అలా జరగటం లేదు! ఎనభై ఏళ్ల వయసు దాటినా, వారి మెదడు చురుగ్గా పనిచేస్తుంటుంది. మనుషుల్ని చక్కగా గుర్తు పడతారు.

- వివరాలు 12లో

ఉరిమిన వరుణుడు



హైదరాబాద్ వీఎస్‌టీ క్రాస్ రోడ్స్‌లో వర్షానికి జలమయమైన రహదారి

ఉరుములు, మెరుపులతో హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

రోడ్లన్నీ జలమయం.. పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి వరద

నగర శివారులోని తొర్రూర్‌లో అత్యధికంగా 13.5 సెం.మీ. వర్షపాతం నమోదు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరాన్ని మరోసారి భారీ వర్షం ముంచెత్తింది. శనివారం రాత్రి 8:30 గంటల నుంచి సుమారు రెండు గంటలపాటు ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం దంచికొట్టింది. దీంతో ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపించగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఫలితంగా ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. పలు అపార్ట్‌మెంట్లలోకి వరదనీరు వచ్చి చేరింది. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలు వర్ష బీభత్సానికి వణికిపోయాయి. రాత్రి 11 గంటల వరకు నగర శివారులోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అత్యధికంగా 13.5 సెం.మీ. వర్షం కురిసింది. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షానికి హైదరాబాద్-విజయవాడ హైవేపై పెద్దఅంబర్‌పేట్ వద్ద రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఫలితంగా వాహనదారులు, ఊళ్లకు పయనమైన ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. మరోవైపు నగరంలోని ప్రధాన ప్రాంతాలైన బేగంబజార్, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, శ్రీనగర్ కాలనీ తదితర

మిగతా 2వ పేజీలో ▶



రోజులో సంతోషమే ఎక్కువ

- సంతోషం, బాధ, ఆందోళన, ఆశ్చర్యం, కోపం.. ఇలాంటి భావోద్వేగాల సమాహారమే మన జీవితం. ఆ క్షణానికే చిన్నపిల్లల్లా మారిపోతాం.. మరుక్షణమే రాక్షసుల్లా ప్రవర్తిస్తాం.. ఇంకో క్షణంలో ఒత్తిడికి గురవుతాం.. ఏ ఎమోషన్ ఎక్కువసేపు ఉండదు. చాలామంది దీన్ని అంగీకరించరు కానీ ఇదే వాస్తవం. వీటిలో మనతో ఎక్కువ సేపు ఉండేది ఏది?

- వివరాలు 2లో

రోజులో సంతోషమే ఎక్కువ

సంతోషం, బాధ, ఆందోళన, ఆశ్చర్యం, కోపం.. ఇలాంటి భావోద్వేగాల సమాహారమే మన జీవితం. ఆ క్షణానికే చిన్న పిల్లల్లా మారిపోతాం.. మరుక్షణమే రాక్షసుల్లా ప్రవర్తిస్తాం.. ఇంకో క్షణంలో తీవ్ర ఒత్తిడికి గురవుతాం.. ఏ ఎమోషన్ కూడా మనలో ఎక్కువ సేపు ఉండదు. చాలామంది దీన్ని అంగీకరించరు కానీ ఇదే వాస్తవం. సరే, ఇన్ని భావోద్వేగాల్లో మనతో ఎక్కువ సేపు ఉండేది ఏది? చాలామంది అనుకుంటున్నట్టు బాధ /ఆవేదన / ఆందోళన ఇవేనా మన రోజువారీ జీవితంలో రాజ్యమేలుతున్నాయి? అంటే కాదు.. అంటున్నారు మానసిక నిపుణులు.



ఆ తరవాతి స్థానాల్లో ప్రేమ, ఆందోళన

రోజులో సానుకూల భావోద్వేగాలే ఎక్కువ

స్త్రీల కంటే పురుషుల్లోనే అధిక పాజిటివ్ ఎమోషన్లు

90 శాతం సమయంలో ఏదో ఒక భావోద్వేగం


సాక్షి, స్పెషల్ డెస్క్: ఏ మనిషీ రోజూ ఏడుస్తూ కూర్చోడు.. ఆవేదన, ఆందోళనలతో ఉక్కిరిబిక్కిరైపోడు. అలాగని రోజంతా సంతోషం, ఆనందం కూడా ఉండవు. కానీ, ఒక రోజులో ఒక మనిషిలో ఎక్కువ సేపు ఉండే ఎమోషన్ ఏదో తెలుసా.. సంతోషం. నెదర్లాండ్స్, స్పెయిన్, అమెరికాకు చెందిన వేర్వేరు విభాగాలకు చెందిన పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. చాలామంది కోపిష్టులు మన చుట్టూ ఉంటారు. వాళ్లు కూడా రోజంతా ఎవరు దొరుకుతారా తిడదామా, కొడదామా అని రోజంతా ఉండరు. రోజు మొత్తం భావోద్వేగాల్లో ఇది 10 శాతం కూడా ఉండదు. కానీ, స్త్రీలలో మాత్రం పురుషుల కంటే ఎక్కువ సమయం కోపం ఉంటోందట. భయం కూడా రోజులో చాలా తక్కువ సేపే.. కేవలం 5 శాతమే ఉంటోంది.


రోజుకు ఒకలా..

ఇకపోతే అన్ని రోజులూ అన్ని ఎమోషన్లూ ఒకేలా ఉండవు. సాధారణంగా వారం ప్రారంభంలో విచారం, ఆందోళన, కోపం వంటి ప్రతి కూల భావోద్వేగాల శాతం ఎక్కువగా ఉంటోంది. వారాంతంలో అనుకూల భావోద్వేగాలైన ఆనందం, ప్రేమ, సంతృప్తి ఎక్కువ శాతంలో ఉంటున్నాయి.

పురుషుల్లో ఒకలా.. మహిళల్లో మరోలా..

- రోజువారీ జీవితంలో 45 శాతం సమయంలో పూర్తిగా పాజిటివ్ ఎమోషన్స్ ఉంటున్నాయని మగాళ్లు చెప్పారు. అలాగే 14 శాతం నెగెటివ్, 31 శాతం మిశ్రమ భావోద్వేగాలు ఉంటున్నాయని చెప్పారు.
- ఈ విషయంలో మహిళలు.. 39 శాతం పాజిటివ్, 17 శాతం నెగెటివ్, 34 శాతం మిశ్రమ భావోద్వేగాలు ఉంటున్నాయని చెప్పారట.
- స్త్రీలతో పోలిస్తే పురుషులు సానుకూల భావోద్వేగాలను ఎక్కువ సార్లు అనుభవిస్తున్నారట. ఇందులో కూడా ప్రత్యేకించి.. ఆనందం, సంతృప్తి, అప్రమత్తత, ఉల్లాసం, గర్వం వంటివి స్త్రీలలో కంటే పురుషుల్లో ఎక్కువసార్లు కలుగుతున్నాయట.





ప్రామాణిక పరిశోధన

నెదర్లాండ్స్, స్పెయిన్, అమెరికాకు చెందిన వేర్వేరు విభాగాలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. మొత్తంగా 11,572 మంది పాల్గొన్నారు. సగటు వయసు 33 సంవత్సరాలు. ఇందులో ఫ్రెంచి, స్విస్, బెల్జియం దేశాల వారు ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో సగానికిపైగా మహిళలే. ఈ అధ్యయనం కోసం '58 సెకెన్లు' అనే మొబైల్ యాప్‌ని తయారుచేశారు. రోజులో ఏ సమయంలో ఏ భావోద్వేగం ఉంటుందో చెప్పాలని వీరికి ఒక ప్రశ్నపత్రం ఇచ్చారు. 2013 ఫిబ్రవరి నుంచి 2014 ఏప్రిల్ వరకు డేటా సేకరణ చేశారు. ఈ యాప్ ఇప్పటికీ కూడా పనిచేస్తోంది. ఇది ప్రపంచ ప్రసిద్ధ ప్లస్ వన్ సైన్స్ జర్నల్ సహా అనేక జర్నళ్లలో ప్రచురితమైంది. దీన్ని ఇప్పటికీ భావోద్వేగాలకు సంబంధించి ప్రామాణిక పరిశోధనల్లో ఒకటిగా పరిగణిస్తారు.

ఒక రోజులో ఏ ఎమోషన్ మనలో ఎక్కువ శాతం ఉంటుందంటే.. టాప్ 10 ఎమోషన్లు
› ఆనందం › ప్రేమ › ఆందోళన › సంతృప్తి › అప్రమత్తత
› ఆశ › విచారం › ఉల్లాసం › గర్వం › అసహ్యం / చిరాకు

రోజులో రాత్రి 8 నుంచి 9 గంటల సమయంలో ఆనందం, ఉల్లాసం, ప్రేమ వంటి భావోద్వేగాలు ఎక్కువగా కనిపించాయి.

రోజులో ఎక్కువ సార్లు కలిగే అనుభూతి ఆనందం. ఆ తరవాతి స్థానాల్లో ప్రేమ, ఆందోళన ఉన్నాయి. ప్రతికూల భావోద్వేగాల కంటే అనుకూలమైనవి 2.5 రెట్లు ఎక్కువ సార్లు రోజులో కలుగుతున్నాయట. రోజులో 90 శాతం సమయంలో ప్రతి కూల లేదా అనుకూల లేదా మిశ్రమ.. ఇలా ఏదో ఒక భావోద్వేగం కలుగుతోందట.



రాఖీ సందర్భంగా హరీశ్‌రావుకు బొట్టు పెడుతున్న సత్యవతి రాథోడ్

సమ్మర్ క్యాంపుల నిర్వహణలో మీ పాత్ర ఉందా?

నిధుల ఖర్చులో జగన్మోహన్‌రావు ఏవైనా ఆదేశాలు ఇచ్చేవారా?

మూడో రోజూ దేవరాజ్‌ను విచారించిన సీఐడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: బీసీసీఐ (భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు) నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు వచ్చిన నిధులను సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ఖర్చు పెట్టినట్టుగా లెక్కల్లో చూపి, కొల్లగొట్టిన వ్యవహారంపై సీఐడీ అధికారులు హెచ్‌సీఏ సెక్రెటరీ దేవ రాజ్ రామ్‌చందర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో క్రికెట్ ఆట అభివృద్ధితోపాటు, యువ ఆటగాళ్ల ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహించాల్సిన సమ్మర్ క్యాంపుల నిర్వహణలోనూ అవినీతి జరిగినట్టు కీలక ఆధారాలు లభించడంతో ఈ అంశంపై సీఐడీ అధికారులు దృష్టిసారించారు. మల్కాజిగిరి కోర్టు అనుమతితో శనివారం మూడో రోజు సైతం దేవరాజ్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు, ఈ కేసులో ఏ–1 జగన్మోహన్ రావుతో ఎప్పటి నుంచి పరిచయం ఉంది..? అధ్యక్ష ఎన్నికల్లో జగన్మోహన్‌రావుకు ఏదైనా సహకారం అందించారా? డాక్యుమెంట్ల ఫోర్జరీ అంశం గురించి ముందుగా తెలుసా? హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్మోహన్‌రావు ఆర్థిక అంశాల్లో ఏవైనా ఆదేశాలు ఇచ్చేవారా? అని సీఐడీ అధికారులు దేవరాజ్‌ను ప్రశ్నించినట్టు తెలిసింది. గతంలో కస్టడీలో భాగంగా జగన్మోహన్‌రావు, హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంటే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రెటరీ సి.రాజేందర్ యాదవ్, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవితల విచారణ సందర్భంగా సేకరించిన సమాచారం పైనా దేవరాజ్‌ను సీఐడీ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. విచారణ సందర్భంగా ఇప్పటికే ఉప్పల్ స్టేడియం నుంచి సేకరించిన పలు డాక్యుమెంట్లను ముందుంచి దేవరాజ్‌ను ప్రశ్నించారని, అయితే చాలా అంశాలకు దేవరాజ్ సమాధానాలు దాటవేశాడని తెలుస్తోంది.

ఆర్టీసీకి అనువైన చోటు.. పోలీస్ శాఖకు

సర్వే చేయకుండా నిర్ణయాలు

- ఆరాంఘర్ కూడలిలో నిత్యం ఆగుతున్న 2,200 బస్సులు
- పక్కనే ఉన్న ప్రభుత్వ ఖాళీ భూమిలో టెర్మినల్ నిర్మాణానికి ప్లాన్
- పోలీస్ శాఖకు ఉపయోగపడే భూమి ఆర్టీసీ వద్ద అందుబాటులో
- డిపో స్థలాన్ని పోలీస్‌శాఖకు కేటాయించి, ఆరాంఘర్ భూమి ఆర్టీసీకి ఇస్తే సమస్య పరిష్కారం



ఆరాంఘర్‌లోని ఆర్టీసీ టెర్మినల్ ప్రతిపాదిత స్థలం ఇదే. దీనిని పోలీసు శాఖకు కేటాయించారు (ఇన్‌సెట్)లో రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్‌డిపో

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీకి అనువైన స్థలానికి పోలీస్‌శాఖకు కేటాయించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. శాస్త్రీయ అధ్యయనం లేకుండా, సర్వే చేయకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. శంషాబాద్ ప్రధాన రోడ్డు మీద ఉన్న ఆరాంఘర్ కూడలి ప్రాంతంలో బస్ టెర్మినల్ నిర్మాణానికి ఆర్టీసీ ప్లాన్ చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, ఏపీలోని కర్నూలు, కడప, అనంతపురం, తిరుపతి లాంటి రాయలసీమ ప్రాంతాలు, బెంగళూరు, రాయచూరు లాంటి ప్రాంతాలకు నిత్యం బస్సులు ఈ కూడలిలో ఆగుతుంటాయి. ఆయా మార్గాల్లో వెళ్లే దాదాపు 700 బస్సులు ఇక్కడ నిలుస్తాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా ఇక్కడే జమ అవుతుండటంతో సిటీ బస్సులకు కూడా ఇది కేంద్రంగా మారింది. అక్కడ దాదాపు 1,500 సిటీ బస్సులు నిలుస్తాయి. దీంతో ఇదే ప్రాంతంలో అటు సిటీ, ఇటు అంతర్రాష్ట్ర సర్వీసులు నిలిపేందుకు వీలుగా పెద్ద టెర్మినల్ నిర్మించాలని ఆర్టీసీ నిర్ణయించింది. కూడలిలోనే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ వెల్ఫేర్‌కు చెందిన 14 ఎకరాల ఖాళీ స్థలం ఉండటంతో, అందులో ఏడెకరాల భూమి తమకు కేటాయిస్తే జూబ్లీ బస్టాండు కంటే పెద్ద టెర్మినల్ నిర్మిస్తామని, ఇది ప్రయాణికులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆర్టీసీ ప్రభుత్వాన్ని కోరింది. మానసిక పరిపక్వత లేని చిన్నారుల కోసం అక్కడ ఓ కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం ఈ స్థలాన్ని గతంలో ప్రైవేట్ సంస్థకు కేటాయించింది. కొంతకాలంగా ఆ సంస్థ కార్యకలాపాలు లేకపోవటంతో ఆ స్థలం ఖాళీగానే ఉంది.

సానుకూలంగా స్పందించి..
ఆ తర్వాత పోలీసు శాఖకు కేటాయింపు..

ఆర్టీసీ విన్నపానికి తొలుత సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఆ తర్వాత మనసు మార్చుకొని దాన్ని పోలీస్ శాఖకు కేటాయించింది. ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవనానికి గోషామహల్‌లోని పోలీసు మైదానంలో దాదాపు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించటంతో, పోలీస్ శాఖకు ప్రత్యామ్నాయ స్థలంగా ఆరాంఘర్ స్థలాన్ని కేటాయించింది. కానీ, ఈ విషయంలో ప్రభుత్వం సర్వే చేసినట్టు కనిపించటం లేదు.

ఆరాంఘర్ కూడలికి కూతవేటు దూరంలో రాజేంద్రనగర్‌లో ఆర్టీసీ బస్‌డిపో ఉంది. దాదాపు 9 ఎకరాల స్థలంలో ఇది విస్తరించి ఉంది. బస్‌డిపోను ఆనుకునే రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ ఉంది. ఇదే ప్రాంగణంలో ఏసీపీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, సిబ్బంది క్వార్టర్లు ఉంటాయి. ఇవన్నీపోను ఎకరాల విస్తీర్ణంలో ఖాళీ స్థలం ఉంది. ఇదంతా పోలీస్ శాఖ అధీనంలోనే ఉన్నందున, పక్కనే ఉన్న ఆర్టీసీ బస్‌డిపో స్థలాన్ని.. గోషామహల్ పోలీస్ గ్రౌండ్ కోల్పోయినందుకు ప్రత్యామ్నాయ భూమిగా సేకరించి పోలీస్‌శాఖకు అందిస్తే.. ఆ శాఖకు సంబంధించిన ఇక్కడి కార్యాలయాలు ఒకే చోట ఉన్నట్టవుతుంది. ఇప్పుడు ఆరాంఘర్ కూడలిలోని స్థలాన్ని ఆర్టీసీకి కేటాయిస్తే, కోల్పోయే రాజేంద్రనగర్ డిపో సహా కొత్త టెర్మినల్‌ను అక్కడే నిర్మించుకునే వీలుంది. దీంతో ఆర్టీసీకి సంబంధించిన నిర్మాణాలన్నీ ఒకేచోట ఉంటాయి. ఇది ఇటు ఆర్టీసీకి, అటు పోలీస్ శాఖకు అనుకూలంగా ఉండే వీలుంది. ఈ కోణంలో ఉన్నతాధికారులు యోచించకుండా, రెండు శాఖలకు అసౌకర్యంగా ఉండే నిర్ణయం తీసుకోవటం విశేషం. ఆరాంఘర్ కూడలిలో కాకుండా, వేరే చోట ఆర్టీసీ టెర్మినల్ నిర్మిస్తే ఉపయోగం అంతగా ఉండదని, వేరే చోట కొత్త టెర్మినల్ నిర్మించినా.. ప్రయాణికులు ఎక్కువ మంది మళ్లీ ఆరాంఘర్ కూడలికే వస్తారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

పంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు ఏర్పాటు

- పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ ఖాళీ భూముల్లో కూడా..
- వెంటనే ఖాళీ భూములు, భవనాల వివరాలు పంపండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ భవనాలు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాస పథకం అమలుపై శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్‌కు పంపాలని ఆదేశించారు. రాష్ట్రంలోని కలెక్టరేట్లన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచే పంపిస్తామని తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లు పంపాల్సిన వివరాలతో ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారంలోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు.

స్కూళ్లపై కూడా సోలార్ ప్లాంట్లు

ప్రభుత్వ భవనాలతోపాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఉన్న ఖాళీ భూముల వివరాలు సైతం పంపాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన 6.70 లక్షల ఎకరాల్లో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ఇవి ప్రారంభించామని, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

14 లేదా 16న కొడంగల్‌కు సీఎం

అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో సమీక్ష

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 14 లేదా 16వ తేదీన కొడంగల్‌లో పర్యటించనున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు స్థానిక అధికారులకు మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. నియోజకవర్గంలో గడిచిన ఏడాదిన్నర కాలంలో సుమారు రూ.10 వేల కోట్లతో పలు రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, జూనియర్ కళాశాలలు, 220 పడకల ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రి, కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకం, కొడంగల్‌లో రూ.6 కోట్లతో ఆర్అండ్‌బీ అతిథి గృహం, రూ.344 కోట్లతో రోడ్ల విస్తరణ పనులు, రూ.30 కోట్లతో పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, సమీకృత గురుకుల విద్యా సంస్థలు, కొడంగల్‌లో మున్సిపల్ కార్యాలయం, రూ.300 కోట్లతో ఇతర అభివృద్ధి పనులు.. తదితర అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేయనున్నట్లు తెలిసింది.

రూ.80 వేల కోట్లతో

సౌర, పవన విద్యుత్

ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్‌సింగ్



సీఎం రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్టీపీసీ ఎండీ గురుదీప్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సౌర, పవన విద్యుదుత్పత్తికి రూ.80 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్‌సింగ్ తెలిపారు. గురుదీప్‌సింగ్ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పునరుత్పాదక రంగంలో పెట్టుబడులు పెట్టడం వల్ల.. ఇంధన రంగంలో పరిపుష్టి కావడానికి అవకాశం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 6,700 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుదుత్పత్తికి అవకాశం ఉందని.. ఎన్టీపీసీ బృందం అంచనా వేసినట్లు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీ ముందుకొస్తే.. అన్నివిధాలా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా సీఎండీకి హామీ ఇచ్చారు.

ఉత్తరకాశీలో కొనసాగుతున్న సహాయక చర్యలు



ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం సంభవించిన కుంభవృష్టి, కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధితులను రక్షించేందుకు నాలుగు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన వారిలో శనివారం వరకు 729 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. ఈ విలయంలో నలుగురు చనిపోగా, 49 మంది వరకు గల్లంతైనట్లు భావిస్తున్నారు. ఆకస్మిక వరదల కారణంగా విద్యుత్ వ్యవస్థ ఛిన్నాభిన్నమైన ధరాలీకి తాత్కాలికంగా విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. శనివారం సైనిక హెలికాప్టర్ చినూక్ ద్వారా జాలీగ్రాంట్ ఎయిర్‌పోర్టు నుంచి జనరేటర్‌ను తెప్పించారు. గంగ్నానీలోని లిమ్చిగాడ్ వద్ద బెయిలీ వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదివారం కల్లా ఇది సిద్ధమవుతుందని, దీనిద్వారా రాకపోకలు మరింత సులువవుతాయని అధికారులు చెబుతున్నారు. గంగోత్రి హైవే పలు ప్రాంతాల్లో తీవ్రంగా దెబ్బతింది. దీంతో, ధరాలీకి అవసరమైన సామగ్రిని తీసుకురావడం కష్టసాధ్యంగా మారింది. భారీ యంత్ర సామగ్రి, పరికరాలు వస్తేనే 50 అడుగుల మేర పేరుకుపోయిన టన్నుల కొద్దీ బురదమట్టి, పెద్ద బండరాళ్లు, శిథిలాలను తొలగించి, గల్లంతైన వారి ఆచూకీ కనుగొనేందుకు వీలవుతుందని అంటున్నారు.



శనివారం రాత్రి హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షం

ఉరిమిన వరుణుడు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాల్లోనూ భారీ వర్షానికి వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. ప్రధాన రహదారులపై నీళ్లు నిలిచిన చోట్ల హైడ్రా అధికారులు మోటార్లతో వరద నీటిని తోడారు. ట్రాఫిక్ పోలీసులు సైతం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు. కాగా, ఈ నెల 15 వరకు నగరంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

రాత్రి 11 గంటల వరకు వర్షపాతం ఇలా

ప్రాంతం	సెంటీమీటర్లు
తొర్రూర్	13.5
బేగంబజార్	12.4
ఖైరతాబాద్ సెస్	11.9
చార్మినార్	11.2
హిమాయత్‌నగర్ (జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్)	10.3
జవహర్‌నగర్ (ముషీరాబాద్)	10.2
నాంపల్లి	10.1
ఆసిఫ్‌నగర్	9.7
ఎల్‌బీ నగర్	9.6
ఆజంపురా	9.2
గణాంక భవన్	9.2
హయత్‌నగర్	9.1
మలక్‌పేట	8.9
శ్రీనగర్ కాలనీ	8.6



మట్టిరోడ్డు కాదు.. పంటపొలమే..! నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగి పొర్లాయి. శాలిగౌరారం చెరువు ప్రధాన కాల్వలతో పాటు రామగిరి, తిరుమలరాయునిగూడెం, శాలిగౌరారం గ్రామాల వరదనీరు లోతట్టు భూముల మీదుగా ప్రవహించింది. దీంతో వరిపొలాలు నీటమునిగి ఇసుక మేట వేసింది. - శాలిగౌరారం







గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు రాఖీ కడుతున్న మహిళ • సీఎం రేవంత్‌కు రాఖీ కడుతున్న మంత్రి కొండా సురేఖ • మాజీ సీఎం కేసీఆర్‌కు రాఖీ కడుతున్న అక్క లక్ష్మీబాయి • డిప్యూటీ సీఎం భట్టికి రాఖీ కడుతున్న రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి • కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

రాజ్‌భవన్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

- గవర్నర్‌కు రాఖీ కట్టిన మహిళలు

సాక్షి, హైదరాబాద్: రక్త సంబంధాన్ని, మనుషుల మధ్య మమతను గుర్తు చేసే పవిత్రమైన పండుగ రాఖీ పౌర్ణమి అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ), మాతృశక్తి, దుర్గావాహిని నాయకులు రాఖీ కట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, వీహెచ్‌పీ మహిళా విభాగం మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ, కో–కన్వీనర్లు శ్రీవాణి, లక్ష్మి సరోజ, వాణిదేవి, దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి, రాష్ట్ర బాల సంస్కార ప్రముఖ్ శిరీష, మహంకాళి కన్వీనర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు మహిళా మంత్రుల రాఖీలు

సాక్షి, హైదరాబాద్: రక్షాబంధన్ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులకు.. మంత్రులు సీతక్క కొండా సురేఖ, రాఖీలు కట్టారు. సీతక్క తన నివాసానికి వచ్చిన నాయకులు, భద్రత, వ్యక్తిగత సిబ్బందికి కూడా రాఖీలు కట్టి ఆశీర్వదించారు. సీఎంకు రాఖీలు కట్టిన వారిలో మాజీ మంత్రి జె.గీతారెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత, బీసీ కమిషన్, విద్యా కమిషన్, శిశు సంక్షేమాభివృద్ధి కమిషన్, రైతు కమిషన్‌కు చెందిన మహిళా సభ్యులు, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు, మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల పాఠశాల విద్యార్థులు, బ్రహ్మకుమారీలు ఉన్నారు.

స్వదేశీ వస్తువులతోనే దేశ సుస్థిరత

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్న సందర్భంగా విదేశీ వస్తువులకు స్వస్తి పలికి.. స్వదేశీ వస్తువులనే వినియోగించాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా.. స్వదేశీ వస్తువులనే వాడాలని ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హిందూ భావజాలాన్ని సనాతన ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు.. దేశవ్యాప్తంగా రక్షా బంధన్ జరుపుకొంటున్న హిందువులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావులకు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి, బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చంద్రశేఖర్ తివారీ, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో రాఖీ పండుగ సందడి

సాక్షి, హైదరాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌లో శనివారం సందడి నెలకొంది. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలకు రాఖీలు కట్టేందుకు మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గాంధీభవన్‌కు తరలివచ్చారు. క్విట్ ఇండియా దినోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం.. పార్టీ నేతలకు మహిళలు రాఖీలు కట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలకు మంత్రి కొండా సురేఖ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. క్విట్ ఇండియా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వీహెచ్, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్ తదితరులకు మహిళా నేతలు, కార్యకర్తలు రాఖీలు కట్టారు.

అటు బనకచర్ల.. ఇటు ఎమ్మెల్సీలు

- సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు
- ఎమ్మెల్సీల అనర్హతపై సోమవారం కేటీఆర్ పిటిషన్ దాఖలు
- బనకచర్లపై సుప్రీం న్యాయవాదులతో హరీశ్ మంతనాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై నిరంతరం విమర్శల వర్షం కురిపిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ.. తెలంగాణకు సంబంధించిన కీలక అంశాలపై న్యాయ పోరాటం చేయాలని భావిస్తోంది. పార్టీ మారిన ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించిన బీఆర్‌ఎస్ 'గోదావరి బనకచర్ల'లింకు ప్రాజెక్టుపైనా దేశ అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లేందుకు సన్నద్ధమవుతోంది. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పది మంది ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా కోర్టుకు వెళ్లాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది.

ఢిల్లీకి చేరుకున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం సుప్రీంకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న కేటీఆర్ న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేటీఆర్‌తోపాటు ఢిల్లీకి వెళ్లిన బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పిటిషన్ దాఖలుకు అవసరమైన పత్రాలు సిద్ధం చేస్తున్నారు.

బనకచర్లపై బీఆర్‌ఎస్ న్యాయపోరాటం

ఏపీ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న బీఆర్‌ఎస్.. ఈ ప్రతిపాదనకు ఆదిలోనే అడ్డు చెప్పాలని భావిస్తోంది. బనకచర్ల లింకు ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ప్రకటించిన బీఆర్‌ఎస్ అందుకు అవసరమైన కార్యాచరణపైనా దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. బనకచర్ల ద్వారా తెలంగాణకు జరిగే అన్యాయంపై ఇప్పటికే పార్టీ కేడర్‌కు, విద్యార్థి, యువజన విభాగం నాయకులకు బీఆర్‌ఎస్ అవగాహన కల్పించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, మంచిర్యాలలో విద్యార్థి సదస్సులు కూడా నిర్వహించింది. ఓ వైపు క్షేత్ర స్థాయిలో బనకచర్లను అడ్డుకుంటూనే మరోవైపు న్యాయ పోరాటానికి సిద్ధమవుతోంది.

బనకచర్లపై సుప్రీంకు వెళ్లే యోచన!

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు బనకచర్ల లింకు ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు ఆ పార్టీ సన్నద్ధమవుతోంది. నీటిపారుదల రంగానికి సంబంధించి సంపూర్ణ అవగాహన కలిగిన మాజీమంత్రి హరీశ్‌రావుకు కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు బాధ్యత అప్పగించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఢిల్లీకి వెళ్లిన హరీశ్‌రావు న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపి శుక్రవారం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. కాగా బనకచర్ల ప్రాజెక్టుపై త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తారని బీఆర్‌ఎస్ వర్గాల సమాచారం

కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడేది లేదు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- కుటుంబ సభ్యులతో కలసి రాఖీ సంబురాలు



బండి సంజయ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి శైలజ

కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయని, 'మీ పదేళ్ల అవినీతికి మేం రక్ష.. మా దోపిడీకి మీరు రక్ష'.. అంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను వంచిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కరీంనగర్‌లోని తన నివాసంలో శనివారం బండి సంజయ్ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలతో కలసి రాఖీ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే దమ్ములేక.. చేసిన తప్పులు, పాపాల నుంచి తప్పించుకునేందుకు లీగల్ నోటీసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. 'నేను ఏ గుడికైనా వచ్చి ప్రమాణం చేస్తాను. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని కేటీఆర్ ప్రమాణం చేస్తారా'అని సవాల్ విసిరారు. అసలు నోటీసులు ఇవ్వాలనుకుంటే కేసీఆర్, ఆయన కొడుకు ఎప్పటికీ జైల్లోనే ఉంటారని అన్నారు. కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులిచ్చి విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదివాసీల ఆహారం స్టార్ హోటళ్ల మెనూలో చేరింది

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ఆదివాసీ ఉత్సవంలో పాల్గొన్న మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీల ఆహారపు అలవాట్లను ఎగతాళి చేసిన వారికి.. ఇప్పుడు అదే పౌష్టికాహారం అయ్యిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని కుమురంభీం భవన్‌లో రాష్ట్రస్థాయి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. 'స్టార్ హోటల్ మెనూలో ఆదివాసీల ఆహార పదార్థాలు, వంటకాలు వచ్చి చేరాయి. ఎంతోమంది సంపన్నులు జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలతో కూడిన ఆహారాన్నే ఇష్టంగా తీసుకుంటున్నారు. ఆధునిక సమాజానికి దూరంగా ఉండే ఆదివాసీలు, గిరిజనులు పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉంటున్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆదివాసీ ప్రాంతాల్లో బతకాలనిపిస్తోంది. గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది'అని చెప్పారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ చదువు, సంస్కారం, సంస్కృతి అనే మూడు అంశాలను గిరిజనులు, ఆదివాసీలు ఆకళింపు చేసుకున్నారని, అందుకే వారి ఆచార, వ్యవహారాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ఉపసభాపతి రామచంద్రునాయక్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజన సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిందని, గిరిజన సంక్షేమ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ తన ఆటపాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, కమిషనర్ అలగు వర్షిని, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్ రాఖీ వేడుకలో తెలంగాణ విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి భవన్‌లో శనివారం జరిగిన రాఖీ ఉత్సవాల్లో తెలంగాణ విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి 9 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో నలుగురు ప్రభుత్వ పాఠశాలలు, ఐదుగురు కేజీబీవీకి చెందిన విద్యార్థులున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ వీరిని ఎంపిక చేయగా.. రాష్ట్రపతి ద్రౌపదీముర్ముకు రాఖీలు కట్టారు.

పాదయాత్ర నాదే... మీనాక్షిది కాదు

- విడతల వారీ పాదయాత్రలో సీఎం, డిప్యూటీ సీఎం సైతం పాల్గొంటారు
- కేడర్‌లో ఆత్మవిశ్వాసం కోసమే రేవంత్ 'పదేళ్లపాటు సీఎం' వ్యాఖ్యలు
- తెలంగాణకు బీసీ నేత సీఎం అవుతారు.. అదీ కాంగ్రెస్ పార్టీలోనే
- మీడియాతో ఇష్టాగోష్టిలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: జనహిత పాదయాత్ర నిర్వహించాలనుకున్నది తానేనని.. తమ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కాదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కొందరు కావాలనే దాన్ని మీనాక్షి పాదయాత్రగా ప్రచారం చేశారన్నారు. శనివారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఈ నెల 23 తర్వాత జనహిత పాదయాత్ర మళ్లీ మొదలు పెడతామన్నారు. విడతలవారీగా జరిగే ఈ పాదయాత్రలో వీలు, సమయాన్ని బట్టి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు కూడా పాల్గొంటారని తెలిపారు. తొలివిడత పాదయాత్రలో ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగా కనిపించారన్నారు.

4–5 రోజుల్లో బీసీ రిజర్వేషన్లపై తదుపరి కార్యాచరణ

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకించనక్కర్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కేబినెట్ తీర్మానాలు, అసెంబ్లీలో బిల్లులు, కులగణన లాంటి వ్యవహారాలు ఆషామాషీగా జరగవని.. ప్రజలన్నీ అర్థం చేసుకుంటారన్నారు. ఢిల్లీలో తాము నిర్వహించిన ధర్నాకు రాహుల్, ఖర్గే రాకపోవడానికి షెడ్యూల్ కుదరకపోవడమే కారణమన్నారు. నాలుగైదు రోజుల్లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమై బీసీ రిజర్వేషన్లపై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తుందని చెప్పారు. తెలంగాణకు బీసీ నేత సీఎం అవుతారని.. అది కూడా తమ పార్టీలోనే కచ్చితంగా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

మా మధ్య విభేదాల్లేవు

సీఎం రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య విభేదాలున్నట్లు కొందరు విష ప్రచారం చేస్తున్నారని.. అందులో నిజం లేదని మహేశ్‌గౌడ్ వివరించారు. సీఎంతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, అలా ఉండబట్టే బీసీ రిజర్వేషన్లపై ఇంతవరకు పోరాడగలిగామని చెప్పారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి చెప్పడంలో తప్పేమీ లేదన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ యంత్రాంగంలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం కోసమే ఆయన ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారన్నారు. గతంలో పీసీసీ చీఫ్‌గా పనిచేసినప్పుడు.. ప్రస్తుతం సీఎంగా పనిచేస్తున్నప్పుడు రేవంత్‌రెడ్డిలో చాలా మార్పు వచ్చిందని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై కసరత్తు పూర్తయిందని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డిల అంశాన్ని క్రమశిక్షణా కమిటీ పరిశీలిస్తుందన్నారు.

జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే


జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తమ విజయం నల్లేరుపై నడకేనని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోతే వారి కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చే సంప్రదాయానికి తిలోదకాలిచ్చింది కేసీఆరేనని.. తాము జూబ్లీహిల్స్‌లో తప్పక పోటీ చేస్తామని చెప్పారు. ఉపఎన్నిక నోటిఫికేషన్ రాగానే అభ్యర్థిని ప్రకటిస్తామని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు.



మూడు తరాల రక్షాబంధన్ సంబరాలు

- మేనత్త ఇంట్లో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి రాఖీ వేడుక

నార్కట్‌పల్లి: రక్షాబంధన్ పర్వదినాన్ని ఏకకాలంలో మూడు తరాలు జరుపుకొన్నాయి. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం తన తండ్రి, సోదరి, కుమారుడు, కుమార్తెతో కలిసి రాఖీ పండుగ జరుపుకొనేందుకు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలోని మేనత్త కల్మకొలను అండమ్మ ఇంటికి వచ్చారు. తండ్రి రామచంద్రారెడ్డికి జగదీశ్‌రెడ్డి మేనత్తలు కల్మకొలను అండమ్మ, కడారు వసంత రాఖీ కట్టారు. జగదీశ్‌రెడ్డికి ఆయన తోబుట్టువు కట్టా రేణుక రాఖీ కట్టారు. జగదీశ్‌రెడ్డి కుమార్తె లహరి.. సోదరుడు వేమనరెడ్డికి రాఖీ కట్టింది. ఒకేచోట మూడు తరాల వారు రాఖీలు కట్టుకొని సంబరాలు జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జగదీశ్‌రెడ్డి మేనత్త అయిన కల్మకొలను అండమ్మ.. ప్రెస్ అకాడమీ చైర్మన్ కల్మకొలను శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో భట్టి తదితరులు

'క్విట్ బీజేపీ'తోనే దేశానికి భవిష్యత్

- క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా జాతీయ జెండావిష్కరణలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: దేశాన్ని కులాలు, మతాల పేరిట విభజించాలని చూస్తున్న బీజేపీని కట్టడి చేయాలని, క్విట్ ఇండియా తరహాలో క్విట్ బీజేపీ నినాదంతోనే దేశానికి భవిష్యత్ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. డూఆర్‌డై నినాదంతో నాడు మహాత్మాగాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమ చరిత్రను కూడా తుడిచేయాలని బీజేపీ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. శనివారం క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన జాతీయ జెండావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులను తరిమికొట్టేందుకు జరిగిన ఆందోళనలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైందన్నారు. బీజేపీ నెహ్రూ, పటేల్, బోస్ లాంటి మహనీయుల చరిత్రను కాలరాయాలని చూస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, సేవాదళ్ చైర్మన్ జితేందర్, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి యూత్ కాంగ్రెస్ గుండెకాయ: యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దిన వేడుకలు గాంధీభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జెండాను బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ విభాగం కాంగ్రెస్ పార్టీకి గుండెకాయ లాంటిదన్నారు. రాహుల్‌గాంధీ ఎప్పుడూ యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారని, యూత్ కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి పార్టీలో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిలతోపాటు యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

బీజేపీ 'ఆకర్ష్' వేగిరం

- నేడు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరిక
- మరో ఇద్దరు ముగ్గురు మాజీలు కూడా అదే దారిలో..
- బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- స్థానిక ఎన్నికలపై ప్రత్యేక దృష్టి... బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి అసంతృప్తులను చేర్చుకునే వ్యూహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేరికలపై కమలదళం స్పీడ్ పెంచింది. ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇతర ముఖ్య నేతల సమక్షంలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు కాషాయ గూటికి చేరనున్నారు. మరికొద్ది రోజుల్లో మరో ఇద్దరుముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరే అవకాశాలున్నట్టు పార్టీవర్గాల సమాచారం. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు బీజేపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన నేపథ్యంలో...బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి మాజీ ఎమ్మెల్యేలతో పాటు జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు నేతలను చేర్చుకునే వ్యూహానికి పార్టీ నాయకత్వం పదును పెడుతోంది. పార్టీ బలహీనంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానికంగా బలం చాటేందుకు వారి చేరికలు ఉపయోగపడతాయని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. పార్టీ ఏఏ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో బలహీనంగా ఉందనే దాని ప్రాతిపదికన చేరికలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తోంది. మరీ ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మెదక్, వరంగల్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో ఇతర పార్టీల నుంచి పెద్దసంఖ్యలో చేర్చుకునేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్టు సమాచారం.

ఆపరేషన్‌ను బలపరిచేలా పార్టీ చీఫ్ వ్యాఖ్యలు

బీజేపీలో చేరికలకు సంబంధించి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ 'ఆపరేషన్'ప్రయత్నాలను బలపరుస్తున్నాయి. తమతో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలోనే వీరి చేరికలు ఉండే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీ మొత్తం ఖాళీ కాబోతున్నదని, అందుకు బీజేపీలో బాలరాజు చేరడమే సంకేతమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అధికార కాంగ్రెస్ పార్టీలోనూ కొందరు నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారు కూడా తమ పార్టీ వైపు చూస్తున్నారన్నారు. వీరంతా కూడా సరైన సమయం కోసం వేచి చూస్తున్నారని, ఈ రెండు పార్టీల్లోని కొందరు ముఖ్యనేతలతో సహా, మాజీ ఎమ్మెల్యేలకు బీజేపీనే రాజకీయ ప్రత్యామ్నాయం కాబోతోందని చెప్పారు. వీరితో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మేధావులు కూడా పార్టీలో చేరేందుకు సముఖంగా ఉన్నారంటున్నారు. ఏ పార్టీతో సంబంధం లేకుండా తటస్థులుగా ఉన్న యువత, మేధావులు, విద్యావేత్తలను బీజేపీలో చేరాలని ఆహ్వానిస్తున్నామని రాంచందర్‌రావు ప్రకటించారు.

మళ్లీ కీలక దశకు..

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలోకి ఇతర పార్టీల నుంచి వివిధ స్థాయిల నాయకులు భారీ సంఖ్యలో చేరారు. శాసనసభ కంటే కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ కార్యాచరణ విజయవంతమై మంచి ఫలితాలు (మొత్తం 17 సీట్లలో 8 ఎంపీ స్థానాలు గెలుచుకోవడం) వచ్చాయి. ఈ ఎన్నికలప్పుడు పార్టీలో చేరిన వారే ఆ తర్వాత జరిగిన పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కల్లా క్షేత్రస్థాయి నుంచి బలపడేందుకు ఇదే మంచి సమయం, అవకాశమనే అభిప్రాయంతో పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు చేరికల ఆపరేషన్‌కు మళ్లీ పదును పెట్టాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా నలుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బీజేపీ ఎరవేసినట్టుగా వచ్చిన ఆరోపణలు పెనుసంచలనానికి కారణమయ్యాయి. గతంలో బీజేపీలో చేరేందుకు తనను ప్రలోభపరిచిందని ఆరోపించిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి చేరికకు ముందువరుసలో నిలిచారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడమే కాకుండా ఆదివారం బీజేపీలో చేరబోతున్నట్టుగా కూడా ఆయన ప్రకటించారు. బాలరాజుతోపాటు త్వరలోనే ఉమ్మడి పాలమూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఇటీవల ఢిల్లీలో బీఎల్ సంతోశ్, ఇతర నేతలను కలిసి చేరికకు అనుమతి కోరినట్టు తెలుస్తోంది.

'ఓట్ల చోరీ'పై ప్రజల్లోకి

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయించుకున్నారు. ఆయనకు మద్దతుగా టీపీసీసీ కూడా కార్యక్రమాలు తీసుకోవాల్సి ఉంటుంది. కచ్చితంగా బీజేపీ సాగిస్తున్న ఎలక్టోరల్ మోసాలను ప్రజలకు వివరిస్తాం'అని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు.

గాంధీ భవన్‌లో ప్రజెంటేషన్ ప్రదర్శన: ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ ఢిల్లీలో ఇచ్చిన ప్రజెంటేషన్‌ను గాంధీ భవన్‌లో శనివారం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు తదితరులు వీక్షించారు.



ప్రతిదానికీ సమయము కలదు.
ఆకాశము క్రింద ప్రతి ప్రయత్నమునకూ సమయము కలదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.12.49 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ధనిష్ఠ ప.3.33 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.10.38 నుండి 12.12 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.44 నుండి 5.36 వరకు, **అమృత ఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం : 6.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నబీర్ భాటియా (బిజినెస్‌మేన్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దేశభక్తి మంచి విషయమే. అయితే నేనంటానూ... దేశానికి ఆర్థికంగా చేవనిచ్చే శక్తి కూడా మనలోని ఆ దేశభక్తికి ఉండాలని! శక్తి లేని భక్తి ఉత్త వేస్ట్ వ్యవహారం. దేశానికి వచ్చేదేం లేదు. పోయేదేం లేదు.

గర్వంగా తల పైకెత్తి చూస్తూ గట్టిగా 'జై హింద్' అని సెల్యూట్ కొట్టినప్పుడు జాతీయ జెండా నుండి బిలియన్‌ల కొద్దీ ఫారిన్ ఎక్స్ఛేంజ్ నాణేలు దేశ ప్రజలపై గలగలమని కురిసినప్పుడు మాత్రమే అది ప్రయోజనకరమైన దేశభక్తి అవుతుంది. డబ్బును ఉత్పత్తి చెయ్యలేని దేశభక్తికి నా దృష్టిలో ఒక్క డాలర్ విలువైనా లేదు.

తక్కువ మాట్లాడి ఎక్కువ పని చెయ్యటం దేశభక్తి. జీడీపీని చేతులు మారుతున్న డబ్బుతో కాకుండా, ముక్కలవుతున్న రెక్కల చెమట చుక్కలతో లెక్కేయటం దేశభక్తి.

మన జీడీపీ ఘనంగా ఉన్నందువల్ల దేశంలో ఏం మార్పు వచ్చింది? మన ఎకానమీ ఫోర్త్ లార్జెస్ట్‌కి చేరుకున్నందు వల్ల ప్రపంచం మనల్ని చూసే విధానం ఏం మారింది?



ఇలా మాట్లాడితే, 'యాంటీ నేషనల్' అంటారు! నిజాలను చూడటం యాంటీ నేషనల్ అయితే, నిజాలను చూడనివ్వకుండా చేయటం 'నేషనలిజం' అవుతుందా?

నేనిక్కడ క్యాలిఫోర్నియాలో కూర్చుని 'నా దేశం' అంటూ ఇండియా గురించి మాట్లాడటం హర్ష్ గోయెంకా వంటి దేశభక్త భారతీయ పారిశ్రామికవేత్తలకు బొత్తిగా నచ్చటం లేదు!

"మేము ఇక్కడ జీవిస్తున్నాం. ఇక్కడ ఓటు వేస్తున్నాం. ఇక్కడ పని చేస్తున్నాం. ఇక్కడ పన్నులు కడుతున్నాం. మేము ఈ దేశాన్ని ప్రేమిస్తున్నాం. కాబట్టి, మా తలనొప్పులేవో మేము పడతాం. అన్నీ సర్దుకుని దేశం వదిలి వెళ్లిన వారు, మా కోసం ఏమీ ధర్మోపదేశాలు చేయనవసరం లేదు" అని హర్ష్ గోయెంకా!

ఏం? దేశం లోపల ఉండేవారికి మాత్రమే దేశభక్తి ఉండాలా? దేశం బయట ఉన్నవారికి దేశభక్తి ఉండకూడదా? దేశభక్తి అంటే జయజయధ్వానాలు మాత్రమేనా? నా దేశం గురించి నేను మాట్లాడటం దేశభక్తి అవదా?!

ఇంట్లో బియ్యానికి డబ్బుల్లేవు. దాని గురించి నేను మాట్లాడతాను. బయట అమ్మా, చెల్లి స్వేచ్ఛగా మసల లేరు. ఆ విషయమూ నేను మాట్లాడతాను. నాన్న మా అందర్నీ చదివించటానికి సతమతమౌతున్నారు. అదీ మాట్లాడతాను. ఇది పరువు సమస్య కాదు. నా దేశపు దాపరికాల సమస్య!

దాపరికము, దీర్ఘాలోచన... రెండూ ఒకటే! మాట్లాడవలసిన చోట మౌనంగా ఉండటం తప్పవుతుంది. నిర్ణయం తీసుకోవలసినప్పుడు ఆలోచిస్తూ కూర్చోవటం అనర్థాన్ని తెస్తుంది.

18 ఏళ్ల వయసులో నేనొక నిర్ణయం తీసుకున్నాను. అలాగే 28 ఏళ్ల వయసులో ఇంకొక నిర్ణయం. ఇప్పుడు నేనేమిటన్నది అప్పటి ఆ రెండు నిర్ణయాలే!

"నా లైఫ్‌ను నాకు వదిలేయండి" అని ఇంట్లో చెప్పి, నేను బెంగుళూరు రైల్వే స్టేషన్‌లో ఢిల్లీ రైలెక్కాను. ఢిల్లీ చేరాక, అక్కడి నుంచి ట్యాక్సీలో బిట్స్ పిలానీకి. అది నా మొదటి నిర్ణయం. తర్వాత పదేళ్లకు, నా 'హాట్ మెయిల్'ను 400 మిలియన్ డాలర్లకు మైక్రోసాఫ్ట్‌కు ఇచ్చేశాను. అది నా రెండో నిర్ణయం.


మరోసారి నేనిప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన టైమ్ వచ్చింది. అయితే అది తీసుకునే నిర్ణయం కాదు. తీసుకోవాలని చెప్పే నిర్ణయం!

అమెరికా మనపై ట్యారిఫ్‌లు వేస్తోంది. 25 శాతం, 50 శాతం, ఇంకా అంతకుమించి కూడా! మనమూ అమెరికాపై టారిఫ్‌లు వెయ్యాలి. ఇరవై శాతమో, యాభై శాతమో, వంద శాతమో కాదు. '0' శాతం వెయ్యాలి!

అవును. '0' శాతంతో మనమంటే ఏంటో చూపించాలి. ట్యారిఫ్‌లు వెయ్యకపోతే అమెరికా బతకలేదు. ట్యారిఫ్‌లు ఎత్తేసి కూడా ఇండియా నిలబడగలదు అని నిరూపించాలి. ఇది సాహసం. కానీ, ఇదే తగిన సమాధానం!

మనకెంత దేశభక్తి ఉందన్నది కాదు లెక్క. మనమంటే ప్రపంచానికి భయ భక్తులుండటం లెక్క! దేశభక్తికీ ఆర్థిక శక్తి ఉన్నప్పుడే లెక్కలు తేలుతాయి.

మసిబారిన ఎన్నికల సంఘం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

పేరుకు మనది అతి పెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ. ఇప్పుడది మేడిపండు చందంగా మారిపోయిందనడానికి రుజువులు చాలా కనిపిస్తున్నాయి. దాని పొట్ట విప్పి చూస్తే పురుగులు భయపెడుతున్నాయి. ప్రజాస్వామ్యానికి కాపు కాయవలసిన ఎన్నికల వ్యవస్థ అచేతనత్వంలోకి, నిష్క్రియాపరత్వంలోకి జారుకున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టి.ఎన్. శేషన్ వలె పులిలా గాండ్రించగల అధికారాన్ని ఎన్నికల సంఘానికి మన రాజ్యాంగం దఖలు పరిచింది. గాండ్రించవలసిన రాజ్యాంగ వ్యవస్థలు పెంపుడు చిలకలుగా మారిపోయి, పంజరాల్లోకి చేరిపోయాయి. సర్కారు వారి పాటకు అవి కోరస్‌లు పాడుతుంటే మన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నట్టా? మాయల ఫకీర్ల చెరలో మూలుగుతున్నట్టా?

కుల, మత, జాతి నెపాలతో ఏ వ్యక్తికీ ఓటు హక్కును తృణీకరించడానికి వీల్లేదని రాజ్యాంగంలోని 325వ అధికరణం స్పష్టం చేసింది. కానీ ఎన్నికలకు మూడు నాలుగు నెలల ముందట బిహార్ ప్రజలు పౌరసత్వ శీల పరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్నికల నేపథ్యంలో ఈసీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో మాటమాత్రంగానైనా చెప్పకుండానే, ఆ తర్వాత ఓటర్ల జాబితాల ప్రత్యేక వడబోత (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రకటించారు. నెలరోజుల సమయం మాత్రమే ఇచ్చి ఓటర్లందరూ వారి శాశ్వత నివాసాన్ని నిరూపించుకునే ఆధారాలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనికి ఆధార్‌తో పాటు ఎన్నికల సంఘమే గతంలో జారీచేసిన ఓటర్ ఐ.డి. కార్డులు పనికి రావని తేల్చారు.

బిహార్ శ్రామికులు లక్షల సంఖ్యలో దినసరి ఉపాధి కోసం పలు ప్రాంతాలకు తాత్కాలికంగా వలస పోతారనే సంగతి తెలిసిందే. వీళ్లంతా హుటాహుటిన సొంతూరికి బయల్దేరి తమ ముల్కీని నిరూపించుకోవలసిన పరిస్థితి. అసలు ఎన్నికల సంఘం ఆదేశాల గురించే వారిలో చాలామందికి తెలిసి ఉండకపోవచ్చు. ఓటర్ల జాబితాను వడపోయాలనే ఆలోచన మంచిదే కావచ్చు. సమగ్రంగా సక్రమమైన రీతిలో ఓటర్ల జాబితాను తయారుచేయాలనుకున్నప్పుడు సరిగ్గా ఎన్నికల ముందే ముహూర్తం పెట్టుకోవడం అనుమానాలకు తావిచ్చింది. అది కూడా అఖిలపక్ష సమావేశంలో చూచాయగానైనా చెప్పకుండా ఆదేశాలు జారీ చేయడాన్ని బట్టి అనుమానాలు మరింత బలపడ్డాయి.

ఎన్నికల నిర్వహణతోపాటు, ఓటర్ల జాబితా రూపకల్పన బాధ్యతను 324వ అధికరణం ప్రకారం ఎన్నికల సంఘంపైనే రాజ్యాంగం మోపింది. ఓటరుగా నమోదయ్యే బాధ్యతను పౌరునిపై రాజ్యాంగం పెట్టలేదు. ఓటును అతనికి ఒక హక్కుగా ప్రసాదించింది. పౌరులను ఓటరుగా నమోదు చేయవలసిన బాధ్యతను నిర్వహించవలసిన ఎన్నికల సంఘం అందుకు విఘ్నాలను కల్పించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమవుతుంది. గతంలో ఎన్నికల సంఘమే జారీచేసిన ఓటరు కార్డులు చెల్లుబాటు కావనడం ఆందోళనకరం. ఈ గుర్తింపు కార్డుల ఆధారంగా ఇప్పటివరకు జరిగినవన్నీ బూటకపు ఎన్నికలే అనుకోవాలా?

ప్రతిపక్షాలు లేవనెత్తిన అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ ఎన్నికల సంఘం కొత్త ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించింది. గత జాబితాలో ఉన్న 65 లక్షల మందిని తొలగించినట్టు ప్రకటించింది. ఇందులో 22 లక్షలు చనిపోయిన వారి పేర్లనీ, 36 లక్షలమంది శాశ్వతంగా వలస పోయారనీ పేర్కొన్నారు. శాశ్వతంగా వలస పోయినట్టు ఎలా నిర్ధారణకొచ్చారో తెలియదు. ఆ మేరకు వాళ్లేమైనా అఫిడవిట్లు సమర్పించారా? పారదర్శకత ఎక్కడుంది? 22 లక్షలమంది ఏయే సమయాల్లో చనిపోయారో తెలియదు. ఐదేళ్ల కింద జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 7.36 కోట్ల మందికి ఓటు హక్కు ఉన్నది. ఇప్పుడు వడబోత తర్వాత 7.24 కోట్లమందే నివాస పత్రాలను సమర్పించారని చెప్పారు. ఐదేళ్లలో చనిపోయేవారి సంఖ్యకు రెట్టింపు సంఖ్యలోనైనా కొత్త ఓటర్లు నమోదై ఉండాలి కదా! భారతదేశంలో ప్రతి వెయ్యి జనాభాకు జననాల రేటు 19.3 శాతంగా ఉంటే మరణాల రేటు 7.5 శాతంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వ హెల్త్ ప్రొఫైల్ నివేదిక తెలియజేస్తున్నది. ఈ లెక్కన ఐదేళ్ళలో ఓట్లు పెరగాలి. కానీ తగ్గడం ఆశ్చర్యాన్నీ, ఆందోళననూ కలిగిస్తున్నది.

2024 సాధారణ ఎన్నికల తర్వాత గత ఏడాది కాలంగా ఎన్నికల సంఘం పనితీరు మీద తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పార్టీలే కాదు, స్వచ్ఛంద సంస్థలు కూడా సంఘం పనితీరును ప్రశ్నిస్తున్నాయి. సాక్ష్యాధారాలతో అనేక అవకతవకలను ఎత్తిచూపుతున్నాయి. కానీ, ఎన్నికల సంఘం స్పందించడం లేదు. బెల్లం కొట్టిన రాయిలా మౌనాన్నే ఆశ్రయిస్తున్నది. అడపాదడపా బుకాయించేందుకు ప్రయత్నిస్తున్నది. యథా రాజా తథా ప్రజా అంటారు గదా! యథా కేంద్ర ఎన్నికల సంఘం తథా రాష్ట్ర సంఘం. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రెండు జడ్పీటీసీల ఉపఎన్నికలనే తీసుకుందాం. ఎన్ని అక్రమాలు చేసైనా ఈ రెండు స్థానాలను గెలుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నది. అధికారంలో ఉన్న పార్టీ రాజకీయ ఎజెండాకు పోలీసు యంత్రాంగంతోపాటు ఎన్నికల సంఘం కూడా తందానా అంటున్న తీరు విభ్రాంతికరం. మామూలుగానైతే జడ్పీటీసీ ఉపఎన్నికల్లో రాష్ట్ర నాయకులు జోక్యం చేసుకోరు. పార్టీల జిల్లాస్థాయి నాయకులే ప్రచారం చేస్తారు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో స్థానిక ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా జరిగినప్పుడు కూడా ఆయన ప్రచారానికి వెళ్ళలేదు. స్థానిక నాయకత్వానికే బాధ్యత అప్పగించారు. చంద్రబాబు మాత్రం విస్తృతంగానే ప్రచారం చేశారు. ఆ ఎన్నికల్లో బాబు సొంత నియోజకవర్గంలో ఉన్న నాలుగు జడ్పీటీసీలు, నాలుగు మండల పరిషత్‌లు, ఒక మునిసిపాలిటీని కూడా గెలుచుకొని వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. బహుశా అప్పటి అవమానాగ్ని వారిని ఇప్పటికీ దహిస్తున్నట్టున్నది. ఇప్పుడు ఉపఎన్నికలు జరుగుతున్న రెండు స్థానాల్లో పులివెందుల మండల జడ్పీటీసీ కూడా ఒకటి. దీంతోపాటే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ గెలిచిన రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట స్థానం మరొకటి. ఈ రెండు స్థానాలనూ గెలవడం కోసం భూమ్యాకాశాలను ఏకం చేయడానికి తెలుగుదేశం పార్టీ ప్రయాసపడుతున్నది.

ప్రతిపక్ష పార్టీ అభిమానుల్లో, ఓటర్లలో భయోత్పాతం సృష్టించడానికి పాలక పార్టీ దాడులకు తెగబడటం, అధికార దుర్వినియోగానికి పాల్పడటం యథేచ్ఛగా జరిగిపోతున్నది. ఒక ఎమ్మెల్సీ సహా వైసీపీ నాయకులను టార్గెట్ చేసి మరీ దాడులు చేశారు. మేం లేకపోతే వాళ్ల తలలు తెగిపడేవని సాక్షాత్తూ డీఐజీ ర్యాంకు పోలీసు ఉన్నతాధికారే ప్రకటించారు. వైసీపీ వాళ్లపై హత్యాప్రయత్నం జరిగిందని స్వయంగా డీఐజీయే సాక్ష్యం చెబుతుంటే అరెస్టు చేసింది మాత్రం వైసీపీ కార్యకర్తలనే! ఇంత దారుణం జరుగుతుంటే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏం చేస్తున్నట్టు? ఏదోరకంగా పాలక పార్టీని గెలిపించాలనే తాపత్రయంతో నాలుగు గ్రామాల పోలింగ్ బూత్‌లనే పక్క గ్రామాలకు మార్పించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఇటువంటి మార్పులు అసాధారణం. ఈ గ్రామాల్లో అత్యధిక సంఖ్యలో వైసీపీ అభిమానులుంటారనీ, పొరుగూరుకు వెళ్ళి ఓటెయ్యడానికి వృద్ధులూ, అనారోగ్యంతో ఉన్నవారు ఆసక్తి చూపకపోవచ్చుననీ, కనుక ప్రతిపక్షం ఓట్లు తగ్గించవచ్చనీ పాలక పార్టీ ఆలోచన కావచ్చు. స్వతంత్రంగా వ్యవహరించవలసిన ఎన్నికల సంఘం పాలక పార్టీ ఆదేశాలకు తలూపి నిర్హేతుకమైన ఇటువంటి నిర్ణయాలను తీసుకోవడం శోచనీయం.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు 2024లో జరిగిన సాధారణ ఎన్నికలు ఎంత ప్రహసనంగా ముగిశాయో, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలి ఎంత అనుమానాస్పదంగా ఉన్నదో తెలియజేసే ఉదంతాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఈ అంశాలపై ఇటీవల వైసీపీ ప్రతినిధి బృందం కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక నివేదికను ఇచ్చింది. ఇందులో ప్రధానంగా ఈవీఎమ్‌ల పనితీరుపై అనుమానాలకు కారణాలను వివరిస్తూ, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్‌ను పునరుద్ధరించే విషయాన్ని ఆలోచించాలని కోరారు. వైసీపీ బృందం ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వడానికి చాలాకాలం ముందటే 'వోట్ ఫర్ డెమొక్రసీ' (వీఎఫ్‌డీ) అనే స్వచ్ఛంద సంస్థ దేశవ్యాప్తంగా 2024 ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ తీరు తెన్నులపై సునిశితమైన అధ్యయనం చేసి, 226 పేజీల నివేదికను విడుదల చేసింది. ఆ ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ఆధారాలతో సహా వాటిని నివేదికలో పొందుపరిచింది. ఎన్నికల సంఘం అనుమానాస్పద వ్యవహార శైలిని కూడా ఈ నివేదిక దుయ్యబట్టింది. నివేదికను విడుదల చేయడమే కాకుండా, మరో స్వచ్ఛంద సంస్థ (ఏడీఆర్)తో కలిసి ఢిల్లీలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వీఎఫ్‌డీ వెల్లడించింది.

వీఎఫ్‌డీ వంటి సంస్థల ఆరోపణలను ఎన్నికల సంఘం ఇప్పటివరకు ఖండించలేకపోయింది. దానిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి కూడా సాహసించలేకపోయింది. దీన్ని బట్టి ఏమర్థమవుతుంది? ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పోలింగ్, కౌంటింగ్ తీరుతెన్నులపై ప్రముఖ సెఫాలజిస్టు ఆరా మస్తాన్ వంటి వాళ్లు కూడా నిశితమైన పరిశీలన చేసి తమ అనుమానాలను ప్రకటిస్తున్నారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయనడానికి ఈ పరిశీలనలన్నీ కావలసినన్ని కారణాలను చూపెడుతున్నాయి. వాటన్నింటినీ క్రోడీకరించడం ఇక్కడ సాధ్యం కాకపోవచ్చు. కానీ నాలుగైదు ముఖ్యాంశాలను మాత్రం ప్రస్తావన చేయవచ్చు.

పోలయిన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు దేశవ్యాప్తంగా 4 కోట్ల 65 లక్షల పైచిలుకు ఎక్కువ ఉన్నాయనీ, దీని పర్యవసానంగా దేశవ్యాప్తంగా 79 లోక్‌సభ స్థానాల ఫలితాలు తారుమారయ్యాయనీ వీఎఫ్‌డీ తేల్చింది. పోలింగ్ జరిగిన రోజు రాత్రి 8 గంటల తర్వాత ఈసీ విడుదల చేసిన తుది వోట్ల సంఖ్య కంటే కొన్ని రోజుల తర్వాత విడుదల చేసిన ఓట్ల సంఖ్య అసాధారణ రీతిలో పెరిగిపోవడంలోని ఔచిత్యాన్ని అది ప్రశ్నించింది. గతంలో ఎన్నడూ ఇటువంటి తేడా ఒక శాతాన్ని మించి రాలేదన్న విషయాన్ని గుర్తుచేసింది. వీఎఫ్‌డీ పరిశోధన ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అనుమానాస్పద ఓట్ల పెరుగుదల 12.54 శాతం. 49 లక్షల పైచిలుకు ఓట్లని వీఎఫ్‌డీ తేల్చింది. వైసీపీ

> ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంతవరకు 2024లో జరిగిన సాధారణ ఎన్నికలు ఎంత ప్రహసనంగా ముగిశాయో, కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలి ఎంత అనుమానాస్పదంగా ఉన్నదో తెలియజేసే ఉదంతాలు ఒక్కొక్కటే బయటకు వస్తున్నాయి. ఈ అంశాలపై ఇటీవల వైసీపీ ప్రతినిధి బృందం కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక నివేదికను ఇచ్చింది. ఇందులో ప్రధానంగా ఈవీఎమ్‌ల పనితీరుపై అనుమానాలకు కారణాలను వివరిస్తూ, భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్‌ను పునరుద్ధరించే విషయాన్ని ఆలోచించాలని కోరారు. వైసీపీ బృందం ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వడానికి చాలాకాలం ముందటే 'వోట్ ఫర్ డెమొక్రసీ' (వీఎఫ్‌డీ) అనే స్వచ్ఛంద సంస్థ దేశవ్యాప్తంగా 2024 ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ తీరు తెన్నులపై సునిశితమైన అధ్యయనం చేసి, 226 పేజీల నివేదికను విడుదల చేసింది. ఆ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ ఆధారాలతో సహా వాటిని నివేదికలో పొందుపరిచింది. ఈసీ వ్యవహార శైలిని ఈ నివేదిక దుయ్యబట్టింది.

బృందం ఈసీకి సమర్పించిన నివేదికలో ఈ తేడా 51 లక్షలుగా పేర్కొంది. మొత్తం 'లెక్కించిన' ఓట్ల సంఖ్య నుంచీ, కూటమికి లభించిన మొత్తం ఓట్ల నుంచి ఈ 'దొంగిలించిన' ఓట్లను తీసివేసి లెక్కవేస్తే వైసీపీకి, కూటమికి చెరో 46 నుంచి 48 శాతం ఓట్ల వరకు వస్తాయి. 2014 ఫలితాలకు ఇది దగ్గరగా ఉన్నది. అప్పుడూ మూడు పార్టీలు కూటమిగా ఉన్నాయి. అప్పుడూ చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చారు. ఇప్పుడు అంతకు మించిన హామీలను ఇచ్చారు. ఈ లెక్కలు కనీసం వాస్తవానికి కొంచెం దగ్గరగా కనిపిస్తున్నాయి.

పోలింగ్ ముగిసే సమయానికి 40–50 శాతంగా ఉన్న ఈవీఎమ్‌ల బ్యాటరీలు లెక్కింపు రోజున 99 శాతం ఉండటంపై చేసిన ఫిర్యాదుకు ఈసీ స్పందన విచిత్రంగా ఉన్నది. ఫిర్యాదు చేసిన ఈవీఎమ్‌ల జోలికి వెళ్ళకుండా కొత్త మెషీన్లతో మాక్ పోలింగ్ జరిపి చూసుకోమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశించినా మైక్రో కంప్యూటర్లలో నిక్షిప్తమైన అసలైన సమాచారాన్ని తనిఖీ చేయడానికి అంగీకరించలేదు. ఐదు శాతం వీవీ ప్యాట్ల లెక్కింపునకు అంగీకరించలేదు. పైగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ని మార్చి, కౌంటింగ్ ముగిసిన నెలరోజుల తర్వాత సరికొత్త ఎస్ఓపీని విడుదల చేశారు. వీవీ ప్యాట్లనూ ధ్వంసం చేసి ఓడిపోయిన అభ్యర్థులు కోర్టును ఆశ్రయించకుండా వ్యూహాత్మకంగా ఈసీ వ్యవహరించింది. అన్నిటినీ మించి, బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలతో అభ్యర్థులకు ఇవ్వవలసిన ఫామ్–20ని మూడున్నర నెలల వరకు ఎన్నికల సంఘం అప్‌లోడ్ చేయకపోవడం తీవ్రమైన అనుమానాలకు దారి తీసింది. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా జాతరను తలపించేవిధంగా ఓటర్లు బారులు తీరినందువల్లనే ఈ అసాధారణ పెరుగుదల అని నమ్ముదామంటే సీసీ టీవీ ఫుటేజీలను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో లేకుండా చేసింది.

కర్ణాటకలోని మహదేవ్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో తాము చేసిన పరిశీలన ఫలితాలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇటీవలనే ప్రకటించారు. అవకతవకలపై పక్కా ఆధారాలను ఆయన మీడియాకు చూపెట్టారు. జరిగిన గోల్‌మాల్ వ్యవహారానికి ఈ అంశాలు కొత్త కోణాలు. పెద్ద ఎత్తున డూప్లికేట్ ఓట్లున్నాయనీ, ఫేక్ అడ్రస్‌లున్నాయనీ, ఒకే అడ్రస్‌పై డజన్లకొద్దీ ఓట్లున్నాయని ఆధారాలతో సహా ఆయన ప్రదర్శించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఉద్దేశించిన ఫామ్–6 దుర్వినియోగంపై కూడా ఆయన సాక్ష్యాలను బయటపెట్టారు. ప్రతిపక్ష నేత ఆరోపణలపై సరైన రీతిలో స్పందించకపోగా, రాహుల్‌గాంధీని ప్రమాణం చేయాలని ఈసీ కోరడం ఒక విడ్డూరం. ఎన్నికల సంఘం అంపశయ్యపైకి చేరిందనీ, మన ప్రజాస్వామ్యానికి ప్రమాదం ముంచుకొస్తుందనీ అనడానికి ఈ పరిణామాలే నిదర్శనాలు. రాజకీయ వ్యవస్థలతోపాటు, ప్రజాస్వామ్య ప్రియులు, పౌర సమాజాలు గొంతెత్తి ప్రతిఘటించకపోతే మనం భారీ మూల్యం చెల్లించవలసి రావచ్చు.

vardhelli1959@gmail.com

మాలెగావ్ తీర్పే కాదు, విచారణా విచిత్రమే!

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

మహారాష్ట్రలోని మాలెగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబు పేలుళ్ల కేసులో నిందితులుగా పదిహేడేళ్లుగా విచారణను ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులు నేరం చేశారని ప్రాసిక్యూషన్ రుజువు చేయలేకపోయిందని ముంబైలోని ప్రత్యేక ఎన్ఐఏ న్యాయస్థానం న్యాయమూర్తి ఏకే లాహోటీ ఈ ఏడాది జూలై 31న తీర్పు ప్రకటించారు. ఆరుగురి మరణానికీ, వంద మంది దాకా గాయపడటానికీ కారణమైన ఆ నేరం ఎవరు చేశారో ఇప్పటికీ బయటపడలేదు! ఈ కేసు గురించీ, విచారణ క్రమం గురించీ, తీర్పు గురించీ ఆలోచించవలసిన అంశాలెన్నో!

ముస్లిం జనాభా ఎక్కువగా ఉండే మాలెగావ్‌లో ఒక మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబులు పేలి, ఆరుగురు మరణించిన ఆ కేసు దర్యాప్తును అప్పటి ప్రభుత్వం మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటిఎస్)కు అప్పగించింది. అప్పటి ఏటిఎస్ అధిపతి హేమంత్ కర్కరే నాయకత్వంలో ఆ దర్యాప్తు జరిగి అక్టోబర్–నవంబర్‌లలో 11 మంది అనుమానితులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అఖిల భారత విద్యార్థి పరిషత్ మాజీ నాయకురాలు సాధ్వి ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, మతాచార్యులు దయానంద పాండే అలియాస్ స్వామి అమృతానంద, రిటైర్డ్ సైనికాధికారి మేజర్ రమేశ్ ఉపాధ్యాయ, అప్పటికి సైన్యంలో పని చేస్తున్న అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ ఉన్నారు. వారిలో అత్యధికులు 'అభినవ భారత్' అనే సంస్థ సభ్యులనీ, ఆ సంస్థ హిందూ రాజ్య స్థాపన లక్ష్యంతో విధ్వంసాలకు పూనుకుంటున్నదనీ ఏటిఎస్ అధికారి హేమంత్ కర్కరే చెప్పారు. ఈ సంస్థకు, అనుబంధ సంస్థలకు దేశంలో 19 చోట్ల జరిగిన పేలుళ్లతో సంబంధం ఉందని తేలిందని కూడా కర్కరే అన్నారు.

అప్పటికి రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉండిన భారతీయ జనతా పార్టీ, శివసేనలు ఇదంతా కాంగ్రెస్ పన్నాగమనీ, కేసు దర్యాప్తు ఇలా సాగించిన హేమంత్ కర్కరే 'దేశద్రోహి' అనీ ప్రకటించారు. అప్పటి గుజరాత్ సీఎం మోదీ ఏటిఎస్ దర్యాప్తు మన సైనిక బలగాల నైతిక ధృతిని కించపరిచేలా ఉందని విమర్శించారు. ఈ దర్యాప్తు వివరాలు బయటపెట్టి, నిందితులను అరెస్టు చేసిన నెల రోజుల తర్వాత ముంబాయిపై తీవ్రవాద దాడిలో హేమంత్ కర్కరేను గురిచూసి కాల్చి చంపారు. ఆయన తీవ్రవాదుల కాల్పుల్లో చనిపోయారనే అభిప్రాయం ఎంత ఉందో, ఆయన హత్య వెనుక కుట్ర ఉందనే అభిప్రాయం అంత ఉంది. ఆయన చనిపోగానే తన



◆ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉండిన రోహిణి సాలియాన్ ఈ కేసు విచారణలో వేగంగా సాగవద్దని ఎన్ఐఏ నుంచి ఆదేశాలు వచ్చాయని బయట పెట్టారు.

'శాపం వల్లనే చనిపోయాడ'ని సాధ్వి అన్న మాటలు ఆ అనుమానాలకు ఆజ్యం పోశాయి.

మరొకవైపు, ఏటిఎస్ 2009 జనవరి 20న పదకొండు మంది నిందితుల మీద ఛార్జిషీట్ దాఖలు చేసింది. అప్పటికి ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పింది. 2011 ఏప్రిల్‌లో ఈ కేసును ఎన్ఐఏ తన పరిధిలోకి తీసుకుని, 2012లో మరొక ఇద్దరిని అరెస్టు చేసి నిందితుల సంఖ్యను 14కు చేర్చింది. 2016 మేలో ఎన్ఐఏ కొత్త ఛార్జిషీట్ తయారు చేసింది. 'ఉపా' చట్టం కింద ఆరోపణలున్నప్పటికీ, 2017లో నిందితులందరూ బెయిల్‌మీద బయటికి వచ్చారు. 2018లో విచారణ ప్రారంభమయింది. 323 మంది ప్రాసిక్యూషన్ సాక్షులను, 8 మంది డిఫెన్స్ సాక్షులను విచారించిన తర్వాత, ప్రాసిక్యూషన్ నేర నిర్ధారణకు తగినంత విశ్వసనీయంగా సాక్ష్యాధారాలను సమర్పించలేదని తీర్పు వెలువడింది.

ఆ తీర్పులోనే న్యాయమూర్తి కొందరు కీలకమైన సాక్షులను ఎన్ఐఏ ఉపసంహరించుకోవడం ప్రాసిక్యూషన్ ఉద్దేశాల గురించి ప్రతికూల నిర్ధారణలకు అవకాశం ఇచ్చిందని అన్నారు. ఆ సాక్షులను ప్రవేశపెట్టి ఉంటే, ఆరోపణలను రుజువు చేయడంలో చాలా ఖాళీలు పూరింపబడేవని అన్నారు. కేసు విచారణకు, నేర నిరూపణకు ఉపయోగపడే సాక్షులను ప్రాసిక్యూషన్ తనంతట తానే ఎలా పక్కన పెట్టిందో తీర్పులో వివరంగా రాశారు. అలాగే, సీఆర్పీసీ సెక్షన్ 164 కింద మేజిస్ట్రేట్ దగ్గర నమోదు చేసిన పదముగ్గురు సాక్షుల వాంఙ్మూలాలు మాయమై పోయాయని ఎన్ఐఏ కోర్టుకు చెప్పింది. ఆ పత్రాలు మాయమైనప్పుడు, అవి ఏ మేజిస్ట్రేట్ ముందర నమోదయ్యాయో ఆ మేజిస్ట్రేట్‌ను విచారించవలసి ఉంటుంది. కాని ప్రాసిక్యూషన్ వ్యతిరేకించింది. అయితే ఇలా ప్రాసిక్యూషన్ తప్పులన్నిటినీ జాగ్రత్తగా నమోదు చేసిన న్యాయమూర్తి, ప్రాసిక్యూషన్ వ్యతిరేకించినా అవసరమైన సాక్షులను పిలవడానికి తనకున్న హక్కును మాత్రం వాడుకోలేదు!

విచారణలో మరొక మలుపు కూడా ఉంది. కేసు మొదలయిన నాటి నుంచీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉండిన రోహిణి సాలియాన్ ఈ కేసు విచారణలో వేగంగా సాగవద్దని ఎన్ఐఏ నుంచి తనకు ఆదేశాలు వచ్చాయని 2015లో బయట పెట్టారు. ఆ తర్వాత ఆమెను ఎన్ఐఏ ప్రాసిక్యూటర్ల జాబితా నుంచి తొలగించారు. ఏటిఎస్ నేతృత్వంలో తాము చాలా బలమైన సాక్ష్యాధారాలు తయారు చేశామని, ప్రస్తుత కేసు ఓటమి సాక్ష్యాధారాల లేమి వల్ల జరగలేదనీ, సంస్థాగత, రాజకీయ నిజాయతీ కుప్పకూలడం వల్ల జరిగిందనీ ఆమె అన్నారు. 'చట్టాన్ని అమలు చేయ వలసినవారే అధికారంలో ఉన్నవారిని సంతృప్తి పరచడం కోసం దురుద్దేశాలతో పని చేస్తే న్యాయం పట్టాలు తప్పడంలో ఆశ్చర్యమేమీ లేదు' అన్నారామె. ఇదీ మన దర్యాప్తు వ్యవస్థల పని తీరు!!

వ్యాసకర్త 'వీక్షణం' సంపాదకుడు

వేంకటమను పేరు!

పూర్వం దక్షిణాపథంలో తొండమాన్ చక్రవర్తి పరిపాలన సాగుతున్న రోజులలో ఒకనాడు మృగయా వినోదార్థం ఆ రాజు అడవికి వెళ్ళాడు. వనంలో క్రూరమృగాలను వెంబడించి తిరిగి అలిసిపోయి ఒక పెద్ద బండరాయికి ఆనుకుని సేదదీరి, ఆ రాయినే తరువాత కదిలించి పైకెత్తాడు. అకస్మాత్తుగా ఒక వరాహం ఆ బండరాయి చాటు నుండి బయటకొచ్చింది. వేటాడే ఆలోచనతో విల్లెత్తి బాణాన్ని సంధించి గురిపెట్టాడు. దానిని గ్రహించిన ఆ వరాహం పరుగు లంకించుకుంది. చక్రవర్తి వరాహం వెంటపడ్డాడు.

జ్యోతిర్మయం

ఆ వరాహం చాలా దూరం తీసుకెళ్ళి, చివరకు చెట్ల దాపున ఉన్న ఒక కుహరంలో ప్రవేశించి చూస్తుండగానే అదృశ్యమైంది. ఆశ్చర్యపోయిన తొండమాన్ చక్రవర్తి ఆ గుంటను తవ్వడం మొదలుపెట్టాడు. వరాహం కనపడలేదు. అలసిపోయి కళ్ళు మూసుకున్నాడు తొండమాన్ చక్రవర్తి. అంతలో కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుగుతో ఆ ప్రదేశంలో శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. తన కళ్ళను తానే నమ్మలేక అవాక్కై నిలబడిన చక్రవర్తిని ఆదరంగా చూస్తూ... 'నన్ను భక్తితో కొలిచి, నన్ను తెలుసుకుని అత్యుత్తమమైన ఫలములను పొందుదువు గాక!' అని ఆశీర్వదించాడు. శ్రీహరికి ఎదురుగా నేలపై సాగిలపడి మొక్కి భక్తితో నుతించాడు తొండమానుడు. వెంటనే ఆ ప్రదేశంలో సౌధ, సాల, గోపుర, మంటపాదులను నిర్మింపజేశాడు. 'కట' మనే పాపకాష్ఠము, ద్రవిడ భాషలోని 'వేం' అనే దహన నామంతో చేరి 'వేంకటాద్రి' అనే పేరుతో ఆ ప్రదేశం సకల పాపాలను హరించే పవిత్రమైన ప్రదేశంగా ఈ భువిపై వెలిసింది అని ఎఱ్ఱయకవి 'సకలనీతికథా నిదానము' కావ్యంలో చెప్పాడు. ఆ వేంకటాచలానికి భక్తుల ప్రయాణం పొద్దు పొడుపుతోనే ఇలా సాగింది అన్నాడు:

చ. కటములు జీవురింప దెలిగన్నులవాడుదయింప బాదసం / ఘటన నలంగ గోరికలు గాంచెద మంచును దీర్థయాత్రకై / యిటునటు లేగనేల నరులెట్టి యఘాత్ములకైన గల్గు వేం / కటమనుపేరు జిహ్వా తుది గాపురముండిన ముక్తిసంపదల్.

కోరికలు తీరాలని, పాపాలు నశించాలని ఆలోచనతో తీర్థయాత్రకై నరులు వేరే ప్రదేశాలకు వెళ్ళడం ఎందుకు? ఎంతటి పాపాత్ముడికైనా 'వేంకట' మనే పేరు నాలుక చివరన ఎల్లప్పుడూ ఉంటే చాలు, ముక్తి సంపదలు లభిస్తాయని దీని భావం.

– భట్టు వెంకటరావు

10లో నలుగురే!

మనదేశం మొత్తం జనాభాలో 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత సుమారు 29% ఉన్నారు. అంటే దాదాపు 42 కోట్ల మంది! యువత జనాభా పరంగా భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా అవతరించింది. ఆర్థిక వృద్ధి, అభివృద్ధిని నడిపించే సామర్థ్యం వీరికి ఉంది. ఇదంతా నాణేనికి ఒక వైపు. వాస్తవానికి మన దేశంలోని యువతలో ఆర్జించే వారి సంఖ్య 40 శాతం లోపే ఉంది. అంతేకాదు, ప్రతి పది మందిలో ఒకరే ఉద్యోగం చేస్తున్నారు.

పీపుల్ రీసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్జ్యూమర్ ఎకానమీ (పీఆర్ఐసీఈ) విడుదల చేసిన 'నావిగేటింగ్ ది యూత్ ఫ్రాంటియర్' అనే పరిశోధనా పత్రంలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. 2025 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదుగురు యువకుల్లో ఒకరు భారత్‌కు చెందిన వారు ఉంటారని ఈ అధ్యయనం తెలిపింది. 2024–25లో మొత్తం యువతలో 2.4 శాతం అంటే.. ఒక కోటి మంది మాత్రమే వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారని వివరించింది. 'యువతలో అత్యధికంగా 26.8 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. వ్యాపారం, స్వయం ఉపాధి 14.1 శాతం; వేతన జీవులు 9.9 శాతం, రోజువారీ కూలీలు 12.3 శాతం ఉన్నారు' అని వెల్లడించింది.

యువతలో సంపాదనాపరులు **40%** లోపే

34% మంది నెల ఆర్జన రూ.10 వేలలోపే

నాలుగింట మూడొంతులు ప్రైవేట్ జాబ్స్

మూడింట ఒక వంతు..: సంపాదించే యువతలో మూడింట ఒక వంతు.. అంటే 34.2 శాతం మంది ఆదాయం నెలకు రూ.10,000 లోపే ఉండడం ఆందోళన కలిగించే అంశం. ఇక 69.3 శాతం మంది ఆదాయం నెలకు రూ.25,000 లోపే ఉంది. దిగువ, దిగువ మధ్య ఆదాయ విభాగంలో ఎక్కువ మంది స్త్రీలు ఉండగా; ఎగువ మధ్య, అధిక ఆదాయ విభాగంలో పురుషులు అధికంగా ఉన్నారు. ప్రైవేటు రంగంలో ఏకంగా 3 కోట్లపైచిలుకు మంది విధులు నిర్వర్తిస్తున్నారు.



గ్రామాల్లోనే ఎక్కువ..: యువతలో 70 శాతం కంటే ఎక్కువ మంది కార్మికులు, 90 శాతం మంది వ్యవసాయదారులు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. నిరుద్యోగుల్లో 68 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారు. మెట్రో నగరాల్లోని యువతలో అత్యధికంగా 22 శాతం మంది ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే వ్యవసాయేతర కార్యకలాపాలలో 17 శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. సాంకేతికత, కళలు, సంస్కృతి పరంగా ప్రత్యేకత ఉన్న నగరాల్లో 19 శాతం, ఆర్థికంగా వేగంగా వృద్ధి చెందుతున్న పట్టణాల్లో 16 శాతం యువత స్వయం ఉపాధి పొందుతున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఉద్యోగం ఎక్కడంటే..

విభాగం	సంఖ్య (లక్షల్లో)	శాతం
ప్రభుత్వ ఆఫీసుల్లో	66	16
ప్రైవేట్	309	74
కుటుంబ వ్యాపారం	12	3
ఇతర	23	5

ఏ ఉద్యోగాలు? (సంఖ్య, శాతాల్లో)

శాశ్వత ఉద్యోగాలు	ఒప్పంద ఉద్యోగాలు	ఇతర
1.85 కోట్లు	1.88 కోట్లు	42 లక్షలు
45%	45%	10%


నగటు ఆదాయం
రూ.1,59,000

మొత్తంగా భారత్‌లోని యువతలో 38.7 శాతం మంది మాత్రమే సంపాదనపరులు ఉన్నారు. యూత్ నగటు ఆదాయం దేశంలో రూ.1,59,000 మాత్రమే.

ఇది పట్టణాల్లో రూ.2,19,000 కాగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,28,000.

2024-25లో భారతీయ యువత ఆదాయాలు ఇలా..

వార్షిక ఆదాయం	సంఖ్య (కోట్లలో)	యువతలో	గ్రామీణం వాటా
రూ.60,000 లోపు (దిగువ)	1.2	7.5%	89%
రూ.60,001-రూ.1.2 లక్షలు (దిగువ మధ్య)	4.3	26.7%	74%
రూ.1.2-3 లక్షలు (మధ్య)	5.7	35.1%	48%
రూ.3-6 లక్షలు (ఎగువ మధ్య)	3.3	20.6%	30%
రూ.6 లక్షలకుపైగా (అధిక)	1.6	10.1%	22%
మొత్తం	16.2	100.0%	52%



యూత్ ఏం చేస్తున్నారంటే..

కార్యకలాపాలు	సంఖ్య (కోట్లలో)	శాతం	గ్రామీణ ప్రాంత శాతం
వ్యవసాయం	1.0	2.4	90
వేతన జీవులు	4.2	9.9	44
వ్యాపారం	5.9	14.1	51
రోజువారీ కూలీలు	5.2	12.3	71
గృహిణులు	4.6	11.1	64
విద్యార్థులు	11.3	26.8	68
జాబ్ కోసం చూస్తున్నవారు	2.5	6	68
ఇంటికి పరిమితమైనవారు	3.3	7.9	70
ఇతరులు	4.0	9.5	56
మొత్తం	42.0	100	65

క్లుప్తంగా...

అమ్మా.. నీ వెంటే నేను..

- తల్లి మరణం తట్టుకోలేక తనయుని ఆత్మహత్య


పుల్లమ్మ


కరుణాకర్

వేంసూరు: తల్లి మరణ వార్త విని తట్టుకోలేని తనయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం అడసర్లపాడులో జరిగిన ఈ సంఘటనపై స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారోజు పుల్లమ్మ (80) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. విషయాన్ని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె కుమారుడు మారోజు కరుణాకర్ (40)కు తెలిపారు. కరుణాకర్ హైదరాబాద్‌లో చిరుద్యోగం చేస్తూ ఒంటరిగానే ఉంటున్నాడు. తల్లి మరణ వార్త విని తట్టుకోలేక హైదరాబాద్‌లో అద్దెకు ఉంటున్న ఇంట్లోనే శనివారం తెల్లవారుజామున ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో కరుణాకర్ మృతదేహాన్ని కూడా అడసర్లపాడుకు తీసుకొచ్చి దహన సంస్కారాలు నిర్వహించారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని..

- పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య


మల్లేశం

దుబ్బాక టౌన్: గ్రామంలో భూమి కొనుగోలు చేసినప్పటికీ సదరు భూమి అమ్మిన వారు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మనస్తాపం చెందిన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మానస కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెలిమెల మల్లేశం (49) అదే గ్రామానికి చెందిన రిమ్మనగూడ బొందవ్వ వద్ద 10 సంవత్సరాల క్రితం 2 ఎకరాల 12 గుంటల విస్తీర్ణం గల భూమిని కొనుగోలు చేశాడు. అయితే ఇప్పటి వరకు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదు. గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ ఫలితం లేదు. మల్లేశం భూమి విషయంపై తరచూ కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో మల్లేశం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను తొలుత సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి, తర్వాత మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మల్లేశం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ సిబ్బందిపై దాడి

- 35 మంది గిరిజనులపై కేసు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ సోనాపూర్ తండా బీట్ పరిధి పాలఘోరీలు ప్రాంతంలో అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించేందుకు ప్రయత్నించిన అటవీ అధికారులపై దాడి చేసిన 35 మంది ఆదివాసీ గిరిజనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఈ నెల 8న గుడిసెలు తొలగించేందుకు ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి సిబ్బందితో కలిసి వెళ్లారని పేర్కొన్నారు. సిడం మోతీరాంతోపాటు అక్కడి ఆదివాసీ గిరిజనులు అటవీశాఖ సిబ్బందిపై కారం చల్లి, కర్రలతో దాడి చేశారని తెలిపారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాజేందర్, బీట్ ఆఫీసర్ సంతోష్ గాయపడగా.. వారిని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. శ్రీధరచారి ఫిర్యాదు మేరకు సిడం మోతీరాంతోపాటు 35 మందిపై 163 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మావోయిస్టుల ఇలాకాలో కార్ఖానాలు

- పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు
- రక్షణకు రంగంలోకి దిగనున్న సీఐఎస్ఎఫ్
- భారీ రిక్రూట్‌మెంట్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టులపై ముప్పేట దాడితో విరుచుకుపడుతోన్న కేంద్ర ప్రభుత్వం వారి కట్టడికి చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. వచ్చే మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని చెబుతున్న కేంద్రం.. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పారిశ్రామిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు రక్షణ కల్పించేందుకు ఇప్పుడే ప్రణాళిక సిద్ధం చేసింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సెస్ (సీఐఎస్ఎఫ్)లో కొత్త రక్తం నింపేందుకు భారీగా రిక్రూట్‌మెంట్లు చేపట్టనుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నూతన పారిశ్రామిక పాలసీని ప్రకటించింది. ఈ క్రమంలో ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు భద్రత కల్పిస్తామని చెబుతున్న కేంద్రం పెట్టుబడులకు ఇబ్బంది రాకుండా చూస్తామని చెబుతోంది. అందులో భాగంగా ప్రత్యేక బలగాల స్థానంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్సెస్ (సీఐఎస్ఎఫ్)ను రంగంలోకి దించుతోంది.


సీఐఎస్ఎఫ్ జవాన్లు (ఫైల్)

సీఐఎస్ఎఫ్‌పై సీలింగ్ ఎత్తివేత..

ప్రస్తుతం సీఐఎస్ఎఫ్‌లో పనిచేస్తున్న జవాన్ల సంఖ్య 1.25 లక్షలకు అటూఇటుగా ఉంది. పహల్గాం ఘటన తర్వాత కొత్తగా 13వేల మందిని చేర్చుకోగా మరో 24వేల మంది నియామక ప్రక్రియ వేర్వేరు దశల్లో ఉంది. సీఐఎస్ఎఫ్‌కు సంబంధించి 1.62 లక్షల పోస్టుల వరకే సీలింగ్ ఉంది. తాజాగా బస్తర్‌లో పెట్టుబడులు ఆకర్షించేందుకు దీన్ని జూలై 22న కేంద్రం సవరించింది. మొత్తంగా 2.20 లక్షల మంది కానిస్టేబుళ్లు/జవాన్లను నియామకానికి సీఐఎస్ఎఫ్‌కు అవకాశం కల్పించింది. కేంద్రం తాజా నిర్ణయంతో రాబోయే ఐదేళ్లలో ఏటా 14వేల మందికి మించకుండా మొత్తం 58 వేల మంది సీఐఎస్ఎఫ్ జవాన్లు బస్తర్ అడవుల్లో అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే ఇక్కడ పారిశ్రామిక పురోగతి, ఖనిజాల రవాణా కోసం మల్కాన్‌గిరి–భద్రాచలం రైల్వే మార్గానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, చాన్నాళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన కొత్తగూడెం–కిరండోల్ రైలు మార్గం ఫైనల్ లోకేషన్ సర్వేకూ పచ్చా జెండా ఊపింది. అంతేకాక కిరండోల్–బీజాపూర్–రామగుండం వరకు కొత్త మార్గానికి సర్వే చేపడుతోంది. వీటికి రక్షణతో మొదలయ్యే సీఐఎస్ఎఫ్ విధులు ఆ తర్వాత రాబోయే పరిశ్రమలకూ భద్రత కల్పించనున్నాయి.

సోదరునికి రాఖీ కట్టేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో యువతి మృతి
- తల్లి, మేనమామకు గాయాలు

సిద్దిపేట కమాన్: సోదరుడికి రాఖీ కట్టేందుకు హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్న యువతికి అదే చివరి రోజు అయ్యింది. రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందగా.. తల్లి, మేనమామకు గాయాలయ్యాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శివారులో శనివారం జరిగిన ఈ సంఘటనపై సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలివి. చిన్నకోడూరు మండలం గోనెపల్లికి చెందిన తాళ్లపల్లి పర్శరాములు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం గజ్వేల్ పట్టణంలో భార్య పల్లవి, కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. వీరి కూతురు తాళ్లపల్లి శృతి (24) ఎం ఫార్మసీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తోంది. పర్శరాములు భార్య పల్లవి సిద్దిపేటలోని తమ్ముడు నాగిళ్ల శ్రీనివాస్‌కు రాఖీ కట్టేందుకు.. కూతురు శృతితో కలిసి గజ్వేల్ నుంచి సిద్దిపేటకు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తన భార్య, అక్క పల్లవి, మేనకోడలు శృతితో కారులో అల్లీపూర్ గ్రామానికి వెళ్లి భార్యను అక్కడ దింపేశాడు. అనంతరం మహారాష్ట్ర నుంచి వచ్చిన సోదరుడు లింగంకు రాఖీ కట్టేందుకు శృతి.. తన తల్లి పల్లవి, మేనమామ శ్రీనివాస్‌తో కలిసి నంగునూర్ మండలం నర్మెటకు బయలుదేరింది. ఈ క్రమంలో పట్టణ శివారు రాజీవ్ రహదారిపై శ్రీనివాస్ నడుపుతున్న కారు టైరు పంక్చర్ కావడంతో.. నెమ్మదిగా రోడ్డు పక్కకు తీసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఆర్టీసీ రాజధాని బస్సు.. వెనుకనుంచి వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనక సీట్లో కూర్చున్న శృతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. శృతి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాస్, ఆయన సోదరి పల్లవికి స్వల్ప గాయాలవడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


శృతి

40 ఏళ్ల తర్వాత అన్నకు రాఖీ..

కథలాపూర్: మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యురాలిగా పనిచేసి.. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో లొంగిపోయిన బత్తుల గాంబాలు అలియాస్ పసుల వసంత జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం సిరికొండలో ఉంటున్న అన్న బత్తుల రాజంకు శనివారం రాఖీ కట్టారు. సుమారు 40 ఏళ్ల తర్వాత అన్నకు రాఖీ కట్టడంతో కుటుంబసభ్యులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. గాంబాలు సుమారు 40 ఏళ్ల క్రితం మావోయిస్టు దళంలో చేరారు. అప్పటి నుంచి కుటుంబసభ్యులకు దూరంగానే ఉంటున్నారు. నాలుగు నెలల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో లొంగిపోయి ప్రస్తుతం కోరుట్లలో నివాసం ఉంటున్నారు. రాఖీ పండుగ సందర్భంగా సిరికొండ గ్రామానికి వచ్చి ఆమె తన అన్న రాజంకు రాఖీ కట్టారు.


అన్న రాజంకు రాఖీ కడుతున్న మావోయిస్ట్ నాయకురాలు గాంబాలు

సోదరుడికి చివరి రాఖీ..

- మృతి చెందిన వ్యక్తికి రాఖీలు కట్టిన తోబుట్టువులు

కేసముద్రం: రాఖీ పండుగ రోజే ఒక్కగానొక్క సోదరుడు అనారోగ్యంతో మృతి చెందగా.. తల్లడిల్లిపోయిన ఐదుగురు తోబుట్టువులు అతడికి రాఖీలను కట్టి ప్రేమను చాటుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధి కేసముద్రం విలేజ్‌లో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుంకరబోయిన చిన్నసోమయ్య, లక్ష్మి దంపతులకు కుమార్తెలు పూలమ్మ, జయమ్మ, దేవా, నాగమ్మ, నీలమ్మ, కుమారుడు యాకన్న ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. కాగా, యాకన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. యాకన్నకు నలుగురు అక్కలు, ఒక చెల్లెలు ప్రతి సంవత్సరం రాఖీ పండుగకు వచ్చి రాఖీలు కట్టేవారు. మృతి చెందిన సోదరుడి చేతికి రాఖీలు కడుతూ తమ్ముడా, అన్నయ్యా.. ఇవే మా చివరి రాఖీలు అంటూ వారు రోదించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది.


మృతిచెందిన సోదరుడికి రాఖీ కడుతూ రోదిస్తున్న సోదరి

ఏం ఘనకార్యం చేశావని ఊరేగింపు

- బండిపై రావుల శ్రీధర్‌రెడ్డి ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: ఏం ఘనకార్యం చేశావని ఊరేగింపు తీశావో చెప్పాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు సాక్షిగా హాజరైన బండి సంజయ్ ర్యాలీగా వెళ్లడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బండి సంజయ్ ఉండడం మన దౌర్భాగ్యమని, సిట్ విచారణ అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలకు పిచ్చాసుపత్రిలో చేర్చాలని ధ్వజమెత్తారు. సంచనాల కోసం మీడియాతో చిల్లరవాగుడు వాగుతున్నారని, ఇలాంటి వాళ్లతో బీజేపీ భ్రష్టు పడుతుందని, తన శాఖ గురించి ఇంగిత జ్ఞానం కూడా లేని వ్యక్తి ఆయన అని ఆరోపించారు.

కోటి ఎకరాల్లో సాగు

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో ఆశాజనకం

గోదావరి పరీవాహక ప్రాంతంలో సాగునీరు లేక వరిసాగు అంతంత మాత్రంగా ఉండగా కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో మాత్రం ఇప్పుడిప్పుడే రైతులు నాట్లు వేసేందుకు ఉపక్రమిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు కూడా దక్షిణ తెలంగాణ రైతులకు ఆశాజనకంగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే సగటున 40 శాతం వరిసాగు కాగా పత్తి 70–80 శాతం సాగైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే పత్తి 80 శాతానికిపైగా సాగవగా వరి 30–40 శాతం వరకు సాగులో ఉంది. రంగారెడ్డి పరిధిలోని మూడు జిల్లాల్లో భారీ గా వర్షాలు కురిసినప్పటికీ వరిసాగు విస్తీర్ణం అంతంత మాత్రంగానే ఉంది. కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలతోపాటు దక్షిణ తెలంగాణలో వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో కృష్ణా నది పరిధిలోని 30 జలాశయాల్లో 619 టీఎంసీల నీటికిగాను 577 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఆగస్టు మూడో వారం వరకు దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలతోపాటు ఉత్తర తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాల్లో కూడా వరిసాగు విస్తీర్ణం భారీగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ చెబుతోంది.

ఎస్సారెస్పీ నీటి విడుదలతో..

ఉత్తర తెలంగాణ జిల్లాలకు గోదావరి జలాలే ప్రధాన నీటి వనరు. మొత్తంగా గోదావరి పరిధిలో 419 టీఎంసీల సామర్థ్యంగల 57 జలాశయాలు ఉండగా వాటిలో ఇప్పుడున్న నీటి నిల్వలు కేవలం 146 టీఎంసీలే. అయితే నిజామాబాద్‌తోపాటు పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, హనుమకొండతోపాటు నిర్మల్, మంచిర్యాలకు నీరందించే ఎస్సారెస్పీ కుడి, ఎడమ కాల్వలకు ఇటీవల నీటిని విడుదల చేయడంతో ఆయా జిల్లాల పరిధిలో రైతులు కాల్వల కింద ఉన్న పొలాల్లో నాట్లు వేసుకుంటున్నారు. నిజామాబాద్, జిల్లాలో లోటు వర్షపాతం ఉన్నప్పటికీ సెప్టెంబర్‌లో వానలు కురిసి ప్రాజెక్టులు నిండుతాయనే ఆశతోపాటు ఎస్సారెస్పీ నీటి విడుదలతో సాధారణ సాగు విస్తీర్ణంలో 90 శాతానికిపైగా నాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్‌లలో ఇటీవల కురిసిన వర్షాలకు తోడు జలాశయాల నుంచి వచ్చిన నీటితో రైతులు సాగు పనుల్లో ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్‌లోని నాలుగు జిల్లాల్లోనూ 60–70 శాతం పంటలను సాగు చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంకన్నా సుమారు 60 శాతం తక్కువగా సాగు నమోదైంది. ఉమ్మడి వరంగల్ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇప్పటివరకు 43 వేల ఎకరాల్లో పంటలు సాగు కావల్సి ఉండగా 4,500 ఎకరాలకే పరిమితమయ్యాయి. ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోనూ మూడో వంతు విస్తీర్ణంలో కూడా నాట్లు వేయలేదు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో వరిసాగు విస్తీర్ణం ఈసారి ఆశాజనకంగా ఉంది.

ఉద్యాన పంటలు అంతంతే..

రాష్ట్రంలో ఇప్పటివరకు బోర్లు, బావుల కిందనే అధికంగా వరినాట్లు వేయగా చెరువులు, ప్రాజెక్టుల కింద ఇప్పుడిప్పుడే నాట్లు వేసేందుకు ఉపక్రమిస్తున్నారు. దీనివల్లనే సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 50 శాతం వరి సాగు మాత్రమే పూర్తయింది. ఉద్యానవన పంటల్లో దీర్ఘకాలిక పంటల విస్తీర్ణం 8.40 లక్షలుగా ఉండగా ఇప్పటివరకు సీజనల్ ఉద్యాన పంటలు 78,348 ఎకరాల్లోనే సాగైంది. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, మొక్కజొన్న, సోయాబీన్‌తోపాటు కూరగాయల పంటలు, ఇతర పంటలకు ఊతం ఇచ్చినట్లయింది. ఉత్తర తెలంగాణకు వర్షాభావ పరిస్థితులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

హైవేలపై రాఖీ రద్దీ

- టోల్‌ప్లాజాల వద్ద బారులు తీరిన వాహనాలు
- ఫాస్టాగ్ స్కానింగ్‌లో జాప్యంతో వాహనదారుల ఇబ్బందులు


బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వరంగల్ వైపు బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్, బీబీనగర్: వరుస సెలవులతోపాటు రాఖీ, బోనాల పండుగల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి భారీ సంఖ్యలో ప్రజలు స్వస్థలాలకు బయలుదేరటంతో ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ తీవ్రమైంది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ శనివారం రాత్రి వరకు కొనసాగింది. విజయవాడ మార్గంలో టోల్‌ప్లాజా వద్ద అర కిలోమీటర్ వరకు ట్రాఫిక్ జామ్ అయింది. టోల్‌ప్లాజాలో వాహనాలు వెళ్లడానికి ఫాస్టాగ్ స్కానర్లు సరిగ్గా పనిచేయకపోవడంతో టోల్ విండోలోనే రెండు నిమిషాలకు పైగా వాహనాలు ఆగాయి. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద కూడా వాహనాలు పెద్ద సంఖ్యలో బారులు తీరాయి. జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. గూడురు టోల్‌ప్లాజా నుంచి ఒక్కరోజే సుమారు 50 వేలకు పైగా వాహనాలు తరలి వెళ్లాయి. టోల్‌బూత్‌లలో సిబ్బంది కొరతతోపాటు ఫాస్టాగ్ స్కానింగ్ కాకపోవడంతో వాహనాలు ఆలస్యంగా కదిలాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



వరుస సెలవులు, రాఖీ పండుగ రద్దీ వల్ల ఆర్టీసీ డ్రైవర్లు, ఇతర సిబ్బంది బిజీగా మారారు. దీంతో నల్లగొండ బస్ స్టాప్‌లో.. విధుల్లో ఉన్న అన్నకు ఆయన సోదరి రాఖీ కట్టింది.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

వృక్షా బంధన్..


వృక్షాలకు రాఖీలు కడుతున్న గిరిజనులు, అటవీ సిబ్బంది

ఖమ్మం వ్యవసాయం: అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టడం ఆనవాయితీ. కానీ ప్రకృతిని రక్షించాలని, వృక్షాలు, అడవులే తమకు రక్షణ అంటూ ఖమ్మం జిల్లా అటవీ శాఖ ఉద్యోగులు రక్షాబంధన్‌ను శనివారం వినూత్నంగా నిర్వహించారు. జిల్లాలోని బ్రహ్మాళ్లకుంటలో చెట్లకు రాఖీలు కట్టడంతో పాటు స్థానిక గిరిజనులతోనూ కట్టించారు. అటవీ సంపదను కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. తద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం, గిరిజనులకు అడవులతో అనాదిగా ఉన్న బంధాన్ని పెంపొందించటానికి దోహదపడుతుందని అటవీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

పుతిన్, ట్రంప్ భేటీ 15న



వాషింగ్టన్: ప్రపంచ దేశాలు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ భేటీకి వేదిక, తేదీ ఖరారయ్యాయి. ఈ నెల 15వ తేదీన అలస్కాలో ఇరువురు నేతలు సమావేశం కాబోతున్నారు. డొనాల్డ్ ట్రంప్ ఈ విషయం స్వయంగా వెల్లడించారు. పుతిన్‌తో తన భేటీ గురించి శనివారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. వచ్చే శుక్రవారం రష్యా అధ్యక్షుడిని కలుసుకోబోతున్నట్లు తెలిపారు. ఇద్దరు నేతలు ముఖాముఖి సమావేశం అవుతుండడం నాలుగేళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడం విశేషం. ఉక్రెయిన్–రష్యా యుద్ధాన్ని ముగించే దిశగా పుతిన్‌ను ట్రంప్ ఒప్పిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై ట్రంప్ టారిఫ్‌ల మోత మోగించారు. భారత ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు.

వేదిక అలస్కా

- నాలుగేళ్ల తర్వాత జరుగబోతున్న ముఖాముఖి చర్చలు
- ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించేలా పుతిన్‌పై ఒత్తిడి పెంచే అవకాశం

అంతేకాకుండా రష్యా ప్రత్యర్థి దేశమైన ఉక్రెయిన్‌పై సైనిక సాయం భారీగా పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఈ తరుణంలో ట్రంప్, పుతిన్ భేటీ విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అతిపెద్ద యుద్ధం ఉక్రెయిన్–రష్యా సమరమే. దీనికి సాధ్యమైనంత త్వరగా తెరదించాలని ట్రంప్ పట్టుదలతో ఉన్నారు. పుతిన్‌ను కలుసుకోబోతున్నట్లు ఇటీవల హఠాత్తుగా ప్రకటించి, అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.

ఒకప్పటి రష్యా భూభాగమే అలస్కా

పుతిన్, ట్రంప్ సమావేశానికి అలస్కా వేదిక అవుతుండడం మరో విశేష పరిణామం. అలస్కా 1867 దాకా రష్యా సామ్రాజ్యంలో అంతర్భాగమే. అప్పటి జార్ చక్రవర్తి అలెగ్జాండర్–2 ఈ ప్రాంతాన్ని అమెరికాకు విక్రయించారు. బ్రిటిష్ సైన్యం దీన్ని ఆక్రమిస్తుందన్న భయంతో అప్పటికప్పుడు అమ్మకానికి పెట్టారు. ఎకరాకు ఒక డాలర్ చొప్పున అమ్మేసినట్లు చెబుతుంటారు. 19వ శతాబ్దంలో ప్రపంచంలో ఇది అతిపెద్ద రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం అలస్కా భూభాగం విలువ 10 బిలియన్ డాలర్లు(రూ.8.75 లక్షల కోట్లు) ఉంటుందని అంచనా. బంగారం సహా సహజ వనరులకు లోటులేని ప్రాంతం అలస్కా. అమెరికా విస్తీర్ణంలో ఐదింట ఒక వంతు అలాస్కా ఉంటుంది. అలస్కాతో రష్యాకు విడదీయరాని అనుబంధం ఉంది.

ఆగస్టు 15న సమావేశం ఎందుకు?

ఇక ఇద్దరు కీలక నాయకుల భేటీ కోసం నిర్ణయించిన తేదీకి కూడా చెప్పుకోదగ్గ ప్రాధాన్యం ఉంది. ఆగస్టు 15వ తేదీ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తేదీ అని మనకు తెలుసు. కానీ, ఎక్కువ మందికి తెలియని సంగతి ఏమిటంటే.. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తేదీ ఆగస్టు 15. జపాన్ చక్రవర్తి హిరోహితో లొంగుబాటు ప్రకటనతో ఈ యుద్ధం ముగిసింది. ఈ ఏడాది ఆగస్టు 15న రెండో ప్రపంచ యుద్ధానికి 80 ఏళ్లు పూర్తికాబోతున్నాయి. 1945 ఆగస్టు 15న రెండో ప్రపంచ యుద్ధానికి తెరపడగా సరిగ్గా రెండేళ్లకు ఇండియాకు స్వాతంత్ర్యం లభించింది. జపాన్‌లో మిత్రదేశాల సైన్యాన్ని లార్డ్ లూయిస్ మౌంట్‌బాటెన్ ముందుండి నడిపించారు. విజయం చేకూర్చి పెట్టారు. అదే మౌంట్‌బాటెన్ ఇండియా గవర్నర్ జనరల్ హోదాలో 1947లో స్వాతంత్ర్య దినాన్ని ఆగస్టు 15గా నిర్ణయించారు. అది ఆయనకు ఇష్టమైన తేదీ కావడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఆగస్టు 15వ తేదీన పుతిన్, ట్రంప్ కలుసుకోబోతున్నారు.



మా అభ్యంతరాలు వినాల్సిందే

ప్రాదేశిక సమగ్రతపై రాజీపడే ప్రసక్తే లేదు

- ఆక్రమణదారులకు మా భూమిని అప్పగించం
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టీకరణ



కీవ్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య ఈ నెల 15న జరుగబోతున్న భేటీ పట్ల ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్‌స్కీ అసహనం వ్యక్తంచేశారు. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా వారిద్దరూ ఏ నిర్ణయం తీసుకున్నా, ఏ ఒప్పందం కుదుర్చుకున్నా అది తమకు సమ్మతం కాబోదని తేల్చిచెప్పారు. ఈ మేరకు శనివారం 'టెలిగ్రామ్'లో పోస్టు చేశారు. రష్యా ఆక్రమణలో ఉన్న తమ భూభాగాలను వదులుకొనే ప్రసక్తే లేదన్నారు. అవి ఏనాటికైనా ఉక్రెయిన్‌లో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. ఒకవేళ వాటిని రష్యాలో అంతర్భాగంగా అమెరికా ప్రభుత్వం అధికారికంగా గుర్తిస్తే సంఘర్షణ మరింత ముదురుతుంది తప్ప తగ్గబోదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ట్రంప్–పుతిన్ చర్చల్లో ఈ అంశంపై చర్చ జరగదనే భావిస్తున్నామని తెలిపారు. ఉక్రెయిన్–రష్యా మధ్య శాంతి కోసమే ఆ ఇరువురు నేతల చర్చలు పరిమితమైతే బాగుంటుందని వెల్లడించారు. రెండు దేశాల నడుమ శాశ్వత శాంతి సాధ్యం కావాలంటే తమ అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఆక్రమణదారులకు తమ భూమి అప్పగించేందుకు సిద్ధంగా లేమన్నారు. ఉక్రెయిన్ ప్రమేయం లేకుండా ఇతర పక్షాలు తీసుకొనే ఏ నిర్ణయమైనా అది శాంతికి వ్యతిరేకమే అవుతుందన్నారు. పరిష్కారమార్గాలను చంపేసేలా ఎవరూ వ్యవహరించవద్దని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, ఉక్రెయిన్‌లోని ఖేర్సన్ సిటీపై రష్యా సైన్యం శనివారం డ్రోన్లతో దాడికి దిగింది. ఈ ఘటనలో ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు మరణించారు. మరో 16 మంది గాయపడ్డారు. జపొరిజియాలో జరిగిన మరో దాడిలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. రష్యా సైన్యం 47 డ్రోన్లు ప్రయోగించగా, వాటిలో 16 డ్రోన్లను మధ్యలోనే కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకటించింది. రెండు క్షిపణులు సైతం ప్రయోగించగా, ఒక క్షిపణిని ధ్వంసం చేశామని తెలియజేసింది.

ఐదు పాక్ యుద్ధ విమానాలు కూల్చేశాం

మరోభారీ విమానాన్ని సైతం పడగొట్టాం

- ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వైమానిక దళానికి భారీ దెబ్బ
- మాపై ఎలాంటి ఒత్తిళ్లు రాలేదు.. ఆంక్షల్లేవు
- లక్ష్యం నెరవేరింది కాబట్టే ఆపరేషన్ ముగించాం
- భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఏం జరుగుతుందో ఉగ్రవాదులకు అర్థమైంది
- ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ వెల్లడి



బెంగళూరు: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ వైమానిక దళాన్ని భారీగా దెబ్బకొట్టామని భారత వైమానిక దళం(ఐఏఎఫ్) ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఆ ఆపరేషన్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలు, మరో భారీ విమానాన్ని కూల్చివేశామని ప్రకటించారు. మన సైన్యం ఇప్పటిదాకా ఉపరితలం నుంచి ఉపరితలానికి చేసిన నమోదిత దాడుల్లో ఇది అతిపెద్ద దాడి అని పేర్కొన్నారు. శనివారం బెంగళూరులో 16వ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎల్.ఎం.కాత్రే స్మారక ప్రసంగంలో అమర్‌ప్రీత్ సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌పై వివరాలు పంచుకున్నారు. ఆ ఆపరేషన్‌లో పాకిస్తాన్‌పై జరిగిన నష్టంపై భారత సైనికాధికారి బహిరంగంగా ప్రకటన చేయడం ఇదే మొదటిసారి. తొమ్మిది పాక్ ఉగ్రవాద స్థావరాలకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలను అమర్‌ప్రీత్ సింగ్ ప్రదర్శించారు. దాడికి ముందు, దాడి తర్వాత దృశ్యాలు ఇందులో ఉన్నాయి. పాకిస్తాన్ చెబుతున్నట్లుగా సాధారణ జనావాసాలపై, పౌరులపై దాడి చేయలేదని స్పష్టం చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

''పటిష్టమైన ప్రణాళికతో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించాం. దాదాపు 90 గంటల వ్యవధిలోనే అనుకున్న లక్ష్యం సాధించి, ప్రత్యర్థి దేశాన్ని భారీగా నష్టపరిచాం. పాకిస్తాన్‌కు చెందిన రెండు వైమానిక స్థావరాలు సైతం ధ్వంసం చేశాం. భారత ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థ, డ్రోన్ వ్యవస్థలు సమర్థవంతంగా పని చేశాయి. పాక్ సైన్యం ప్రయోగించిన మానవ రహిత వైమానిక వాహనాలు(యూఏవీ), డ్రోన్లను కూల్చివేశాం. వాటిలో చాలావరకు మన భూభాగంలో పడిపోయాయి. కొన్ని క్షిపణులను సైతం తుత్తునియలు చేసి మన సత్తా చాటాం.

కాళ్లబేరానికి వచ్చిన పాక్

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్ సైనిక స్థావరాలపై దృష్టి పెట్టి, క్షిపణులతో దాడికి దిగాం. జకోబాబాద్ ఎయిర్‌బేస్‌లో కనీసం ఒక ఏడబ్ల్యూసీ విమానంతోపాటు ఎఫ్–16 యుద్ధ విమానాలను పార్క్ చేసిన హ్యాంగర్ సగం వరకు నామరూపాల్లేకుండా పోయింది. అమెరికా ఇచ్చిన ఎఫ్–16లు చాలావరకు దెబ్బతిన్నాయి. రెండు కమాండ్ కంట్రోల్ కేంద్రాలు కూడా ధ్వంసమయ్యాయి. సర్గోధా ఎయిర్‌బేస్‌ను సైతం నేలమట్టం చేశాం. పదవీ విరమణ కంటే ముందే ఈ ఎయిర్‌బేస్‌పై దాడి చేసే అవకాశం రావడం సంతోషకరం. సుకుర్ ఎయిర్‌బేస్‌లో యూఏవీ హ్యాంగర్‌తోపాటు రాడార్ సైట్‌పై దాడి చేశాం. మరింత నష్టం జరిగే ప్రమాదం కనిపించడంతో పాకిస్తాన్ కాళ్లబేరానికి వచ్చింది. దాడులు ఆపాలంటూ ఫోన్‌చేసి అభ్యర్థించింది. కాల్పుల విరమణ కోసం విజ్ఞప్తి చేసింది. మన దాడిలో దెబ్బతిన్న పాక్ ఎయిర్‌బేస్‌లు ఎప్పటికీ వినియోగంలోకి రావు. వాటికి మరమ్మతు కొనసాగుతూనే ఉన్నాయి. రష్యాలో తయారైన ఎస్–400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ మనకు ఎంతగానో తోడ్పడింది. ఇదొక గేమ్ ఛేంజర్ అని చెప్పొచ్చు.

మాకు పూర్తి స్వేచ్ఛ లభించింది

పాక్ ముష్కరులపై ఆపరేషన్ విషయంలో సైన్యంపై రాజకీయపరమైన ఒత్తిళ్లేవీ రాలేదు. దాడులకు ప్రణాళిక రచించి, అమలు చేయడానికి మాకు పూర్తి స్వేచ్ఛ లభించింది. ఆపరేషన్ సిందూర్ విజయానికి మన ప్రభుత్వ పట్టుదల కూడా కారణమే. మాకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఒత్తిళ్లు లేవు, ఆంక్షలు విధించలేదు. మేము ఏవైనా నియంత్రణలు పాటించి ఉంటే అవి సొంతంగా పాటించినవే. పాక్ ఉగ్రవాదులను భారీగా దెబ్బకొట్టాలన్న లక్ష్యంతోనే పనిచేశాం. మన శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పాం.

'ఇంకా చావగొట్టాలి' అన్నారు

పాకిస్తాన్‌పై ఆపరేషన్‌ను త్వరగా ముగించడంపై రకరకాల వ్యాఖ్యలు వినిపించాయి. వాస్తవం ఏమిటో చెప్పుకోవాలి. మా ఉద్దేశాలు స్పష్టంగా ఉన్నాయి. ఉగ్రవాదులకు మర్చిపోలేని గుణపాఠం చెప్పాలన్నదే మా లక్ష్యం. భారత్‌పై మళ్లీ దాడికి దిగితే ఏం జరుగుతుందో వారికి తెలిసిరావాలి. ఆపరేషన్ సిందూర్‌తో ఆ లక్ష్యం నెరవేరింది. భారత్ వైపు కన్నెత్తి చూస్తే ఎంత మూల్యం చెల్లించాలో ముష్కరులకు అర్థమైంది. లక్ష్యం నెరవేరింది కాబట్టి దాడులు ఆపేశాం. ఆపరేషన్ ముగించిన రోజు చాలామంది మాట్లాడారు. నాకు సన్నిహితులైనవారు మాట్లాడుతూ.. 'ఇంకా చావగొట్టాలి' అన్నారు. అనుకున్నది సాధించిన తర్వాత కూడా దాడులు కొనసాగించడంలో అర్థం లేదు.

'బాలాకోట్'పై ఒప్పించలేకపోయాం

పుల్వామా ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలన్న ధ్యేయంతో బాలాకోట్‌లో భీకర దాడులు చేశాం. వైమానిక దాడులతో పాక్ సైనిక శిబిరాలను నేలమట్టం చేశాం. బాలాకోట్ దాడికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు అందుబాటులో లేవు. అవి లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. విమర్శలకు తావిచ్చింది. మేము ఏం సాధించామో ప్రజలకు చెప్పలేకపోవడం నిజంగా దురదృష్టకరం. బాలాకోట్ దాడులతో పాకిస్తాన్‌కు పెద్ద నష్టం జరిగినట్లు నిఘా సమాచారం ఉంది. ఈ దాడుల్లో ఎంతోమంది ఉగ్రవాదులు హతమయ్యారు. కానీ, ఆ విషయంలో ప్రజలను నమ్మించలేకపోయాం. కానీ, ఆపరేషన్ సిందూర్ విషయంలో మేము అదృష్టవంతులమే. ఎందుకంటే వీడియోలు, ఫొటోలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో మన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ది అత్యంత కీలక పాత్ర. సైనిక దళాలను, ఇతర సంస్థలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. ఏ యుద్ధంలోనైనా తొలుత గగనతల దాడులే ముఖ్యమని ఆపరేషన్ సిందూర్ ద్వారా మరోసారి తేటతెల్లమైంది'' అని అమర్‌ప్రీత్ సింగ్ వివరించారు.

అతిపెద్ద బ్లాక్ హోల్

3,600 సూర్యగోళాల ద్రవ్యరాశితో సమానం

లండన్: భూగోళం నుంచి 500 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో అతిపెద్ద కృష్ణ బిలాన్ని ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్‌మౌత్ సైంటిస్టులు గుర్తించారు. అంతరిక్షంలో ఇప్పటిదాకా కనిపెట్టిన బ్లాక్ హోల్స్‌లో ఇదే అతిపెద్దది కావడం గమనార్హం. దీని ద్రవ్యరాశి 3,600 సూర్యగోళాల ద్రవ్యరాశితో సమానమని చెబుతున్నారు. కాస్మిక్ హార్స్‌షూ సిస్టమ్‌లోని ఒక భారీ పాలపుంత(గెలాక్సీ) మధ్యలో ఇది కేంద్రీకృతమై ఉన్నట్లు వెల్లడించారు. మన భూగ్రహం ఉన్న పాలపుంత మధ్యలోని కృష్ణబిలం కంటే ఇది 10 వేల రెట్లు పెద్దదని తెలియజేశారు. ఇప్పటిదాకా 10 భారీ బ్లాక్‌హోల్స్‌ను గుర్తించారు. వాటన్నింటికీ ఇప్పుడు కనిపెట్టిందే పెద్దన్న అని అంటున్నారు. దీని ఉనికిని కనిపెట్టడానికి గ్రావిటేషనల్ లెన్సింగ్, స్టెల్లార్ కైనమాటిక్స్ ఉపయోగించారు. సాధారణంగా కృష్ణ బిలాలు తమకు సమీపంలో ఉన్న వస్తువులను ఆకర్షించి, తమలో విలీనం చేసుకుంటూ ఉంటాయి. విశ్వంలో ఇవి ఎలా ఏర్పడ్డాయన్న దానిపై భిన్నమైన వాదనలు ఉన్నాయి. అవి శాస్త్రీయంగా నిరూపితం కాలేదు.

పండుగ సీజన్‌లో రైల్వేల బంపర్ ఆఫర్

- దీపావళి, ఛత్ సెలవుల్లో రద్దీ తగ్గించేందుకు ప్రణాళికలు
- రిటర్న్ టికెట్ ప్రాథమిక ధరపై 20% రాయితీ
- ఈ నెల 14 నుంచి బుకింగ్స్ ప్రారంభం
- అక్టోబర్ 13 నుంచి చేసే ప్రయాణాలకు 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్'

సాక్షి, న్యూఢిల్లీ: దీపావళి, ఛత్ పండుగల రద్దీని తగ్గిస్తూ ప్రయాణికులకు సౌలభ్యం కల్పించేందుకు రైల్వే శాఖ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్ ప్యాకేజ్' పేరుతో ప్రవేశపెట్టిన ఈ స్కీమ్‌లో రిటర్న్ టికెట్ ప్రాథమిక ధరపై 20 శాతం రాయితీ లభిస్తుంది. ఈ మేరకు శనివారం కేంద్ర రైల్వే శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పథకంలో భాగంగా చేసే బుకింగ్‌లు ఆగస్టు 14 నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన రౌండ్ ట్రిప్ ప్యాకేజ్‌లో భాగంగా వెళ్లే ప్రయాణం అక్టోబర్ 13 నుంచి 26 మధ్య, వచ్చే ప్రయాణం నవంబర్ 17 నుంచి డిసెంబర్ 1 మధ్య ఉండాలి. రిటర్న్ టికెట్ బుకింగ్‌కు 60 రోజుల అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ వర్తించదు. రెండు ప్రయాణాలూ ఒకే ప్రయాణికుల పేర్లతో, ఒకే తరగతి, ఒకే గమ్యస్థానం ఉన్న జంటకు మాత్రమే అనుమతిస్తారు. అయితే రెండు ప్రయాణాల్లోనూ కన్ఫర్మ్‌డ్ టికెట్లు తప్పనిసరి. ఫ్లెక్సీ ఫేర్ రైళ్లు మినహా అన్ని సాధారణ, ప్రత్యేక రైళ్లకు రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ ఆఫర్ వర్తిస్తుంది. ఈ పథకం కింద బుక్ చేసిన టికెట్లకు రీఫండ్ లేదా మార్పులు అనుమతించరు. ఆన్‌లైన్ లేదా కౌంటర్.. రెండు టికెట్లు ఒకే విధానంలోనే బుక్ చేయాలి. ఈ స్కీమ్ పండుగ సీజన్‌లో రద్దీని విభజించడంతో పాటు, ప్రత్యేక రైళ్ల వినియోగాన్ని పెంచుతుందని కేంద్ర రైల్వేశాఖ ఆశిస్తోంది.

ఆఫర్ వివరాలు

- **బుకింగ్ ప్రారంభం:** ఆగస్టు 14, 2025
- **ప్రారంభ ప్రయాణం:** అక్టోబర్ 13 నుంచి 26 వరకు
- **తిరుగు ప్రయాణం:** నవంబర్ 17 నుంచి డిసెంబర్ 1 వరకు
- రిటర్న్ టికెట్ బుకింగ్‌కు 60 రోజుల అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ వర్తించదు.
- రానుపోను టికెట్లు ఒకే ప్రయాణికుల పేర్లతో, ఒకే తరగతి, ఒకే గమ్యస్థాన జంటకు మాత్రమే.
- రెండు ప్రయాణాలకూ కన్ఫర్మ్‌డ్ టికెట్లు తప్పనిసరి.
- ఫ్లెక్సీ ఫేర్ రైళ్లు మినహా అన్ని రైళ్లకు ఆఫర్ వర్తింపు.
- టికెట్ బుక్ చేసిన తర్వాత మార్పులు, రీఫండ్‌లు ఉండవు.

ఫిర్యాదు వచ్చేదాకా ఆగడం ఎందుకు?

దర్యాప్తు చేయండి: ఒ.పి.రావత్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో గోల్‌మాల్ జరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేస్తోంది. అక్రమాలకు ఆస్కారమే లేదని తేల్చిచెబుతోంది. అయితే, నకిలీ ఓటర్ల విషయంలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒ.పి.రావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో నకిలీ ఓటర్లను చేర్చారంటూ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల పట్ల ఎన్నికల సంఘం దర్యాప్తు చేయాలని సూచించారు. 'ఎవరో ఫిర్యాదు చేసేదాకా ఆగడం ఎందుకు? మీరే సొంతంగా దర్యాప్తు చేయండి. నిజాలు బయటపెట్టండి'' అని ఈసీకి తేల్చిచెప్పారు. తాను ఎన్నికల సంఘంలో పని చేసిన సమయంలో ఎవరైనా రాజకీయ నాయకులు ఆరోపణలు చేస్తే వాటిపై తాము దర్యాప్తు చేసేవాళ్లమని గుర్తుచేసుకున్నారు. సామాన్య ప్రజలకు నిజాలు వెల్లడించేవాళ్లమని అన్నారు. దానివల్ల ఎన్నికల సంఘం పట్ల ప్రజల విశ్వసనీయత దెబ్బతినేది కాదని వ్యాఖ్యానించారు. ఒ.పి.రావత్ తాజాగా ఓ మీడియా సంస్థతో మాట్లాడారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

మరో ఇద్దరికి గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంలో శుక్రవారం రాత్రి నుంచి కొనసాగుతున్న భీకర ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఆర్మీ జవాన్లు నేలకొరిగారు. ఆ ప్రాంతంలో గత తొమ్మిది రోజులుగా ముష్కరుల కోసం భద్రతా బలగాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇద్దరు జవాన్లు మృత్యువాత పడిన నేపథ్యంలో కూంబింగ్‌ను ముమ్మరం చేశామని అధికారులు వెల్లడించారు. ప్రాణత్యాగం చేసిన జవాన్లను లాన్స్ నాయక్ ప్రీత్‌పాల్ సింగ్, సిపాయి హర్మీందర్ సింగ్ అని తెలిపారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారన్నారు. ఆగస్టు ఒకటో తేదీన కుల్గాం జిల్లా అఖాల్ అటవీ ప్రాంతాన్ని దిగ్బంధించి సోదాలు చేపట్టిన సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్ సందర్భంగా ఇద్దరు ఉగ్రవాదులు హతమవ్వగా ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది జవాన్లు గాయపడ్డారని వెల్లడించారు. తాజా ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులు అక్కడ జరుగుతున్న ఆపరేషన్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా నిఘా వేశారు. దాక్కున్న ముష్కరుల జాడ కనిపెట్టేందుకు ఆర్మీ జవాన్లకు తోడుగా పారా కమాండోలను సైతం రంగంలోకి దించారు. సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లలో ఇదొకటని అధికారులు వివరించారు. తాజా ఘటనపై జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి ధైర్యసాహసాలు, త్యాగం మరువలేనివని పేర్కొన్నారు.



ప్రీత్‌పాల్ సింగ్




హర్మీందర్ సింగ్

నానోక్రాఫ్ట్‌తో కృష్ణ బిలాల

రహస్యాల ఛేదన

- పేపర్ క్లిప్ కంటే తక్కువ బరువుండే వ్యోమనౌక
- వందేళ్లలో బ్లాక్స్ హోల్స్ సమీపంలోకి పయనం
- ఆస్ట్రోఫిజిసిస్ట్ కాసిమో బాంబీ వెల్లడి



సువిశాలమైన అంతరిక్షంలో కృష్ణ బిలాలు(బ్లాక్ హోల్స్) అంతుచిక్కని మిస్టరీయే. వాటి గురించి సంపూర్ణంగా తెలుసుకోవడానికి సైంటిస్టులు దశాబ్దాలుగా పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. బ్లాక్‌హోల్స్ పుట్టుక, పరిణామం గురించి తెలిస్తే విశ్వం ఎలా ఆవిర్భవించిందో, గ్రహాలు ఎలా ఏర్పడ్డాయో చాలావరకు నిర్ధారణకు రావొచ్చని భావిస్తున్నారు. భూగ్రహం నుంచి కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉండే కృష్ణ బిలాల వద్దకు చేరుకొనే సదుపాయం ఇప్పటికైతే లేదు. అలాంటి వ్యోమనౌకను ఎవరూ అభివృద్ధి చేయలేకపోయారు. కానీ, అది సాధ్యమేనని ప్రముఖ అస్ట్రోఫిజిసిస్ట్ కాసిమో బాంబీ ధీమాగా చెబుతున్నారు. మరో 100 ఏళ్లలో కృష్ణ బిళం వద్దకు వ్యోమనౌకను పంపించగలమని అంటున్నారు. ఈ స్పేస్‌క్రాఫ్ట్ బరువు ఎంత ఉంటుందో తెలుసా? కేవలం ఒక పేపర్ క్లిప్ బరువు కంటే తక్కువే. ఇదొక నానోక్రాఫ్ట్ అని చెప్పొచ్చు. దీంతో కృష్ణబిళాల మిస్టరీలను ఛేదించవచ్చని కాసిమో బాంబీ అంచనా. దీనిపై 'జర్నల్ ఐసైన్స్'లో వివరాలు ప్రచురితమయ్యాయి.

కాంతి వేగంలో మూడో వంతు వేగం

బ్లాక్‌హోల్ వద్దకు పంపించే నానోక్రాఫ్ట్ శక్తివంతమైన లేజర్‌తో పనిచేస్తుంది. భూమిపైనుంచే దీనిని ఆపరేట్ చేయొచ్చు. కాంతి వేగంలో మూడో వంతు వేగంతో అంతరిక్షంలోకి దూసుకెళ్తుంది. బ్లాక్ హోల్ సమీపంలోకి వెళ్లడానికి వందేళ్లు పడుతుంది. ఇదంతా వినడానికి సైన్స్ ఫిక్షన్‌లాగా అనిపిస్తున్నా.. అది కచ్చితంగా వాస్తవ రూపం దాల్చుతుందని కాసిమో బాంబీ అంటున్నారు. మరో 20 నుంచి 30 ఏళ్లలో ఈ ప్రయోగం పట్టాలకెక్కుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. లేజర్, అంతరిక్ష ప్రయోగాల్లో మరింత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని, ప్రయోగాల ఖర్చు కూడా తగ్గుతుందని ఆయన వెల్లడించారు. కేవలం కొన్ని గ్రాముల బరువుండే నానోక్రాఫ్ట్‌లో మైక్రోచిప్, ఫోటాన్ బీమ్స్‌తో పనిచేసే లైట్ సెయిల్ ఉంటాయి. ఈ బుల్లి వ్యోమనౌక 20 నుంచి 25 కాంతి సంవత్సరాల దూరంలోని కృష్ణబిళాలను పరిశోధిస్తుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

భౌతికశాస్త్రంలో విప్లవాత్మకం

బ్లాక్స్ హోల్స్ అనేవి అంత సులువుగా కంటికి కనిపించవు. ఎందుకంటే వాటి నుంచి కాంతి ఉద్గారం జరగదు. సంప్రదాయ టెలిస్కోప్‌లతో గుర్తించలేం. పరిశోధనకు అనువైన బ్లాక్ హోల్‌ను ఎంచుకోవడం ఒక సవాలే. సమీపంలోని నక్షత్రాలపై చూపే గురుత్వాకర్షణ ప్రభావం ఆధారంగా కృష్ణ బిళాలను సైంటిస్టులు గుర్తిస్తుంటారు. భూమి నుంచి 25 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న బ్లాక్ హోల్స్‌ను మరో పదేళ్లలోపు కనిపెట్టగలమని చెబుతున్నారు. వీటిపై నానోక్రాఫ్ట్ చేసే పరిశోధనలు భౌతికశాస్త్రంలో విప్లవాత్మకం అవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం సహా ఫిజిక్స్‌లో ప్రాథమిక సూత్రాలను సంక్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో పరీక్షించేందుకు ఇది దోహదపడుతుందని అంటున్నారు. అతి తేలికైన వ్యోమనౌకలను అంతరిక్షంలోకి పంపించగల పరిజ్ఞానమే అందుబాటులోకి వస్తే అది మరిన్ని కీలక పరిశోధనలకు, అంతరిక్షంలోని రహస్యాలను కనిపెట్టడానికి తోడ్పడుతుందని చెబుతున్నారు.

334 రాజకీయ పార్టీలపై వేటు

ఇవి ఆరేళ్లలో ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయలేదు

- అందుకే జాబితా నుంచి తొలగించాం: ఈసీ
- ప్రస్తుతం 6 జాతీయ పార్టీలు, 67 ప్రాంతీయ పార్టీలు మనుగడలో ఉన్నట్లు వెల్లడి
- తొలగించిన వాటిలో ఏపీకి చెందిన ఐదు, తెలంగాణకు చెందిన 13 పార్టీలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో 334 రాజకీయ పార్టీలపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) వేటు వేసింది. 2019 నుంచి ఇప్పటి వరకు అంటే ఆరేళ్ల కాలంలో జరిగిన ఏ ఒక్క ఎన్నికల్లోనూ ఈ పార్టీలు పోటీ చేయలేదని స్పష్టం చేసింది. అందుకే ఆయా పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఈసీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు..కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, నేషనలిస్ట్ పీపుల్స్ పార్టీ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, మరో 67 ప్రాంతీయ పార్టీలు మనుగడలో ఉన్నాయని ఈసీ తెలిపింది. ఈ పార్టీలు మాత్రమే ప్రతి ఎన్నికలోనూ పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పార్టీలపై వేటు వేసిన విషయాన్ని ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘాల కార్యాలయాలకు తెలిపినట్లు పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 29ఏ నిబంధనల ప్రకారం ఆయా రాజకీయ పార్టీలు ఈసీ వద్ద నమోదు చేసుకున్నట్లు తెలిపింది. ఆరు సంవత్సరాల్లో వరుసగా ఎన్నికల్లో పోటీ చేయకపోతే, ఆ పార్టీని నమోదును పార్టీల జాబితా నుంచి తొలగించే అధికారాలు తమకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. తొలగించిన పార్టీలు ఏవిధమైన కార్యకలాపాలు నమోదు చేయని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ఈ పార్టీల కార్యాలయాలను సైతం భౌతికంగా ఈసీ గుర్తించలేకపోయిందని తెలిపింది. గతంలో కొన్ని గుర్తింపు పొందని పార్టీలు ఆదాయ పన్ను చట్టాలను, మనీ లాండరింగ్ వ్యతిరేక చట్టాలను ఉల్లంఘించినట్లు తేలిందని ఈసీ గుర్తు చేసింది.

తెలుగు రాష్ట్రాల్లో 18 పార్టీలు

తొలగింపునకు గురైన వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 5 రాజకీయ పార్టీలు, తెలంగాణకు చెందిన 13 పార్టీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 'భారతీయ బహుజన ప్రజా రాజ్యం, హిందుస్తాన్ రాష్ట్రీయ పార్టీ, జై భారత్ జనసేన పార్టీ, తెలుగు బహుజన పార్టీ, తెలుగు రాష్ట్రీయ శక్తి పార్టీ'లను ఈసీఐ జాబితా నుంచి తొలగించింది. ఇక, తెలంగాణ నుంచి తొలగించిన వాటిలో.. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైఖ్య సమితి పార్టీ, బహుజన సమాజ్ పార్టీ(అంబేద్కర్–ఫూలే, ఇండియన్ మైనార్టీస్ పొలిటికల్ పార్టీ, జాగో పార్టీ, జాతీయ మహిళా పార్టీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్, తెలంగాణ కార్మిక రైతు రాజ్యం పార్టీ, తెలంగాణ లోక్‌సత్తా పార్టీ, తెలంగాణ మైనార్టీ ఓబీసీ రాజ్యం, తెలంగాణ ప్రజా సమితి(కిషోర్ రావు అండ్ కిషన్), తెలంగాణ స్టూడెంట్స్ యునైటెడ్ నేషన్ పార్టీ, యువ పార్టీ, యువ తెలంగాణ పార్టీ'లు ఉన్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తం 2,854 గుర్తింపు పొందని రాజకీయ పార్టీలకు గాను ప్రక్షాళన అనంతరం 2,520 పార్టీలు మిగిలి ఉన్నాయని ఈసీ వివరించింది. జూన్‌లో 345 పార్టీల గుర్తింపు తొలగించే ప్రక్రియను ప్రారంభించిన ఈసీ 334 పార్టీలను తొలగించాలని నిర్ణయించింది. 2001 నుంచి ఇప్పటి వరకు కనీసం నాలుగు సార్లు క్రియాశీలకంగా లేని గుర్తింపు పొందని రాజకీయ పార్టీలను తొలగించినట్లు ఈసీ వెల్లడించింది.

సాక్షిప్లస్ జాతీయం పేజీలో..
పసుపుతో మధుమేహానికి చెక్
'ఆర్‌జీ కర్' నిరసనకారులపై లాఠీఛార్జి
ముక్కలుగా నరికి.. 10 చోట్ల పడేశారు..!

సాక్షి
హైదరాబాద్
ఆదివారం । 10 । ఆగస్టు । 2025

బొట్టు పెట్టి.. రాఖీ కట్టి..





రక్షా బంధన్ సందర్భంగా శనివారం నగరం అనుబంధాల జడిలో.. అనురాగాల ఒడిలో మైమరిచిపోయింది. సోదరులకు రాఖీలు కట్టి అక్కాచెల్లెళ్లు ప్రేమాప్యాయతలను పంచుకున్నారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు చిన్నారులు అభిమాన పూర్వకంగా రాఖీలు కట్టి ఆనందించారు.

మళ్లీ ఉరిమిన వరుణుడు



ఆర్టీసీ క్రాస్ రోడ్డులో..



మస్నూరాబాద్‌లో..

మహా నగరంలో వరుణుడు మరోసారి తన ప్రతాపం చూపించాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వానతో విరుచుకుపడ్డాడు. శనివారం రాత్రి సుమారు రెండు గంటల పాటు దంచికొట్టాడు. రహదారులపై వరద నీరు చేరడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వాహనదారులు నరకయాతనకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో బస్తీలు, కాలనీలు జలమయంగా మారాయి. బేగంబజార్‌లో అత్యధికంగా 12.4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. హుస్సేన్ సాగర్ నుంచి భారీగా వరద నీరు బయటకు ప్రవహిస్తుండటంతో కవాడిగూడ, గాంధీ నగర్, అరవింద్ నగర్, సబర్మతి నగర్ నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు.

– సిటీబ్యూరో/చిక్కడపల్లి

హైటెక్స్‌లో ఆగస్టు ఫెస్ట్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జయేశ్ రంజన్ తదితరులు

మాదాపూర్: ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు రాష్ట్రం, దేశంలో సాంకేతికత ఆధారిత వృద్ధి భవిష్యత్‌ను రూపొందించడంలో కీలమైనవని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో శనివారం ఆగస్టు ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2035 నాటికి రాష్ట్ర జీడీపీ 1 ట్రిలియన్‌కు, 2047 నాటికి 3 ట్రిలియన్‌లకు, జాతీయ జీడీపీని 5 నుంచి 10 శాతం పెంపు లక్ష్యంగా తెలంగాణ రైజింగ్– 2047 విజన్ పాలసీ అని తెలిపారు. సినీ సంగీత దర్శకుడు రమణ గోగుల మాట్లాడుతూ.. కృత్రిమ మేధతోనే మనుగడ అని పనిని మెరుగుపర్చుకోవడానికి అది ఒక సాధనమన్నారు. గ్రామీణ విద్యార్థి ఆవిష్కర్తగా వేరుశెనగ పొట్టు ఉపయోగించి పర్యావరణ అనుకూలమైన వినాయకుడి విగ్రహాలు, బయో పూలతొట్లు, గ్లాసులు, ప్లేట్లు తదితరాల తయారీని కొనియాడారు. మెకానికల్ ఇంజినీర్ నుంచి ఆవిష్కర్తగా మారిన దీపక్‌రెడ్డి.. రైతులు బంజరు భూముల నుంచి రాళ్లను తొలగించడంలో సహాయపడడానికి ఒక పరికరాన్ని ఆవిష్కరించారు. బహుళ దశలు, హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్‌లు, స్టార్టప్ షోకేస్‌లు, సృజనాత్మక ఇన్‌స్టాలేషన్స్, వ్యవస్థాపకులు, టెక్ ఔత్సాహికులు ఫెస్ట్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ జె.ఎ.చౌదరి, ఆగస్టు ఫెస్ట్ వ్యవస్థాపకుడు కిరణ్ మావెరిక్ తదితరులు పాల్గొన్నారు.

రక్షాబంధన్‌లో చిక్కుకున్న ట్రాఫిక్

కిలోమీటర్ ప్రయాణానికి అర్ధగంట పైమాటే

లక్డీకాపూల్: గ్రేటర్ నగరంలో శనివారం ట్రాఫిక్ రక్షా బంధన్‌లో చిక్కుకుంది. వాహనాల రాకపోకలు నిలిచిపోయి సతమతమైంది. రాఖీ పండుగ, వీకెండ్ కావడంతో నగరవాసులతో రహదారులన్నీ ట్రాఫిక్‌తో స్తంభించిపోయింది. రాఖీ పౌర్ణమి రద్దీ కారణంగా ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బస్సులు, మెట్రో రైళ్ల ప్రయాణికులతో కిటకిటలాడగా.. వ్యక్తిగత వాహనాలు పెద్ద సంఖ్యలో రోడ్డెక్కడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగర శివార్లలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత తీవ్రంగా మారింది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా పూర్తిగా నిండిపోయాయి. ఫలితంగా కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులుగా నిలిచి, ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి నెలకొంది. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద ట్రాఫిక్ దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది. వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపై ఇరుక్కుపోయారు. ఊహించని ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు మరీ ముఖ్యంగా రాఖీ కట్టేందుకు బయలుదేరిన మహిళలు అవస్థలకు గురయ్యారు. గచ్చిబౌలి నుంచి మెహిదీపట్నం రూట్ ఇరువైపులా, మియాపూర్ నుంచి లక్డీకాపూల్ రహదారి ఇరువైపుల, కొంపల్లి వైపు వెళ్లే రహదారులన్నీ వాహనాలతో స్తంభించిపోయాయి. బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. నగరంలో ఎక్కడ చూసినా బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ తప్పని పరిస్థితి నెలకొంది. ఊహించని పరిణామంతో నగర పోలీసులు సైతం ట్రాఫిక్‌ను చక్కదిద్దే క్రమంలో సతమతమయ్యారు.



ఆర్టీసీ స్పెషల్ దోపిడీ

సాధారణ చార్జీలపై 50 శాతం అదనం

- రాఖీ సందర్భంగా భారీగా తరలివెళ్లిన ప్రయాణికులు
- సిటీ బస్సులు కూడా ప్రత్యేక చార్జీలతో జిల్లాలకు తరలింపు
- ఈ నెల 11 వరకు 50 శాతం అదనపు బాదుడే



సాక్షి, సిటీబ్యూరో: రక్షా బంధన్‌ను ఆర్టీసీ భారీగా సొమ్ము చేసుకుంది. రాఖీ సందర్భంగా సొంత ఊళ్లకు తరలివెళ్లిన ప్రయాణికులపై నిలువు దోపిడీకి పాల్పడింది. కొంతకాలంగా ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలపైనే బస్సులను నడుపుతున్న ఆర్టీసీ అధికారులు శనివారం రాఖీ సందర్భంగా ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేశారు. ప్రత్యేక బస్సుల్లో ఈ నెల 11వ తేదీ వరకు 50 శాతం అదనపు చార్జీలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ప్రత్యేక బస్సుల పేరిట..

కొంతకాలంగా దసరా, సంక్రాంతి వంటి పండుగల సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సులను సైతం సాధారణ చార్జీలపైనే నడుపుతున్నారు. కానీ శనివారం ఉన్నపళంగా రాఖీ రద్దీని సొమ్ము చేసుకొనేందుకు 2003 నాటి జీవో 16ను ఆర్టీసీ అధికారులు తెరపైకి తేవడం గమనార్హం. ప్రభుత్వం విడుదల చేసిన ఆ జీవో ప్రకారం ప్రత్యేక బస్సుల డీజిల్, నిర్వహణ ఖర్చుల కోసం టికెట్ ధరలను పెంచినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సుల పేరిట ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ చార్జీలను పెంచారు. ఈ రెండు కేటగిరీలకు చెందిన బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉంది. పైగా రాఖీ సందర్భంగా మహిళలే పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. అయినప్పటికీ పురుష ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని చార్జీలను పెంచినట్లు అధికారులు తెలిపారు.



అడ్డగోలు వసూళ్లు..

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సిటీ బస్సులను కూడా అదనపు చార్జీలతో జిల్లాలకు నడిపారు. మరోవైపు మ్యాక్సీ క్యాబ్‌లు, ప్రైవేట్ కార్లు, ట్యాక్సీలు, టాటాఏస్‌లు, తదితర వాహనాల్లో సైతం ప్రయాణికుల నుంచి అడ్డగోలుగా వసూలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లోనే చార్జీలు పెంచడంతో ప్రైవేట్ వాహనదారులు మరింత రెచ్చిపోయి ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడ్డారు. ఉప్పల్ నుంచి హన్మకొండకు ఆర్టీసీ లగ్జరీ చార్జీ శనివారం రూ.300 నుంచి రూ.450కి పెరిగింది. ప్రైవేట్ వాహనాల్లో ఏకంగా రూ.500 నుంచి రూ.700 వరకు వసూలు చేశారు. అన్ని రూట్లలోనూ ఇదే తరహాలో ప్రయాణికులపై దారిదోపిడీ కొనసాగింది.

భారీగా కిక్కిరిసి...

నగరంలోని జూబ్లీ, మహాత్మా గాంధీ, దిల్‌సుఖ్ నగర్ బస్టేషన్‌లు ప్రయాణికులతో కిక్కిరిశాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కిటకిటలాడాయి. ఎల్‌బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, బీఎన్‌రెడ్డినగర్ తదితర ప్రధాన కూడళ్లు సైతం ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులతో నిండిపోయాయి. సాధారణంగా హైదరాబాద్ నుంచి ప్రతి రోజు సుమారు 1.5 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తారు. శనివారం మరో 30 వేల మందికి పైగా ప్రయాణం చేసినట్లు అంచనా. ఆర్టీసీ బస్సుల్లో కాకుండా సొంత వాహనాల్లో, ప్రైవేట్ వాహనాల్లో, రైళ్లలోనూ నగరవాసులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు.

సిటీలో బస్సుల్లేవ్..

సిటీ బస్సులను చాలా వరకు జిల్లాలకు తరలించడంతో నగరంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గంటల తరబడి బస్టాపుల్లోనే పడిగాపులు కాశారు. రాఖీ సందర్భంగా నగరంలో ఉన్న తోబుట్టువులు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో క్యాబ్‌లు, ఆటోలు, తదితర వాహనాలను ఆశ్రయించారు. మెట్రో రైళ్లలోనూ భారీ రద్దీ నెలకొంది. రాయదుర్గం, అమీర్‌పేట్, సికింద్రాబాద్, ఉప్పల్ ,నాగోల్ రూట్లో ఉదయం నుంచి రాత్రి వరకు మెట్రోలు కిక్కిరిశాయి. ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్ రూట్‌లలోనూ ప్రయాణికుల రద్దీ భారీగా నమోదైంది. మరోవైపు అనేక చోట్ల ట్రాఫిక్ రద్దీ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

స్తంభించిన ట్రాఫిక్..

వరుస సెలవుల దృష్ట్యా కూడా ప్రయాణికుల పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ప్రయాణికులు, వాహనాల రద్దీతో రహదారులపైన ట్రాఫిక్ స్తంభించింది. విజయవాడ వైపు వనస్థలిపురం, హయత్‌నగర్ రూట్‌లో ట్రాఫిక్ నిలిచిపోయింది. వరంగల్ వైపు ఉప్పల్ నుంచి ఘట్కేసర్ వరకు వెళ్లడానికే కనీసం 3 గంటల సమయం పట్టినట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు.అన్ని రూట్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వివిధ మార్గాల్లో శనివారం ఒక్కరోజే సుమారు 10 లక్షల మందికి పైగా సొంత ఊళ్లకు వెళ్లినట్లు అంచనా.



నాణ్యతపై నిఘా నేత్రాలు

బల్దియా ఇంజినీరింగ్ పనులపై థర్డ్ పార్టీల తనిఖీలు

యూనివర్సిటీలు, ఐఐటీలకు జీహెచ్‌ఎంసీ ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ చేపట్టే సివిల్ ఇంజినీరింగ్ పనుల నాణ్యత పరీక్షల నిర్వహణలో థర్డ్‌పార్టీలుగా వ్యవహరించేందుకు యూనివర్సిటీలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలను ఆహ్వానిస్తూ జీహెచ్‌ఎంసీ టెండర్లు పిలిచింది. జీహెచ్‌ఎంసీ ఏటా రూ.వందల కోట్ల విలువైన వివిధ ఇంజినీరింగ్ పనులను చేపడుతోంది. సివిల్ ఇంజినీరింగ్ పనులతో పాటు ప్రాజెక్ట్స్ విభాగం ద్వారా ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్‌ఓబీలు, ఆర్‌యూబీలు, ఎస్‌ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) ద్వారా నాలాలకు సంబంధించిన పనులు, హౌసింగ్ విభాగం ద్వారా ఇళ్ల నిర్మాణం తదితర పనులు చేస్తోంది.

30 సర్కిళ్లలో 12 ఏజెన్సీలు..

ప్రస్తుతం సివిల్ పనుల కోసం, ఎస్‌ఎన్‌డీపీ పనుల కోసం సంబంధిత విభాగాలు టెండర్లు పిలిచినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ పనుల్లో సమగ్ర రోడ్డు నిర్వహణ ప్రోగ్రామ్ (సీఆర్‌ఎంపీ) పనులు కాకుండా ఇతర పనులకు థర్డ్ పార్టీ సేవలందించాల్సిందిగా పేర్కొన్నారు. రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చుతో చేసే పనులకు రెండేళ్ల వరకు థర్డ్‌పార్టీ సేవల కోసం ఈ టెండర్లు పిలిచారు. జీహెచ్‌ఎంసీలో ఉన్న 30 సర్కిళ్లలో జరిగే పనుల నాణ్యతను తనిఖీలు చేసేందుకు 12 ఏజెన్సీలను నియమించనున్నారు.

నివేదికలివ్వాల్సిందే..

టెండరు ద్వారా ఎంపికయ్యే సంస్థలు జీహెచ్‌ఎంసీ చేపట్టే సివిల్ ఇంజినీరింగ్ పనులైన సిమెంట్ కాంక్రీట్ పేవ్‌మెంట్స్, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, వరదనీటి కాలువలు, ఆర్‌సీసీ భవనాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, ఫుట్‌పాత్‌లతో పాటు ఇతరత్రా పనులు నాణ్యతగా జరుగుతున్నదీ లేనిదీ తనిఖీలు చేసి నివేదికలివ్వాలి. పనులు నాసిరకంగా జరగకుండా చూడాలి. ఇందుకుగాను క్షేత్రస్థాయిలో తనిఖీలతోపాటు లేబరేటరీ పరీక్షలు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఏజెన్సీలుగా పనిచేసేందుకు ముందుకొచ్చే సంస్థలు కనీసం పది సంవత్సరాల క్రితం ఏర్పాటైనవై ఉండటంతో పాటు ఏఐసీటీఈ గుర్తింపు, అవసరమైన ఇతరత్రా అర్హతలు కలిగి ఉండాలి.

ఎస్‌ఎన్‌డీపీ పనులకు..

ఎస్‌ఎన్‌డీపీకి సంబంధించి తొలిదశలో చేపట్టిన పనుల్లో ఇంకా పూర్తి కాని పనులతో పాటు రెండో దశలోని పనులకు థర్డ్‌పార్టీ సేవలందించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

అక్క ఉండగా.. అనుబంధం అండగా!

అయిదేళ్ల తమ్ముడు అప్లాస్టిక్ అనీమియా వ్యాధితో బాధపడుతుండగా తన మూలకణాలిచ్చి ప్రాణాలు కాపాడింది ఓ అక్క. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తమ్ముడికి రాఖీ కట్టి.. నేను నీకు ఎప్పటికీ అండగా ఉంటాను అని మనో ధైర్యాన్నిచ్చింది. ఈ ఘటన శనివారం రక్షా బంధన్ సందర్భంగా చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అయిదేళ్ల బాలుడు ఎముక మజ్జ లోపంతో వచ్చే తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతున్నాడు. ఈ బాలుడిని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. మూలకణ మార్పిడితో చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఇంటర్ చదువుతున్న అతడి సోదరి తన మూల కణాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. కిమ్స్ ఆస్పత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నరేందర్‌కుమార్ తోట ఆధ్వర్యంలో బాలుడికి సోదరి నుంచి సేకరించిన మూల కణాలతో విజయవంతంగా చికిత్స పూర్తి చేశారు. దీంతో ఈ బాలుడికి పునర్జన్మ ప్రసాదించినట్లయింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడికి రాఖీ కట్టి ఆమె ఆత్మీయతను చాటి, ధైర్యాన్నిచ్చింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

– రాంగోపాల్‌పేట్

వానబొట్టు.. ఒడిసిపట్టు

గ్రేటర్‌లో ఇంకుడు గుంతల జలయజ్ఞం– 2025

- వర్షపు నీటి సంరక్షణతోనే నీటిఎద్దడి సమస్యకు పరిష్కారం
- ఇక ప్రజా స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు
- 50 రోజుల ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమైన జలమండలి

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరంలో 'వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేద్దాం.. భూగర్భజలాలను పెంపొందిద్దాం' అనే నినాదంతో 'ఇంకుడు గుంతల జలయజ్ఞం–2025'కు జలమండలి సిద్ధమైంది. ఇప్పటికే అమలు చేస్తున్న 90 రోజుల ఇంటింటా ఇంకుడు గుంత' కార్యక్రమంలో భాగంగా 50 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. నగరంలో సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదవుతున్నా.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న నివాస, వాణిజ్య సముదాయలతో పాటు ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశాలన్నింటిని కాంక్రీట్‌తో కప్పేస్తుండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాదితో పోల్చితే భూగర్భ జలాలు మరింత అడుగంటినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

గ్రౌండ్ వాటర్ రీచార్జికి ప్రణాళిక..

వానాకాలంలో సైతం నిత్యావసరాల నీటి కోసం ట్యాంకర్ల డిమాండ్ పెరగడం భూగర్భజలాల తీవ్రతకు అద్దం పడుతోంది. మహానగర తాగునీటి అవసరాలను తీర్చేందుకు సుదూర ప్రాంతాల నుంచి జలాలను తరలించి శుద్ధి చేసి సరఫరా చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చువుతుండగా.. నగరంలో కురుస్తున్న సెంటీమీటర్ల కొద్దీ వర్షం వరద ప్రవాహంగా మారి మురుగు నాలాల్లో వృథాగా కలిసిపోవడాన్ని జలమండలి త్రీవంగా పరిగణించింది. భూగర్భజలాలను పెంచితే కనీసం నిత్యావసరాల కోసం సరఫరా చేసే ట్యాంకర్ తాకిడి తగ్గుతుందని జలమండలి భావిస్తోంది. నీటి సంరక్షణలో భాగంగా భూగర్భజలాల పెంపు లక్ష్యంగా వచ్చేవారం నుంచి సెప్టెంబర్ 30 వరకు నాలుగు రకాల 'గ్రౌండ్‌వాటర్‌రీచార్జీ ' ప్రణాళిక అమలుకు సిద్ధమైంది. ఇప్పటికే జలమండలి ఎండీ అశోక్ రెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా డివిజన్ జీఎం నుంచి మేనేజర్ల వరకు క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగేలా ఆదేశాలు జారీ చేశారు. రోజువారీగా ఇంకుడు గుంతల పురోగతిని జీఓఎస్ ట్యాగింగ్ ద్వారా మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు చర్యలకు ఉపక్రమించారు.



ఇంటింటా.. ఓ ఇంకుడు గుంత

వర్షపు నీటి సంరక్షణలో భాగంగా 300 చదరపు మీటర్లున్న ప్రతి ఇంటా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ప్రాంగణంలో ఇంకుడుగుంత తప్పని సరి చేస్తూ జలమండలి చర్యలు చేపట్టింది. పాత, కొత్త నివాస, వాణిజ్య సముదాయాలపై దృష్టి సారించింది. క్యాన్ నెంబర్ ఆధారంగా ప్రతి నెలా 20 కంటే ఎక్కువ ట్యాంకర్లను బుక్ చేసుకున్న 42,784 ప్రాంగణాలను గుర్తించింది. అందులో 40,209 పరిశీలించగా కేవలం 22,825 నివాసాల్లో మాత్రమే ఇంకుడు గంతలు ఉన్నట్లు, మిగిలిన 17,384 నివాసాల్లో లేనట్లు బహిర్గతమైంది. వీటిలో 16,196 గృహాలకు ఇంకుండు గుంత ఏర్పాటు చేసుకోవాలని నోటీసు జారీ చేశారు.

బహిరంగ ప్రాంతాల్లో ..

భూగర్భజలాల పెంపునకు ప్రజాస్థలాల్లో ఇంకుడు నిర్మాణాలకు జలమండలి సిద్ధమైంది. ప్రజా స్థలాలు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రోడ్డు పక్కన నివాస, వాణిజ్య సముదాయాల రూఫ్ టాప్ నుంచి కిందికి పడే వర్షపు నీటిని పైపుల ద్వారా సంరక్షణ కోసం ప్రజా ఇంకుడు గుంతల ఏర్పాటు చర్యలకు దిగింది. ఇప్పటికే జలమండలి బృందాలు ఎన్జీవోల సహకారంతో సర్వే ద్వారా ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలని ప్రాంతాలను గుర్తిస్తోంది. మొత్తం సుమారు 16 వేల వరకు ప్రజా ఇంకుడు గుంతలా ఏర్పాటు చేయాలని లక్ష్యాన్ని పెట్టుకుంది.

హార్వెస్టింగ్ పిట్స్‌గా హ్యాండ్ పంప్స్

నిరుపయోగంలో ఉన్న బోరు బావులను హార్వెస్టింగ్ పిట్‌లతో ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చాలని జలమండలి నిర్ణయించింది. ఇప్పటికే సుమారు 3,222 బోర్ వెల్స్‌లను గుర్తించింది. అందులో పవర్ బోర్‌వెల్స్ 1,045 ఉండగా, వాటిలో కోర్ సిటీ పరిధిలో 246, శివారు పరిధిలో 7,99 బోర్లు ఉన్నాయి. మొత్తమ్మీద హ్యాండ్ బోర్‌వెల్స్ 2,177 ఉండగా వాటిలో కోర్‌సిటీలో 1,665, శివార్లలో 1,557 బోర్లు ఉన్నాయి.

కమ్యూనిటీల్లో..

ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవన సముదాయాల్లో 'కమ్యూనిటీ ఇంకుడు గుంతలు' ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టనుంది. ఇప్పటికే ఓఆర్‌ఆర్ లోపల, అవతల గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అపార్ట్‌మెంట్లను గుర్తించింది. ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

జలయజ్ఞంలో భాగస్వామ్యం అవసరం



భూగర్భజలాల పెంపు కోసం ఇంకుడు గుంతల జలయజ్ఞం–2025లో ప్రతి నివాస సముదాయం తమ కర్తవ్యంగా భావించి భాగస్వామ్యం కావల్సిన అవసరం ఉంది. వృథాగా పోతున్న వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేయాలి. అప్పుడే భూగర్భ జలమట్టం పెరుగుదల ఉంటుంది. నిత్యావసర నీటి ఎద్దడి సమస్య తగ్గుతుంది.

– అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి

డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ

ప్రజా బహిరంగ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను జీఐఎస్ మ్యాపింగ్ చేసి డ్యాష్ బోర్డు ద్వారా పనితీరును పర్యవేక్షించనుంది. ఇప్పటికే గుర్తించిన 'ప్రజా ఇంకుడు గుంతల' ప్రాంతాలను జియో ట్యాగ్ చేస్తున్నారు. నిర్మాణం ముందు, నిర్మాణం తరువాత తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేసేందుకు వీలుగా ఐటీ విభాగం ప్రత్యేక మొబైల్ యాప్ రూపకల్పన చేస్తోంది.

బంగ్లా యువతిని నిర్బంధించి..

వ్యభిచార కూపంలోకి దించి



కేసు వివరాలు వెల్లడిస్తున్న చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్

చాంద్రాయణగుట్ట: విదేశీ యువతిని నిర్బంధించి వ్యభిచార కూపంలోకి దించిన ముఠా సభ్యులను పాతబస్తీ బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ ఆర్. దేవేందర్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. బంగ్లాదేశ్ ఢాకా కు చెందిన రూపా అనే మహిళ సమీపంలో ఉండే యువతిని హైదరాబాద్ నగరం నివాసం, జీవనోపాధికి బాగుంటుందని నమ్మించి ఆరు నెలల క్రితం అక్రమంగా పశ్చిమ బెంగాల్ మీదుగా హైదరాబాద్‌కు తీసుకొచ్చింది. ఇక్కడికి వచ్చాక మెహదీపట్నం మురాద్‌నగర్‌కు చెందిన షహనాజ్ ఫాతిమా(32) ఇంట్లో ఉంచింది. అనంతరం హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ సమీర్(23) బాధితురాలిని బండ్లగూడ ఇస్మాయిల్ నగర్‌కు చెందిన హజేరా బేగం (41) ఇంటికి తీసుకొచ్చి నిర్బంధించారు. 'నీవు వ్యభిచారం చేయాలని, లేకుంటే భారత్‌కు అక్రమంగా వచ్చావంటూ ఫిర్యాదు చేస్తే జైలుకు వెళతావంటూ' తీవ్రంగా బెదిరించడంతో బాధితురాలు గత్యంతరం లేని పరిస్థితుల్లో అంగీకరించింది. ఇలా ఆరు నెలల నుంచి నగరంలోని పలు హోటళ్లకు బాధితురాలిని పంపించి వ్యభిచారం చేయించారు. చివరకు వారి చెర నుంచి తప్పించుకొని శుక్రవారం బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని జరిగిన విషయమై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న రూపా, వీరికి సహకరించిన సర్వర్ అనే నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమావేశంలో డీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టన్నులకొద్దీ తరలించారు

స్పెషల్ మాన్సూన్ డ్రైవ్‌లో వ్యర్థాలు తరలించిన జీహెచ్‌ఎంసీ

- 1992 మెట్రిక్ టన్నుల చెత్త
- 2.95 లక్షల ఇళ్లలో దోమల నివారణ కార్యక్రమాలు
- సీఅండ్‌డీ వ్యర్థాలు 1005 మెట్రిక్ టన్నులు



ఆరోగ్య పరిరక్షణ కోసం..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నిర్మాణదారులు నిర్మాణ, కూల్చివేతల (సీఅండ్‌డీ) వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా పారబోస్తున్నారు. రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో కుమ్మరించేస్తున్నారు. గతనెల 29వ తేదీ నుంచి శుక్రవారం వరకు పదిరోజుల పాటు నిర్వహించిన స్పెషల్ మాన్సూన్ డ్రైవ్‌లో 1005 మెట్రిక్ టన్నుల సీఅండ్‌డీ వ్యర్థాలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తరలించారు. ఇక రోడ్లు, తదితర ప్రాంతాల్లో కుప్పలు పడ్డ చెత్త 1992 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు తొలగించారు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ సవ్యంగా జరగనందునే ప్రజలిలా రోడ్ల వెంబడి చెత్త పారబోస్తున్నారు.

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ నిర్వహించిన ఈ స్పెషల్ మాన్సూన్ డ్రైవ్‌లో.. ఇళ్లలో దోమల నివారణ మందులు చల్లడం, నిల్వనీటిని తొలగించడం, (యాంటీ లార్వా ఆపరేషన్స్) తదితర పనులు చేశారు. జీహెచ్‌ఎంసీలోని 30 సర్కిళ్ల పరిధిలో ఉన్న 150 వార్డుల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కమిషనర్ కర్ణన్ ఆదేశాల కనుగుణంగా డెంగీ బాధితుల ఇళ్లను, చుట్టుపక్కల ఇళ్లను ఏఎంఓహెచ్‌లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు సందర్శించారు. అంశాల వారీగా చేసిన పనుల వివరాలిలా ఉన్నాయి.

- 30 సర్కిళ్లలోని 1007 కాలనీల్లో కార్యక్రమాల నిర్వహణ
- తరలించిన చెత్త 1992 మెట్రిక్ టన్నులు, సీఅండ్‌డీ వ్యర్థాలు 1005 మెట్రిక్ టన్నులు
- డెంగీకేసులున్నట్లు గుర్తించిన ఇళ్లు 82
- ఏఎంఓహెచ్‌లు సందర్శించిన ఇళ్లు 4561
- డిప్యూటీ కమిషనర్లు సందర్శించిన ఇళ్లు 4683
- జోనల్ కమిషనర్లు తనిఖీ చేసిన ఇళ్లు 191
- యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించిన ఇళ్లు 295216
- బీటీ,సీసీ రోడ్లలో పూడ్చిన గుంతలు 1037
- క్యాచ్‌పిట్స్ మరమ్మతులు 161, కొత్త మూతలు అమర్చిన క్యాచ్‌పిట్స్ 142
- దెబ్బతిన్న 19 సెంట్రల్ మీడియన్లకు స్వల్ప మరమ్మతులు
- సీఅండ్‌డీ వ్యర్థాలు బహిరంగంగా వేసినట్లు గుర్తించిన 466 మందికి రూ.24.30 లక్షల పెనాల్టీలు.
- శుభ్రం చేసిన పార్కులు 674
- 1509 వీధికుక్కలకు సంతాననిరోధక శస్త్ర చికిత్సలు

ఈ కార్యక్రమాలతోపాటు పరిసరాల పరిశుభ్రత, డెంగీ వంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగేలా బస్తీల్లో 267 ర్యాలీలు, సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యులతో 501 సమావేశాలు నిర్వహించినట్లు అడిషనల్ కమిషనర్(పారిశుధ్యం–ఆరోగ్యం) సీఎన్ రఘుప్రసాద్ తెలిపారు. సమావేశాల్లో 23వేల మందికి పైగా పాల్గొన్నట్లు చెప్పారు.

నాలుగేళ్ల బాలికపై తండ్రి లైంగిక దాడి

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కన్న తండ్రిపై బంజారాహిల్స్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే మహిళకు 2017లో ఆఫాన్ అనే వ్యక్తితో రెండో పెళ్లి జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. కొన్ని రోజులుగా తన కుమార్తె ముభావంగా ఉండడంతో పాటు చిన్న విషయానికే బెంబేలెత్తిపోవడం, తీవ్రమైన భయంతో వణికిపోవడాన్ని తల్లి గమనించింది. ఆమె ప్రవర్తనలో విపరీత ధోరణిని చూసిన తల్లి ఏమైందని ఆరా తీసింది. తండ్రి ఆఫాన్ తనపై చేసిన అఘాయిత్యాన్ని తెలిసీ తెలియని భాషలో చెప్పింది. దీంతో ఆమెపై లైంగిక దాడి చేసినట్లు గుర్తించిన బాధితురాలి తల్లి బాలికను సైక్రియాటిస్ట్ వద్దకు తీసుకువెళ్లింది. ఆమెపై లైంగిక దాడి జరగడంతోనే ప్రవర్తనలో మార్పు వచ్చిందని తేల్చారు. నెల రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై తండ్రి లైంగిక దాడికి దిగాడని తేలింది. దీంతో మహిళ తన భర్తను ఇంట్లోకి రానివ్వడం లేదు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఆఫాన్ తండ్రితో పాటు బంధువులు వచ్చి మహిళను తీవ్ర పదజాలంతో దూషించారు. దీంతో ఆందోళనకు గురైన బాలిక తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



రూపక్ త్రిపాఠి(ఫైల్)

గచ్చిబౌలి: అదుపు తప్పి కారు పల్టీ కొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. చత్తీస్‌ఘడ్ రాయపూర్‌కు చెందిన రూపక్ త్రిపాఠి(30) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కేపీహెచ్‌బీలో తమ్ముడు శాశ్వత్ త్రిపాఠితో కలిసి నివాసం ఉంటున్నారు. స్నేహితులతో కలిసి ఎర్టిగా కారులో కేపీహెచ్‌బీ నుంచి నాలెడ్జ్ సిటీకి వెళుతుండా టీ హబ్ రోడ్డులో శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. నాలుగు పల్టీలు కొట్టడంతో బెలూన్ తెరుచుకున్నప్పటికీ డ్రైవింగ్ చేస్తున్న రూపక్ త్రిపాఠి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మాదాపూర్‌లోని మెడికావర్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారులో ఉన్న సోదరునితో పాటు స్నేహితులు వైభవ్ పాటిల్, ఇషాన్ త్రిపాఠి, ఎస్ రాజ్ సింగ్‌లు క్షేమంగా బయటపడ్డారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే ఇటీవల రూపక్ త్రిపాఠి మొబైల్ యాప్‌ను డెవలప్ చేశాడు. యాప్‌ను లాంచ్ చేయాల్సి ఉందని చెప్పి చత్తీస్‌ఘడ్ నుంచి వారం రోజుల క్రితం ముగ్గురు స్నేహితులను పిలిపించుకున్నాడు. తెల్లవారు జామున ఐటీ కారిడార్ చూసేందుకు వెళుతూ కారు అదుపుతప్పడంతో రూపక్ త్రిపాఠి తిరిగి రాని లోకాలు వెళ్లాడు.కారు ముందు చక్రం ఊడిపోయి నుజ్జునుజ్జు అయ్యింది. పోలీసులు మృత దేహనికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అబుదాబిలో రోడ్డు ప్రమాదం: దంపతులు మృతి

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని సూరజ్‌గార్డెన్ బస్తీకి చెందిన ఓ కుటుంబం అబుదాబిలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆ ప్రమాదంలో దంపతులు మరణించగా వారి కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పట్టణంలోని సూరజ్‌గార్డెన్ బస్తీకి చెందిన సయ్యద్ వాహిద్ కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 7న ఉదయం కారులో ప్రయాణిస్తుండగా కారు అదుపు తప్పి ప్రమాదం చోటు చేసుకుంది. సయ్యద్ వాహిద్ సంఘటన స్థలంలోనే మృతిచెందగా అతడి భార్య ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. నాలుగు నెలల బాలుడికి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 6, 8 సంవత్సరాల ఇద్దరు కుమార్తెలకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో సూరజ్‌గార్డెన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. శనివారం సాయంత్రం మృతదేహాలు రాగా ఖననం పూర్తి చేశారు.

విమానాల రాకపోకలకు అంతరాయం

శంషాబాద్: సాంకేతిక సమస్యలతో పాటు వాతావరణ ప్రతికూల ప్రభావంతో పలు విమానాల రాకపోకల్లో తీవ్ర అంతరాయం కలిగింది. అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే విమానం షెడ్యూల్ సమయానికి ఐదు గంటలు ఆలస్యంగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. వీటితో పాటు శంషాబాద్ విమానాశ్రయం నుంచి శనివారం సాయంత్రం ఢిల్లీ వెళ్లాల్సిన ఆకాశ ఎయిర్ లైన్స్ విమానం బయలుదేరాల్సిన విమానం షెడ్యూల్ సమయానికి గంట ఆలస్యంగా ఇక్కడి నుంచి టేకాఫ్ తీసుకుంది. అదే విధంగా భారీ వర్షం కారణంగా హైదరాబాద్ నుంచి షార్జా వెళ్లాల్సిన విమానం కూడా గంట ఆలస్యంగా టేకాఫ్ తీసుకుని బయలుదేరింది. వీటితో పాటు మరో రెండు దేశీయ విమానాలు కూడా షెడ్యూల్ సమయానికి గంట ఆలస్యంగా బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

ఫోన్ లింక్ క్లిక్ చేయడంతో రూ.1.37 లక్షలు మాయం

కుషాయిగూడ: టెలిగ్రామ్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేయడంతో తన బ్యాంకు అకౌంటు నుంచి రూ.1.37 లక్షల రూపాయలు మాయమైన సంఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపిన మేరకు.. సైనిక్‌పురికి చెందిన గొల్లపల్లి మహేష్ (32) వ్యాపారం చేసుకుంటాడు. తన సెల్‌ఫోన్ టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన లింక్‌లపై అవగాహన లేని అతడి తండ్రి హరినాథ్ వాటిలో ఓ లింక్‌ను క్లిక్ చేయడంతో మహేష్‌కు చెందిన బ్యాంకు అకౌంటు నుంచి రూ. 1.37 లక్షలు డ్రా అయ్యాయి. దీంతో ఖంగుతిన్న బాధితుడు కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు బ్యాంకు అకౌంటును వెంటనే ఫ్రీజ్ చేసి రూ1.20 లక్షలను హోల్డ్‌లో ఉంచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తల్లి మరణం తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

నిజాంపేట్: అనారోగ్య సమస్య కారణంగా తల్లి శుక్రవారం మరణించడంతో తట్టుకోలేక కుమారుడు శనివారం ఉదయం ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఖమ్మం జిల్లా, వేంసూర్ మండలం, అడసెర్లపాడు గ్రామానికి చెందిన మారోజు కరుణాకర్ (43) 4నెలల నుంచి బాచుపల్లిలోని కేఆర్‌సిఆర్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. గతంలో కరుణాకర్ వనస్థలిపురంలో బేకరి పెట్టగా తీవ్ర నష్టాలు రావడంతో బేకరి క్లోజ్ చేశాడు. తన తల్లితోపాటు భార్య, కుమార్తెలు తన సొంత ఊరు అయిన ఖమ్మం జిల్లాలో నివాసం ఉంటున్నారు. కరుణాకర్ ఉద్యోగ అన్వేషన కోసం బాచుపల్లికి వచ్చి స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. తల్లి మరణాన్ని తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి..ఆస్పత్రి వద్ద ఆందోళన..



ఆస్పత్రిలోకి దూసుకెళ్తున్న ఆందోళనకారులు

శంషాబాద్: వైద్యం వికటించడంతోనే రోగి మృతి చెందిందంటూ శుక్రవారం రాత్రి బాధితులు శంషాబాద్ పట్టణంలోని లిమ్స్ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మదన్‌పల్లి పాతతండాకు చెందిన మాజీ ఎంపీటీసీ కిషన్ నాయక్ భార్య లక్ష్మీ(50)కు కిడ్నీసమస్య కారణంగా ఈ నెల 6న శంషాబాద్ పట్టణంలోని లిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. 7న వైద్యులు చికిత్స చేసి బాగుందని చెప్పారు. ఆదివారం రాత్రి లక్ష్మి 10.30 గంటల తర్వాత మృతిచెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. కొద్ది నిమిషాల్లోనే ఆందోళనకారులు వందల సంఖ్యలో ఆస్పత్రి వద్దకు చేరుకోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి అద్దాలు, కిటికీలు, సామగ్రిని ధ్వంసం చేయడంతో పాటు సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఆస్పత్రి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, శంషాబాద్ ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడారు. అర్ధరాత్రి మొదలైన ఆందోళన తెల్లవారుజామున కొలిక్కివచ్చింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.ఇదిలా ఉండగా లక్ష్మిని అడ్మిట్ చేసుకునే సమయంలోనే పరిస్థితి విషమంగా ఉన్నట్లు ముందే వెల్లడించామని.. అయినా చికిత్స అందించాలని కుటుంబ సభ్యులు కోరారని లిమ్స్ ఆస్పత్రి యజమాన్యం వెల్లడించింది. చికిత్సలో ఎలాంటి పొరపాటు జరగలేదని పేర్కొన్నారు.



లిమ్స్ ఆస్పత్రి ఎదుట భారీ ఎత్తున గుమిగూడిన ఆందోళనకారులు

కాస్ట్యూమర్‌పై దాడి: నలుగురిపై కేసు

వెంగళరావునగర్: సీరియల్ షూటింగ్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిపై యూనియన్ సభ్యులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. వేతనాల పెంపు విషయంపై తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో 2022లో జరిగిన ఒప్పందం గడువు ఈ ఏడాది జూన్ 3తో ముగిసింది. వేతనాలు పెంచడానికి ఛాంబర్ కోరిన గడువు సైతం ఇటీవల ముగియడంతో ఈ నెల 1 నుంచి ఆయా యూనియన్లు షూటింగ్స్‌కు బంద్ పాటించారు. గత సోమవారం సారథి స్టూడియోలో ఒక సీరియల్‌కు సంబంధించి కాస్ట్యూమర్ యూనియన్ ప్రతినిధి సత్యనారాయణ వర్క్ చేస్తుండగా విషయం తెలుసుకున్న యూనియన్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి రాంబాబు, అసిస్టెంట్ తేజ్ తదితరులు కలిసి సారథి స్టూడియోకు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి సత్యనారాయణపై యూనియన్ నేతలు దాడి చేశారు. దాంతో ఆయనకు గాయాలయ్యాయి. శనివారం బాధితుడు సత్యనారాయణ మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించని వాహనదారులకు రాఖీలు



పహాడీషరీఫ్: రాఖీ పౌర్ణమి సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్న వాహనదారులకు బాలాపూర్ పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి రాఖీలు కట్టారు. హెల్మెట్ ధరించకుండా పుట్టింటికి భర్తలతో వెళ్తున్న వాహనాలను గుర్తించి హెల్మెట్ ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే వచ్చే ఏడాది రాఖీలు కట్టలేకపోతారని అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో రాఖీ శుభాకాంక్షలు తెలిపి మరీ మహిళా పోలీస్ అధికారులతో రాఖీలు కట్టించారు.

కిటకిటలాడిన నృసింహుడి సన్నిధి

ఇబ్రహీంపట్నం: శ్రావణ మాసం, రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఇబ్రహీంపట్నం శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. గుట్టపై సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఖబరస్థాన్ కోసం ముస్లింల ఆందోళన


బోరబండలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

రహమత్‌నగర్: ఖబరస్థాన్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలనే డిమాండ్‌తో ముస్లింలు నిరసనబాట పట్టారు. గడచిన రెండు నెలలుగా రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలోని మసీదుల వద్ద ప్రతి శుక్రవారం ప్రార్థనల శాంతి యుతంగా నిరసన తెలుపుతున్నారు. మరణించిన ముస్లింల పార్థివ దేహాలను సమాధి చేసేందుకు రహమత్‌నగర్ డివిజన్ సంజయ్‌నగర్‌లో ఉన్న ఖబరస్థాన్‌లో స్థలం సరిపోవడం లేదన్నారు. తమకు కొంత స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ శాంతి యుతంగా ప్లకార్డులు పట్టుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరబండ డివిజన్‌లో ఖబరస్థాన్‌కు అసలు స్థలమే లేదంటూ అక్కడి ముస్లింలు ఆందోళన చేస్తున్నారు. ప్రతి శుక్రవారం ప్రార్థనల అనంతరం మసీదు వద్ద రెండు డివిజన్‌లకు చెందిన ముస్లింలు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 35, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 26, పందిరి బీర 26, క్యాబేజీ 11, క్యారెట్ 41, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు బీఈడీ అభ్యర్థుల జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈడీ కోర్సులో సీటు సాధించిన అభ్యర్థుల మొదటి విడత జాబితాను ఆదివారం విడుదల చేయనున్నట్లు టీజీ ఎడ్‌సెట్–2025 అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఎడ్‌సెట్–2025లో అర్హత సాధించిన అభ్యర్థుల్లో 17, 151 మంది వివిధ బీఈడీ కాలేజీలో ప్రవేశాలకు వెబ్‌ఆప్షన్స్ ఇచ్చినట్లు చెప్పారు. సీటు సాధించిన విద్యార్థులు ఈ నెల 11 నుంచి 14 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్టు చేయాలన్నారు.

ముస్లిం రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వాలి

కాచిగూడ: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరస్పరం విమర్శలు మానుకుని 42శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలోని బీసీలకు కల్పిస్తామంటున్న 42 శాతం రిజర్వేషన్లలో ముస్లిం మైనార్టీలకు 11శాతం ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించాలన్నారు. ముస్లిం రిజర్వేషన్లపై సీఎం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే రిజర్వేషన్ల సాధనకై బీసీలు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తారని హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ.20వేల కోట్లు కేటాయించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తరహాలోనే బీసీలకు కూడా చట్టబద్ధమైన సబ్‌ప్లాన్ తీసుకురావాలని డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్లపై డైవర్షన్ రాజకీయాలు


కాచిగూడలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: బీసీ రిజర్వేష్ల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే తమిళనాడు మాజీ సీఎం జయలలిత తరహాలో ఢిల్లీలో అమరణ దీక్ష చేసేవారని అన్నారు. శనివారం కాచిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో బీసీ రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డి నామ్‌కే వాస్తేగా ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. మళ్లీ బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు సాధించే వరకు సీఎం ఢిల్లీలోనే ఉండి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను చదువుకు దూరం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, కిరణ్, అర్జున్, వరుణ్, గోపి, వినయ్, వేదా అర్జున్, తేజస్, విప్లవ్, రుద్రాన్న, దేవాన్న, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తలకు రాఖీ కడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


కేంద్ర మంత్రి సంజయ్‌కు రాఖీ కడుతున్న బీజేపీ నాయకురాలు భార్గవి రెడ్డి


ఫిలింనగర్ దైవసన్నిధానంలో పౌర్ణమి పూజలు చేస్తున్న అర్చకులు

అంబరాన్నంటిన రాఖీ సంబురం

నేతల ఇళ్ల వద్ద మహిళల సందడి

బంజారాహిల్స్: రాఖీ పౌర్ణమి వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా రాఖీ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు.

- రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం నియోజకవర్గాల పరిధిలోని పలు నేతల ఇళ్ల వద్ద మహిళా నేతలు, కార్యకర్తల సందడి కనిపించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసానికి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున మహిళా నేతలు, కార్యకర్తలు తరలి రావడంతో ఆయన నివాసం వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యేకు మాజీ కార్పొరేటర్ భారతి నాయక్‌తో పాటు పలువురు నాయకురాళ్లు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి డివిజన్‌లోని నేతలు, కార్యకర్తలకు రాఖీలు కట్టి రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు రాఖీ కడుతున్న మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, మహిళలు



ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి అమ్మవారికి ఎంతో ప్రత్యేకమైనదని ఫిలింనగర్ దైవసన్నిధానం అర్చకులు తెలిపారు. శనివారం ఫిలింనగర్ దైవసన్నిధానంలో అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా వేకువ జామునే విశేష అభిషేకం, అర్చన, హోమం నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుంటే సకల సుఖ సంతోషాలు కలుగతాయని భక్తుల విశ్వాసమని అర్చకులు తెలిపారు. ఫిలింనగర్ రోడ్ నెం. 1లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సుమారు నాలుగున్న క్వింటాళ్ళ రకరకాల పూలతో అమ్మవారికి పుష్పాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.


యూసుఫ్‌గూడలో బీఆర్‌ఎస్ నేత సురేందర్ యాదవ్‌కు రాఖీ కడుతున్న దృశ్యం


టీపీసీసీ లీగల్‌సెల్ స్టేట్ కన్వీనర్ నరేందర్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి హజారా సుల్తానా...


మాజీ కార్పొరేటర్లు కిలారి, కంజర్లకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఘనంగా నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవం


గరుడ వాహన సేవలో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు


ఆలయంలో బండ నరసింహ స్వామి పూజలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని శ్రీ బండ నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు శతాబ్దాల చరిత్ర కల్గిన నరసింహ స్వామి ఆలయ వార్షికోత్సవాలు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. రాత్రి 7 గంటలకు స్వామివారిని గరుడ వాహనంలో ఖైరతాబాద్ పురవీధుల్లో ఊరేగించారు. ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డితో పాటు ఆలయ తాంత్రి నీపురం శ్రీహరం స్వామి, వెంకటేష్ స్వాములతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


హర్ ఘర్ తిరంగాతో దేశ ఐక్యతను చాటుదాం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ 'హర్ ఘర్ తిరంగా' వర్క్‌షాప్‌ను శనివారం సాగర్ సొసైటీలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు మెచినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా యువమోర్చా ఆధ్వర్యంలో ఆదివారం (నేడు) తిరంగా ర్యాలీ నిర్వహించాలని, అలాగే మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వతంత్ర సమరయోధులు, మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించాలని, 13, 14 తేదీల్లో ఇంటిపైన జాతీయ పతాకం ఎగురవేసి భారతదేశ ఐక్యతను చాటాలని ఆయన వివరించారు. బీజేపీ ఖైరతాబాద్ నియోకవర్గ కన్వీనర్ గడ్డం వెంకటస్వామి,


వర్క్‌షాప్‌లో పాల్గొన్న నాయకులు

జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, నాయకులు శీతల అనిల్‌కుమార్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, చెలిమిటి గిరి, గురుబ్రహ్మగౌడ్, లక్ష్మీనారాయణ, గొల్లి రమ్య, మంజలి నరసింహ, పురుషోత్తం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నేర్పించాలి



చిక్కడపల్లి: కళల ద్వారా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య, సంగీత కళా నిలయాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సాయిశరణ్య, సాయిశ్రావ్య అన్నారు. త్యాగరాయ గానసభలో శనివారం కళా నిలయం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నటరాజస్వామికి పూజ చేసి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కళలకు కాణాచి అయిన ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా తమ కళా సంస్థను ఏర్పాటు శాస్త్రీయ సంగీతం, కూచిపూడి నృత్యాన్ని పరిచయం చేస్తున్నామని అన్నారు. ఈ కళలను చిన్నతనం నుంచి నేర్పిస్తే వారు క్రమశిక్షణ గల పౌరులుగా ఎదుగుతారని అన్నారు. వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు సంగీతం, నృత్యం తోడ్పడుతాయని తెలిపారు.

- ప్రకాశం జిల్లాకు చెందిన సినీ మాటల రచయితగా మరుధూరిరాజా, సంగీత దర్శకులుగా సాయి కార్తీక్ ప్రవేశించి ఉన్నతస్థాయికి ఎదిగారని పేర్కొన్నారు. తమ కళా నిలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వారిని సత్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. అదే విధంగా నాటకరంగ గురువులు చిట్టా శివప్రసాద్, కూచిపూడి నృత్య గురువులు ఎస్వీ శివకుమారిలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 50మంది కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత విభావరి ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞశర్మ, కళాకారులు జస్వత్, సుమంత్, కరవది నాగలక్ష్మి పాల్గొన్నారు.

అధికారులకు రాఖీలు కట్టిన జేహెచ్‌పీఎస్ విద్యార్థినులు


బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్ రెడ్డికి రాఖీ కుడుతన్న దృశ్యం

ఫిలింనగర్: రక్షాబంధన్ సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) విద్యార్థులు సామాజిక విధులు నిర్వర్తించే పలువురు అధికారులను కలిసి రాఖీలు కట్టారు. బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ సురేందర్, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం, వాటర్‌వర్క్స్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, అగ్నిమాపక సిబ్బంది రాజేశ్వర్, విద్యుత్ శాఖ సిబ్బంది రియాజ్ తదితరులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు అవిశ్రాంతంగా పనిచేస్తున్న అన్ని రంగాల రక్షణ అధికారులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వారు ప్రోత్సహించారు. పౌరులకూ చట్టాన్ని అమలుచేసే అధికారులకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే అద్భుతమైన సంప్రదాయంలో విద్యార్థులు పాల్గొన్నందుకు అధికారులు విద్యార్థులను ప్రశంసించారు.

నేడు వార్–2 సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్...

యూసుఫ్‌గూడలో ట్రాఫిక్ మళ్లింపు


ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్

బంజారాహిల్స్: వార్–2 సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకు యూసుఫ్‌గూడ బెటాలియన్ పోలీస్‌లైన్స్‌లో జరగనున్న దృష్ట్యా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ విభాగం పేర్కొంది. ముఖ్యంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టూ ఉన్న రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గేలా సూచించిన రోడ్లలో వాహనదారులు ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ప్రయాణ సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నెంబర్ 90102 03626ను సంప్రదించాలన్నారు.

- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం వైపు వెళ్లే వాహనాలను కృష్ణానగర్ జంక్షన్, శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట వైపు మళ్లిస్తారు.
- మైత్రీవనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, మాదాపూర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను యూసుఫ్‌గూడ బస్తీ వద్ద ఆర్‌బీఐ క్వార్టర్స్, కృష్ణానగర్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు మళ్లిస్తారు.
- మైత్రీవనం జంక్షన్ నుంచి బోరబండ బస్టాపు వైపు వచ్చే ట్రాఫిక్‌ను సవేరా ఫంక్షన్ హాల్, కృష్ణకాంత్ పార్కు, జీటీఎస్ టెంపుల్, కళ్యాణ్‌నగర్, మోతీనగర్, బోరబండ బస్టాపు వైపు మళ్లిస్తారు.
- బోరబండ బస్టాప్ నుంచి మైత్రీవనం జంక్షన వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ప్రైమ్ గార్డెన్, కళ్యాణ్‌నగర్, మిడ్‌ల్యాండ్ బేకరీ, జీటీఎస్ కాలనీ, కళ్యాణ్‌నగర్ జంక్షన్, ఉమేష్‌చంద్ర విగ్రహం యూటర్న్, ఐసీఐసీఐ యూటర్న్, మైత్రీవనం జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- యూసుఫ్‌గూడలో ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభిమానులు ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని ఎలాంటి ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే అభిమానులు తమ వాహనాల్లో కాకుండా మెట్రోలో రాకపోకలు సాగించాలన్నారు. కోట్ల విజభాస్కర్‌రెడ్డి స్టేడియం ఎదుటే మెట్రో స్టేషన్ ఉన్నందున అందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. వాహనాల పార్కింగ్ సమస్యల దృష్ట్యా మెట్రోలో రాకపోకలతో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

సాధారణ ప్రజలకు పార్కింగ్ స్థలాలు..

- మెట్రోపార్కింగ్ (జానకమ్మ తోట 1, 2) యూసుఫ్‌గూడ
- సవేరా ఫంక్షన్ హాల్, మహమూద్ ఫంక్షన్ హాల్ (ఫోర్ వీలర్స్ పార్కింగ్ కోసం)

ద్విచక్ర వాహనం చోరీ

వెంగళరావునగర్: హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వరంగల్‌కు చెందిన బి.అఖిల్ అమీర్‌పేట బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీసు సమీపంలో ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తాత్కాలికంగా తమ బంధువుల ద్విచక్ర వాహనాన్ని వినియోగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీ రాత్రి వాహనాన్ని తాను ఉంటున్న హాస్టల్ ఎదుట పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో శనివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీకేగూడలో వ్యక్తి అదృశ్యం


ఉమా మహేశ్

అమీర్‌పేట: బీకేగూడలో నివసించే ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీకేగూడలోని బాలాజీ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముండే కొల్లూరు ఉమామహేశ్ (42) మానసిక సమస్యతో గత నెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆతని ఆచూకి కోసం అనేక ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అతని సోదరి వాసంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎవరికైన ఆచూకి తెలిస్తే ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సంస్కృతిని పాటించాలి

చందానగర్: శ్రీ లక్ష్మీ గణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఉపాకర్మ కార్యక్రమంను శనివారం సాయి కీర్తి ఎస్టేట్స్ కమ్యూనిటి హాల్‌లో నిర్వహించారు. పది మందికి ఉపనయనంలో భాగంగా యజ్ఞోపవీతధారణను జరిపించారు. వేద పండితులు, ఘనాపాటి హరి సీతారామమూర్తి శాస్త్రబద్ధంగా పూర్తి చేయించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వేద విజ్ఞానాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలకు అందించేందుకు అందురూ కృషి చేయాలని, స్వీయ నియమ నిబంధనలను తప్పకుండా ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్యామలరావు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి శశి భూషణ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం


ఓయూలో ఆదివాసీ నృత్యాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆదివాసి స్టూడెంట్ యూనియన్ (ఏఎస్‌యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆదివాసి జాతీయ పతాకాన్ని ఓయూ అధ్యాపకులు ప్రొ.రేగ రాజేందర్ ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌యూ రాష్ట్ర నాయకులు సొగబోయిన పాపారావు, అరుణ్‌కుమార్, వెంకన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కృతి నృత్య అకాడమీ డాక్టర్ రోజని వల్లభనేని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, పుష్పాంజలి, చంద్రచూడ, చరణములే నమ్మితి, ఆత్మరామ, బృందావనసానం, కళ్యాణరామ, శివతాండవం, రామాయణశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు కంతి, అను, వేదం, అక్షద, రజీవ్, సుకన్య, ఆద్య, రితిక, మహశ్రీ, ప్రదర్శించారు. అలాగే శ్రీరామ నాటక నికేతన్ గురువు మంజుల రామస్వామి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వసుధైక కుటుంబం, శివస్తోత్రం, నటనమాడినారు, గోపిక మాధవం తదితర అంశాలను కళాకారులు వరేణ్య, స్మితిక, వర్షిక, సాన్విత, అనుష్క, ఆకృతి, వర్ష, రెబెక్క, వంశిక, శరణ్య, సహస్ర, సంధ్య, తనుశ్రీ తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం స్వరాలాపన నిర్వహించారు. శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ సంస్థ గురువు ఊటుకూరి శ్రీనివాస్ శిష్యబృందం అంతయునీవే, అన్ని మంత్రములు, షోడశకళానిధికి, ఎక్కడి మనుషజన్మము, వచ్చెను అలమేలు మంగ, కంటి శుక్రవారము, కీర్తనలను సృజన, కవిత, రామలక్ష్మి, ప్రసన్న, మహిమ, కావ్య, నివేదిత, వైష్ణవిలు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్‌లు కళాకారులను ఘనంగా సత్కరించారు.

సాక్షి
ఆదివారం । 10 । ఆగస్టు । 2025

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

స్మార్ట్ వాల్వ్‌మీటర్లు!

తాగునీటి లెక్కకు

నీటి చుక్కకు పక్కాగా లెక్క కట్టేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. మహానగర వాసులకు సరిపడా, నాణ్యమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. సుదూర ప్రాంతాల్లోని జలాశయాల నుంచి నీటిని తరలించి శుద్ధి చేసిన అనంతరం సరఫరా చేస్తున్న ప్రతీ చుక్కనూ లెక్కించడానికి స్మార్ట్ వాల్వ్ మీటర్స్ టెక్నాలజీ వినియోగానికి సిద్ధమైంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా సనత్‌నగర్‌లోని జేకే కాలనీలోని రెండు లైన్లలో అమలవుతుండగా, తాజాగా రిజర్వాయర్ అవుట్ లెట్ వద్ద, బల్క్ కనెక్షన్‌లు ఉన్న ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్మార్ట్ వాల్వ్ మీటర్స్‌పై సమీక్ష నిర్వహించారు. అనువైన సాంకేతిక పరిజ్ఞానం కోసం అన్వేషించాలని ఐటీ అధికారులను ఆదేశించారు. వాస్తవంగా తాగునీటి సరఫరాలో సుమారు 15 వేల చిన్న, పెద్ద వాల్వ్‌లు ఉండగా, అందులో 35 శాతం మాత్రమే తరుచూ ఆపరేట్ అవుతుంటాయి. తాజాగా కనీసం వెయ్యి వాల్వ్‌లను ఆటోమేషన్ చేయడానికి ఉన్న సాధ్యసాధ్యాలను పరిశీలిస్తోంది. -సాక్షి,సిటీబ్యూరో


సోలార్ ఎనర్జీతో స్మార్ట్ వాల్వ్ పనితీరును పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్ రెడ్డి (ఫైల్)

రిజర్వాయర్ అవుట్‌లెట్, బల్క్ కనెక్షన్లకు ఏర్పాటు

- సోలార్ ఎనర్జీతో నిర్వహణ
- ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టుగా సనత్‌నగర్‌లో అమలు

మొబైల్ యాప్‌తో అప్‌డేట్

సరికొత్త విధానంలో లైన్‌మెన్లు క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే వాల్వులను మొబైల్ యాప్‌తో అప్‌డేట్ చేసే వెసులుబాటు ఉంటుంది. వాల్వ్ సెన్సర్లకు సోలార్ ప్యానళ్లు అమర్చి మొబైల్స్‌కు అనుసంధానిచ్చారు. వాల్వ్ సెన్సర్ సంబంధిత లైన్‌మెన్, ఉన్నతాధికారుల మొబైల్‌తోపాటు వాటర్ బోర్డు డాష్‌బోర్డు అనుసంధానంతో కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షించవచ్చు. వాటర్ క్వాలిటీ, క్వాంటిటీ, క్లోరిన్ శాతం వివరాల్ని తెలుసుకునే విధంగా యాప్ రూపొందించారు. స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ పూర్తిగా సోలార్ ఎనర్జీతో పనిచేస్తుంది. బ్యాటరీ బ్యాకప్ ఉన్నందున నిర్వహణలో పవర్ సమస్య ఉండదు.


ఆటోమేటిక్ వాటర్ వాల్వ్

ప్రత్యేక కంట్రోల్ రూమ్

జలమండలి ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏకీకృత వ్యవస్థ ద్వారా స్మార్ట్ వాల్వ్‌ల ఆపరేషన్, నియంత్రణ, పర్యవేక్షణ చేసేలాగా వ్యవస్థ రూపకల్పనకు జలమండలి సిద్ధమవుతోంది. స్మార్ట్ మీటర్ల పనితీరు, పంపిణీ చేసిన క్వాంటిటీ, క్వాలిటీతోపాటు బిల్లింగ్ వివరాలను సైతం ఈ వ్యవస్థకు అనుసంధానం చేస్తోంది. పైప్‌లైన్ల సాధారణ వాల్వ్‌లకు బదులు ఆటోమెటిక్ స్మార్ట్ వాటర్ వాల్వ్‌లను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం జేకే లైన్‌లో వాటర్ లైన్‌మెన్లు వాల్వ్‌ల వద్దకు వెళ్లకుండానే మొబైల్ ద్వారా ఆపరేట్ చేస్తూ నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రస్తుతం ఇలా...

నగరంలో సాధారణ వాల్వ్‌ల గుండా లైన్‌మెన్ల పర్యవేక్షణలో నీటి విడుదల కొనసాగుతోంది. ప్రతి సెక్షన్‌లోని ఒక్కో ప్రాంతంలో నల్లా కనెక్షన్లపై లైన్‌మెన్లు ఉంటారు. నీటి సరఫరా జరిగే సమయంలో పైప్‌లైన్ వాల్వ్‌లను తిప్పి నీటిని విడుదల చేస్తుంటారు. నిర్ణయించిన మేరకు థ్రెడ్లను తెరవాలి. వాల్వ్ థ్రెడ్లు తిప్పడం బట్టి నీటి సరఫరాలో ప్రెషర్, లో ప్రెషర్ ఉంటుంది. వాస్తవంగా ఆయా లైన్లకు నిర్ణయించిన సమయం వరకూ నీటిని వదలాలి. అనంతరం థ్రెడ్లను మూసివేస్తే సరఫరా ఆగిపోతోంది. అయితే లైన్‌మెన్ల చేతివాటంతో కొందరికి ప్రెషర్, మరికొందరికి లోప్రెషర్ ద్వారా నీటి సరఫరా జరగడం సర్వసాధారణమైంది. స్మార్ట్ వాటర్ వాల్వ్‌లు అందుబాటులోకి వస్తే వినియోగదారులందరికీ సమానంగా నీటి సరఫరా జరిగే అవకాశాలు ఉండవచ్చు.

చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం స్ఫూర్తిదాయకం

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సామ్ కోషి

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమం కోసం చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో చేపడుతున్న సంస్కరణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సామ్ కోషి అన్నారు. శనివారం ఆయన చర్లపల్లిలోని ఖైదీల వ్యవసాయ క్షేత్రం (ఓపెన్ ఎయిర్ జైల్)ను సందర్శించారు. ఈ సందర్భంగా జైలు పనితీరు, కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలు చేస్తున్న వ్యవసాయం, కూరగాయల సాగు, కోళ్ల పెంపకం, నర్సరీలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. జైళ్ల శాఖ సంస్కరణలు ప్రశంసనీయమని, ఖైదీలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం జైలు ఆవరణలో ఆయన మొక్క నాటారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి జస్టిస్ కిరణ్ కుమార్, ముదిగొండ రాజు, జైలు పర్యవేక్షణాధికారి శివ కుమార్‌గౌడ్, కాళిదాసు, జైలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జస్టిస్ సామ్ కోషికి జైలులోని ఉత్పత్తులను అందజేస్తున్న ఖైదీలు

టూరిజం పాలసీ అమలుకు రూట్‌మ్యాప్


లక్డీకాపూల్‌లో సదరన్ ట్రావెల్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్

లక్డీకాపూల్: ఈ ఏడాది మార్చి17 నుంచి అమలులోకి వచ్చిన 2025–2030 పర్యాటక రంగం పాలసీ అమలుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ పాలసీతో అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను టాప్–5 లో ఉంచడమే తమ లక్ష్యమన్నారు. శనివారం లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేసిన సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ ప్రధానంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంతోపాటు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం ఈ పాలసీలో భాగమన్నారు. గుర్తింపు పొందిన పర్యాటక స్థలాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడంతోపాటు జలపాతాలు, ఏకో టూరిజం కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలతోపాటు క్రాఫ్ట్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించిందని తెలిపారు. తద్వారా పర్యాటక రంగంలో 3 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పారు. ఈ క్రమంలో మరో 27 ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు రూట్ మ్యాప్ రూపొందించామని వివరించారు. శంషాబాద్ విమానాశ్రయం సమీపంలో తెలంగాణకు తలమానికంగా నిలిచిపోయేలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, ప్రాంతీయ రింగ్ రోడ్ల వెంట డ్రై పోర్టులు, గోదావరి, కృష్ణా నదులపై రివర్ బెస్ట్ టూరిజం, వాటర్ ఫ్రంట్ హబ్‌లు వంటి ప్రత్యేకతలతో కూడిన పర్యాటక కేంద్రాలను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. కుటుంబ సభ్యుల యాత్రలకు తెలంగాణ కేంద్రంగా నిలిచేలా పాలసీ రూపొందించినట్టు మంత్రి పేర్కొన్నారు.

న్యాయవిద్య పట్టభద్రులు బాధ్యతాయుతంగా ఉండాలి



శ్రీనగర్ కాలనీ: న్యాయవిద్య పట్టభద్రులు బాధ్యతాయుతంగా, న్యాయ విలువలను పాటిస్తూ సమాజసేవకు, దేశ సమగ్రతకు కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో పడాల రామారెడ్డి లా కళాశాల 19వ స్నాతకోత్సవాలు ఘనంగా జరిగాయి. వేడుకలకు జస్టిస్ కె.లక్ష్మణ్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. న్యాయవిద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 42 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 500 మందికి న్యాయ డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ న్యాయవిద్య పోటీ తీవ్రంగా ఉన్న వృత్తి అని, దీనికి పరిధులు ఉండవని, ఎక్కడైనా వాదనలు వినిపించవచ్చని అన్నారు. వృత్తిలో రాణించాలంటే అన్ని సబ్జెక్టులతోపాటు కమ్యూనికేషనల్ స్కిల్స్, డ్రాఫ్టింగ్‌లో పట్టు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటేనే ఎవరైనా ఉన్నతస్థాయికి చేరుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయలక్ష్మి, సెక్రటరీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

స్టేట్ హోంను సందర్శించిన కలెక్టర్



వెంగళరావునగర్: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన శనివారం వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఆ శాఖ ప్రాంగణంలోని శిశువిహార్‌లో ఆశ్రయం పొందుతున్న చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారితో కలిసి ఆటలాడుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వారికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్నారులను మరింత జాగ్రత్తగా చూడాలని ఇన్‌చార్జీలకు తెలియజేశారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తనకు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిశువిహార్ ఇన్‌చార్జి సంతోషి, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ తస్లిమా, సవిత తదితరులు పాల్గొన్నారు.

జంతు ఆధారిత వ్యవసాయం పెంచాలి

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్

రాయదుర్గం: జంతు ఆధారిత వ్యవసాయాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాల ఆదాయాలను మరింత మెరుగు పర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, ఎర్త్‌సైన్సెస్, ఆటమిక్ ఎనర్జీ శాఖల మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్‌ఐఏబీ) క్యాంపస్‌లో శనివారం వినూత్న జంతు ఆరోగ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించారు. దేశంలోనే మొట్టమొదటి యానిమల్ స్టెమ్‌సెల్ బయో బ్యాంకును ఆయన ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లో కొత్తగా నిర్మించ తలపెట్టిన హాస్టల్, రెసిడెన్షియల్ బ్లాక్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు జంతు ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం, పశువుల ఉత్పాదకతను పెంచడం, రైతుల జీవనోపాధిని భద్రపర్చడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కేంద్రం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించేందుకే వికసిత్ భారత్–2047 విజన్ వైపు పయనించడానికి అనేక పథకాలను ప్రారంభించిందని చెప్పారు. బయోటెక్నాలజీ విభాగం ఆర్థిక కార్యదర్శి, బ్రిక్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేష్ ఎస్ గోఖలే మాట్లాడుతూ పరిశోధనలను వాస్తవ ప్రపంచ పరిష్కారాలుగా విజయవంతంగా మార్చినందుకు ఎన్‌ఐఏబీ శాస్త్రవేత్తలను అభినందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ జి.తరు శర్మ, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ జననిరాధాకృష్ణన్, పలువురు ఎన్‌ఐఏబీ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. జంతువుల ఆరోగ్యాన్ని రక్షించడం, రైతుల జీవనోపాధిని కాపాడటం కోసం ఎన్‌ఐఏబీ, బ్రిక్స్ ఆధ్వర్యంలో రూపొందించిన ఐదు స్వదేశీ సాంకేతికతలు బ్రూడివా, ఉద్దార్ కేర్, క్యూర్ చెక్, టాక్సోయాంటీబాడీ ర్యాపిడ్ టెస్ట్, ర్యాపిచెక్స్ జేఈ ఎన్ఎస్ఐ టెస్ట్ వంటి ఐదు నూతన సాంకేతికతలను కేంద్రమంత్రి ఆవిష్కరించారు.


గౌలిదొడ్డిలోని ఎన్ఐఏబీలో హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి జితేంద్రసింగ్

పీహెచ్‌డీ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి పలు విభాగాల్లో కామర్స్, ఇంగ్లిష్, తెలుగు, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, ప్రజాపరిపాలన, సామాజిక శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పా చక్రపాణి తెలిపారు. ప్రవేశ పరీక్షను కంప్యూటర్ ఆధారంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. యూజీసీ/ సీఎస్ఐఆర్–జేఆర్ఎఫ్/ ఎన్ఈటీ/ ఎస్ఎల్ఈటీ/ ఎస్ఈటీలో అర్హత సాధించిన లేదా ఎంఫిల్ పట్టా పొందిన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు రిజిస్ట్రేషన్‌కు గడువు ఆగస్టు 30వ తేదీ అని తెలిపారు. ఆలస్యం రుసుముతో సెప్టెంబర్ 4 వరకు గడువు ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష హైదరాబాద్‌లో మాత్రమే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ప్రవేశ పరీక్ష తేదీని విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ ఫోన్ నెంబర్లలో 040–23544741, 23680411, 040–23680240 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మతస్వేచ్ఛను కాలరాస్తున్నారు..

రాంగోపాల్‌పేట్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కు అయిన మత స్వేచ్ఛను కాలరాస్తున్నారని సుప్రీం కోర్టు ప్రముఖ న్యాయవాది, ఏడీఎఫ్ ఇంటర్నేషనల్ ఏసియా అడ్వకేసీ తెహ్మినా అరోరా అన్నారు. శనివారం సికింద్రాబాద్‌లోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో సివిల్ రైట్స్ ఇనిషియేటివ్ ఇంటర్నేషనల్ సంస్థ (సీఆర్ఐఐ) ఆధ్వర్యంలో "భారతదేశంలో మత స్వేచ్ఛ సత్యమా–స్వప్నమా"అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె మాట్లాడారు. క్రైస్తవుల మీద దాడులు జరిగినప్పుడు అద్దాల మేడల్లో ఉండే బిషప్స్ వచ్చి అరెస్టులు అయితేనే ప్రభుత్వాల్లో కదలిక వస్తుందని అన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది ఫ్రాంక్లిన్ సీజర్ థామస్, వైఎస్ విమలమ్మ, సీఆర్ఐఐ వ్యవస్థాపకుడు, మాజీ అదనపు డీజీపీ కె.బాబూరావు, మాజీ ఐఏఎస్‌లు శామ్యూల్ ఆనంద్, మిన్నీ మ్యాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు పులిగుజ్జు సురేష్ రాసిన స్వేచ్ఛ నుంచి చెరసాలలోకి అనే పుస్తకాన్ని బాబూరావు ఆవిష్కరించారు.

ప్లాస్టిక్, ఏస్తటిక్ సర్జరీలు సంక్లిష్టం


దుబాయ్‌కి చెందిన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్


టీ హబ్‌లో 'సేఫ్ ప్లాస్ట్-2025' సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

రాయదుర్గం: ప్లాస్టిక్, ఏస్తటిక్ సర్జరీలు చాలా సంక్లిష్టమైనవని దుబాయ్‌కి చెందిన ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్ అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో రెండు రోజులపాటు సాగే 'సేఫ్ ప్లాస్ట్–2025'సదస్సు శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్జరీ ప్రక్రియపై తగిన శిక్షణ లేకుండా కేవలం పుస్తకాలు చూసి చేయడం కూడా సరికాదన్నారు. పూర్తిస్థాయి శిక్షణ పొందిన తర్వాత సర్జరీ చేస్తేనే రోగులకు అత్యంత సురక్షితంగా చికిత్స అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మిగిలిన విభాగాల్లో చేసే చికిత్సలు వేరు, ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులు చేసే చికిత్సలు వేరని అన్నారు. పెర్సానిక్స్ కాస్మొటిక్స్, ప్లాస్టిక్ సర్జరీ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురుకర్ణ వేముల మాట్లాడుతూ చికిత్సల నిమిత్తం వైద్యుల వద్దకు వెళ్లే ముందు వారి ప్రొఫైల్, వెబ్‌సైట్లు, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్లు వంటి వివరాలను సరిచూసుకోవాలన్నారు. వైద్యుల డిగ్రీల గురించి తెలుసుకోవాలని, ఎంబీబీఎస్, ఎండీ, ఎంసీహెచ్ లాంటివి కాకుండా ఎఫ్ఐఎస్ఎస్ వంటి ఏవేవో పేర్లతో ఫెలోషిప్‌లు ఉన్నాయంటే అనుమానించాలన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 120 మందికి పైగా ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులు పాల్గొన్నారు. విదేశాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కొందరు పాల్గొన్నారు.

బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి

తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ అధ్యక్షుడు రవికుమార్



హిమాయత్‌నగర్: రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించిన 42 శాతం రిజర్వేషన్లను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను రాష్ట్రపతి ఆమోదించి తమిళనాడు మాదిరిగా రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్డ్‌లో చేర్చాలన్నారు. శనివారం హిమాయత్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆనాడు తమిళనాడు సీఎం జయలలిత ఢిల్లీకి వెళ్లి ప్రధానిని ఒప్పించి రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించుకున్నారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఢిల్లీలో ధర్నాలు చేయడం వలన సాధించేది ఏమీ లేదని స్పష్టం చేశారు. ముస్లింలకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లను ఆమోదించకపోతే బిజెపిపై బీసీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీ రిజర్వేషన్లపై రెండు నాలుకల ధోరణి విడనాడాలని హితవు పలికారు. తమ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లను పక్కదారి పట్టించే కుట్ర

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ఆర్.కృష్ణయ్య ధ్వజం


బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే ఆ అంశాన్ని పక్కదారి పట్టించడానికి ప్రయత్నిస్తోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. కేంద్రంపై నెపం నెట్టి తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం జరిగిన 18 బీసీ సంఘాల సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పద్ధతి ప్రకారం ప్రయత్నించడం లేదని విమర్శించారు. బీసీని దేశ ప్రధానిగా చేసిన బీజేపీ బీసీ రిజర్వేషన్ల పెంపునకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు సాధించాలంటే కేంద్రంపై యుద్ధం ప్రకటించి ధర్నాలు చేస్తే సరిపోదని, బీసీ, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి కలుపుకుపోవాలని సూచించారు. కేంద్ర మంత్రులను విమర్శించడం లాంటి చర్యలు రిజర్వేషన్లు సాధించడానికి ఎలా ఉపయోగపడతాయని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే వెళ్లాలన్నారు. 70 ఏళ్ల దేశ చరిత్రలో కుల గణన చేసిన బిజెపి చరిత్ర సృష్టించిందని అన్నారు. సమావేశంలో నాయకులు సి.రాజేందర్, భూపేష్ సాగర్, ర్యాగ రమేష్, నిఖిల్ పటేల్, రమాదేవి, చిక్కుడు బాలయ్య, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మీయతకు ప్రతీక



పంజగుట్ట: ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు మాతృశక్తి, దుర్గావాహిని మహిళానేతలు రాఖీ కట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, పద్మశ్రీ, శ్రీవాణి, లక్ష్మిసరోజ, వాణీదేవి, వాణి సక్కుబాయి, శిరీష పాల్గొన్నారు.

● అనుబంధాలను పెంచుతుంది..

ముషీరాబాద్: రాఖీ పౌర్ణమి సందర్భంగా హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు ఆయన మనవరాళ్లు జశోదర, వేదాంషితోపాటు పారిశుధ్య కార్మికులు రాఖీ కట్టారు. దత్తాత్రేయ మాట్లాడుతూ కుటుంబ బంధాలను మెరుగుపరిచే పవిత్రమైన సంప్రదాయమని అన్నారు.



● శుభాకాంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: రాఖీపౌర్ణమి సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుకు జీహెచ్ఎంసీ మాజీ మేయర్, బీజేపీ నాయకురాలు బండ కార్తీక రెడ్డి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



● సీఎం కటౌట్‌కు రాఖీ

హిమాయత్‌నగర్: ఇళ్లస్థలాలను పరిరక్షించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మహిళా విభాగం నేతలు వినూత్నరీతిలో సీఎం రేవంత్‌రెడ్డి కటౌట్‌కు రాఖీ కట్టి విన్నవించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో విశ్రాంత ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల కబ్జాకు ఓ సొసైటీ ప్రయత్నిస్తోందని జి.సూర్యకళ, ఝాన్సీ రాణి, కటకం జానకి, అనురాధ, మేరీ ముద్రాయి, సరోజ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 10, ఆగస్టు, 2025

12న ఫార్మా సదస్సు..

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ప్రముఖ టెక్–ఆధారిత కోల్డ్ సప్లై చైన్ సొల్యూషన్స్ సేవల సంస్థ అయిన సెల్సియస్ లాజిస్టిక్స్, ఈ నెల 12న దేశ ఫార్మా రాజధానిగా పేరొందిన నగరంలో ప్రత్యేక సదస్సు నిర్వహించనుంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. మాదాపూర్‌లోని నోవోటెల్ హోటల్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న ఔషధ కంపెనీలు భాగస్వామ్యం కానున్నాయని కోల్డ్ చైన్ సొల్యూషన్స్‌లో అత్యాధునిక ఆవిష్కరణలు తక్కువ వ్యయంలో సమర్థవంతమైన పరిష్కారాలను అన్వేషించడానికి, సాంకేతిక పురోగతిని ప్రదర్శించడానికి ఈ సదస్సు వీలు కల్పిస్తుందన్నారు.

నేడు నగరంలో అభిజిత్ షో..

సాక్షి, సిటీబ్యూరో : బాలీవుడ్ నటుడిగా, రచయితగా చిరపరిచితుడైన ముంబైకి చెందిన అభిజిత్ దేశ్ పాండే నగరానికి వస్తున్నారు. నటుడిగానే కాక హాస్య ప్రదర్శనలకూ పేరొందిన ఆయన ఫన్నీ సైడ్ ఆఫ్ హైదరాబాద్, ఎన్‌చాంటి కేఫ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఓ హాస్యభరిత కార్యక్రమంలో పాల్గొని ప్రదర్శన ఇవ్వనున్నారు. కొండాపూర్‌లోని ది స్ట్రీట్ కామెడీ క్లబ్‌లో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఆయన ప్రదర్శన ప్రారంభమై సుమారు గంటన్నర పాటు కొనసాగుతుంది.









కుకుకూ..
కుకు.. కోకిల
రావే.. రాణి వాసము
నీకు ఎందుకో.. రెక్క విప్పుకో
చుక్కలందుకో.. రంగుల లోకం పిలిచే
వేళ.. రాగం నీలో పలికే వేళ.. విరులా తెరలే
తెరచి రావే.. బిడియం విడిచి నడచి రావే.. నా
పాటల తోటకు రావే ఈ పల్లవి పల్లకిలో.. స్వరమై రావే విరి
పొదల ఎదలకు.. సూర్యుడు నిన్నే చూడాలంట.. చంద్రుడు నీతో
ఆడాలంట.. బురుజూ బిరుదూ విడిచి రావే.. గడప తలుపు దాటి రావే..
అని 'సితార'లో వేటూరి రాసిన ఈ పాట వింటుంటే ఎంత హాయిగా ఉంటుందో..

పొద్దునే లేవగానే పక్షుల కిలకిలలు వింటుంటే.. ప్రకృతి సరిగమలు వింటున్నంత హాయిగా అనిపిస్తుంది.. అందుకే నగరంలో పలువురు తమ బాల్కనీల్లో వివిధ జాతుల పక్షులను తమ కేజ్‌లలో పెంచుకుంటున్నారు. వాటి కిలకిలలు వింటూ వాటితో సమయం గడిపి నేస్తాలుగా చేసుకుంటున్నారు.. అంతేకాదు ఒత్తిడిని తగ్గించుకుంటున్నారు..

- సాక్షి, సిటీబ్యూరో

పక్షుల కిలకిలలు..
ప్రకృతి సరిగమలు..

పక్షుల పెంపకం పట్ల నగరవాసుల క్రేజ్

- ఇళ్లల్లోని కేజ్‌లో వివిధ రకాల జాతులు
- బాల్కనీలో సమయం గడుపుతున్న వైనం
- బర్డ్ వాచింగ్ వంటి అభిరుచికి కొనసాగింపు
- దేశ, విదేశీ వెరైటీ పక్షులకు పెరుగుతున్న డిమాండ్
- ఒత్తిడిని తగ్గించుకునేందుకు పక్షులే నేస్తాలుగా

పక్షుల కిలకిలలు వింటూ నిద్రలేవాలంటే.. అంత సులభం కాదు. అయితే పుస్తకాలు చదువుతూ ఊహల్లో తేలాలి.. లేదా వ్యయప్రయాసలకోర్చి సహజమైన ప్రకృతి ఒడిలోకి వెళ్లాలి.. ఈ రెండూ కాదంటే.. కనీసం కొన్ని పక్షులను ఇంట్లో పెంచుకున్నా కొంత వరకూ ఆ లోటు తీరుతుంది.. సరిగ్గా నగరవాసులు ఇదే ట్రెండ్ ఫాలో అవుతున్నారు. విభిన్న రకాల పక్షులను బాల్కనీల్లో పెంచుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇళ్లలో పక్షుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.

బడ్జీ (బడ్జీరిగర్ / పరకీత్)

ఆస్ట్రేలియా మూలాలు ఉన్న దీనిని చిన్న చిలక అని కూడా పిలుస్తారు. ఇవి భిన్న రకాల రంగులతో అందంగా కనిపిస్తాయి. అందుకే వీటిని ఎక్కువ మంది పెంచుకునేందుకు అనువుగా మారాయి. వీటి ధర సుమారు రూ.1,200–1,500 మధ్యలో ఉంటాయి.

లవ్ బర్డ్స్

ఇవి తక్కువ పరిమాణంలో ఆకర్షణీయ రంగులతో కనువిందు చేస్తాయి. సోషల్‌గా పెంచుకునేందుకు అనువుగా ఉంటాయి. సగటు లవ్‌బర్డ్స్ ధర సుమారు రూ.5వేలు ఉంటే, దీనిలో అరుదైన అల్బినో రెడ్ ఐ వెరైటీ ధర : సుమారు రూ.10,000 వరకూ ఉంది. వీటిలో విభిన్న రకాలు ఉన్నాయి.



కోకాటెయిల్



ఆస్ట్రేలియాకు చెందిన పెంపుడు పక్షి. భిన్న రంగుల్లో ఉండే పసుపు ముఖంపై మెరిసే ఆరెంజ్ ప్యాచ్ హైలైట్. చిన్న వయసులో ఉన్నప్పుడే కొని ఇంటిలో పెంచడం ఉత్తమం. ఇవిచాలా తెలివైనవి. డోర్‌బెల్, ఫోన్, అలారం, గడియారాలు వంటి శబ్దాలను కాపీ చేయగలవు. వీటి ధర రూ.2వేల నుంచి మొదలై రూ.15వేల వరకూ ఉంటాయి.



మకావ్

ప్రపంచపు అత్యంత కలర్ ఫుల్ బర్డ్స్‌గా మకావ్ నిలుస్తుంది. మన పరిభాషలో రామచిలుకల్లోని 350 వెరైటీల్లో ఇది కూడా ఒకటి. మకావ్ ప్యారెట్ అని కూడా పిలుస్తారు. ఈ పక్షి రూ.లక్ష నుంచి మొదలై దాదాపు రూ.2లక్షల పై చిలుకు ఉండే అత్యంత అరుదైన జాతి. వంద ఏళ్ల వరకూ జీవించడం దీని ప్రత్యేకతగా చెప్పొచ్చు. ధ్వనులను, మనుషుల గొంతులను, మాటలను అనుకరించగల సామర్థ్యం వీటి సొంతం.

ఆస్ట్రేలియా మూలాలున్న జీబ్రా ఫించ్

అందమైన ఎరుపు ముక్కు, నలుపు, తెలుపు తోక, బూడిద, పసుపు ఈకలతో, జీబ్రా ఫించ్ చూడగానే ఆకట్టుకుంటాయి. పరిసరాలకు సంగీత స్పర్శను జోడించే శ్రావ్యమైన స్వరాలను అందిస్తాయి. భాగస్వామితో కలిసి జీవించడానికి ఇష్టపడతాయి. వీటితో మాట్లాడినా, లేదా ఈల వేసినా ప్రతిస్పందిస్తాయి. తరచూ యజమానులను కిచకిచలు, బీప్‌లతో పలకరిస్తాయి. జంట పక్షులు ధర రూ.2500 నుంచి రూ.3500 వరకూ ఉన్నాయి.



సన్ కొన్యూర్

నార్త్ అమెరికా, వెనిజులా, బ్రెజిల్ వంటి దేశాల్లో విరివిగా కనిపించే ఈ సన్ కొన్యూర్ పక్షుల జత దాదాపు రూ.40వేలకు పైమాటే. ఒకటి కావాలంటే రూ.25వేలకు పైనే ఉంటుంది. అత్యంత ఆకర్షణీయమైన రూపం దీని సొంతం. దాదాపు పాతికేళ్ల పైనే జీవిత కాలం ఉండడం మరో ప్రత్యేకత.

హైసింత్ మాకాస్

ఇదొక అద్భుతమైన కోబాల్ట్ బ్లూబర్డ్. ఆకట్టుకునేలా దాదాపు ఒక మీటరు సైజు కలిగి ఉండే పెద్ద పక్షి. ఇది సాధారణంగా జంతుప్రదర్శనశాలలలో కనిపిస్తుంది. అయితే ఈ ఆకర్షణీయమైన పక్షిని ఇంటిలో తోడుగా పెంచుకునేందుకు అవకాశం ఉంది. హైసింత్ మాకా మనతో మంచి సంబంధాలను ఏర్పరుచుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

హౌస్ స్పారో



ఇవి సాధారణంగా మనకు గతంలో ఎక్కడ పడితే అక్కడ కనిపించేవి. కానీ ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. వీటినే మనం చిలకలుగా కూడా వ్యవహరిస్తాం. వీటిని రెండింటి జతగా కొనుగోలు చేస్తే రూ.300 వరకూ ఉంటుంది. వీటిని పెంచుకోడానికి కాకుండా స్వేచ్ఛగా వదిలేయడానికి ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అలా వీటికి స్వేచ్ఛని ఇవ్వడం ద్వారా మంచి జరుగుతుందని నమ్ముతారు.

పక్షులను బందిఖానాలో ఉంచడం వాటికి హానికరం. పోషకాహార లోపం, అనుచిత వాతావరణం, ఒంటరితనం నిర్బంధంలో ఒత్తిడి వంటి సమస్యలకు దారితీస్తుంది. పక్షులు ఎగురుతూ ఇతర పక్షులతో కలిసి జీవించాలి.

కొన్ని సూచనలు..

- పేరున్న పక్షి రకాల కోసం పెద్ద ఖర్చు, సరైన జాగ్రత్తలు, డైట్ ఏర్పాట్లు అవసరం.
- చాలా వరకూ పక్షులు 'జంట'గా మాత్రమే జీవించడానికి ఇష్టపడతాయి. దీనిపై ముందస్తు అవగాహన అవసరం.
- కొత్తగా పక్షులను ఇంట్లో పెంచుకోవాలనుకునే వారికి తొలిదశలో బడ్జీలు, లవ్ బర్డ్స్ మొదలైనవి సులభమైన ఎంపిక.
- పెంపుడు పక్షులైనప్పటికీ కొన్నింటిని పంజరంలో ఉంచడం సరైంది కాదు.



వెడ్డింగ్ డిజైనర్ కలెక్షన్..

సాక్షి, సిటీ బ్యూరో: అంతర్జాతీయ డిజైనర్‌గా పేరొందిన గౌరవ్ గుప్తా ఆగస్టులో తన ఇండియన్ కౌచర్– 2025 కలెక్షన్ పేరిట రూపొందించారు. 'క్వాంటమ్ ఎంటాంగ్లిమెంట్' పేరిట రూపొందిన ఈ కలెక్షన్ నగర మార్కెట్‌లోకి విడుదల చేశామని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కలెక్షన్ భారతీయ వివాహ వేడుకలను దృష్టిలో ఉంచుకుని రూపొందిందని, ప్రీ వెడ్డింగ్ పార్టీస్ నుంచి రిసెప్షన్ వరకూ భిన్న సందర్భాలకు అనువుగా వీటిని తీర్చిదిద్దామని ఈ సందర్భంగా గౌరవ్ తెలిపారు. శారీగౌన్లు, లెహంగాలు, 200 రోజులకు పైగా బనారస్ ఫ్యాబ్రిక్ ఉపయోగించి చేతితో నేసిన బ్రోకేడ్‌లు, క్రిస్టల్ వెబ్‌లు, హ్యాండ్–కట్ ఫ్లోరల్స్, గిల్డెడ్ జరీ, పురాతన ఆభరణాల–స్ఫూర్తితో ఎంబ్రాయిడరీ వంటి విశేషాలెన్నో ఈ కలెక్షన్‌లో ఉన్నాయని వివరించారు. ఈ కలెక్షన్ నగరంలో ఎంపిక చేసిన స్టోర్స్‌లో అందుబాటులో ఉంటుందన్నారు.

ఆయనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ఉద్యోగ విరమణ అనంతరం విశ్రాంతి తీసుకోకుండా సామాజిక బాధ్యతను బుజాలపై వేసుకున్నాడు.. అందరిలా తీర్థయాత్రల్లో.. దైవ చింతనో.. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో కాలక్షేపానికో ప్రాధాన్యతనివ్వకుండా.. యువతను సన్మార్గంలో నడిపేందుకు ప్రతినబూనాడు.. యోగా, కత్తిసాము, కర్రసాము వంటి ప్రాచీన యుద్ధ కళల్లో విద్యార్థులకు శిక్షణనిస్తూ సమాజాభివృద్ధికి తన వంతు పాత్రను పోషిస్తున్నాడు. ఆయనే సీతాఫల్‌మండికి చెందిన దేశబోయిన జయరాజ్ అనే విశ్రాంత ఉపాధ్యాయుడు. - సికింద్రాబాద్

'స్టీలేజ్ ఉత్సవం'

ఆభరణాల భద్రతపై అవగాహన కోసం..



సాక్షి, సిటీబ్యూరో: ఫిజికల్ సెక్యూరిటీ సొల్యూషన్స్ రంగంలో అంతర్జాతీయంగా పేరొందిన గన్నేబో సంస్థ బిఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేసిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) సర్టిఫైడ్ సేఫ్స్, స్ట్రాంగ్ రూమ్ డోర్లు, లాకర్ల గురించి నగరవాసుల్లో అవగాహన పెంపొందించడానికి 'స్టీలేజ్ ఉత్సవం' పేరుతో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. నగరంతో పాటు దేశవ్యాప్తంగా 100కి పైగా నగరాల్లో దీనిని నిర్వహిస్తున్నామని, బిఐఎస్ ధృవీకరించిన భద్రతా ఉత్పత్తుల వినియోగ ప్రాముఖ్యతను తెలియజెప్పడమే 'స్టీలేజ్ ఉత్సవం' ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రచారం ద్వారా గన్నేబో సంస్థ, ఆభరణాలను నిల్వచేసే వారికి, ప్రదర్శించే వ్యాపారులకూ సరైన భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంచడం ద్వారా సరైన సేఫ్స్, స్ట్రాంగ్ రూమ్ డోర్లు, అధిక భద్రత కలిగిన లాక్స్ ఎంచుకునేలా చేస్తుందన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మార్కెటింగ్, ప్రొడక్ట్ మేనేజ్మెంట్ హెడ్ అనిర్బన్ ముఖుతి పాల్గొని మాట్లాడారు.

అవిశ్రాంత ఉపాధ్యాయుడు..
యోగా సాధకుడు..



విద్యార్థులకు ఉచిత శిక్షణే దినచర్య

- కర్రసాము, కత్తిసాములోనూ నైపుణ్యాలు
- ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక బాధ్యతగా
- పలు సంప్రదాయ క్రీడల్లో యువతకు తర్ఫీదు
- ఆదర్శం జయరాజ్ మాస్టారు ప్రస్థానం

ఉద్యోగ విమరణ అనంతరం.. సహజ జీవనశైలికి భిన్నంగా తన వంతు పాత్రను పోషిస్తున్నాడు.. 32 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించినా సంతృప్తి చెందలేదు.. ఇంకా ఏదో సాధించాలన్న తపన. ఎందరో విద్యార్థులకు పాఠాలు బోధించినా.. మరికొంత మందికి చేరువవ్వాలనే సత్సంకల్పంతో ముందుకు కదులుతున్నాడు జయరాజ్ మాస్టార్. ఉద్యోగ విరమణ చేసి ఎనిమిదేళ్లు గడుస్తున్నా.. ప్రతినిత్యం ఏదో ఒక పాఠశాలను ఎంచుకుని రెండు గంటల పాటు తరగతులు తీసుకోవడం.. వారికి పలు అంశాల్లో అవగాహన కల్పించడమే ఆయన నిత్యకృత్యం.

యోగాలో ప్రత్యేక శిక్షణ..

జయరాజ్ ఆర్య.. తెలుగు, సోషల్ టీచరే కాదు దశాబ్దాల అనుభవం గడించిన యోగా మాస్టారు కూడా. అనేక మందికి ఉచిత యోగా క్లాసులు అందించిన ఘనత ఆయనది. నగరంలోని బాలలకు యోగ తరగతులు నిర్వహిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. ఎల్‌కేజీ మొదలు అన్ని తరగతుల విద్యార్థులకూ యోగాలో శిక్షణ ఇవ్వడం ఆయనకు దినచర్య.

ప్రాచీన యుద్ధ కళల్లో..

కర్రసాము, కత్తిసాము, ఏకపాత్రాభినయం వంటి ప్రాచీన యుద్ధ కళలో నైపుణ్యం సాధించిన జయరాజ్.. శిక్షణనివ్వడంలోనూ అందెవేసిన చెయ్యే. యోగాతోపాటు విద్యార్థులకు కర్రసాము, కత్తిసాము నేర్పిస్తున్నారు. వీటితోపాటు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు తెలుగు పద్యాలు, ఏకపాత్రాభినయంలో తర్ఫీదునిస్తున్నారు.



11 రోజుల దీక్షలు..

అభిరుచి, ఆసక్తిని బట్టి విద్యార్థులను ఎంపిక చేసుకుని వేసవి సెలవుల్లో వారికి ఆర్యసమాజంలో 11 రోజుల వేసవి దీక్షను కొనసాగిస్తున్నారు. సదరు విద్యార్థులు 11 రోజుల (పగలు, రాత్రి) పాటు ఆర్యసమాజంలోనే ఉండే విధంగా బస, ఆహారం వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. వారితోపాటే ఆయన కూడా అక్కడే బసచేసి పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర ఆహారం, వ్యాయామం, చదువుపట్ల ఏకాగ్రత, సమాజంలోని మంచీచెడులు వంటి అంశాలపై అవగాహన కలిగిస్తున్నారు.



నాన్న స్ఫూర్తితో..

మా నాన్న ఆర్యసమాజ సేవకుడు. మా ఇంటి సమీపంలోనే ఆర్యసమాజ భవనం ఉండేది. నాన్నతో వెళ్లి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలకు ఆకర్షితుడినయ్యాను. సమీపంలోని సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం.. యాదృచ్ఛికంగా చదువుకున్న పాఠశాలలోనే ఉపాధ్యాయుడిగా సర్వీసు మొత్తంలో ఎక్కువ కాలం పనిచేశా. పలు సామాజిక అంశాల పట్ల చిన్నతనం నుండే అవగాహన కలిగింది. ప్రస్తుతం మేడిబావిలోని ఆర్యసమాజానికి సంయోజకుడిగా పనిచేస్తున్నాను. 2017లో ఉద్యోగ విరమణ చేశాను. అప్పటి నుంచి విద్యార్థులకు యోగా, వ్యాయామం, కత్తిసాము, కర్రసాములో తర్ఫీదునిస్తున్నాను.

– జయరాజ్ ఆర్య, విశ్రాంత ఉపాధ్యాయుడు

మనిషి మెదడు వృద్ధాప్యంలో కుచించుకుపోతుంది. జ్ఞాపకశక్తి సన్నగిల్లుతుంది. అయినప్పటికీ, 'సూపర్ ఏజర్స్' అని శాస్త్ర పరిశోధకులు పేర్కొంటున్న కొందరిలో అలా జరగటం లేదు! ఎనభై ఏళ్ల వయసు దాటినా, వారి మెదడు చురుగ్గా పనిచేస్తుంటుంది. మనుషుల్ని చక్కగా గుర్తు పడతారు. 30 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలు సైతం చెరిగిపోకుండా ఉంటాయి. అల్జీమర్స్‌తో వచ్చే మతిమరుపు, విశ్లేషణాత్మక శక్తి తగ్గడం వంటివి వారిలో లేవు. అసలు ఇదెలా సాధ్యం?! ఈ ప్రశ్నకు సమాధానంగా చికాగోలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ పరిశోధకురాలు టామర్ గెఫెన్ పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. అల్జీమర్స్ అసోసియేషన్ జర్నల్. 'అల్జీమర్స్ - డిమెన్షియా' తన తాజా సంచికలో ఆ వివరాలను ప్రచురించింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



సూపర్ ఏజర్.. వీళ్ల జ్ఞాపకశక్తీ సూపర్

టామర్ గెఫెన్.. చికాగోలోని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 'మెసులమ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాగ్నిటివ్ న్యూరాలజీ అండ్ అల్జీమర్స్ డిసీజ్' విభాగంలోని 'సైకియాట్రీ అండ్ బిహేవియరల్ సైన్సెస్'లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ 'సూపర్ ఏజింగ్ ప్రోగ్రామ్'లో ఆమె బృందం పరిశోధనలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఆ ప్రోగ్రామ్‌లో 113 సూపర్ ఏజర్‌లపై అధ్యయనం జరుగుతోంది. వీరిలో 80 మంది సూపర్ ఏజర్‌లు.. గత 25 ఏళ్లలో ఈ కార్యక్రమానికి తమ మెదడు కణజాలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ కణజాలాలపై జరిగిన పరిశోధనలు తాజాగా మెదడు గురించి కొన్ని అద్భుతమైన ఆవిష్కరణలు చేశాయి. విశేషం ఏమిటంటే ఈ సూపర్ ఏజర్‌లలో గుండె జబ్బులు, మధుమేహం ఉన్నవారు కూడా ఉండటం!

300 మందిపై పరిశోధన

నార్త్‌వెస్టర్న్ కార్యక్రమంలో సూపర్ ఏజర్‌గా ఉండటానికి, ఒక వ్యక్తి 80 ఏళ్ల పైబడి ఉండాలి. మంచి గ్రాహకశక్తి కలిగి ఉండాలి. రోజువారీ సంఘటనలను, వ్యక్తిగత చరిత్రను గుర్తుంచుకునే సామర్థ్యం ఉండాలి. 50 లేదా 60 ఏళ్ల వయసులోని సాధారణ వ్యక్తుల కంటే కూడా మెరుగైన ధారణ శక్తి ఉండాలి. అలాంటి వారిలో గత 25 ఏళ్లలో 300 సూపర్ ఏజర్‌లపై గెఫెన్ బృందం అధ్యయనం జరిపింది.

పెద్దవిగా... ఎంటోర్హినల్ కార్టెక్స్!

సూపర్ ఏజర్ మెదడులోని 'ఎంటోర్హినల్ కార్టెక్స్'లోని కణాలు పెద్దవిగా, ఆరోగ్యకరంగా ఉన్నాయి. జ్ఞాపకశక్తి, అభ్యాసానికి శక్తి జనింపజేసే ప్రాంతమే ఈ ఎంటోర్హినల్ కార్టెక్స్. ఇవి హిప్పోక్యాంపస్‌తో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయి. అల్జీమర్స్ వ్యాధి ప్రభావం మెదడులో మొదట ఎంటోర్హినల్ కార్టెక్స్ పైనే పడుతుంది. అయితే ఆ కార్టెక్స్ సూపర్ ఏజర్‌లలో బలంగా ఉంది. కార్టెక్స్‌లోని కణాల ప్రతి పొర కూడా భారీగా, బొద్దుగా, చెక్కుచెదరకుండా ఉంది.

మందంగా.. సింగ్యులేట్ కార్టెక్స్!

యాభై, అరవై ఏళ్ల వారితో పోల్చి చూసినప్పుడు ఏకాగ్రతకు, ప్రేరణకు, గ్రాహ్యతకు కారణమైన 'సింగ్యులేట్ కార్టెక్స్' అనే మెదడు నిర్మాణం సూపర్ ఏజర్‌లలో మందంగా ఉండటాన్ని పరిశోధకులు గమనించారు. అలాగే, మెదడులో జ్ఞాపకశక్తికి కేంద్రమైన హిప్పోక్యాంపస్‌లోని 'టౌ టాంగిల్స్', తక్కిన వారితో పోల్చినప్పుడు సూపర్ ఏజర్‌లలో మూడు రెట్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. టౌ అనేది ఒక ప్రొటీన్. ఆ ప్రొటీన్ల అసాధారణ నిర్మాణం అల్జీమర్స్ ముఖ్య సంకేతాలలో ఒకటి. సూపర్ ఏజర్‌లలో టౌ టాంగిల్స్ తక్కువగా ఉన్నాయి కనుక వారి జ్ఞాపకశక్తి క్షీణించకుండా స్థిరంగా ఉంది.

అదృష్టమా? జన్యువులా?!

జన్యువులు.. దీర్ఘాయుషు, వృద్ధాప్యం, కణాల మరమ్మతు, జ్ఞాపకశక్తి వంటి అనేక అంశాలలో కీలకమైన పాత్ర పోషిస్తాయి. కానీ, సూపర్ ఏజర్‌లలో వారి అద్భుత జ్ఞాపకశక్తికి కారణం జన్యువులో, అదృష్టమో తేల్చుకోలేకపోయింది గెఫెన్ బృందం. ఇది తేల్చడానికి మరికొన్ని పరిశోధనలు, మరికొంత సమయం అవసరం కావచ్చు.

సూపర్ ఏజర్‌ల ప్రత్యేకతలు

టామర్ గెఫెన్ బృందం సూపర్ ఏజర్‌లలో ప్రధానంగా ఈ కింది లక్షణాలను, స్వభావాలను గుర్తించింది.

- సామాజిక సంబంధాలలో మెరుగ్గా ఉన్నారు.
- కమ్యూనిటీ పనులలో చురుగ్గా పాల్గొంటున్నారు.
- స్నేహాలకు, బంధాలకు విలువిస్తున్నారు
- స్వేచ్ఛ, స్వతంత్ర భావన కనిపించాయి.
- సలహాలు అడగరు. తామే నిర్ణయాలు తీసుకుంటారు.
- తమకు ఇష్టమైనట్లు జీవిస్తున్నారు.

ఎనభై దాటినా యాభైలో ఉన్నట్లే!

ఏళ్ల నాటి సంగతులూ మర్చిపోలేదు

మెదడా, లేక మంత్ర తంత్రమా!

పాతికేళ్లుగా శాస్త్రవేత్తల పరిశోధనలు

తక్కువగా... మైక్రోగ్లియా కణాలు!

గెఫెన్ బృందం సూపర్ ఏజర్స్ మెదడులోని నొప్పి, వాపునకు ప్రభావితం అయ్యే కణ వ్యవస్థను కూడా పరిశీలించింది. వారిలో మెదడు పని చేయటానికి అవసరమైన మైక్రోగ్లియా కణాలు తక్కువ క్రియాశీలకంగా ఉన్నాయి. అంటే మైక్రోగ్లియా స్థాయిలు సూపర్ ఏజర్‌లలో 30, 40, 50 ఏళ్ల వ్యక్తులలో ఉన్నట్లే తక్కువగా ఉన్నాయి. దీనర్థం సూపర్ ఏజర్‌ల మెదడులో వ్యాధికారకాలు తక్కువగా ఉన్నాయని.

వైభవంగా శ్రావణ పౌర్ణమి గరుడసేవ



తిరుమల: తిరుమలలో శనివారం రాత్రి శ్రావణ పౌర్ణమి సందర్భంగా గరుడ వాహన సేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, బోర్డు సభ్యుడు డాలర్స్ దివాకర్‌రెడ్డి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

శోభాయమానం... తొలి తెప్పోత్సవం

రాఘవేంద్రునికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ



మంత్రాలయం: రాఘవేంద్రస్వామి 354వ సప్త రాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వైభవంగా వేడుకలు సాగాయి. సూర్యాస్తమయ సమయాన ఉత్సవమూర్తి తొలి తెప్పోత్సవం శోభాయమానంగా జరిగింది. రాఘవేంద్రస్వామి మూల బృందావనం నుంచి ఉత్సవమూర్తి మేళతాళాలతో శ్రీమఠం నుంచి బయలుదేరారు. శ్రీమఠం ఈశాన్య భాగంలో రూ.1.90 కోట్లతో బెంగళూరుకు చెందిన ఆశా, ప్రకాష్ దంపతుల సహకారంతో నిర్మించిన పరిమళ తీర్థం పుష్కరిణికి చెంతకు చేరుకున్నారు. అక్కడ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పరిమళ తీర్థానికి పూజలు గావించి ఉత్సవమూర్తిని తెప్పపై కొలువుంచారు. ఉత్సవమూర్తికి పుష్పార్చనలు, హారతులు పట్టి తెప్పోత్సవానికి అంకురార్పణ పలికారు. పుష్కరిణి చుట్టూ వేలాది భక్తుల నడుమ వేద ఘోషలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలు విహరించారు.

టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ

ఉత్సవాల్లో ఆనవాయితీలో భాగంగా తిరుమల వెంకన్న పట్టువస్త్రాలను రాఘవేంద్రస్వామికి సమర్పించారు. శనివారం టీటీడీ ఆలయ ఏఈవో రామకృష్ణ దంపతులు పట్టువస్త్రాలతో శ్రీమఠం చేరుకోగానే పీఠాధిపతి శాస్త్రోక్తంగా వాటిని స్వీకరించి శిరస్సున ఉంచుకుని రాఘవేంద్రుల గర్భాలయం చేరుకున్నారు. అక్కడ రాఘవేంద్రుల మూల బృందావనంతో పట్టు వస్త్రాలకు విశేష పూజలు గావించారు. అనంతరం ఊంజల్ మంటపంలో ఏఈవోకు పీఠాధిపతి సన్మానం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు





ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ తుహిన్ కుమార్, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నంద




తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ తుహిన్ కుమార్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అలాగే జస్టిస్ తుహిన్ కుమార్ తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

– తిరుమల /చంద్రగిరి

నాకంటే మేధావి ఇక్కడ ఎవరున్నారు?

సీఎం చంద్రబాబు నాయుడు



సాక్షి, విశాఖపట్నం/పాడేరు: ''ఇక్కడ నాకంటే మేధావి ఎవరున్నారు? ఎవరూ లేరు. నేను ముందుచూపుతో ఆలోచిస్తా. జీవో నంబర్ 3 విషయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడతారా? దివంగత ఎన్టీఆర్ తర్వాత గిరిజనులకు ఉద్యోగాలిచ్చింది నేనే. గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు తీసుకొచ్చి డోలీ మోతలు లేకుండా చేశా. ఏజెన్సీ ఇంతలా అభివృద్ధి చెందిందంటే అది నావల్లే అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి'' అని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం అల్లూరి జిల్లా పాడేరు మండలం వంజంగిలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ''రాయ్‌పూర్-విశాఖపట్నం సహా ఏజెన్సీకి జాతీయ రహదారులు తీసుకొచ్చా. ఏజెన్సీలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటున్నా. పీఎం సూర్యఘర్ పథకాన్ని నేనే అందిస్తున్నా. జల్ జీవన్ మిషన్ ద్వారా టీడీపీ ప్రభుత్వం ఇంటింటికీ ఉచితంగా తాగునీరు ఇస్తోంది. పాడేరులో ప్రభుత్వ మెడికల్ కాలేజీని త్వరలోనే పూర్తి చేస్తాం. గిరిజన మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తాం.'' అని పేర్కొన్నారు.

ఫస్ట్ స్టేజ్.. టార్గెట్ లక్ష!

మెడికల్, దివ్యాంగ పింఛన్ల భారం తగ్గించుకునేలా కూటమి సర్కారు స్కెచ్

సాక్షి, అమరావతి: ఏపీలో తొలి విడతలో లక్ష మంది మెడికల్, దివ్యాంగ పింఛన్‌దారుల భారం తగ్గించుకునేలా కూటమి సర్కారు పన్నాగం పన్నింది. ఒకేసారి అంత మందికి పింఛన్ తొలగిస్తే అలజడి రేగుతుందని వ్యూహాత్మక ఎత్తుగడలతో కుట్ర అమలుకు ఉపక్రమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఏళ్ల తరబడి నెలనెలా పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల్లో అనర్హుల గుర్తింపు పేరిట ప్రత్యేక కార్యక్రమం మొదలు పెట్టింది. మొదటి విడతలో.. కదలలేని స్థితిలో లేక మంచానికే పరిమితమై ఉండే పెరాలసిస్, తీవ్ర కండరాల బలహీనత తరహా రోగులకు అందజేసే మెడికల్ పింఛను లబ్ధిదారులతో పాటు దివ్యాంగుల లబ్ధిదారులు కలిపి మొత్తం 8.18 లక్షల మందికి వారి పింఛను అర్హతను నిర్ధారించేందుకు వైద్యుల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీరిలో దాదాపు 7 లక్షల మందికి నిర్ధారణ పరీక్షలకు హాజరు కావాలంటూ నోటీసులు ఇవ్వగా 17 వేల మంది మినహా మిగతా వారికి పరీక్షలు పూర్తయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నోటీసులు అందుకుని కూడా పరీక్షలకు హాజరు దాదాపు ఆ 17 వేల మందికి ఆగస్టు 1న పింఛను డబ్బుల పంపిణీ కూడా నిలిపివేశారు. వీరికి మరోసారి నోటీసులు ఇచ్చి, అప్పటికీ వైద్య పరీక్షలకు హాజరు కానిపక్షంలో వారి పింఛను పూర్తి స్థాయిలో తొలగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా.. మెడికల్, దివ్యాంగుల కోటాలో పింఛన్లు తీసుకుంటున్న మొత్తం 8.18 లక్షల మందికి సెప్టెంబర్ నాటికి పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ తర్వాత వారిలో వికలత్వ శాతం 40 కంటే తక్కువగా చూపి.. కొంత మంది పింఛన్‌ను రద్దు చేయనున్నట్లు తెలిసింది. వీరిలో 60 ఏళ్లు పైబడిన వారికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. మిగతా వారిలో కూడా వికలత్వ శాతాన్ని తగ్గించి.. ఆ మేరకు పింఛన్ల కేటగిరి మార్చనున్నారని అధికార వర్గాల సమాచారం. అంటే రూ.15 వేల పింఛన్ తీసుకుంటున్న వారికి రూ.10 వేలు.. రూ.10 వేలు తీసుకుంటున్న వారికి రూ.6 వేల పింఛన్‌కు మార్చడం అన్నమాట. ఇలా పింఛన్ లబ్ధిదారుల తొలగింపు, కేటగిరీల మార్పులు లక్ష వరకు ఉంటాయని సమాచారం.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి ప్రభుత్వం

- ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తుండటం దారుణం
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు
- వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా అడ్డగించిన పోలీసులు



ఎలక్షన్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వైఎస్సార్ జిల్లా పులివెందుల రూరల్ మండల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తుండటం దారుణమని వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్క జెడ్పీటీసీ స్థానంలో ఎన్నికలు నిర్వహించడంలో యంత్రాంగం ఘోర వైఫల్యం చెందిందని మండి పడింది. దౌర్జన్యాలు, దాడులపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోరా? అని నిలదీసింది. పులివెందుల రూరల్ జెడ్పీటీసీ ఉప ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించాలని కోరుతూ ఆ పార్టీ ప్రతినిధి బృందం శనివారం ఎన్నికల కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు పేర్ని నాని, మేరుగ నాగార్జున, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, రమేష్‌కుమార్ యాదవ్, సూర్యనారాయణ రాజు, మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, సుధాకర్ బాబు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులను పోలీసులు బయటే ఆపేయడంతో తోపులాట జరిగింది. దీంతో వారంతా కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఇంత దుర్మార్గం ఎక్కడా చూడలేదని నిప్పులు చెరుగుతూ వాగ్వాదానికి దిగారు. 'ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి.. పోలీసుల దౌర్జన్యం నశించాలి.. ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణి విడనాడాలి..' అని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో వారిని వినతిపత్రం అందజేసేందుకు పోలీసులు అనుమతించారు. పోలింగ్ బూత్‌లు మార్చడానికి వీల్లేదని, బైండోవర్ కేసులు పెట్టి కనిపించకుండా దాచిన వైఎస్సార్‌సీపీ నాయకులను విడుదల చేయాలని, సీసీ కెమెరాలు, వెబ్ క్యాస్టింగ్ చేయాలని వారు ఎన్నికల కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఆటవికం.. అరాచకం

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక వేళ చంద్రబాబు పోలీసు యంత్రాంగం దమనకాండ

- పిండారీలు, కాలకేయులను తలదన్నే రీతిలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ మూక దాడి
- పెళ్లి వేడుకలో ఉన్న సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డిపై దాడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో గెలిచేందుకు ఎన్ని అడ్డదారులు ఉన్నాయో.. అన్నింటినీ ఉపయోగించినా ఫలితం కనిపించక పోవడంతో టీడీపీ పెద్దలు ఇదివరకెన్నడూ లేని విధంగా అరాచకానికి తెరలేపారు. పిండారీలు, కాలకేయులు, బందిపోట్లను తలదన్నే రీతిలో టీడీపీ మూక వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం నల్లగొండువారిపల్లెలో అత్యంత క్రూరంగా, కిరాతకంగా చేసిన దాడిలో.. తీవ్రంగా గాయపడి, ఒంటి నిండా రక్తమోడుతూ ప్రాణంతో బతికి బట్టకట్టిన బాధితుడినే ప్రథమ (ఏ1) నిందితుడిగా చేస్తూ మరో 50 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులో తొమ్మిది మందిని శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు.. శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఇదే కేసులో పులివెందుల మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులను ఇరికించి, అరెస్టు చేసి.. జెడ్పీటీసీ ఉప ఎన్నిక పోలింగ్ రోజున వారిని లేకుండా చేయాలన్నదే ముఖ్యనేత ఎత్తుగడ. కానీ.. అత్యంత కిరాతకంగా క్రూరంగా హత్యాయత్నానికి తెగబడ్డ టీడీపీ కాలకేయులు కళ్లెదుటే తిరుగుతున్నా, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై యథేచ్ఛగా దాడులు చేస్తున్నా.. వారి వైపు పోలీసులు కన్నెత్తి కూడా చూడటం లేదు. చంద్రబాబు పోలీసు యంత్రాంగం సాగిస్తున్న ఈ ఆటవిక, అరాచకానికి పులివెందుల వేదికైంది. టీడీపీ మూక పాశవికంగా చేసిన దాడిలో.. తీవ్రంగా గాయపడి, ప్రాణాలతో బయట పడిన వేల్పుల రాము (రామలింగారెడ్డి)ను పోలీసులు ఏ-1గా చేరుస్తూ ఏకంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. జరగని ఘటనలు జరిగినట్లు.. కళ్లెదుట కన్పిస్తున్న వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరిస్తూ.. పోలీసు యంత్రాంగం అరాచకం సృష్టిస్తోంది. టీడీపీ మూక దాడిలో తల పగిలి వేల్పుల రాము శరీరంపై రక్తపుధారలు కారుతున్న దృశ్యాలు సస్యాక్ష్యంగా కన్పిస్తున్నా.. వైఎస్సార్‌సీపీ నేతలకు రక్తపు గాయాలు ఏమీ కాలేదని, తాము స్పందించకపోయి ఉంటే వారి తలలు ఎగిరిపోయేవని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలు పోలీసుల దమనకాండకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఉప ఎన్నిక గండం గట్టెక్కేందుకే అరాచకం

సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన 143 హామీలను అటకెక్కించడం.. రెడ్ బుక్ కుట్రలు, కుతంత్రాలతో టీడీపీ మూక రక్తపుటేరులు పారిస్తుండటం.. అవినీతి, అక్రమాలను వ్యవస్థీకృతం చేసి, నీకింత నాకింతా అంటూ చంద్రబాబు గ్యాంగ్ దోచుకుతింటుండటంతో 14 నెలల్లోనే టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతోంది. దాంతో ప్రజల దృష్టి మళ్లించడానికి ఎప్పటికప్పుడు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ చంద్రబాబు నెట్టుకొస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల గండం నుంచి గట్టెక్కేందుకు బరితెగించి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. పోలీసు యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలను తప్పుడు కేసులతో భయభ్రాంతులకు గురిచేశారు. భారీ ఎత్తున ప్రలోభపెట్టి లొంగదీసుకోవడానికి కుట్రలు చేశారు. కానీ ఆ కుట్రలు ఏవీ పారక పోవడంతో ముఖ్య నేత కనుసైగలతో పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు తెగబడుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పులివెందుల శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలు సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి



టీడీపీ మూకల దాడిలో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రామలింగారెడ్డి

(చంటి), అమరేష్‌రెడ్డి, నాగేష్, శ్రీకాంత్, తన్మోహన్‌రెడ్డిలపై టీడీపీ రౌడీ మూకలు హత్యాయత్నం చేశాయి. అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాషా (కిరికిరి బాషా) ముఠా దాడి చేసి వెళ్లిపోయింది. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఏమాత్రం పట్టించుకోలేదు. బుధవారం నల్లగొండువారిపల్లెలో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై బందిపోటు దొంగల ముఠా తరహాలో టీడీపీ రౌడీ మూకలు మెరుపు దాడి చేశాయి. ఒక్కసారిగా దాదాపు 100 మంది రాడ్లు, కర్రలు, ఇతర మారణాయుధాలతో వారిని చుట్టుముట్టి మట్టు బెట్టేందుకు యత్నించారు. వేల్పుల రామలింగారెడ్డి తలపై రాడ్డుతో కొట్టారు. దీంతో తల పగిలి ఆయన కింద పడిపోయారు. పక్కనే ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైనా అదే స్థాయిలో దాడి చేశారు. రమేష్ యాదవ్ తల తిప్పడంతో భుజంపై రాడ్ల దెబ్బలు పడ్డాయి. ఎమ్మెల్సీ రేంజ్ రోవర్, వేల్పుల రామలింగారెడ్డికి చెందిన ఫార్చ్యునర్, స్కార్పియో వాహనాలనూ సమ్మెటలతో ధ్వంసం చేశారు. రామలింగారెడ్డి ఉన్న ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించబోయారు. గ్రామస్తులు ప్రతిఘటించేందుకు సిద్ధమవడంతో రౌడీ మూకలు పారిపోయాయి. ఈ ఘటన చోటుచేసుకున్న ప్రాంతానికి సమీపంలోనే పోలీసులు ఉన్నప్పటికీ.. చూసి చూడనట్లు పట్టించుకోక పోవడం కుట్రకు నిదర్శనం. ఈ దాడి విషయమై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే దాడికి పాల్పడిన వారు పోలీసుల కళ్లెదుటే తిరుగుతున్నా పట్టించుకోకపోగా, బాధితులైన వైఎస్సార్‌సీపీ శ్రేణులపైనే కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకోవడం.. అరెస్టు చేయడం ప్రభుత్వ దమనకాండకు, దుర్మార్గానికి నిదర్శనంగా నిలుస్తోంది.

పరాకాష్టకు చేరిన అకృత్యాలు

అదే బుధవారం రోజున జరగని ఘటనను జరిగినట్టుగా టీడీపీ నేతలు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు మేరకు వేల్పుల రామును ఏ-1గా, హేమాద్రి రెడ్డిని ఏ-2గా చేర్చుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయడం గమనార్హం. ఈ కేసును అడ్డం పెట్టుకుని శుక్రవారం రాత్రి 12 మంది వైఎస్సార్‌సీపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. శనివారం ముగ్గురిని వదిలేసి.. మిగతా తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఇదే కేసులో పులివెందుల మండలంలో కీలకమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా ఇరికించి, అరెస్టు చేయడానికి పోలీసులు పావులు కదుపుతున్నారు. ఎన్నికల ప్రక్రియ నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులను తప్పించడానికే తప్పుడు ఫిర్యాదులు, అక్రమ కేసులు, అరెస్టుల కుట్రకు తెరతీశారన్నది స్పష్టమవుతోంది. చంద్రబాబు ఆదేశాలకు తలొగ్గుతూ పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని.. తమ రాజకీయ జీవితాల్లో ఇంతటి దుర్మార్గాలు ఎన్నడూ చూడలేదంటూ రాజకీయ పార్టీల నేతలు నివ్వెరపోతున్నారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలు జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో కీలకమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేస్తున్నారు. ఒక్క పులివెందుల మండలంలోనే శనివారం రాత్రి వరకు దాదాపు 150 మందిని బైండోవర్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూత్‌ల మార్పు

ఇన్నిన్ని అరాచకాలకు పాల్పడినా ఫలితమివ్వక పోవడంతో టీడీపీ నేతలు తాజాగా మరో కుట్రకు తెరలేపారు. ఉప ఎన్నికలో ఓటింగ్ శాతం తగ్గించి, లబ్ధి పొందాలనే కుట్రలకు పదును పెడుతున్నారు. ఏ గ్రామంలోని ఓటర్లు ఆ గ్రామంలోనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం లేకుండా అక్కడి ఓట్లు ఇక్కడికి, ఇక్కడి ఓట్లు అక్కడికి మార్చేస్తున్నారు. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె పంచాయతీలో 6, 7 నంబర్ల పోలింగ్ బూత్‌లు, నల్లగొండువారిపల్లెలో పోలింగ్ బూత్ 8, నల్లపురెడ్డిపల్లెలో 9, 10, 11 బూత్‌లు ఉన్నాయి. ఇది వరకు ఏ గ్రామానికి చెందిన ఓటర్లు ఆ గ్రామంలోని పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకునే వారు. తాజాగా ఎర్రబల్లె కొత్తపల్లె ఓటర్లు నల్లపురెడ్డిపల్లె బూత్‌లలో, నల్లపురెడ్డిపల్లె ఓటర్లు ఎర్రబల్లె కొత్తపల్లె బూత్‌ల పరిధిలోకి వచ్చేలా అధికారులు మార్చిడి చేశారు. ఓటర్ల పరిశీలన (వెరిఫికేషన్) సందర్భంగా ఈ విషయం బహిర్గతం కావడంతో పలువురు అవాక్కవుతున్నారు. ఓటు వేయాలంటే 4 కిలోమీటర్లు పక్క గ్రామంలోకి వెళ్లాల్సిన పరిస్థితి. దీన్ని ఆసరాగా చేసుకుని పోలింగ్‌ను ప్రభావితం చేయడానికి టీడీపీ స్కెచ్ వేసింది. ఓట్లు వేయకుండా అడ్డుకోవడం, లేదా రిగ్గింగ్ చేయడానికి ఈ ఎత్తుగడ వేశారు. పోలీసులు అండదండలతో పోలింగ్ బూత్‌లను తమ ఆధీనంలోకి తీసుకునేలా టీడీపీ రాక్షస వ్యూహం రచించింది. దీనికి పోలీసులు, అధికార వర్గాలు దన్నుగా నిలుస్తున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. పోలింగ్ బూత్‌లను మార్చవద్దని, యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేసింది. కానీ.. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటి వరకు స్పందించక పోవడం గమనార్హం.

• పరిపరిశోధన

సంతాన నియంత్రణకు మేల్ పిల్!



ఈ 'మాత్ర' సంతాన నియంత్రణలో ఓ విప్లవాత్మకమైన మేలి మలుపు. త్వరలో అందుబాటులోకి రాబోతున్న ఈ 'పిల్' కుటుంబ నియంత్రణలో ఒక మేలిమలుపు. ఇప్పటివరకూ సంతాన నియంత్రణ భారమంతా దాదాపు మహిళపైనే ఉండేది. సంతాన నియంత్రణ మాత్రలు ఆమెకే ఉండేవి. పురుషుడి విషయంలో కండోమ్, వాసెక్టమీ ఉన్నప్పటికీ వాటివాటి పరిమితులు వాటికి ఉన్నాయి. జెండర్ తేడాలు త్వరత్వరగా చెరిగిపోతున్న ప్రస్తుత ప్రపంచంలో పురుషులకూ సంతాన నియంత్రణ మాత్రలు రాబోతూ ఉండటం వల్ల... ఇప్పుడు మహిళలపై, వాళ్ల ఆరోగ్యాలపైనా, ఎంతోకాలంగా వాళ్లు మోస్తున్న భారం నుంచి విముక్తి దొరికేందుకు ఆస్కారముంది. ఇక అల్లంత దూరంలోనే పురుషులకూ సంతాన నియంత్రణ మాత్రలు కనిపిస్తూ ఉన్న నేపథ్యంలో వాటి వివరాలను పరికిద్దాం...

పురుషులు నోటి ద్వారా తీసుకునే ఈ సంతాన నియంత్రణ మాత్రలను ప్రస్తుతం 'వైసీటీ -529' అని పిలుస్తున్నారు. 'పిల్స్' చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్న ఆ మాత్రల విషయమేమిటో చూద్దాం.

వైసీటీ - 529 ప్రత్యేకత ఏమిటంటే...

'యువర్ ఛాయిస్ థెరప్యూటిక్స్' సంస్థ ఆధ్వర్యంలోకి రాబోతున్న ఈ సంతాన నియంత్రణ పిల్స్‌ను సంక్షిప్తంగా 'వైసీటీ – 529' అని పిలుస్తున్నారు. ఇదొక డైలీ పిల్. అంటే తమకు సంతానం వద్దనుకున్నంత కాలం పురుషుడు నోటి ద్వారా తీసుకోవాల్సిన మాత్ర ఇది.

గతంలోనూ పురుషులకూ సంతాన నియంత్రణ మాత్రల తయారీ కోసం కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అయితే అవన్నీ పురుష హార్మోన్ అయిన 'టెస్టోస్టెరాన్' పై పనిచేసేలా రూపొందించడంతో చాలా ప్రతికూలతలు కనిపించాయి. దాంతో అవన్నీ విఫలమయ్యాయి. ఆ అనుభవాల దృష్ట్యా రూపొందించిన ఈ మాత్రలు టెస్టోస్టెరాన్‌పై పనిచేయకుండా...ఇవి తెలివిగా మరో మార్గంలో పనిచేస్తాయి. అంటే వీర్యకణాలను పుట్టించేందుకు తోడ్పడే 'రెటినాయిడ్ యాసిడ్ రెసెప్టార్ ఆల్ఫా' అనే ప్రొటీన్‌ను మాత్రమే ఇవి అడ్డగిస్తాయి. ఫలితంగా పురుషుడి వృషణాలలో వీర్యకణాల ఉత్పత్తి ఆగిపోతుంది. దీనివల్ల ఆ మాత్ర ప్రభావం ఉన్నంత సేపు తాత్కాలికంగా వీర్యకణాలు తయారుకావు. అంతేతప్ప... ఈ పిల్ వల్ల పురుషుడిలో వాంఛలూ, కోరికలూ, సామర్థ్యాలు అన్నీ యథాతథంగా ఉంటాయి. పురుషులలో స్రవించే హార్మోన్ అయిన టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలూ ఉండవు.

ఎంత వరకు సురక్షితం?

పైన పేర్కొన్న అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఇదెంతో సురక్షితమైన పిల్. ఇప్పటి వరకూ నిర్వహించిన వైద్యపరీక్షలూ, చేసిన ట్రయల్ రన్స్... వీటన్నింటిలోనూ ఇదెంతో సేఫ్ అని తేలింది. డిసెంబరు 2003 నాటి నుంచి జూన్ 2025 దాదాపు ఈ ఏడాదిన్నర కాలంలో ఆరోగ్యవంతులైన వ్యాసెక్టమీ చేయించుకున్న 16 మంది యువకులపై దీన్ని ప్రయోగించి చూశారు. (తమ పార్ట్‌నర్‌కు అవాంఛిత గర్భం రాకుడదనే ఉద్దేశంతో వ్యాసెక్టమీ అయిన పురుషులను తొలి అధ్యయనాల కోసం ఎంపిక చేసుకున్నారు). వాళ్లకు పిల్‌ను 180 ఎంజీ మోతాదులో ఇస్తూ వాళ్లలో వీర్యకణాలను నిశితంగా పరిశీలిస్తూ వచ్చారు. తేలిన అంశమూ... విన వచ్చిన శుభవార్త ఏమిటంటే... వాళ్లలోని వాంఛలకూ, డ్రైవ్‌కూ, ఉత్సాహానికీ, మూడ్స్‌కూ ఏలాంటి లోపమూ రాలేదు. అంతా నార్మల్. అన్నీ బాగా ఉండటంతో పాటు అనుకున్న ఫలితమూ వచ్చింది. వాళ్లందరిలో వీర్యకణాల సంఖ్య సున్నా అయ్యింది.

పురుషుల్లో కుటుంబ నియంత్రణ పిల్ రావడాన్ని ఎందుకు విప్లవాత్మకమైన మార్పుగా చూస్తున్నామంటే...

ఇప్పటివరకూ యుటెరస్‌లో అమర్చే ఇంట్రా యుటెరైన్ డివైస్ (ఐయూడీ)లైనా, నోటి ద్వారా తీసుకునే పిల్స్ అయినా, హార్మోన్ ఇంజెక్షన్లయినా లేదా ఇతరత్రా ఏ మార్గాలైనా అవి మహిళల కోసమే తయారయ్యాయి / తయారవుతున్నాయి. మహిళల్లో చాలా సంక్లిష్టమైన ప్రక్రియల్లో జీవక్రియలు నిర్వహించే హార్మోన్లను ఈ కాంట్రసెప్టివ్స్ ప్రభావితం చేస్తుండటం వల్ల అవి మహిళల్లో అనేక రకాల ప్రతికూల ప్రభావాలను చూపుతుంటాయి. వాటి ప్రభావంతో కొందరు మహిళలు బరువు పెరగడం, వాళ్ల మూడ్స్ వేగంగా మారిపోతూ ఉండటం (మూడ్ స్వింగ్స్), జీవక్రియల్లో మార్పులతో ఇతరత్రా ప్రతికూల ప్రభావాలు కనిపిస్తుంటాయి.

ఇక పురుషులకూ కండోమ్, వ్యాసెక్టమీ అనే కుటుంబ నియంత్రణ మార్గాలు ఉన్నప్పటికీ కండోమ్ పూర్తిగా నూరు పాళ్లూ నమ్మదగినది కాదు. తెలియకుండానే ఏ టైమ్‌లోనైనా అది చిరగడం లాంటి అనర్థాలు జరిగినప్పుడు పార్ట్‌నర్‌కు అవాంఛిత గర్భం వచ్చే ప్రమాదం ఉంది. దాంతో తన ప్రమేయమూ, తప్పూ లేకుండానే మహిళా పార్ట్‌నర్‌పై గర్భధారణ భారం పడుతుంది.

ఇక వ్యాసెక్టమీ అనేది కుటుంబ నియంత్రణకు పూర్తిగా శాశ్వత ప్రత్యామ్నాయం. పైగా పురుషులందరిలోనూ అది నూరు పాళ్లూ సక్సెస్ కాకపోవచ్చు. అందుకే పురుషుల్లో వారి లైంగిక ప్రేరణలకు కారణమయ్యే టెస్టోస్టెరాన్‌కు ఏ భంగమూ రాకుండా పిల్ తయారైతే... అది నూరుపాళ్లూ సేఫ్‌గా ఉండటంతో పాటు మహిళపైన ఉద్వేగపరమైనవీ, యాంగ్జైటీ వంటి మానసికమైనవి అయిన ఎన్నోరకాల భారాలను సంపూర్ణంగా తొలగిస్తుంది. అందుకే పురుషుల కోసం కూడా పూర్తిగా సురక్షితమైనదీ, నమ్మదగినదీ అయిన పిల్ కోసం ఎన్నో ఏళ్లుగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఎట్టకేలకు అదిప్పుడు దాదాపుగా సక్సెస్ అయ్యిందనే చెప్పవచ్చు.

తర్వాతి పరిశోధనలేమిటి...?

ఇప్పుడీ 16 మందిపై జరిగిన పరిశోధనలు పూర్తిగా విజయవంతం కావడంతో... ఇకపై మరో 50 మందిపై పరిశోధనలు నిర్వహించనున్నారు. 'లార్జ్ ఫేజ్ 1బి / 2ఏ' అనే ఈ అధ్యయనాలను ఈసారి వ్యాసెక్టమీ చేయని పురుషులపై నిర్వహిస్తారు. ఈసారి కొంత ముందుకెళ్లి ఈ రోజువారీ పిల్‌ను వాడినప్పుడు అది ఏ మేరకు స్పెర్మ్‌కౌంట్‌ను పూర్తిగా అదుపు చేసి గర్భం రాకుండా చూస్తుందనే అంశాన్ని పరిశీలిస్తారు. నిజానికి ఈ పిల్ తర్వాత రెండు రోజుల పాటు రక్షణ దొరికే అవకాశాలున్నప్పటికీ గర్భం రావడాన్ని నూరు పాళ్లు నివారించేందుకు ప్రతిరోజూ వాడాల్సి ఉంటుంది.

తర్వాత్తర్వాత దీని ప్రభావాన్ని మరింత పెంచుతూ... రానురానూ మరిన్ని పరిశీలనల తర్వాత దీన్ని రెండు రోజులకో సారి తీసుకోవాలా, మూడు రోజులకోమారు వాడాలా అనేది నిర్ణయిస్తూ, పిల్‌ను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలనేది పరిశోధకుల ఉద్దేశం.

పరిశోధన పూర్వరంగమేమిటీ, ఏ మేరకు పిల్ ప్రభావవంతం?

మానవులపై ప్రయోగించడానికి ముందర 'వైసీటీ-529' పిల్‌ను కోతులపైనా, ఎలుకలపైనా ప్రయోగించి చూశారు. పిల్ వాటిల్లో 99 శాతం ప్రభావవంతంగా పనిచేస్తూ వీర్యకణాలు పూర్తిగా లేకుండా చేసింది. తమ పురుష పార్ట్‌నర్‌తో కలిసిన ఆడ కోతులూ, ఆడ ఎలుకలకు గర్భం రాలేదు. పిల్స్ మానేశాక మళ్లీ కొద్ది వారాల్లోనే సంతానోత్పత్తి యథావిధిగా జరగడం మొదలైంది. ఏ లోపమూ రాలేదు.

చివరగా... ఇది కేవలం ఒక సరికొత్త పిల్ మాత్రమే కాబోదు. మహిళలూ, పురుషుల మధ్య సమానత్వానికి సంకేతం. మహిళల ఆరోగ్యాలను కాపాడుతూ, వాళ్లలోని హార్మోనల్ అసమతౌల్యాలను నివారిస్తూ... భవిష్యత్తులో మరెంతో మంది మైండ్ సెట్‌నూ, దృష్టికోణాలనూ సమూలంగా మార్చబోయే ఓ అద్భుతమైన ఔషధం కాబోతోంది ఈ పిల్.

– యాసీన్

కొద్ది రోజుల్లోనే అందు బాటులోకి రానున్న ఆశారేఖ ఇది...

పరిశోధనల్లో ఈ తదుపరి దశలూ విజయవంతమైతే... రానున్న కొన్నేళ్లలోనే... వీలైతే కొన్నాళ్లలోనే పురుషులకూ నమ్మదగిన, సురక్షితమైన, ఒక సింపుల్ పిల్ సంతాన నియంత్రణ కోసం చాలా త్వరలోనే అందుబాటులోకి రానుంది. దాంతో ఇక కాంట్రసెప్టివ్ భారమనేది పూర్తిగా మహిళపైనే పడకుండా... ఇకపై మహిళలతో పాటు పురుషులూ ఆ భారాన్ని సమంగా పంచుకోనున్నారు.

• స్ఫూర్తి

ఈ ఇల్లు ఎవరిదో తెలుసా?

ఆలనాపాలనా లేకుండా శిథిలమైన ఆ భవనం భూత్ బంగ్లాను తలపించి భయపెడుతుంది.

ఎవరూ పట్టించుకోని ఈ భవనం ఒకప్పుడు కష్టాల్లో ఉన్న ఎంతోమంది అమ్మాయిలను పట్టించుకుంది. ఆశ్రయమిచ్చి దారి చూపింది. మద్రాస్‌కు చెందిన వైద్యురాలు, సంఘసంస్కర్త, రచయిత్రి,





బ్రిటిష్ ఇండియాలో తొలి మహిళా శాసనసభ్యురాలైన డా. ముత్తులక్ష్మికి చెందిన ఆ విశాలమైన ఇల్లు ఎంతోమంది పేదింటి అమ్మాయిలకు నీడను ఇచ్చింది. ఆ ఇంట్లో ఆశ్రయం పొంది చదువుకున్న అమ్మాయిలు నర్స్‌లు, టీచర్‌లు అయ్యారు. 1942లో అడయార్ నది దగ్గర బ్రిటిష్ సైనికులు క్యాంప్ వేశారు. వారు తన ఇంట్లో ఉంటున్న అమ్మాయిలను వేధిస్తున్నారనే విషయం తెలిసి చేతిలో దుడ్డు కర్రతో పహారా కాసేది ముత్తులక్ష్మి. అంతేకాదు స్థానిక బ్రిటిష్ కమాండెంట్ దగ్గరకు వెళ్లి.... 'మా అమ్మాయిలకు ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత మీదే' అని హెచ్చరించింది.

తాజా విషయానికి వస్తే....

మహిళలకు డా. ముత్తులక్ష్మి చేసిన సేవలు, ఇచ్చిన స్ఫూర్తికి చిహ్నంగా ఆ ఇంటిని పునరుద్ధరించి స్మారకకేంద్రంగా మార్చనున్నారు. ఉచిత వైద్యసేవలు అందించే కేంద్రంగా, మహిళలకు వివిధ వృత్తులలో శిక్షణ ఇచ్చే కేంద్రంగా ఈ ఇంటిని తీర్చిదిద్దనున్నారు. లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారు.

'ది రిమార్కబుల్ టేల్ ఆఫ్ డా.ముత్తులక్ష్మి' పేరుతో ముత్తులక్ష్మి జీవితచరిత్ర రాసింది వీఆర్ దేవిక.



• న్యూ

ఉమెన్ సెక్యూరిటీ 'క్యూఆర్ కోడ్స్'

మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని సరికొత్త విధానాన్ని అనుసరించారు మహారాష్ట్రలోని నాగ్‌పుర్ పోలీసులు. నగరంలో నేరాలకు ఆలవాలంగా ఉన్న 330 ప్రదేశాలను గుర్తించి క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ కాంటాక్ట్‌లు, సేఫ్టీ రిసోర్స్‌కు సంబంధించి త్వరగా యాక్సెస్ కావడానికి ఆపదలో ఉన్న మహిళలకు ఈ క్యూ ఆర్ కోడ్‌లు ఉపయోగపడతాయి.

నేరాలను బట్టి మరిన్ని ప్రాంతాలకు ఈ క్యూఆర్ కోడ్‌లను విస్తరిస్తారు.

'మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకొని సాంకేతికతను ఉపయోగించుకుంటున్నాం' అంటున్నారు సీపీ రవీందర్ సింఘాల్.

మహిళల భద్రతకు సంబంధించిన 'దామిని స్క్వాడ్స్' కోసం అయిదు ప్రత్యేకమైన ఆల్–ఉమెన్ వాహనాలను ఏర్పాటు చేశారు. ఈ స్క్వాడ్‌లో 19 మంది మహిళా అధికారులు ఉన్నారు.

'మా బృందాలలోని సభ్యులు ప్రతి స్కూల్‌కు వెళ్లి బాలికల భద్రతకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. బాలికలకు వారి హక్కుల గురించి తెలియజేయడంతో పాటు అవసరమైన సమయాలలో సహాయం ఎలా తీసుకోవాలి... వంటి విషయాల గురించి వివరిస్తున్నారు' అంటున్నారు 'భరోసా సెల్' హెడ్ సీమా సుర్వే.

ఆమె ఆర్థిక నిర్ణయాలలో...

• స్టడీ



ఎనభై శాతం మంది మహిళల ఆర్థిక నిర్ణయాలలో ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తాజా అధ్యయనం తెలియజేసింది. మార్కెటింగ్ రీసెర్చ్ అండ్ పబ్లిక్ ఒపీనియన్ పోలింగ్ కంపెనీ 'ఐపీఎస్‌వోఎస్' దిల్లీ, ముంబై, బెంగళూరు, కోల్‌కత్తాలోని 25–45 ఏళ్ల మధ్య ఉన్న మహిళలపై ఈ అధ్యయనాన్ని నిర్వహించింది.

బడ్జెట్ ప్లానింగ్, మ్యూచువల్ ఫండ్స్... మొదలైన వాటి గురించి అవగాహన ఏర్పర్చుకోవడానికి మహిళలు ఎక్కువగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడుతున్నారు.

మ్యూచువల్ ఫండ్స్ గురించి నిమిషాల వ్యవధిలో సులభంగా వివరించే ఇన్‌స్టాగ్రామ్‌లోని షార్ట్ రీల్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్‌కు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌లు షేర్ చేసే టిప్స్ మహిళలకు ఉపయోగపడుతున్నాయి. స్వతంత్రంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి సంబంధించి మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి, ఆర్థిక వ్యవహారాలను చక్కబెట్టడంలో మహిళలకు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ఉపయోగపడుతున్నాయి. స్వతంత్రంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడానికి సంబంధించి 57 శాతం మంది యూజర్‌లు ఇన్‌స్టాగ్రామ్‌పైనా, 53 శాతం మంది యూజర్‌లు ఫేస్‌బుక్‌పై ఆధారపడుతున్నారు. 'అథెంటిసిటీ'కి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. 75 శాతం మంది ఫైనాన్షియల్ పాడ్‌కాస్ట్‌లకు, 67 శాతం మంది ఇన్‌ఫ్లూయెన్సర్‌లు, ఆర్థిక విషయ నిపుణుల సలహాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక కొత్త స్కీమ్ గురించి తెలుసుకోవడం నుంచి దాని మంచిచెడ్డల గురించి విశ్లేషించుకోవడం వరకు ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు సంబంధించి వాట్సాప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్టడీ రిపోర్ట్ తెలియజేసింది.

• పురస్కారం

అదిగో లక్ష్యం

మన దేశంలోనే కాదు పాశ్చాత్య దేశాల్లో కూడా స్కేట్ బోర్డింగ్ అనేది పురుషాధిపత్య ఆటగా ముద్రపడింది. మహిళా స్కేటర్‌లు రకరకాల అడ్డంకులను అధిగమించి ముందుకు సాగడం అంత సులువు ఏమీ కాదు. ఆశా గోండ్‌లాంటి మహిళా స్కేట్‌బోర్డింగ్ ప్లేయర్స్ ఎన్నో సవాళ్లను అధిగమించి ముందుకువెళ్లారు. 2018లో చైనాలో జరిగిన వరల్డ్ స్కేట్‌బోర్డింగ్ చాంపియన్‌షిప్‌లో మన దేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక మహిళ....ఆశా గోండ్.



మధ్యప్రదేశ్‌లోని జాన్వార్ గ్రామానికి చెందిన ఆశా గోండ్ స్కేట్‌బోర్డింగ్‌లో అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలు పడి ఉండవచ్చు. అయితే ఆమె పడిన కష్టాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలిచాయి తప్ప భయపెట్టలేదు. ప్రతిభకు ఉన్న ప్రత్యేకత అదే కదా!

'అనుమానాలు, అపోహలు, పురుషాధిపత్య గోడలను తమ శక్తిసామర్థ్యాలతో మహిళా స్కేట్‌బోర్డింగ్ ప్లేయర్స్ బద్దలు కొట్టారు' అంటున్న ఇటాలియన్ ఫొటోగ్రాఫర్ చంటల్ పింజి మన దేశంలోని మహిళా స్కేట్ బోర్డింగ్ ప్లేయర్స్‌పై ఫొటోసిరీస్ చేశాడు. స్కేట్‌బోర్డింగ్‌లో మహిళల శక్తిని ప్రతిబింబించే ఈ ఫొటోసిరీస్‌లోని ఫొటో 'సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ–2025' అవార్డ్స్ స్పోర్ట్స్ విభాగంలో బహుమతి గెలుచుకుంది.

• హెల్త్

శాకాహారుల్లో విటమిన్ B12 లోపం ఉంటే...!



మనం చేసే అన్ని పనులకూ మెదడు, నాడీ వ్యవస్థ నుంచే ఆదేశాలు అందుతూ ఉంటాయి. అలాంటి ఆ మెదడు నుంచి జీవక్రియలకు సంబంధించిన ఆదేశాలన్నీ పలు అవయవాలకూ సక్రమంగా అందడానికి ఉపయోగపడే కీలకమైన పోషకం 'విటమిన్-బి12'. ఇది మెదడు కార్యకలాపాలకోసం మాత్రమే కాకుండా రక్తం ఉత్పత్తికీ, కణంలో డీఎన్ఏ ఆవిర్భవించడానికి, మెటబాలిజమ్‌లో పాలు పంచుకునే అమైనో యాసిడ్స్ కార్యకలాపాలకూ చాలా కీలకం, ఎంతో అవసరం! శాకాహార వనరుల్లో విటమిన్ బి12 బాగా తక్కువ. వాళ్లలో ఈ విటమిన్ లోపాన్ని భర్తీ చేసుకోవడమెలాగో చూద్దాం.

మాంసాహారులతో పోలిస్తే శాకాహారుల్లో విటమిన్ బి12 లోపం చాలా ఎక్కువగా కనిపిస్తుంటుంది. కారణం... ఈ విటమిన్‌కు మాంసాహారం మంచి వనరు. దాంతో శాకాహార నియమాన్ని కఠినంగా పాటించేవారిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అలాంటి వారు ఈ లోపాన్ని భర్తీ చేసుకోవడమెలాగో తెలుసుకుందాం.

శాకాహారుల్లో ఎందుకు తక్కువంటే...

విటమిన్ బి12ను మొక్కలూ లేదా జంతువులూ ఇవేవీ సృష్టించలేవు. కేవలం కొన్ని బ్యాక్టీరియాతోపాటు ఆర్కియా అనే ఒక రకం ఏకకణ జీవులు మాత్రమే ఈ విటమిన్‌ను సృష్టించగలవు. ఆర్కియా ఎంత చిన్న జీవి అంటే... ఇది ఏకకణ జీవికంటే కూడా చాలా చిన్నది. ఈ ఏకకణజీవికి న్యూక్లియస్ (కేంద్రకం) కూడా ఉండదు. దాంతో ఇది ఒక కణమనీ, కణంలోని భాగాలని వివిధ భాగాలంటూ చెప్పడానికి కూడా వీలు కానంత చిన్న కణమిది. అయితే... బ్యాక్టీరియా, ఆర్కియా వెలువరించే కొన్ని రకాల ఎంజైముల కలయికతో ఈ సృష్టిలో విటమిన్–బి12 నేచురల్‌గా తయారవుతుంది. జంతువులకు మేలు చేసే బ్యాక్టీరియా మనుగడ సాగించే చోట... అంటే... జంతువుపై ఆధారపడిన బ్యాక్టీరియాలోనూ, ఆ బ్యాక్టీరియా నుంచి వెలువడే పదార్థాల్లోనూ ఇది ఉంటుంది. అందుకో కారణం ఉంది. జీవుల్లో ఉంటూ... ఆ జీవుల నుంచి తమకు అవసరమైనవి తీసుకుంటూ... వాటికి విటమిన్ బి–12 ఇస్తూ ఉండే క్రమంలో విటమిన్ బి–12 వెలువడుతుంది. ఇలా జీవుల మాంసం, ఉత్పాదనల్లోనుంచి వెలువడుతుంది కాబట్టి శాకాహార పదార్థాల్లో ఇది తక్కువ కావడంతో శాకాహారులలో ఈ లోపం రావడానికి అవకాశాలెక్కువ.

ఇంకా ఎవరెవరిలో తక్కువ...

● సాధారణంగా 75 ఏళ్లకు పైగా వయసు పైబడిన వారిలో ● పుట్టుకతో వచ్చే జబ్బు అయిన 'పెర్నీషియస్ అనీమియా' అనే కండిషన్ ఉన్న వారిలో. ఈ కండిషన్ ఉన్నవారిలో ఒక ప్రొటీన్ లోపం వల్ల జీర్ణమైన ఆహారం నుంచి విటమిన్ బి12 ను తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. దాంతో ఈ సమస్యతో బాధపడే కుటుంబ చరిత్ర ఉన్న వారిలో, 60 ఏళ్లు దాటిన మహిళల్లో ఇది ఎక్కువ ● పొట్ట లోపలిపొర పలచబారిన వారిలోనూ ఇది తక్కువ ● పొట్టలో అల్సర్స్ ఉన్నవారిలో ● పొట్టలోని కొంతభాగాన్ని సర్జరీ ద్వారా తొలగించిన వారిలో ● జీర్ణవ్యవస్థ తాలూకు దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారిలో ● చాలాకాలంగా అజీర్తి మందులు (ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ –పీపీఐ) వాడుతున్నవారిలోనూ విటమిన్ బి12 మోతాదులు తక్కువగా ఉండే అవకాశముంది.

లక్షణాలు...

● విటమిన్ బి12 లోపం ఉన్నవాళ్లలో నీరసం, నిస్సత్తువ, అలసట చాలా ఎక్కువ. ఒక్కోసారి ఊపిరి సరిగా అందక ఆయాసం ● అన్ని అవయవాలకూ ఆక్సిజన్‌ను తీసుకెళ్లేందుకు అవసరమైన ఎర్ర రక్తకణాల ఉత్పత్తి తగ్గుతుంది. ఈ కారణంగా వచ్చే రక్తహీనతను 'విటమిన్–బి12 డెఫిషియెంట్ అనీమియా' అంటారు. ఈ కండిషన్ ఉన్నప్పుడు ఏర్పడే పరిస్థితిని ఎదుర్కొనేందుకు శరీరం చాలా పెద్దసైజు ఎర్రరక్తకణాలను ఉత్పత్తి చేస్తుంటుంది. వీటినే మెగాలోబ్లాస్టిక్, మ్యాక్రోసైటిక్ ఆర్‌బీసీ ఉంటారు. ఇవి ఆక్సిజన్ మోసుకెళ్లాల్సిన పనిని సక్రమంగా చేయలేవు ● తరచూ తలనొప్పి, చెవుల్లో హోరు వినిపించడం, ఆకలి లేకపోవడం.

నిర్ధారణ:

సాధారణ రక్తపరీక్ష ద్వారా విటమిన్ బి12 తగ్గడంతో పాటు... ఆ పరీక్షతో తెలిసే ఎర్ర రక్తకణాల సైజ్‌ను బట్టి ఈ విటమిన్ లోపాన్ని తెలుసుకుంటారు.

నివారణ ..


సాధారణంగా మాంసాహారంతో పాటు గుడ్లు, సముద్రపు చేపల్లో విటమిన్ బి12 ఎక్కువ. అయితే మాంసాహారం తీసుకోని వారందరూ. ఇవి తీసుకోవచ్చు. ● పాలు, పాల ఉత్పాదనలు.. అందునా విటమిన్ బి12తో నింపిన (అంటే... విటమిన్ బి12 ఫోర్టిఫైడ్) బాదం పాల (ఆల్మండ్ మిల్క్)లో; విటమిన్ బి12 ఫోర్టిఫైడ్ కొబ్బరిపాలలో; ● విటమిన్ బి12 ఫోర్టిఫైడ్ సోయాపాలలోనూ ఇది ఎక్కువ ● త్వరగా పులిసిపోడానికి అవకాశమున్న పిండితో చేసిన ఇడ్లీ, దోస వంటి ఆహారాలు ● తక్షణం తినగలిగే తృణధాన్యాలు (సిరేల్స్)లో ● తక్కువ కొవ్వు కలిగిన పాలను తోడబెట్టడంతో వచ్చే పెరుగు (యోగర్ట్)లో ● పాలలోనూ, చీజ్‌లోనూ, వెనిలా ఐస్‌క్రీమ్‌లోనూ విటమిన్ బి12 ఎక్కువ.

చికిత్స ఇలా...

రక్తపరీక్షలో విటమిన్ బి12 మోతాదులు మరీ తక్కువగా ఉన్నాయని తేలితే... వాళ్లకు సాధారణంగా ఆరు బి12 ఇంజెక్షన్లతో ఈ లోపాన్ని భర్తీ చేస్తారు. ఇది రోజుకు ఒకటి లేదా రెండు చొప్పున నాలుగు రోజులకు ఒకటి మోతాదులో ఈ ఇంజెక్షన్ చేస్తుంటారు. ఇలా ఇచ్చిన విటమిన్ బి12 కాలేయంలో నిల్వ ఉండిపోయి దేహానికి అవసరమైన జీవక్రియలకోసం ఉపయోగపడుతూ ఉంటుంది.

● ఒకవేళ పెర్నీషియస్ అనీమియా కారణంగా విటమిన్ బి12 లోపం ఉన్నవారైతే... డాక్టర్లు చెప్పిన మోతాదుల్లో జీవితకాలం పాటు విటమిన్ బి12ను తీసుకుంటూనే ఉండాలి. ఇలా విటమిన్ బి12 తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు. ఒకవేళ పోషకాహారలోపం వల్ల విటమిన్ బి12 లోపం ఏర్పడితే అప్పుడు ఇంజెక్షన్ రూపంలో కాకుండా సైనకోబాలమైన్ టాబ్లెట్ల రూపంలోనూ దీన్ని శరీరానికి అందిస్తారు.





డాక్టర్ ఆఫ్తాబ్ అహ్మద్
సీనియర్ ఫిజీషియన్

బీ 12 లోపంతో మరింత నిర్దిష్టంగా కనిపించే మరికొన్ని లక్షణాలు

● చర్మం పసుపుపచ్చరంగులోకి మారడం ● నాలుక పూత, నోట్లో పుండ్లు ● చర్మం కొన్ని ప్రదేశాల్లో స్పర్శజ్ఞానం కోల్పోవడం ● నొప్పి ఎక్కువగా తెలియకపోవడం ● నడుస్తూ నడుస్తూ పడిపోవడం ● చూపు సరిగా లేక స్పష్టంగా కనిపించకపోవడం ● క్షణక్షణానికీ మూడ్స్ మారిపోవడం, డిప్రెషన్‌కు గురికావడం, మతిమరుపు.

చివరగా...

విటమిన్–బి12 టాబ్లెట్లను, ఇంజెక్షన్లను ఎవరికి వారుగా తీసుకుంటూ సొంతవైద్యం చేసుకోకూడదు. కేవలం డాక్టర్ల పర్యవేక్షణలోనే తీసుకోవాలి. ఎందుకంటే... ఈ ఇంజెక్షన్లనూ, మాత్రలనూ తీసుకునేవారు తమ ఇతరత్రా ఆరోగ్య సమస్యల కోసం వేరే మందులు వాడుతుంటే వాటి కార్యకలాపాలకు ఈ విటమిన్ బి12 ఇంజెక్షన్లూ, మాత్రలూ అడ్డురాకుండా ఉండేలా డాక్టర్లు వాటి మోతాదు నిర్ణయిస్తారు. అందుకే ఈ విటమిన్‌ను డాక్టర్ల పర్యవేక్షణలోనే, వారు సూచిస్తేనే వాడాలి.



'నా జీవితంలో అత్యంత మధుర క్షణాలవి'

ఎనిమిదేళ్ల విరామం తర్వాత టెస్టు క్రికెట్ ఆడే అవకాశం దక్కించుకున్న భారత బ్యాటర్ కరుణ్ నాయర్ తన ఇంగ్లండ్ పర్యటన మర్చిపోలేని విధంగా సాగిందని వ్యాఖ్యానించాడు. హెడింగ్లీలో తొలి టెస్టు మొదటి రోజు జాతీయ గీతం పాడుతున్నప్పుడు నేను సాధించగలిగాను అనే గర్వంతో భావోద్వేగానికి లోనయ్యానని అతను గుర్తు చేసుకున్నాడు. ఈ సిరీస్‌లో నాలుగు టెస్టులు ఆడిన నాయర్ 8 ఇన్నింగ్స్‌లలో కలిపి 205 పరుగులు చేశాడు. అయితే చివరి టెస్టులో చేసిన అర్ధసెంచరీ భారత్ విజయానికి కీలకంగా మారింది. 'ఓవల్ టెస్టులో అర్ధ సెంచరీని శతకంగా మలచలేకపోవడం కొంత నిరాశ కలిగించింది. అయితే టెస్టు తొలి రోజు కఠిన పరిస్థితుల్లో జట్టుకు ఉపయోగపడగలిగాను. మొత్తంగా చూస్తే ఎత్తుపల్లాలతో నా సిరీస్ సాగింది. అయితే ఆ అంకం ముగిసింది. ఇకపై రాబోయే రోజుల్లో నాకు అవకాశం దక్కినప్పుడు భారీ స్కోర్లు సాధించగలనని నమ్ముతున్నా' అని నాయర్ చెప్పాడు. త్వరలో జరిగే మహరాజా టి20 ట్రోఫీలో మైసూర్ వారియర్స్ తరఫున కరుణ్ నాయర్ బరిలోకి దిగనున్నాడు.


గార్త్

భారత మహిళల 'ఎ'జట్టు మరో పరాజయం

మెకే: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల 'ఎ' జట్టు ఆకట్టుకోలేకపోతోంది. ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో వరుసగా రెండో మ్యాచ్‌లో సైతం మన అమ్మాయిలు పరాజయం పాలయ్యారు. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో పోరులో భారత్ 'ఎ' జట్టు 114 పరుగుల తేడాతో ఓడింది. దీంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. గాయం నుంచి కోలుకొని తిరిగి జట్టులోకి వచ్చిన ఆసీస్ రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ (44 బంతుల్లో 70; 12 ఫోర్లు) హాఫ్ సెంచరీతో అదరగొట్టింది. తహీలా విల్సన్ (35 బంతుల్లో 43; 6 ఫోర్లు), అనిక లియ రాయెడ్ (21 బంతుల్లో 35; 5 ఫోర్లు), కోర్ట్నీ వెబ్ (13 బంతుల్లో 26 నాటౌట్; 4 ఫోర్లు) ఆకట్టుకున్నారు. భారత బౌలర్లలో కెప్టెన్ రాధ యాదవ్ 2 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో భారత 'ఎ' జట్టు తడబడింది. 15.1 ఓవర్లలో 73 పరుగులకే ఆలౌటైంది. దినేశ్ వృందా (27 బంతుల్లో 21; 2 ఫోర్లు), మిన్ను మణి (15 బంతుల్లో 20; 3 ఫోర్లు) కాస్త పోరాట పటిమ కనబర్చగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. షఫాలీ వర్మ (3), ఉమా ఛెత్రి (0), రాఘ్వి బిస్త్ (5), తనూజ కన్వర్ (0), రాధ (5), సజీవన్ సజన (6), ప్రేమ (4) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున వందకు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లాడిన గార్త్ బంతులను మన అమ్మాయిలు ఎదుర్కోలేకపోయారు. మూడు ఓవర్లు వేసిన గార్త్ 7 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టగా... అమీ ఎడ్గర్, టెస్ ఫ్లింటాఫ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో అనధికారిక టి20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

చరిత్ర సృష్టించిన రమేశ్

- ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్ ఓపెన్ మెన్స్ ఫైనల్‌కు అర్హత
- తొలి భారత సర్ఫర్‌గా రికార్డు





చెన్నై: అలలపై తేలియాడే సర్ఫింగ్‌లో రమేశ్ బుధియాల్ చరిత్ర సృష్టించాడు. ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్ ఓపెన్ మెన్స్ విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించిన తొలి భారత సర్ఫర్‌గా రమేశ్ రికార్డుల్లోకెక్కాడు. శనివారం సెమీఫైనల్లో రమేశ్ 11.43 పాయింట్లు సాధించి రెండో స్థానంతో తుదిపోరుకు అర్హత సాధించాడు. ఇండోనేసియాకు చెందిన పజర్ అరియానా 13.83 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచాడు. అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో రమేశ్ 14.84 పాయింట్లతో ఫిలిప్పిన్స్ సర్ఫర్ నీల్ సాంచెస్ (12.80 పాయింట్లు) వెనక్కి నెట్టి ముందంజ వేశాడు. భారత్‌కు చెందిన కిషోర్ కుమార్ కూడా సెమీఫైనల్‌కు చేరగా... అతడు 8.03 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు. మరో భారత సర్ఫర్ శ్రీకాంత్ క్వార్టర్స్‌లో పోరాడి ఓడాడు. అండర్–18 ఈవెంట్‌లో భారత్ పోరాటం ముగిసింది. ఈ విభాగంలో హరీశ్, ఆద్య సింగ్, దమయంతి శ్రీరామ్ క్వార్టర్స్‌లో పరాజయం పాలై ఇంటిబాట పట్టారు.

మూడో రౌండ్లో అర్జున్ గెలుపు

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్



చెన్నై: తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ నిలకడైన ప్రదర్శనతో మూడో రౌండ్ గేమ్‌లో విజయం సాధించాడు. దీంతో చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ 'మాస్టర్స్' కేటగిరీలో భారత ఆటగాడు రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. శనివారం జరిగిన గేమ్‌లో అర్జున్... అమెరికా గ్రాండ్‌మాస్టర్ రే రాబ్సన్‌ను కంగుతినిపించాడు. ఆరంభం నుంచే దీటైన పైఎత్తులు వేస్తూ వచ్చిన అర్జున్ గెలిచేదాకా పట్టుదల కనబరిచాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పావులు కదిపాడు. ఇదే జోరుతో అర్జున్ 46 ఎత్తుల్లో ప్రత్యర్థిపై విజయం సాధించాడు. తొలిరౌండ్లో గెలిచిన తెలంగాణ ఆటగాడు రెండో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ప్రస్తుతం మూడు రౌండ్లు ముగిసేసరికి 2.5 పాయింట్లతో ఒక్కడే రెండో స్థానంలో ఉన్నాడు. ఆడిన మూడు రౌండ్లూ గెలిచిన జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్ (3) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మూడో రౌండ్లో కీమర్... కార్తికేయన్ మురళీపై గెలుపొందాడు. మిగతా భారత ఆటగాళ్లలో గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతి కీలకమైన విజయాన్ని సాధించాడు. సహచరుడు నిహాల్ శరిన్ (0.5)పై విదిత్ (1.5) గెలుపొందాడు. అతనికిది మొదటి విజయం కాగా... భారత యువ ఆటగాడు వి.ప్రణవ్ మూడో రౌండ్లో తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. టోర్నీ టాప్ సీడ్, గ్రాండ్‌మాస్టర్ అనీశ్ గిరి (నెదర్లాండ్స్)ను ఆద్యంతం నిలువరించాడు. దీంతో డచ్ ఆటగాడు డ్రా చేసుకోక తప్పలేదు. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగుతోన్న ఈ టోర్నీలో ఇంకా ఆరు రౌండ్లు మిగిలున్నాయి.

హారిక గేమ్ డ్రా

ఇక్కడే జరుగుతున్న చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ 'చాలెంజర్స్' టోర్నీలో హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వరుస పరాజయాలకు బ్రేక్ వేసింది. ఆధిబన్ భాస్కరన్‌తో జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక డ్రా చేసుకుంది. ఆర్. వైశాలికి లియోన్ ల్యూక్ (భారత్) చేతిలో చుక్కెదురైంది. అభిమన్యు పురాణిక్... హర్షవర్ధన్‌పై, ప్రాణేశ్... ఇనియన్‌పై గెలుపొందారు. ఆర్యన్ చోప్రా, దీప్తాయన్ ఘోష్‌ల మధ్య జరిగిన గేమ్ డ్రాగా ముగిసింది.

రిషభ్ యాదవ్‌కు కాంస్యం

- కాంపౌండ్ ఆర్చర్లకు నిరాశ
- ప్రపంచ క్రీడలు



చెంగ్డూ (చైనా): భారత యువ ఆర్చర్ రిషభ్ యాదవ్ కాంస్య పతకంతో మెరిశాడు. ప్రపంచ క్రీడల్లో శనివారం జరిగిన పోటీల్లో మిగతా ఆర్చర్లకు నిరాశ ఎదురైంది. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో జరిగిన కాంస్య పతక పోరులో 22 ఏళ్ల రిషభ్ 149–147 స్కోరుతో భారత సీనియర్ సహచరుడు అభిషేక్ వర్మపై గెలుపొందాడు. తొలి సెట్‌లో కచ్చితమైన గురితో పదికి పది పాయింట్లు సాధించడంతో రిషభ్ 30–29తో ఆధిక్యంలోకి వెళ్లాడు. రెండు, మూడు సెట్లలో ఇద్దరు 29–29, 30–30 స్కోర్లు చేశారు. మళ్లీ నాలుగో సెట్‌లో రిషభ్ గురి అదరడంతో 30–29 స్కోరు సాధించాడు. దీంతో మొత్తం 119–117తో రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాడు. ఆఖరి సెట్‌లో ఇద్దరు 30–30 స్కోరు సాధించడంతో రిషభ్‌కు పతకం ఖాయమైంది. సెమీఫైనల్లో అతను 145–147తో రెండు పాయింట్ల తేడాతో అమెరికన్ ఆర్చర్ కుర్టిస్ లి బ్రాడ్‌నాక్స్ చేతిలో ఓడిపోగా, అభిషేక్ వర్మ 145–148తో టాప్ సీడ్ మైక్ ష్లోసెర్ (నెదర్లాండ్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ పోటీల్లో భారత్ పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. 12వ సీడ్ పర్నీత్ కౌర్ 140–145తో కొలంబియాకు చెందిన నాలుగో సీడ్ అలెజాండ్రా వుస్క్వియానో చేతిలో, మూడో సీడ్ మధుర ధమన్‌గొంకర్ 145–149తో ఆరో సీడ్ లీసెల్ జాట్మా (ఈస్తోనియా) చేతిలో ఓడిపోయారు. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన అభిషేక్ వర్మ–మధుర జోడీ నిరాశపరిచింది. అనూహ్యంగా తొలిరౌండ్లోనే భారత ద్వయం 151–154తో దక్షిణ కొరియాకు చెందిన మూన్ యియున్–లీ వున్హో చేతిలో కంగుతింది. మిక్స్‌డ్ రికర్వ్‌లో భారత జోడీలు బరిలోకి దిగలేదు.

సాక్షి సినిమా

నిరాధారమైన ప్రచారాన్ని ఖండిస్తున్నా

- చిరంజీవి




సినీ కార్మికుల వేతనం పెంపుకి సంబంధించిన విషయం గురించి ఇటీవల కొందరు నిర్మాతలు చిరంజీవిని కలిసి మాట్లాడిన విషయం తెలిసిందే. అయితే తాజాగా కొందరు సినీ కార్మికులు చిరంజీవిని కలిసి మాట్లాడగా, తన సినిమాల చిత్రీకరణలకు వేతన పెంపు అమలు చేయించేలా కార్మికులకు హామీ ఇచ్చారనే టాక్ తెరపైకి వచ్చింది. ఈ విషయంపై చిరంజీవి 'ఎక్స్' వేదికగా ఓ పోస్టును షేర్ చేశారు. ''ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులమని చెప్పుకుంటున్న కొంతమంది వ్యక్తులు నేను 30 శాతం వేతన పెంపు అనే వారి డిమాండ్‌ను అంగీకరించానని తప్పుడు ప్రకటనలు చేశారని నా దృష్టికి వచ్చింది. నిరాధారమైన ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నాను. నేను ఫెడరేషన్‌కి చెందిన ఎవరినీ కలవలేదు. ఇది పరిశ్రమ మొత్తానికి సంబంధించిన విషయం. నేనైనా, వ్యక్తిగతంగా ఎవరైనా ఇలాంటి సమస్యలకు హామీ ఇవ్వడం సాధ్యం కాదు. అన్ని వర్గాలతో చర్చలు జరిపి న్యాయ సమ్మతమైన పరిష్కారం చూపించడం ఫిల్మ్ ఛాంబర్ బాధ్యత'' అని పేర్కొన్నారు చిరంజీవి.

కార్మికుల వేతన పెంపుపై చర్చలు విఫలం

- షరతులతో కూడిన వేతన పెంపుకు నిర్మాతల అంగీకారం
- నిర్మాతల షరతులకు ఒప్పుకునేది లేదంటున్న కార్మికుల సంఘం

తెలుగు సినీ కార్మికుల వేతనాల పెంపు విషయమై కార్మికుల సంఘం – నిర్మాతల మండలి మధ్య జరుగుతున్న చర్చలు సానుకూలంగా సాగడం లేదు. శనివారం హైదరాబాద్‌లోని తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో నిర్మాతల సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం సినీ కార్మికుల వేతనాల పెంపుపై తమ నిర్ణయాలను నిర్మాతలు వెల్లడించారు. మూడు విడతలుగా కార్మికుల వేతన పెంపును అమలు చేయనున్నట్లుగా తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి దామోదరప్రసాద్ మాట్లాడుతూ– ''రోజుకి రూ. 2000 లేదా అంతకన్నా తక్కువ వేతనం తీసుకునే కార్మికులకు మొదటి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంపు ఉంటుంది. రోజుకి రూ. 1000 రూపాయలు లేదా అంతకన్నా తక్కువ వేతనం తీసుకుంటున్న కార్మికులకు స్ట్రయిట్‌గా 20 శాతం పెంపుదల చేస్తాం. మళ్లీ మూడో ఏడాది 5 శాతం పెంపుదల ఉంటుంది. మేము ఇప్పటికే కార్మికుల సంఘం ముందు ఉంచిన నాలుగు ప్రతిపాదనలను వారు అంగీకరిస్తేనే ఇవి అమలు అవుతాయి. అలాగే చిన్న బడ్జెట్ సినిమాలకు పాత వేతనాలనే చెల్లిస్తాం. అయితే చిన్న సినిమా బడ్జెట్ పరిమితి... తదితర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం. ఇప్పటికే రోజుకి రూ. 4 వేలు, రూ. 5 వేలు తీసుకుంటున్న కార్మికులకు వేతనాలు పెంచమనడం సరైంది కాదు'' అని పేర్కొన్నారు.

''మా చర్చలు విఫలమైనట్లుగా మేం భావిస్తున్నాం. చర్చలంటూ పిలిచారు. పర్సెంటేజ్ విధానం చెప్పారు. కానీ అందరికీ ఇస్తే అంగీకరిస్తాం అని చెప్పాం. అయితే ఫెడరేషన్‌ను విభజించాలనుకున్నట్లుగా పర్సెంటేజ్‌లను క్రియేట్ చేశారు. అది మేం అస్సలు ఒప్పుకోలేదు'' అంటూ కార్మికుల సంఘం అధ్యక్షుడు అనిల్ వల్లభనేని పేర్కొన్నారు. ఇంకా మాట్లాడుతూ – ''30 శాతం పెంపుదల విభజన (ఒక్కో ఏడాది కొంచెం కొంచెంగా)కు మేం సిద్ధం. కానీ వాళ్లు ఫెడరేషన్‌లోని కొన్ని యూనియన్స్‌కు పెంచుతామని, మరికొన్ని యూనియన్స్‌కు పెంచమని చెప్పారు. ఇందుకు ఒప్పుకునేది లేదు. రోజువారీ వేతనాలు తీసుకునే యూనియన్స్ 13 ఉన్నాయి. అందరికీ సమానంగా పెంచాలని చెప్పాం. తక్కువ, ఎక్కువలు ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడదామన్నాం. కానీ వాళ్లు ఒక ఫిగర్ చెప్పకుండానే వెళ్లిపోయారు. అక్కడ జరిగింది వేరు... బయటికి వచ్చి మాట్లాడింది వేరు. ఫైటర్స్, డ్యాన్సర్స్, టెక్నీషియన్స్... ముఖ్యంగా కెమెరా టెక్నీషియన్స్ గురించి మాట్లాడలేదు. మేం 24 యూనియన్స్ ఉన్నాం. యూనియన్స్‌ను విడగొట్టాలని ప్లాన్ చేస్తున్నారు'' అని అనిల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జరిగిన చర్చలు సానుకూలంగా లేకపోవడంతో ఆదివారం నుంచి తమ నిరసనలను తీవ్రతరం చేస్తామని కార్మికుల సంఘం నాయకులు అంటున్నారు.



నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా శివ

- నాగార్జున

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో 'శివ' ఓ ట్రెండ్‌సెట్టర్ మూవీ. నాగార్జున హీరోగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 1989 అక్టోబర్ 5న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కాగా అన్నపూర్ణ స్టూడియో 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సినిమాను అతి త్వరలో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెలుగులో రీ–రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ– ''నన్ను ఐకానిక్ హీరోగా నిలబెట్టిన సినిమా 'శివ'. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఈ సినిమా గురించి మాట్లాడుకుంటుండటం చూసి, నా అన్నయ్య అక్కినేని వెంకట్, నేను ఈ సినిమాను గ్రాండ్‌గా రీ–రిలీజ్ చేయాలని భావించాం. ఈ 'శివ' సినిమాను కల్ట్ క్లాసిక్‌గా ప్రేక్షకులకే కాకుండా, యూట్యూబ్‌లో చూసిన కొత్త జెనరేషన్‌కి కూడా థియేటర్స్‌లో మంచి అనుభవం ఇవ్వాలని అనుకున్నాం. అందుకే రామ్‌గోపాల్ వర్మ, వెంకట్, నేను కలసి డాల్బీ ఆట్మాస్ సౌండ్‌తో, 4కే విజువల్స్‌తో మళ్లీ ప్రెజెంట్ చేస్తున్నాం'' అని తెలిపారు. ''నాగార్జున, నిర్మాతలు నాపై పెట్టిన నమ్మకమే ఈ సినిమాను ఇంత ఎత్తుకు తీసుకుని వెళ్లింది. ఈ సినిమాని రీ–రిలీజ్ చేయాలని నిర్ణయించుకోవడం నాకు థ్రిల్ ఇచ్చింది. అడ్వాన్స్ ఏఐ టెక్నాలజీతో, మోనో మిక్స్‌ను డాల్బీ అట్మాస్‌కి మార్చాం. 'శివ'ని అందరూ చూసే ఉంటారు. కానీ ఈ కొత్త సౌండ్‌తో ఎవరూ ఇంతవరకూ ఎక్స్‌పీరియన్స్ చేయలేదు. ఈసారి ఆ అనుభూతి గ్యారంటీ'' అన్నారు రామ్‌గోపాల్ వర్మ.

నేనూ ఎదురు చూస్తున్నా!

- మహేశ్‌బాబు


● మహేశ్‌బాబు ప్రీ లుక్



ప్రపంచవ్యాప్త సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని 'ఎస్ఎస్ఎమ్‌బీ29' (వర్కింగ్ టైటిల్) అప్‌డేట్ అధికారికంగా వెల్లడైంది. శనివారం (ఆగస్టు 9) మహేశ్‌బాబు 50వ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రీ లుక్‌ను రిలీజ్ చేసి, మహేశ్‌బాబు ఫ్యాన్స్‌ను ఖుషీ చేశారు ఈ చిత్రదర్శకుడు రాజమౌళి. అలాగే సోషల్ మీడియా వేదికగా రాజమౌళి ఓ పోస్ట్ షేర్ చేశారు. ''మేం ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించి కొంత కాలమే అయింది. ఈ సినిమా గురించిన విశేషాలను తెలుసుకోవాలని మీరందరూ చూపిస్తున్న ఆసక్తి మాకు సంతోషాన్నిస్తోంది. కానీ ఈ సినిమా కథ, స్థాయి, విస్తృతి చాలా పెద్దవి. కొన్ని ఫొటోలను షేర్ చేయడం వల్లనో, ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం వల్లనో న్యాయం చేకూరదు. మేం ఏం సృష్టిస్తున్నామో దాన్ని ప్రపంచానికి చూపించేందుకు ప్రస్తుతం ఎంతో కష్టపడుతున్నాం. నవంబరులో ఈ వివరాలను తెలియజేస్తాం. ఇప్పటివరకూ ఎవరూ చూడని విధంగా ఇది ఉండబోతోంది'' అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు రాజమౌళి. ''మీ అందరిలానే నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. 2025 నవంబరులో మీతో పాటు నేనూ ఎంజాయ్ చేస్తాను'' అని మహేశ్‌బాబు 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇక ఆఫ్రికన్ ఫారెస్ట్ యాక్షన్ అడ్వెంచరస్ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

హారర్... మిస్టరీ


● సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కిష్కిందపురి'. ఈ హారర్, మిస్టరీ, ఎమోషనల్ మూవీని కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మించారు. కాగా 'కిష్కిందపురి' సినిమాను సెప్టెంబరు 12న రిలీజ్ చేస్తున్నట్లుగా వెల్లడించి, ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''థ్రిల్, ఎమోషన్స్ కలగలిసిన ఓ కొత్త తరహా అనుభూతిని ఈ సినిమా ప్రేక్షకులకు అందిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: సామ్ సీఎస్.

ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు



● వద్దే నవీన్

''పెళ్లి, మా బాలాజీ, చాలా బాగుంది' వంటి చిత్రాలతో 1990లలో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన వద్దే నవీన్ గుర్తుండే ఉంటారు. కొన్ని కారణాల వల్ల వెండితెరకు దూరమైన వద్దే నవీన్ మళ్లీ నటుడిగా కెమెరా ముందుకు వచ్చారు. వద్దే నవీన్ టైటిల్ రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. ఈ చిత్రంలో రాశీ సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వద్దే జిష్ణు సమర్పణలో కమల్ తేజ నార్ల దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకుడు కమల్‌తో కలిసి ఈ సినిమాకు వద్దే నవీన్ కథ, స్క్రీన్‌ప్లే అందించడం విశేషం. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''గత కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటున్న వద్దే నవీన్ 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'గా ప్రేక్షకులను అలరించనున్నారు. ఇప్పటికే 80 శాతం షూటింగ్ పూర్తయింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

పరదా కథ అద్భుతం

- హీరో రామ్


● రామ్, అనుపమ

''హిందీలో 'లాపతా లేడీస్'లాంటి సినిమాలు చూసి, మనమెందుకు అలాంటి సినిమాలు చేయలేమని ఆలోచిస్తుంటాం. ఆ కోవలో ఉండే 'పరదా' లాంటి సినిమాలు వచ్చినప్పుడు ప్రోత్సహించాలి. ఇలాంటి సినిమాలు విజయం సాధిస్తే, నిర్మాతలకు ధైర్యం వస్తుంది'' అని హీరో రామ్ అన్నారు. అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా, దర్శనా రాజేంద్రన్, సంగీత, రాగ్ మయూర్ కీలక పాత్రల్లో నటించిన సినిమా 'పరదా'. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ మేకర్స్ రాజ్, డీకేల సపోర్ట్‌తో ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. శనివారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్ మాట్లాడుతూ– ''పరదా' స్టోరీ లైన్ నాకు తెలుసు. చాలా అద్భుతమైన కథ. అనుపమ నాకు మంచి ఫ్రెండ్. ఏ క్యారెక్టర్ చేసినా వంద శాతం ఎఫర్ట్ పెడుతుంది. ఈ సినిమాలో కూడా అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చింది'' అన్నారు. ''రామ్‌లాంటి ఫ్రెండ్ ఉండటం నా అదృష్టం. నేను కూడా 'ఆంధ్రా కింగ్ తాలూకా' (రామ్ హీరోగా చేస్తున్న సినిమా) కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. ''ఈ చిత్రంలో నటిగా అనుపమ కొత్త వెర్షన్‌ను చూస్తారు'' అని పేర్కొన్నారు దర్శక–నిర్మాతలు ప్రవీణ్, విజయ్, శ్రీధర్.

ఎమోషన్... యాక్షన్


● సూర్య, వర్ష

విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా పరిచయం అయిన తమిళ సినిమా 'ఫీనిక్స్'. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వంలో రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదలైంది. త్వరలో ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా తెలుగు టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సూర్య సేతుపతి మాట్లాడుతూ– ''ఈ సినిమా కోసం ఏడాదిన్నర పాటు ట్రైనింగ్ తీసుకున్నాను. యాక్షన్ సీక్వెన్స్‌ని ముందే ప్రాక్టీస్ చేయించారు. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు అద్భుతమైన ఎమోషన్ కూడా ఉంది. ఒక మంచి సినిమాతో తెలుగులో పరిచయం అవుతున్నందుకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''సూర్య సేతుపతి హార్డ్‌వర్కర్. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు మంచి ఎమోషన్ కూడా ఉంది'' అన్నారు అనల్ అరసు. ''ఎమోషనల్ అండ్ హై యాక్షన్ స్టోరీ ఇది. ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అని తెలిపారు ధనుంజయన్. ''ఫీనిక్స్ మంచి సినిమా'' అన్నారు రాజ్యలక్ష్మి. హీరోయిన్ వర్ష , రైటర్ భాష్యశ్రీ మాట్లాడారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

క్లుప్తంగా...

శ్రీవారి ఆలయంలో వైభవంగా శ్రావణ ఉపకర్మ



తిరుమల: శ్రీవారి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ–నూతన యజ్ఞోపవీతధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు కృష్ణస్వామిని శ్రీ భూవరాహస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు అభిషేకించారు. అనంతరం నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. తరువాత శ్రీకృష్ణస్వామి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తిరిగి చేరుకున్నారు.

టీటీడీకి చిరుధాన్యాల శ్రీనివాసుడు చిత్రపటం



ఏయూ క్యాంపస్: విశాఖకు చెందిన చిరుధాన్యాల చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలతో తీర్చిదిద్దిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి చిత్రపటాన్ని శనివారం టీటీడీ ఏఈవో సీహెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ చిత్రపటాన్ని తీర్చిదిద్దేందుకు అరికలు, కొర్రలు, సామలు, నల్లసామలు, రాగులు ఉపయోగించినట్టు విజయ్‌కుమార్ తెలిపారు. 27 రోజులు శ్రమించినట్లు పేర్కొన్నారు.

యువకుల చేతికి చిక్కిన 8 కిలోల మారవ చేప



సదుం: చిత్తూరు జిల్లా సదుం మండలంలో శనివారం ఎనిమిది కిలోల మారవ చేప చిక్కింది. ప్రాజెక్టులోకి వర్షం నీరు వస్తుండడంతో కొర్లకుంటవారిపల్లెకు చెందిన పలువురు యువకులు చేపల వేటకు వెళ్లారు. భార్గవ అనే యువకుడికి మారవ రకానికి చెందిన భారీ చేప దొరికింది. బరువు 8 కిలోల వరకు ఉంటుందని యువకుడు తెలిపారు.

తగ్గుతున్న సన్నబియ్యం ధరలు

రేషన్‌లో ఒకేసారి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ ఫలితం

మరోవైపు విదేశాలల్లోనూ భారీగా పెరిగిన విస్తీర్ణం, ఉత్పత్తి

పొరుగు రాష్ట్రాల్లోనూ ధాన్యపు రాశులు

గణనీయంగా తగ్గిన ఎగుమతులు..

మూతపడుతున్న హోల్‌సేల్ రైస్ డిపోలు



సన్నబియ్యం ధరలు ఇలా.. (క్వింటాల్‌కు రూ.లలో)

రకం	గతేడాది ధర	ప్రస్తుత ధర
జై శ్రీరాం (పాతవి)	7,650	7,100
జై శ్రీరాం (కొత్తవి)	7,000	6,400
హెచ్ఎంటీ (పాతవి)	6,100	5,600
హెచ్ఎంటీ (కొత్తవి)	5,600	5,000
బీపీటీ-5204 (పాతవి)	5,000	4,350
బీపీటీ-5204 (కొత్తవి)	4,150	3,800

ఉచిత బియ్యం కింద పంపిణీ ఇలా...

రాష్ట్రంలో మొత్తం రేషన్ దుకాణాలు : 17,349

రేషన్‌కార్డులు : 91,83,153

లబ్ధిదారులు : 2.81 కోట్ల మంది

మూడు నెలలకు పంపిణీ చేసిన బియ్యం : 5,72,247.537 మెట్రిక్ టన్నులు



సాక్షి ప్రతినిధి, వరంగల్/నిజామాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి. రేషన్‌కార్డుదారులకు మూడు నెలల కోటా కింద సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడమే దీనికి ప్రధాన కారణం. మరోవైపు సన్నధాన్యంపై రైతులకు బోనస్ ఇస్తుండడంతో విస్తీర్ణం పెరిగి వానాకాలం, యాసంగిలో భారీగా సన్నధాన్యం దిగుబడులు వచ్చాయి. ధాన్యం దిగుబడిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. మరోవైపు బియ్యం రీసైకిల్ దందా 90 శాతం పైగా తగ్గింది. ఇంకోవైపు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడి భారీగా పెరగడం... చైనా, థాయ్‌లాండ్, వియత్నాం తదితర దేశాల్లోనూ ధాన్యం ఎక్కువగా ఉత్పత్తి అయ్యింది. దీంతో రాష్ట్రం నుంచి ఏటా భారీగా బియ్యం ఎగుమతులు చేస్తున్న మిల్లర్లపై గట్టి ప్రభావమే పడింది. ఎగుమతులు తగ్గి రైస్‌మిల్లుల్లోనూ నిల్వలు పేరుకుపోయాయి.

గతేడాదితో పోలిస్తే...

- 2024 అక్టోబర్‌కు ముందుతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో సన్నబియ్యం ధరలు తగ్గాయి.
- బీపీటీ–5204 పాత బియ్యం క్వింటా ధర గత ఏడాది రూ.5వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.4,400లకే అమ్ముతున్నారు. కొత్త బియ్యం విషయానికి వస్తే గత అక్టోబర్‌కు ముందు క్వింటా ధర రూ.4,100 ఉండగా...ఇప్పుడు రూ.3,800కు చేరింది.
- హెచ్ఎంటీ రకం పాత బియ్యం గతంలో క్వింటా రూ.6 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.5,600కు తగ్గింది. కొత్త బియ్యం క్వింటా రూ.5,600 ఉండగా ప్రస్తుతం రూ.5వేలకు తగ్గింది.
- జైశ్రీరాం రకం పాత బియ్యం గత అక్టోబర్‌కు ముందు క్వింటా రూ.7,600 ఉండగా, ప్రస్తుతం రూ.7,200కు తగ్గింది. జైశ్రీరాం కొత్త బియ్యం గతంలో క్వింటా రూ.7వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.6,400కు తగ్గడం గమనార్హం. రేషన్‌లో సన్నబియ్యం సరఫరాతో హోల్‌సేల్ బియ్యం దుకాణాలు మూత పడుతున్నాయి. ఒక్క వరంగల్ ట్రైసిటీలో 5,500కు పైగా ఉన్న షాపులు జూన్, జూలై మాసాలలో 800 వరకు మూతపడినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

సన్నబియ్యంతో సగం దుకాణాలు మూతపడ్డాయి



సర్కారు సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో హోల్‌సేల్ రైస్ దుకాణాల్లో ఒక్కసారిగా అమ్మకాలు తగ్గాయి. గతంలో ఒక్కోరోజు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు అమ్మితే ఇప్పుడు రోజుకు రెండు, మూడు కూడ అమ్మడం లేదు. జూన్, జూలై మాసాల్లో అయితే ఒక్క బస్త కూడా అమ్మలేదు. వరంగల్ నగరంలో ఇప్పటికే చాలా హోల్‌సేల్ బియ్యం దుకాణాలు మూత పడ్డాయి.

– దేవసాని తిరుపతి, హోల్‌సేల్ బియ్యం వ్యాపారి, వరంగల్

భారీగా తగ్గిన ఎగుమతులు..

రాష్ట్రం నుంచి బియ్యం దిగుమతి చేసుకునే దేశాల్లో సైతం ధాన్యం దిగుబడులు ఎక్కువగా వచ్చాయి. మరోవైపు కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బిహార్ తదితర రాష్ట్రాల్లో సైతం ధాన్యం దిగుబడులు భారీగా వచ్చాయి. ఆయా రాష్ట్రాల్లో తెలంగాణ స్థాయిలో సీఎంఆర్ తీసుకోకపోవడంతోపాటు ధాన్యం రైతులకు బోనస్ చెల్లించే పథకం లేదు. రేషన్ దుకాణాల ద్వారా తెలంగాణ మాదిరిగా సన్నబియ్యం ఇవ్వడం లేదు. ఇక కర్ణాటకలో ప్రతి గింజను మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతర రాష్ట్రాలు ఇచ్చిన ధరకు.. తెలంగాణ మిల్లర్లు బియ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. చాలా స్వల్పస్థాయిలో మాత్రమే మార్జిన్లు వస్తుండటంతో తమకు గిట్టుబాటు కావడంలేదని రాష్ట్రానికి చెందిన రైస్ మిల్లర్లు ఎగుమతులకు అంతగా ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో రిటైల్ మార్కెట్‌లోనూ బియ్యం ధరలు తగ్గాయి. ఇదిలా ఉండగా ధాన్యం దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలవడం గమనార్హం. ఈ ఏడాది రాష్ట్రంలో 2కోట్ల 80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. కేంద్ర నిల్వల కోసం 60 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించారు. 50–60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులుతున్నాయి.

- తెలంగాణ నుంచి ఏటా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి అవుతోంది. ఈ ఏడాది ధాన్యం సేకరణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన నిజామాబాద్ జిల్లా నుంచి గత ఏడాది వరకు మిల్లర్లు సుమారు 25 వేల టన్నుల బియ్యం దుబాయి, చైనా, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు ఎగుమతి చేసేవారు.
- ధాన్యం భారీగా పండించే వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల నుంచి సైతం ప్రతి ఏటా సుమారు 80 వేల టన్నులకు పైగా బియ్యం ఎగుమతులు చేసేవారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఎగుమతులు మూడో వంతుకు పడిపోయాయి.

ఎగుమతులు తగ్గించాం

ఇతర రాష్ట్రాల్లో సన్న ధాన్యాన్ని బోనస్ లేదు. అక్కడ ప్రతి ధాన్యపు గింజను మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారు. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పలుకుతున్న ధరకు అనుగుణంగా ఆయా రాష్ట్రాల మిల్లర్లు ఎగుమతులు చేస్తున్నారు. తెలంగాణలో సన్నధాన్యం బోనస్ కారణంగా ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది. దీంతో ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పలుకుతున్న ధరకు బియ్యం ఎగుమతి చేయలేకపోతున్నాం. ఎగుమతులు చాలావరకు తగ్గించాం.

– కాపర్తి శ్రవణ్, రైస్‌మిల్లర్, నిజామాబాద్

వైఖానస ఆగమం ప్రకారమే శ్రీవారికి అర్చనాదులు

విఖనస మహర్షి జయంతి సభలో పండితులు



తిరుమల: వైఖానస కల్పసూత్రమ్ ద్వారా ఆవిర్భవించిందే వైఖానస ఆగమమని, తిరుమల శ్రీనివాసునికి వైఖానస ఆగమం ప్రకారమే అర్చనాదులు నిర్వహిస్తున్నారని పండితులు తెలిపారు. తిరుమలలో శనివారం విఖనస మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆస్థాన మండపంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధని సభ సంయుక్త ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన దివి రాఘవ దీక్షితులు ప్రసంగిస్తూ విఖనస మహర్షి రచించిన వైఖానస కల్పసూత్రంలో 18 సంస్కారాలు, 22 యజ్ఞాలు, ధర్మాలు, ప్రాయశ్చిత్తాలు ఉపదేశించారని తెలిపారు.

తెలంగాణ సాధనలో జయశంకర్ పాత్ర కీలకం

సినీ నటుడు ప్రకాశ్‌రాజ్



పురస్కారాలు అందుకున్న ప్రొఫెసర్ శివలింగ ప్రసాద్, అంపశయ్య నవీన్, శ్రీధర్ దేశ్‌పాండేలతో ప్రకాశ్‌రాజ్, ప్రొఫెసర్ హరగోపాల్, దేశపతి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వెలుగుతున్న జ్యోతి కన్నా.. దానిని వెలిగించిన అగ్గిపుల్లే గొప్పదని, ఇదే తరహాలో తెలంగాణ సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ కీలకపాత్ర పోషించారని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. శనివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ స్ఫూర్తి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శివలింగ ప్రసాద్, అంపశయ్య నవీన్, శ్రీధర్ దేశ్‌పాండేలకు స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. అమెరికా టారిఫ్ వార్ నుంచి మనం మెల్కోకోక పోతే ఆర్థిక ఇబ్బందులు తప్పవని అన్నారు. 'మీ కులం, మతం డేంజర్‌లో ఉన్నాయని, మాకు కాంట్రాక్టు ఇవ్వండి మేము చూసుకుంటాం'అనే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ఎక్కువగా మాట్లాడితే హిందూ వ్యతిరేకి అని ముద్ర వేస్తున్నారని, బురద జల్లడం రెండు నిమిషాలే కానీ.. దాన్ని కడుక్కోవడానికి రెండు రోజులు పడుతుందని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన జీవితాన్ని గడిపిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. ఆయన విశ్వ విద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి ఉండాలని అభిలషించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, ప్రొఫెసర్ కె.సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ ప్రధాన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, పొన్నం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ పర్యాటక సంస్థ సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని లక్డీకాపూల్‌లో శనివారం మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యాలయం.. దక్షిణ భారతదేశంలో తమ కార్యకలాపాలను సమర్థంగా సమన్వయం చేయనుంది. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పర్యాటక భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ మోహన్ ఆలపాటి మాట్లాడుతూ తమ కార్యాలయాన్ని నగరం మధ్యలో ఏర్పాటు చేయడంతో అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

కోట్ల విలువైన.. కొమ్ము గుర్రాలు

'స్టార్టప్'.. మనం తరచూ వింటున్న పేరు. ఒక వినూత్న ఆలోచన, ధైర్యే సాహసే లక్ష్మీ అన్న స్ఫూర్తితో ఎంతోమంది ఇలాంటివి ఏర్పాటుచేశారు. అలా మార్కెట్లోకి అడుగుపెట్టిన కంపెనీల్లో.. వినూత్న ఆలోచనలు, సాంకేతికత వినియోగం వంటి వాటితో నిలదొక్కుకున్నవి కొన్నే. అలా సుమారు రూ.8,700 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీగా ఎదిగిన స్టార్టప్‌ను యూనికార్న్ అని పిలుస్తారు. ఈ పదాన్ని 2013లో వెంచర్ క్యాపిటలిస్ట్ ఐలీన్ లీ మొట్టమొదట ఉపయోగించారు.

పేటీఎం, ఫోన్‌పే, జొమాటో, ఓలా, స్విగ్గీ.. ఇలాంటి ఎన్నో కంపెనీలు మనకు సుపరిచితమైనవే. వివిధ రూపాల్లో మన నిత్య జీవితంలోనూ భాగమైపోయాయి. ఇంకా చాలా కంపెనీలు ఉన్నాయిగా అనొచ్చు. కానీ.. అవి వీటిలా ఒక ప్రత్యేక హోదా పొందలేదు. అదే యూనికార్న్. ఒక బిలియన్ డాలర్ల మార్కెట్ విలువున్న స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. ఇవేకాదు.. ఇందులో ఇంకా డెకాకార్న్, హెక్టాకార్న్ వంటివీ ఉన్నాయి. యూనికార్న్ స్థాయికి చేరడానికి సిద్ధంగా ఉన్న 'జింక'లూ, 'చిరుత'లూ కూడా ఉన్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



యూనికార్న్
1 బిలియన్ డాలర్ల విలువైన కంపెనీ.

డెకాకార్న్
ఇది యూనికార్న్ కంటే ఒక మెట్టు ఎక్కువ. 10 బిలియన్ డాలర్ల విలువైన సంస్థ.

హెక్టాకార్న్
100 బిలియన్ డాలర్ల విలువైన కంపెనీ.

మినికార్న్
1 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ ఉండే కంపెనీ. ఇలాంటివి భవిష్యత్తులో యూనికార్న్‌లు అవతరించే అవకాశం ఉంటుంది.

సూనికార్న్
సమీప భవిష్యత్తులో యూనికార్న్‌గా ఎదిగేందుకు అవకాశం ఉన్న కంపెనీని ఈ పేరుతో పిలుస్తారు.

గజెల్
ఇది ఒక రకమైన జింక జాతి. ఇవి గరిష్ఠంగా గంటకు 100 కి.మీ. వేగంతో పరుగెత్తగలవు. వచ్చే మూడేళ్లలో యూనికార్న్ హోదా పొందే అవకాశం ఉన్న కంపెనీలను గజెల్ అంటారు.

చిరుత
వచ్చే ఐదేళ్లలో యూనికార్న్ హోదా పొందే అవకాశం ఉన్న కంపెనీలను చీతా అని పిలుస్తారు. ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా ఫ్యూచర్ యూనికార్న్ ఇండెక్స్ - 2024 ప్రకారం మనదేశంలో 46 గజెల్స్, 106 చిరుతలు ఉన్నాయి.

121 యూనికార్న్‌లు

ప్రముఖ మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ ట్రాక్సన్ అంచనా ప్రకారం.. మనదేశంలో ప్రస్తుతం 121 యూనికార్న్ కంపెనీలు ఉన్నాయి. 2025 జనవరి –ఆగస్టు మధ్య కొత్తగా 4 స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా అవతరించాయి. గతేడాది ఈ జాబితాలోకి 6 కంపెనీలు వచ్చి చేరడం విశేషం. ప్రపంచంలో అత్యధిక యూనికార్న్‌లు ఉన్న దేశం అమెరికా. అక్కడ 1,048 ఉన్నాయి. ఆ తరవాతి స్థానంలో చైనా (245) ఉంది. భారత్ మూడో స్థానంలో నిలిచింది. దేశంలో అత్యధిక యూనికార్న్‌లు ఉన్న నగరం బెంగళూరు. అక్కడ 52 ఉంటే గురుగ్రామ్‌లో 19, ముంబైలో 19 ఉన్నాయి.

కొన్ని ప్రధాన యూనికార్న్ కంపెనీలు

ఆన్‌లైన్‌లో ఆహారం: స్విగ్గీ, జొమాటో, లీషియస్	ఆన్‌లైన్ పేమెంట్, ఇతర సేవలు: ఫోన్‌పే, పేటీఎం	క్విక్ కామర్స్: బ్లింకిట్, జెప్టో
ఎడ్‌టెక్: అన్‌అకాడమీ, బైజూస్, వేదాంతు, ఫిజిక్స్‌వాలా, లీడ్ స్కూల్	ఆన్‌లైన్ ఫార్మసీ: టాటా 1 ఎంజీ, ఫార్మ్‌ఈజీ; బైక్, ట్యాక్సీ, ఆటో, క్యాబ్ రైడ్స్: ర్యాపిడో, ఓలా	ఆన్‌లైన్ గేమింగ్: మొబైల్ ప్రీమియర్ లీగ్, డ్రీమ్ 11, గేమ్స్ 24 బై 7
ఆన్‌లైన్ ట్రేడింగ్: జెరోధా, గ్రో, అప్‌స్టాక్స్	ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే: రేజర్ పే, బిల్‌డెస్క్	సౌందర్య ఉత్పత్తులు, కాస్మెటిక్స్: నైకా, పర్పుల్
ఆన్‌లైన్ షాపింగ్: స్నాప్‌డీల్, ఫ్లిప్‌కార్ట్		

మరికొన్ని ప్రముఖ యూనికార్న్‌లు: బిగ్ బాస్కెట్, కల్ట్ ఫిట్, బోట్, ఫస్ట్ క్రై, లెన్స్‌కార్ట్, డెల్హివరీ, పోర్టర్, పాలసీ బజార్, క్రెడ్, అర్బన్ కంపెనీ, ప్రిస్టీన్ కేర్, ఏథర్, భారత్‌పే, జెటా, మనీవ్యూ, ఏకో

రూ.8,700 కోట్ల విలువున్న స్టార్టప్‌లే యూనికార్న్‌లు
దేశంలో ప్రస్తుతం ఇలాంటి కంపెనీల సంఖ్య 121
వినూత్న ఆలోచనలు, వ్యాపార వ్యూహాలతో ఈ స్థాయికి
ఉపాధి, సరికొత్త అవకాశాలు సృష్టిస్తున్న స్ఫూర్తిదాతలు

స్టార్టప్ ఇండియా

కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రారంభించిన స్టార్టప్ ఇండియా కార్యక్రమం, ప్రోత్సాహకర కార్యక్రమాలు ఈ పదేళ్లలో స్టార్టప్‌లు రికార్డు స్థాయిలో పెరగడానికి దోహదపడ్డాయి. మనదేశంలో యూనికార్న్ హోదా పొందిన మొట్టమొదటి స్టార్టప్ కంపెనీ ఇన్‌మొబి. ఈ మొబైల్ అడ్వర్టయిజింగ్ కంపెనీ 2011లో యూనికార్న్ హోదా పొందింది. దేశంలో జూన్ 30 నాటికి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) లెక్కల ప్రకారం ఉన్న స్టార్టప్‌లు 1,80,683.

సంవత్సరం	ఏర్పాటైన స్టార్టప్‌లు
2020	14,852
2021	20,282
2022	26,596
2023	34,842
2024	34,284
2025 (జూన్ 30)	22,977

యూనికార్న్స్.. వీటి రూటే వేరు

యూనికార్న్ కంపెనీలేవీ రాత్రికిరాత్రే కోట్ల రూపాయల ఆదాయాలు గడించలేదు. దాని వెనుక ఎన్నో సృజనాత్మక ఆలోచనలు ఉన్నాయి. యూనికార్న్‌లలో దాదాపు అన్ని కంపెనీలూ.. ఆయా రంగాల్లో మొట్టమొదటివి. ఈ కంపెనీలన్నీ దాదాపుగా టెక్నాలజీని సద్వినియోగం చేసుకున్నవే. వినియోగదారులకు వస్తువులు, సేవల సౌలభ్యాన్ని పెంచినవే. ఇవి ఏం చేస్తున్నాయంటే...

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయి
- అత్యాధునిక సాంకేతికతలు వినియోగిస్తున్నాయి
- సరికొత్త బిజినెస్ మోడళ్లను ప్రజలకు పరిచయం చేస్తున్నాయి
- వినూత్న వ్యాపార అవకాశాలను సృష్టిస్తున్నాయి
- ఎంతోమంది యువతకు స్టార్టప్‌లు ఏర్పాటుచేయాలన్న స్ఫూర్తిని ఇస్తున్నాయి.

ఓపెన్ వర్సిటీలో ఆదివాసీలకు ఉచిత విద్య

వీసీ ప్రొ.ఘంటా చక్రపాణి

సాక్షి, హైదరాబాద్: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఆదివాసీ విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యను అందిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించిన వారిలో ఎవరున్నారని కాకుండా ఏయే వర్గాల వారు లేరో విశ్వవిద్యాలయం పరిశోధన చేసిందని, పూర్తి స్థాయిలో గణాంకాలను విశ్లేషించుకుంటే కొన్నివర్గాలు, తెగలు ఇంకా చదువుకు దూరంగా ఉన్నాయనే విషయం వెల్లడయిందని వివరించారు. అందులో ముఖ్యంగా ఆదివాసీ తెగలు ఉన్నత విద్యలో అత్యంత వెనుకబడి ఉన్నాయని గుర్తించి వారికి ఉన్నత విద్యను ఉచితంగా అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. తమ విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సులకు దేశంలోనే అత్యంత తక్కువగా ఏడాదికి రూ.3,200 మాత్రమే ఫీజు వసూలు చేస్తున్నదని, అడవి బిడ్డలకు అది కూడా భారం కాకూడదనే ఉద్దేశంతో ఆదివాసీ ఉచిత విద్యా ప్రణాళిక ప్రారంభించామని వివరించారు. రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు తదితర తెగల అడవిబిడ్డలకు అండగా నిలవడం, వారి నివాస ప్రాంతాలకు దగ్గరలో ఎలాంటి బోధన రుసుము లేకుండా కేవలం రూ.500 నామమాత్రపు అడ్మిషన్ ఫీజుతో ఉచితంగా చదువు చెప్పడం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో కనీసం ఒక వెయ్యి మంది ఆదివాసీ పిల్లలను పట్టభద్రులుగా నిలబెట్టాలన్నది తమ లక్ష్యమని వీసీ ఘంటా చక్రపాణి వివరించారు. మరిన్ని వివరాలకు హెల్ప్‌డెస్క్ 040-23680333 / 040-23680555, కాల్‌సెంటర్: 1800 5990 101లో సంప్రదించాలని, లేదా వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

గోపన్‌పల్లి భూములపై హైకోర్టు స్టే

కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో నిషేధిత జాబితాలోని సర్వే నంబర్ 36/ఈలోని 17.04 ఎకరాల భూమి కార్యకలాపాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 2కు వాయిదా వేసింది. గోపన్‌పల్లిలోని వివాదాస్పద భూమిలో సర్వే నంబర్ 36/ఏలోని 12.20 ఎకరాల్లో 8.36 ఎకరాలు, సర్వే నంబర్ 36/ఈలోని 10 ఎకరాల్లో 8.08 ఎకరాలు.. ఇలా మొత్తంగా 17.4 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారు. అయితే ఈ భూములను థర్డ్ పార్టీకి అప్పగించేందుకు వీలుగా రెవెన్యూ ముఖ్య కార్యదర్శి జూన్ 23న ప్రొసీడింగ్స్ జారీ చేశారని.. ఇది రాజ్యాంగ విరుద్ధమని గచ్చిబౌలి మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ భూములు తమవని సొసైటీ వాదిస్తోంది. రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితా నుంచి కొంత భాగాన్ని తొలగించడం ద్వారా రెవెన్యూ ఎంట్రీలను సవరించారని పేర్కొంది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రెవెన్యూ అధికారుల తీరు చట్ట విరుద్ధమన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 300ఏలను ఉల్లంఘించేవిగా ఉన్నాయన్నారు. గతంలో ఇదే అంశంపై దాఖలైన కేసులో ఈ భూములపై హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు జారీ చేసిందని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సర్వే నంబర్ 36/ఏఏ, 36/ఈలోని వివాదాస్పద భూములపై స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్త సిలబస్ అమలయ్యేనా?

డిగ్రీ సిలబస్ మార్పుపై ప్రైవేటు కాలేజీల విముఖత

- ప్రభుత్వ కాలేజీల్లో మౌలిక వసతుల సమస్య
- పరిశ్రమలతో లింకింగ్ కష్టమంటున్న కొన్ని కాలేజీలు
- లైఫ్ సైన్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు కలిసి రాని కంపెనీలు
- క్షేత్రస్థాయి పరిశీలన కరువైందంటున్న కాలేజీలు
- ఇంకా ఖరారు కాని కొన్ని సబ్జెక్టుల సిలబస్



సాక్షి, హైదరాబాద్: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు చివరి దశకు చేరినా, సిలబస్ మార్పుపై ఇంకా స్పష్టత రాలేదు. దీంతో రాష్ట్రంలో ఎక్కడా డిగ్రీ తరగతులు ఇప్పటికీ మొదలు కాలేదు. కొత్త సిలబస్ కోసం కాలేజీలు, విద్యార్థులు ఉన్నత విద్యామండలి వైపు చూస్తున్నారు. రాష్ట్రంలోని 960 డిగ్రీ కాలేజీల్లో 4,38,926 సీట్లు ఉంటే, ఈ ఏడాది 1,97,739 సీట్లు భర్తీ అయ్యాయి. స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఇంకో 5 వేల మంది చేరే వీలుంది. బీకాం కోర్సుల్లో 77 వేల మందికిపైగా చేరారు. లైఫ్‌సైన్స్ కోర్సుల్లో 37 వేల మంది చేరారు. బీఏ ఇతర కోర్సుల్లో ప్రవేశాలు ఏటా 30 శాతానికి మించడం లేదు. దీంతో విద్యార్థులను ఆకర్షించేందుకు ఈ ఏడాది అన్ని సబ్జెక్టుల్లోనూ సిలబస్ మార్పు చేస్తామని ఉన్నత విద్యా మండలి ప్రకటించింది. అనేక కొత్త కోర్సులతోపాటు సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాప్టర్లు కూడా తేవాలని భావించారు. ఇంగ్లిష్, ఫిజిక్స్‌లో కొంత పురోగతి సాధించినా, మిగతా సబ్జెక్టులపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఈ నెల రెండో వారం నుంచి పూర్తి స్థాయిలో డిగ్రీ తరగతులు మొదలవ్వాల్సి ఉన్నా అది జరగడం లేదు. సిలబస్‌పై స్పష్టత లేకపోవడంతో పబ్లిషర్లు పుస్తకాలు కూడా ముద్రించలేదు.

మార్పులు సరే.. వసతులు ఎక్కడ?

డిగ్రీలో ఈసారి సిలబస్ మార్చి పారిశ్రామిక భాగస్వామ్యంతో స్కిల్స్ అందించాలని నిర్ణయించారు. కాలేజీలు ప్రముఖ కంపెనీలతో ఈ దిశగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలి. పట్టణ ప్రాంతాల్లోని కాలేజీలకు ఇది సమస్య కానప్పటికీ, గ్రామీణ ప్రాంత కాలేజీలు మాత్రం ఇబ్బంది పడుతున్నాయి. పట్టణాల్లో కూడా చిన్న కాలేజీలకు పారిశ్రామిక భాగస్వామ్యం కుదిరే అవకాశం లేదని తెలుస్తోంది. బీకాంలో ఇప్పుడు కొత్తగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), ఈ కామర్స్ ఆపరేషన్స్, రిటైల్ ఆపరేషన్స్ వంటి కోర్సులు వచ్చాయి. కానీ, ఆడిటర్ల దగ్గర అనుభవం నేర్చుకోవాలన్న నిబంధనను కాలేజీలు అంగీకరించడం లేదు. కోర్సు పూర్తయ్యాక విద్యార్థులు సొంతంగా వెళ్లేలా నిబంధనలు మార్చాలని కోరుతున్నాయి. బీఎస్సీలోనూ టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఆపరేషన్స్, డిజిటల్ ఇండస్ట్రియల్ ఆపరేషన్స్, మేథ్స్ డేటాసైన్స్, బీఎస్సీ ఆనర్స్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో పాటు బీఎస్సీలో ఏదైనా ఒక ఇతర సబ్జెక్టు చేసుకునే వీలుంది. దీంతో బీఎస్సీ మేథ్స్ విద్యార్థులు డేటాసైన్స్ వైపు ఆసక్తి చూపుతున్నారు. కానీ, వీటికి బోధకుల కొరత చాలా కాలేజీల్లో కన్పిస్తోంది. మౌలిక వసతుల కొరత కూడా ఉంది. ప్రధానంగా డిజిటల్ లైబ్రరీలకు కాలేజీలు ఖర్చు పెట్టాలంటే ఇష్టపడటం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించకుండా సిలబస్ మార్పులు సరికాదని ప్రైవేటు కాలేజీలు అంటున్నాయి. ప్రైవేటు కాలేజీల్లోనూ ఫ్యాకల్టీ కొరత ఉందని ఉప కులపతులు అంటున్నారు. సిలబస్ మార్పుతో పాటు అవసరమైన వసతులు కూడా కల్పించకపోతే ప్రయోజనం లేదని చెబుతున్నారు.

ఎస్‌బీఐ నుంచి పబ్లిక్ ఇష్యూకు 2 సంస్థలు

- జనరల్ ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ల లిస్టింగ్‌కు యోచన
- ఎస్‌బీఐ గ్రూప్ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి
- తెలుగు రాష్ట్రాల్లో 30 ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ శాఖలు ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రెండు అనుబంధ సంస్థల పబ్లిక్ ఇష్యూపై కసరత్తు చేస్తోందని ఎస్‌బీఐ గ్రూప్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు (సీఎస్) శెట్టి తెలిపారు. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ వీటిలో ఉన్నాయని చెప్పారు. స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌కు సంబంధించి నిర్దిష్ట గడువేదీ నిర్దేశించుకోలేదని పేర్కొన్నారు. గ్రూప్‌లో ప్రస్తుతం 18 అనుబంధ సంస్థలు ఉన్నాయని, వీటిపై సుమారు రూ.6,500 కోట్లు ఇన్వెస్ట్ చేయగా, వాటి విలువ ప్రస్తుతం రూ.4 లక్షల కోట్ల పైచిలుకు ఉంటుందని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని అనకాపల్లి, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన 30 హెల్త్ ఇన్సూరెన్స్ శాఖలను శనివారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఇవి ప్రత్యేకంగా ఆరోగ్య బీమా సర్వీసులను అందించేందుకే ఉద్దేశించినవని శ్రీనివాసులు శెట్టి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 2,100 పైగా ఆస్పత్రుల నెట్‌వర్క్‌తో సేవలు అందిస్తున్నట్లు ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ నవీన్ చంద్ర ఝా చెప్పారు.

టారిఫ్‌ల అనిశ్చితి తొలగిపోతే మంచిది..

భారత్‌పై అమెరికా టారిఫ్‌ల వల్ల ప్రత్యక్షంగా పడే ప్రభావం తక్కువే అయినప్పటికీ, వాటి వల్ల తలెత్తిన అనిశ్చితి సాధ్యమైనంత త్వరగా తొలగిపోతే మంచిదని శ్రీనివాసులు శెట్టి అభిప్రాయపడ్డారు. అమెరికాకు ఎక్కువగా ఎగుమతయ్యే రసాయనాలు, టెక్స్‌టైల్స్, ఆభరణాలు, తెలుగు రాష్ట్రాల నుంచి ఆక్వా తదితర రంగాలకు టారిఫ్‌ల వల్ల సవాళ్లు తలెత్తవచ్చని చెప్పారు. అయితే, టారిఫ్‌ల ప్రభావిత రంగాలకు రుణాలు స్వల్ప స్థాయిలోనే ఉన్నందున తమ బ్యాంకుపై ప్రభావం పెద్దగా ఉండదని తెలిపారు.

టెక్ కేంద్రంగా హైదరాబాద్‌కు మరింత ఖ్యాతి

- ప్రపంచ సాంకేతికత, ఇన్నోవేషన్‌కు ప్రధాన కేంద్రం
- సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపుతాం
- ఈయాప్‌సిస్ జీఐసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



ఈయాప్‌సిస్ జీఐసీని ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాయదుర్గం: ప్రపంచ సాంకేతికత, ఇన్నోవేషన్ కేంద్రంగా హైదరాబాద్ నగరానికి ఉన్న స్థానం మరింత బలపడుతోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని ఈయాప్‌సిస్ సంస్థ కొత్తగా విస్తరించిన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ (జీఐసీ)ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈయాప్‌సిస్ విస్తరణతో అంతర్జాతీయంగా హైదరాబాద్ మరింత గుర్తింపు పొందుతుందని తెలిపారు. సర్వీస్ ఆధారిత కంపెనీలను నడపడం తేలిక కానీ.. ప్రొడక్ట్ ఆధారిత కంపెనీలు ఎక్కువ సవాళ్లు ఎదుర్కొంటాయని అన్నారు. సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కంపెనీలు యూనికార్న్ స్థాయిని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు, వృత్తి నిపుణుల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందించే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లో గతంలో మూడు యూనికార్న్‌లు మాత్రమే ఉండేవని.. ఇప్పుడు అవి 30 నుంచి 40 వరకు పెరిగాయని చెప్పారు. ఈయాప్‌సిస్ కొత్త కార్యాలయం నగరానికి మరింత గుర్తింపు తెస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈయాప్‌సిస్ చైర్మన్ బద్దం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఇన్నోవేషన్ సెంటర్ తమ ప్రయాణంలో ఒక పెద్ద మైలురాయి వంటిదని చెప్పారు. ఇది తమకు కొత్త సాంకేతికతలలో మార్పును నడిపే స్థితిని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సెంటర్ ద్వారా ఒరాకిల్ క్లౌడ్, ఈఆర్‌పీ కన్సల్టెంట్లు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టుల వంటి వందలాది అధిక నైపుణ్యాలుగల ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈయాప్‌సిస్ సీఓఓ, డైరెక్టర్ బద్దం సుజినిరెడ్డి, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ ఉదయ భాస్కర్ గామిని ప్రసంగించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నె సతీష్‌కుమార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈసీపై విశ్వాసం లేకుంటే రాజీనామా చేయాలి

రాహుల్‌గాంధీకి బీజేపీ డిమాండ్

న్యూఢిల్లీ: దేశ ఎన్నికల కమిషన్(ఈసీ)పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి విశ్వాసం లేకుంటే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఓట్ల చోరీ ఆరోపణలపై రాతపూర్వక డిక్లరేషన్ ఇవ్వలేని రాహుల్ అందుకు నైతిక బాధ్యత వహించాలని కోరింది. బీజేపీ జాతీయ ప్రతినిధి గౌరవ్ భాటియా శనివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియపై నమ్మకం లేకుంటే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, మరో ఎంపీ ప్రియాంకా గాంధీ కూడా లోక్‌సభ, రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా ఇవ్వాలన్నారు. ఆ తర్వాత వారు సుప్రీంకోర్టు, హైకోర్టుకు ప్రజల వద్దకు తీర్పు కోసం వెళ్లాలన్నారు. ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ చేస్తున్నవన్నీ నిరాధార ఆరోపణలుగా ఆయన కొట్టిపారేశారు. గతంలో సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో ఎన్నికల కమిషన్ పనితీరును ప్రశంసించిందంటూ గుర్తు చేశారు. 'మీకు ఇష్టమైనవైతే అంగీకరిస్తారు, అలా లేకుండా అసౌకర్యమనిపిస్తే ఎన్నికల కమిషన్‌పై నిందలు వేస్తారు. ఇది సరైన విధానం కాదు' అంటూ కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు.

వందేభారత్.. తగ్గేదేలే



అధిక ఆక్యుపెన్సీతో హైదరాబాద్ వందేభారత్ రైళ్లు

- దేశంలోని టాప్ 10 సర్వీసుల్లో చోటు
- విశాఖపట్నంకు రెండు తిరుగుతున్నా 130 శాతం ఓఆర్
- తిరుపతికి మరో సర్వీసు అవసరమని అధికారుల అంచనా
- ఆక్యుపెన్సీలో నిరాశపరిచిన నాగ్‌పూర్ సర్వీసు
- దీన్ని రద్దు చేసే యోచనలో రైల్వే బోర్డు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మీదుగా నడుస్తున్న వందేభారత్ రైళ్లు సూపర్ సక్సెస్ అయ్యాయని మరోసారి స్పష్టమైంది. ప్రయాణికుల ఆదరణ భారీగా ఉండటంతో ఇటీవలే వాటి కోచ్‌ల సంఖ్యను పెంచారు. అయినా, టాప్ ఆక్యుపెన్సీ రేషియోతో దూసుకుపోతున్నాయి. దీంతో విశాఖపట్నం, తిరుపతి మధ్య మరో వందేభారత్ రైలును నడిపేందుకు ఆస్కారం ఉందని అధికారులు తేల్చారు.

సాధారణ రైళ్లతో పోలిస్తే టికెట్ ధర చాలా ఎక్కువ కావటంతో దేశంలోని కొన్ని మార్గాల్లో వందేభారత్ రైళ్ల ఆదరణ స్వల్పంగా తగ్గింది. హైదరాబాద్ నుంచి నడుస్తున్న వందేభారత్ రైళ్లకు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. రద్దీ నేపథ్యంలో కోచ్‌ల సంఖ్య పెంచగా, ప్రయాణికుల సంఖ్య కూడా భారీగా పెరిగింది.

దేశంలోనే టాప్ సర్వీసులలో స్థానం

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 136 వందేభారత్ సర్వీసులు నడుస్తున్నాయి. రాష్ట్రాల నుంచి డిమాండ్ల నేపథ్యంలో వాటి సంఖ్య పెంచేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. దేశంలోని అన్ని రూట్లలో రైళ్లు 130 కి.మీ. వేగంతో దూసుకుపోయేలా ట్రాక్‌ల సామర్థ్యం పెంచుతున్నారు. కొన్ని కీలక రూట్లలో 160 కి.మీ. వేగానికి పెంచుతున్నారు. ఈ ట్రాక్ అప్‌గ్రెడేషన్ పనుల కారణంగా కొన్ని రూట్లలో వందేభారత్ రైళ్ల సగటు వేగం గంటకు 78 కి.మీ.కు తగ్గింది. దీంతో కొన్ని రూట్లలో ప్రయాణికుల ఆదరణ కూడా స్వల్పంగా తగ్గింది. సాధారణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పోలిస్తే వీటి టికెట్ ధరలు ఎక్కువగా ఉండటం కూడా జనంలో కొంత ఆదరణ తగ్గేందుకు కారణమైంది. కానీ, హైదరాబాద్ నుంచి నడుస్తున్న నాలుగు వందేభారత్ రైళ్ల మాత్రం క్రమంగా ప్రయాణికుల సంఖ్య పెంచుకుంటూ దేశంలోనే అత్యధిక ఆదరణ ఉన్న టాప్ 10 సర్వీసుల్లో స్థానం పొందాయి. దక్షిణ మధ్య రైల్వే తొలి వందేభారత్ సర్వీసుగా 2023 జనవరి 15న సికింద్రాబాద్-విశాఖపట్నం వందేభారత్ రైలు మొదలైంది. 16 కోచ్‌లతో ప్రారంభమైన ఈ సర్వీసు ఆది నుంచి 140 శాతానికి మించిన ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తూ వచ్చింది. దీంతో 2024 మార్చిలో ఈ రెండు నగరాల మధ్య రెండో వందేభారత్ రైలును 8 కోచ్‌లతో ప్రారంభించారు. రెండోది కూడా 135 శాతాన్ని మించిన ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తూ వచ్చింది. అప్పట్లో దేశంలో టాప్ 5 సర్వీసుల్లో ఒకటిగా ఇవి నిలిచాయి. దీంతో 2025 జనవరిలో తొలి సర్వీసు కోచ్‌ల సంఖ్యను 20కి, రెండో సర్వీసు కోచ్‌ల సంఖ్యను 16కు పెంచారు. కోచ్‌లను భారీగా పెంచినా వీటి ఓఆర్ 130 శాతంగా నమోదవుతుండటం విశేషం. సికింద్రాబాద్-తిరుపతి మధ్య 2023 ఏప్రిల్ 8న ప్రారంభమైన సర్వీసుకు 8 కోచ్‌లే ఉండటంతో ఆక్యుపెన్సీ రేషియో 133 శాతంగా ఉంటూ వచ్చింది. కోచ్‌ల సంఖ్యను 2024 మేలో 16కు పెంచినా ఓఆర్ 120 శాతానికి మించి నమోదవుతోంది. దీంతో ఈ మార్గంలో మరో వందేభారత్ సర్వీసు నడపాలన్న యోచనలో రైల్వే బోర్డు ఉంది. కాచిగూడ-బెంగళూరు(యశ్వంత్‌పూర్) మధ్య 2023 సెప్టెంబర్‌లో 8 కోచ్‌లతో ప్రారంభమైన వందేభారతసర్వీసుకు 110 శాతాన్ని మించిన ఓఆర్ నమోదవుతూ వచ్చింది. దీంతో ఈ నెల 10న కోచ్‌ల సంఖ్యను 16కు పెంచారు. ఇప్పుడు దీని ఓఆర్ 80 శాతంగా ఉంది.

నాగ్ 'పూర్'సర్వీసు..

సికింద్రాబాద్- పుణె మధ్య గతేడాదే వందేభారత్ రైలు మంజూరైంది. కానీ, అది పట్టాలెక్కకుండానే అనూహ్యంగా సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య సర్వీసు ప్రారంభించారు. ప్రయాణికుల డిమాండ్‌తో సంబంధం లేకుండా రాజకీయ నేతల ఒత్తిడితో దీన్ని ప్రారంభించారు. దేశంలో 20 కోచ్‌లతో నడిచే రెండో సర్వీసుగా దీన్ని తిప్పటం ప్రారంభించారు. కానీ, ప్రయాణికుల ఆదరణ లేక ఆక్యుపెన్సీ రేషియో 30 శాతం మాత్రమే నమోదవుతూ వచ్చింది. దీంతో గత ఫిబ్రవరి 19 నుంచి ఒకేసారి కోచ్‌ల సంఖ్యను మూడోవంతుకు కుదించి 8 కోచ్‌లతో మాత్రమే నడుపుతున్నారు. మొత్తం ప్రయాణికులు ఆ 8 కోచ్‌లలోనే సర్దుకుంటుండటంతో ఆక్యుపెన్సీ రేషియో 70 శాతంగా నమోదవుతోంది.

రైలు నం.	ఎక్కడి నుంచి ఎక్కడికి	ఆక్యుపెన్సీ రేషియో				కోచ్‌ల సంఖ్య సవరించక పూర్వం ఓఆర్
		ఏప్రిల్	మే	జూన్	జూలై	
20707	సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం	129	133	127	102	143
20834	సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం	131	134	127	119	135
20703	కాచిగూడ నుంచి బెంగళూరు	112	110	111	80	110
20701	సికింద్రాబాద్ నుంచి తిరుపతి	117	122	120	116	133
20102	సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్	90	92	84	72	30

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా తనకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు, కాంగ్రెస్ మహిళా శ్రేణులు, ఇతరులతో కలిసి గ్రూప్ ఫొటో దిగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

దుర్గం గట్టు.. అభివృద్ధి చేస్తే ఒట్టు


శిథిలావస్థకు చేరిన కోట

- ఆనవాళ్లు కోల్పోతున్న చారిత్రక కట్టడం
- కాకతీయ రాజుల హయాంలో నిర్మాణం
- శిథిలావస్థకు చేరుకున్న శివాలయం
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న స్థానికులు
- అటకెక్కిన ఎమ్మెల్యే హామీ..

దమ్మపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుర్వాయి గూడెం గ్రామ శివారులోని దుర్గం గట్టుపై కాకతీయుల కాలంలో నిర్మించిన పలు కట్టడాలు, శ్రీ శంకరగిరి దుర్గేశ్వర స్వామి ఆలయం చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్నాయి. కాకతీయుల చరిత్రను ఇనుమడింపజేసేలా ఉన్న ఈ కట్టడాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కాకతీయ రాజుల్లో చివరివాడైన ప్రతాపరుద్రుడు దుర్గం గట్టుపై పలు చారిత్రక కట్టడాలు, ఆలయాలు నిర్మించినట్టు చరిత్రకారులు చెబుతున్నారు. దాదాపు 20 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న ఈ గట్టుపై.. క్రీ.శ.1289 – 1323 మధ్య కాలంలో శ్రీ శంకరగిరి దుర్గేశ్వర స్వామి ఆలయంతో పాటు గట్టు చుట్టూ శత్రుదుర్భేద్యమైన రాతికోట నిర్మించారు. నీటి సౌలభ్యం కోసం గట్టుపై ఆరు బావులు తవ్వి, వాటి లోపల రాతి కట్టడాలు నిర్మించారు. ఆ బావి నీటితోనే కాకతీయులు దుర్గేశ్వర స్వామికి అభిషేకం, అర్చన చేసేవారంటారు. గుట్టపై నిర్మించిన ధ్యాన మందిరాలు నేటికీ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఈ మందిరాల్లో ఆనాడు కాకతీయ వంశీయులు ధ్యానం చేసేవారని తెలుస్తోంది. అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ముప్పయ్ సంవత్సరాల క్రితం వరకు కూడా దుర్గం గట్టుపై ఉన్న శివయ్యకు విశేష పూజలు చేసి, దీపధూప నైవేద్యాలు సమర్పించేవారు. మహా శివరాత్రి సందర్భంగా ఐదు రోజులపాటు ఇక్కడ జాతర నిర్వహించేవారు. కాకతీయుల చరిత్రకు తార్కాణంగా నిలిచే, ఈ గట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

సరైన మార్గం లేక..

దుర్గం గట్టు పైకి వెళ్లడానికి సరైన రవాణా మార్గం లేకపోవడంతో.. కాలక్రమేణా ఆలయ ప్రాభవం తగ్గిపోయింది. ఆలయానికి వెళ్లే భక్తుల సంఖ్య క్రమేపీ తగ్గిపోగా, నేటితరం వారికి దుర్గం గట్టు అంటే కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆలయం, కాకతీయుల చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇదే అదనుగా భావించిన కొందరు దుండగులు గట్టుపై.. గుప్త నిధుల కోసం పలుచోట్ల తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాలతో ఆలయంతో పాటు పలు రాతి కట్టడాలు ధ్వంసం కావడంతో.. పది సంవత్సరాల క్రితం మండల వాసులు తాత్కాలికంగా శివయ్యకు ఆలయం నిర్మించారు.

అమలుకాని ఎమ్మెల్యే హామీ

దుర్గం గట్టుపై ఆలయ పునర్నిర్మాణంతో పాటు కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాల ఆనవాళ్లను మెరుగుపరిచి, గట్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని.. ఈ ఏడాది జనవరిలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హామీ ఇచ్చారు. గత జనవరిలో దుర్గమ్మ గట్టును సందర్శించిన ఎమ్మెల్యే.. గట్టుపై చారిత్రక ఆనవాళ్లను పరిశీలించారు. ఎన్నికల కోడ్ పూర్తి కాగానే సౌర విద్యుత్ సౌకర్యంతో పాటు, తాగునీటి కోసం బోరు కూడా ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. నెలలు గడుస్తున్నా.. అభివృద్ధి పనులు మాత్రం ప్రారంభం కాలేదు.


కాకతీయుల కాలం నాటి శివలింగం


46 గట్టుపై చారిత్రక అనవాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ (పాత చిత్రం)


దుర్గం గట్టుపై నిర్మించిన రాతిబావి

రవాణా సౌకర్యం లేదు



దుర్గమ్మ గట్టు పైకి వెళ్లడానికి సరైన రవాణా మార్గం లేకపోవడంతో ఆలయ ప్రాధాన్యం మసకబారిపోతోంది. గట్టు పైకి వెళ్లడానికి సరైన మార్గం ఏర్పాటు చేస్తే, తిరిగి ఆలయానికి సందర్శకులు పెరుగుతారు. కాకతీయుల కాలం నాటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవలసిన అవసరం ఉంది. ప్రభుత్వం స్పందించి, ఆలయ అభివృద్ధికి పూనుకోవాలి.

– పాశం ప్రసాద్, గోపాలపురం, దమ్మపేట మండలం

చరిత్రను కాపాడుకోవాలి



ఓరుగల్లును పరిపాలించిన కాకతీయులు నిర్మించిన శ్రీ శంకరగిరి దుర్గేశ్వరస్వామి ఆలయ చరిత్ర, విశిష్టతను కాపాడుకోవలసిన అవసరం ఉంది. గట్టుపై ఉన్న ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. దేవాదాయ, పర్యాటక శాఖల సహకారంతో దుర్గం గట్టును అభివృద్ధి చేసి, విద్యుత్, రవాణా, తాగు నీటి సౌకర్యాలను కల్పించాలి.

– విజయ మారుతి శర్మ, దమ్మపేట

వంటకు బకాయిల మంట

- పేరుకుపోయిన మధ్యాహ్న భోజనం కార్మికుల బిల్లులు
- ఐదారు నెలలుగా పెండింగ్‌లోనే వేతనాలు
- కార్మికులకు భారంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ
- కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అందని కోడి గుడ్లు
- సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామంటున్న కార్మికులు

కొత్తగూడెం అర్బన్: మధ్యాహ్న భోజనం కార్మికుల బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో అప్పు చేసి భోజనం వండి పెట్టాల్సి వస్తోందని, వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో.. మెనూ ప్రకారం కూరగాయలు, ఆకుకూరల పప్పు, కోడి గుడ్డు భోజనంలో అందించలేకపోతున్నారు. బిల్లుల విడుదల కోసం 6, 7 తేదీల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. ఆ రెండు రోజులు పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంతో.. విద్యార్థులు అవస్థలు పడ్డారు. బిల్లులు, వేతనాలు విడుదల చేయకపోతే.. సెప్టెంబర్ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని కార్మికులు చెబుతున్నారు. అదే జరిగితే పాఠశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో ఉండాల్సి వస్తుంది.

విద్యార్థులకు అందని కోడి గుడ్డు

ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పప్పు, ఆకుకూరలు, సాంబారు వడ్డించాలి. వారానికి రెండు సార్లు కోడిగుడ్డు అందించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉండగా, ప్రభుత్వం రూ.6 మాత్రమే చెల్లిస్తోంది. దీనివల్ల మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై భారం పడుతోంది. ఫలితంగా జిల్లాలోని చాలా పాఠశాలల్లో కోడిగుడ్డును విద్యార్థులకు అందించడం లేదు. దీంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల కూడా కొన్నిచోట్ల కోడిగుడ్డు వడ్డించడం లేదు. దీంతో కొన్ని పాఠశాలల్లో సాంబారుతోనే మధ్యాహ్న భోజనం పథకం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులు (పాత చిత్రం)

బిల్లులు విడుదల చేయాలి



మధ్యాహ్న భోజన పథకం బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో అవస్థ పడుతున్నాం. కార్మికులు అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలి. సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తాం.

– సత్తెనపల్లి విజయలక్ష్మి,
కార్యదర్శి, జిల్లా మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్

గత మార్చి నుంచి వేతనాలు పెండింగ్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,150 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పని చేస్తున్నారు. వారికి నెలకు రూ.2 వేలు వేతనం ఇస్తుండగా, గత మార్చి నుంచి వేతనాలు చెల్లించలేదు. 9, 10వ తరగతులకు సంబంధించి జనవరి నుంచి కూరగాయలు, ఆకుకూరలు, గుడ్డు బిల్లులు నిలిచిపోయాయి. దీంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వడ్డీ భారంతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, వేతనాలు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.


శనివారం క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీ భవన్‌లో గాంధీ, నెహ్రూ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న పొన్నం, భట్టి, మహేశ్‌గౌడ్, వీహెచ్ తదితరులు


టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న మహిళా కార్యకర్త


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి సీతక్క


శనివారం రాత్రి భారీ వర్షానికి హైదరాబాద్ వీఎస్‌టీ క్రాస్‌రోడ్స్ వద్ద జలమయమైన రహదారి


అమీర్‌పేటలో నీటమునిగిన రోడ్డుపై వాహనదారుల ఇక్కట్లు



నీకో బుక్క.. నాకో బుక్క

తనకు ఎవరో ఇచ్చిన ఆహారంలో.. కొంత శునకానికి పెట్టాడు.. 'ఏమైంది..? తిను.. అలిగినవా..?'అంటూ లాలించాడు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రోడ్డుపై నిల్చొని ఒక బాలుడు యాచిస్తుండగా ఒకాయన గమనించి.. 'కాస్త తిను బిడ్డా'అని ఆహారం అందజేశాడు. కానీ ఆ బాలుడు ఆ ఆహారంలో సగం శునకానికి పెట్టి, మిగతా సగం తాను తిని పెద్దమనసును చాటుకున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి







ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం

అల్లూరు జిల్లా కేంద్రం పాడేరు పరిసర ప్రాంతాల్లో సహజసిద్ధ అందాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఎటు చూసినా ఎత్తయిన కొండలు, పచ్చని పొలాలు, చెట్లు, పొదలు, రకరకాల పూల మొక్కలతో ప్రకృతి సౌందర్యం అణువణువునా ఆకట్టుకుంతోంది. ఇక్కడి వాతావరణం పర్యాటకుల మనసులను మైమరపింపజేస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చీకటి మబ్బులు, పొగమంచు అందాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. – పాడేరు రూరల్



అమితమైన ప్రేమ అమ్మ. అంతులేని అనురాగం అమ్మ. అమ్మ ప్రాణం పోసి జీవమిస్తే.. ఆ ప్రాణానికి ఓ రూపు ఇచ్చి వ్యక్తిగతంగా వృద్ధిలోకి తెచ్చే వ్యక్తి నాన్న. ఈ ఇద్దరికీ దూరమై ఎంతోమంది చిన్నారులు అనాథలుగా మారిపోతున్నారు. అల్లారుముద్దుగా పెరగాల్సిన వారు దిక్కుమొక్కులేకుండా జీవిస్తున్నారు. అలాంటి వారు తమకూ అమ్మానాన్న కావాలని, అందరి పిల్లల్లా తామూ వారి ప్రేమకు నోచుకోవాలని ఎదురుచూస్తున్నారు.

అమ్మానాన్న కావాలి

- దత్తత కోసం అనాథ చిన్నారుల ఎదురుచూపులు
- చట్టప్రకారం జరిగితేనే దత్తత హక్కులు వర్తిస్తాయి
- బిడ్డను దత్తత ఇవ్వాలంటే తల్లిదండ్రుల సమ్మతి ఒక్కటే సరిపోదు
- ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా ఇచ్చినా దత్తత హక్కులు వర్తించవు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనాథ పిల్లలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. వివాహేతర సంబంధాల కారణంగా చాలామంది గర్భం దాల్చడం, ప్రసవం కాగానే ముళ్లపొదల్లోనో, నిర్మానుష్య ప్రదేశాల్లోనూ పసికందులను వదిలి వెళుతున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. పేగు బంధాన్ని కాదనుకుని సమాజానికి భయపడి చేస్తున్న ఈ ఘటనలు కలచి వేస్తుంటాయి. కానీ ఇలాంటి పిల్లలను అక్కున చేర్చుకునేందుకు దత్తతకు ముందుకు రావాలనేది అందరి అభిప్రాయం.

దత్తత చట్టప్రకారమే జరగాలి..

దత్తత అనేది పుట్టగానే ఎవరి బిడ్డనో ఆ తల్లిదండ్రుల సమ్మతితో తెచ్చుకున్నంత మాత్రాన సరిపోదు. చట్ట ప్రకారమే జరగాలి. దత్తత కావాలనుకునే తల్లిదండ్రులు తమ పాన్‌కార్డు ద్వారా www.cara. nic. in (సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దీనికోసం దంపతులు పాన్‌కార్డు, ఆదాయ, వయస్సు, నివాస, వివాహ, ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలతో పాటు దంపతుల ఫొటో వెబ్‌సైట్‌కు అప్‌లోడ్ చేయాలి. ఇవన్నీ అప్‌లోడ్ చేసిన తర్వాత ఏజెన్సీకి రూ.6 వేలు డీడీ సమర్పించాలి. ఇవన్నీ పూర్తయ్యాక 48 గంటల లోగా దంపతుల మొబైల్‌కు సమాచారం వస్తుంది. అనంతరం ఏజెన్సీకి వెళ్లి బిడ్డను రిజర్వు చేసుకోవచ్చు.

బిడ్డ నచ్చిన తర్వాత..

బిడ్డ నచ్చిన తర్వాత రిజర్వు చేసుకొని, రూ.40 వేలు ఏజెన్సీకి చెల్లించాలి. అన్ని ధ్రువపత్రాలు పరిశీలించిన తర్వాత బిడ్డను అప్పగిస్తారు. బిడ్డను పొందిన వారం రోజుల్లోగా దత్తతకు వచ్చిన డాక్యుమెంట్లన్నీ స్థానిక ఫ్యామిలీ కోర్టు లేదా జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించి దత్తతకు అధికారిక ఉత్తర్వులు పొందే అవకాశం ఉంటుంది. శిశుగృహతో పాటు సీసీఐ (చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్)లో ఉన్న వారినీ దత్తత చేసుకోవచ్చు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో శిశుగృహాలు, బాలల సంరక్షణ సంస్థ(సీసీఐ)ల్లో ఉంటున్న దాదాపు వంద మంది చిన్నారులు దత్తత కోసం ఎదురుచూస్తున్నారు.

రెండేళ్ల పాటు బిడ్డ పరిశీలన..

దత్తత తీసుకున్న దంపతులు బిడ్డను తీసుకెళ్లాక.. దత్తత ఏజెన్సీకి చెందిన ప్రతినిధి రెండేళ్ల పాటు బిడ్డను ప్రతి ఆరు మాసాలకోసారి పరిశీలిస్తారు. బిడ్డకేమైనా ఇబ్బందులున్నాయా, తల్లిదండ్రులు సరిగా చూసుకుంటున్నారా లేదా ఇవన్నీ పరిశీలించి జాతీయ దత్తత ఏజెన్సీ 'కారా'కు సమర్పిస్తారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దత్తత ఇలా..

ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు	
అబ్బాయిలు	48
అమ్మాయిలు	75
మొత్తం	123
విదేశీయులు దత్తత తీసుకున్నది	
అబ్బాయిలు	1
అమ్మాయిలు	8
మొత్తం	9
దత్తత కోసం వేచి ఉన్న దంపతులు	73
ఏటా దత్తత కోసం వచ్చే దరఖాస్తులు	25

శిశువుల పట్ల ఔదార్యం ఉండాలి



ఎంతోమంది అనాథ చిన్నారులు ఆసరా కోసం ఎదురుచూస్తున్నారు. చాలామంది సంతానం లేని జంటలు ఇలాంటి బిడ్డలను దత్తత తీసుకుని తల్లిదండ్రులు కావచ్చు. సంతానం లేకపోవడం శాపం కాదు.. దత్తత చేసుకోవడం ఒక వరం. శిశువుల పట్ల ఔదార్యం కలిగి ఉండాలి.
– తరిమెల రమణారెడ్డి, అమ్మ ట్రస్ట్ చైర్మన్

విశాఖలో

ఆటీన్ రాణులు

- భర్త ఫిర్యాదుతో వెలుగులోకి మహిళల 'చతుర్ముఖ పారాయణం'
- కుటుంబాన్ని పట్టించుకోకుండా మూడు ముక్కలాట
- సీపీకి ఫిర్యాదు చేసిన ఓ భర్త
- ఆరుగురు మహిళల అరెస్ట్.. రూ.22 వేలు స్వాధీనం



విశాఖ సిటీ: విశాఖ ఆటీన్ రాణులు పెరిగిపోతున్నారు. చతుర్ముఖ పారాయణంలో మునిగితేలుతున్నారు. పలువురు మహిళలు ఏకంగా పేకాట డెన్‌లు సైతం నిర్వహిస్తున్నారు. కుటుంబాలను సైతం పట్టించుకోకుండా మూడు ముక్కలాటలో నిమగ్నమైపోతున్నారు. తన భార్య పేకాట మత్తులో పడి తమను పట్టించుకోవడం లేదని ఒక భర్త నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. మహిళామణుల జూద క్రీడ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు ఆరుగురు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22 వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్లే పేకాట డెన్‌లు

ఇప్పటి వరకు పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కిన వారంతా మగవారే. కానీ ఇపుడు కాలం మారిపోయింది. అన్నింట్లోను సమానమే అన్నట్లు ముక్కలాటలోను జోరుమీద ఉన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక గ్యాంగ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. జూద క్రీడకు ఎక్కడకు వెళ్లకుండానే ఇళ్లనే పేకాట డెన్లుగా మార్చేసుకుంటున్నారు. భర్తలను, పిల్లలను సైతం పట్టించుకోకుండా ముక్కలు విసిరే పనిలో బిజీగా ఉంటున్నారు. దీన్నే కొందరు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఇళ్లలో పేకాట నిర్వహణకు కమీషన్ సైతం తీసుకుంటున్నారు. కొన్ని అపార్టుమెంట్లలో జోరుగా పేకాట నిర్వహిస్తున్నారు.

ఆరుగురి అరెస్ట్

సీపీ ఆదేశాలతో పోలీసులు ఆ ఇంటిపై దాడులు చేశారు. లోపల పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22 వేలను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొందరు కొన్నేళ్లుగా వివిధ ప్రాంతాల్లో నిత్యం పేకాట ఆడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పనిలో ఉంటున్నట్లు తెలుసుకున్నారు. ఇటువంటి వారిపై పోలీసులు నిఘా పెట్టారు. వీరు ఎక్కడెక్కడ పేకాట నిర్వహిస్తున్నరన్న విషయంపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

భార్య పేకాటపై భర్త ఫిర్యాదు

ఇప్పటి వరకు సీరియల్స్, సినిమాలు, ఫోన్లలో పడి భర్తలు, పిల్లలను పట్టించుకోని ఆడవారు ఉన్నట్లు వింటూ వస్తున్నాం. కానీ పేకాటలో పడి పిల్లలను, తనను పట్టించుకోవడం లేదన్న విషయం ఒక భర్త ఫిర్యాదుతో తాజాగా వెలుగులోకి వచ్చింది. అక్కయ్యపాలెం లలితానగర్ ప్రాంతంలో ఒక ఇల్లు పేకాట డెన్‌గా మారింది. ఆ ఇంటి గృహిణే ఈ జూద క్రీడకు లీడర్‌గా వ్యవహరిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి మహిళలను రప్పించి ఆ ఇంట్లో నిత్యం మూడు ముక్కలాట ఆడిస్తోంది. భర్తను, పిల్లలను సైతం పట్టించుకోకుండా ఆటలోనే మునిగితేలుతోంది. భర్త ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. దీంతో విసుగెత్తిపోయిన భర్త ఇటీవల ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. అతను పట్టించుకోకపోవడంతో నేరుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశారు. తన భార్య పేకాట కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తన గోడును విన్నవించుకున్నాడు. పేకాట డెన్‌గా మారిపోయిన తమ ఇంటిని మార్చాలని కోరారు. దీనికి స్పందించిన సీపీ విచారణ అనంతరం సీఐని బదిలీ చేశారు.



డి హీరేహాళ్ మండలం దొడగట్ట వద్ద సాగుచేసిన పత్తి (ఇన్‌సెట్) ఉద్దేహాళ్ వద్ద కోతకొచ్చిన పత్తి

పత్తి ధరలు పతనం

- క్వింటా రూ.8,400 నుంచి రూ.7,200కు డౌన్
- అన్నదాతల్లో మొదలైన ఆందోళన
- ఇప్పటికీ ఇళ్లల్లోనే పత్తి నిల్వలు

రాయదుర్గం: అనంతపురం జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. గత ఏడాది రబీలో వ్యవసాయ బోర్లు, హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో 2,190 హెక్టార్లలో పత్తి సాగైంది. ప్రస్తుత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు తగ్గి.. పత్తి విస్తీర్ణం పెరిగింది. 13,695 హెక్టార్లలో పత్తి పంట పెట్టారు. రెండు నెలల క్రితం పంట కోతకొచ్చింది. అప్పట్లో పత్తి నాణ్యత ఆధారంగా క్వింటా ధర రూ.8000 నుంచి రూ.8,500 పలికింది. కొందరు రైతులు విక్రయించుకోగా, మరి కొందరు ఇంకో రెండు నెలల పాటు నిల్వ చేస్తే క్వింటా రూ.9 వేలకు పెరిగినపుడు అమ్ముకోవచ్చని ఆశించారు. అయితే పరిస్థితి తారుమారైంది. క్వింటా రూ.7200కు ధర పడిపోవడం రైతులను కలవర పెడుతోంది.

మార్కెట్ సదుపాయం కరువే..

జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నా సరైన మార్కెట్ సదుపాయం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి అమ్ముకోవాలంటే కర్ణాటక రాష్ట్రం బళ్లారి, తుమకూరు ప్రాంతాల్లోని మిల్లులు, ఏఎంసీ మార్కెట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అక్కడ ఏ ధర నిర్ణయించినా సరే దానికే అమ్ముకోవాల్సి వస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని దళారులే ధర నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. ఊళ్లలోనే ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తూ రైతుల నడ్డి విరుస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పత్తి కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మద్దతు ధరతో కొనాలి



ఈ ఏడాది పత్తికి ప్రారంభ ధర క్వింటాలు రూ.8500కు పైగా పలికినా.. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. దీంతో ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పడిపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింది. పెట్టుబడులు చూస్తే ఎకరాకు రూ.40 వేల వరకు పెరిగిపోయాయి. కనీసం క్వింటా పత్తి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేలు పలికితేనే గిట్టుబాటు లభిస్తుంది. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి. నా వద్ద 20 క్వింటాళ్ల పత్తిని నిల్వ చేశాను. ధర కోసం వేచి ఉన్నా.
– జగదీశ్వర్‌రెడ్డి, రైతు, ఉద్దేహాళ్

రైతులను ఆదుకోవాలి



పత్తి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. బళ్లారి మార్కెట్లో ఇష్టమొచ్చిన విధంగా ధరలు నిర్ణయిస్తున్నారు. కూటమి సర్కార్ మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేయాలి. జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలి. నష్టపోతున్న రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.
– రామాంజినేయులు, రాయంపల్లి

పట్టు పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. పట్టు రైతుల సమస్యలను గాలికి వదిలేసింది. గత ప్రభుత్వం పట్టు రైతులకు అందించిన ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. ఎన్నికల ప్రచార సమయంలో పట్టు రైతులను ఆదుకుంటామని కూటమి పెద్దలు స్పష్టమైన హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత హామీ అమలు ఊసే లేకుండా పోవడంతో పట్టు రైతులు తీవ్ర ఇబ్బందుల్లో నలిగిపోతున్నారు. అయితే ప్రభుత్వం కరుణించకపోయినా.. మార్కెట్ మాత్రం అత్యవసర సమయంలో పట్టు రైతులను ఆదుకుంది. మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700కు పైగా చేరుకుంది.



హిందూపురం మార్కెట్‌లో విక్రయానికి తీసుకువచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు (ఫైల్)

పట్టు వీడని సర్కార్ నిర్దయ

- పట్టు రైతులకు అందని ప్రోత్సాహకం
- అత్యవసర సమయంలో ఆదుకున్న మార్కెట్
- రూ.700 దాటిన కిలో బైవోల్టిన్ పట్టు గూళ్ల ధర
- మూడు రోజులుగా ధరల నిలకడ

మడకశిర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం అందడం లేదు. ప్రభుత్వ పట్టు మార్కెట్లలో అమ్మిన బైవోల్టిన్ పట్టుగూళ్లు ప్రతి కిలోకు రూ.10 చొప్పున ప్రోత్సాహక ధనం అందాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పట్టు రైతులకు పైసా కూడా ప్రోత్సాహక ధనం అందలేదు. పట్టు రైతులను ఆదుకోవాలని, ప్రోత్సాహక ధనం అందించాలంటూ పట్టు రైతులు పలుమార్లు విజయవాడకు వెళ్లి ధర్నాలు చేపట్టారు. అయినా ప్రభుత్వంలో చలనం రాలేదు. రూ.కోట్లల్లో ప్రోత్సాహక ధనం బకాయిలు పేరుకుపోవడంతో పట్టు రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కరుణించిన 'మార్కెట్'

పట్టు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్ధయగా వ్యవహరిస్తూ వచ్చినా... అత్యవసర సమయంలో మార్కెట్ కరుణించింది. దీంతో పంట సాగుకు చేసిన అప్పుల భారం నుంచి బయటపడతామనే ధైర్యం పట్టు రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు పెరిగాయి. సత్యసాయి జిల్లా హిందూపురంలోని ప్రభుత్వ పట్టు గూళ్ల మార్కెట్‌లో ఈ నెల 6 నుంచి బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర కిలో రూ.700 పైగా పలుకుతోంది. దీంతో జిల్లాలోని పట్టు రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత మూడు నెలల్లో ఎన్నడూ రూ.700 మార్క్‌ను దాటలేదు. దీంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని అప్పట్లో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కర్ణాటక మార్కెట్‌లోనూ ఆశాజనక ధరలు

కర్ణాటక మార్కెట్‌లోనూ పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కర్ణాటక ప్రాంతంలో రామనగర, శిడ్లగట్ట, చింతామణిలోని పట్టు గూళ్ల మార్కెట్లు ప్రధానమైనవి. జిల్లాలో గిట్టుబాటు ధరలేని సమయంలో సరిహద్దున ఉన్న మడకశిర, హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాలోని పలువురు రైతులు తమ పట్టు గూళ్లను కర్ణాటకలోని మార్కెట్లకు తరలించేవారు. ప్రస్తుతం కర్ణాటక మార్కెట్‌లోనూ కిలో పట్టుగూళ్ల ధర రూ.700 మార్క్ దాటింది. ముఖ్యంగా రామనగర మార్కెట్‌లో ఈ నెల 6న కిలో పట్టు గూళ్లు రూ.811 ధర పలకడం విశేషం.

పెరిగిన పట్టుగూళ్ల ఉత్పత్తి

కొన్ని రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలో పట్టుగూళ్ల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. హిందూపురం మార్కెట్‌కు ఈ నెల 6న 2,431 కిలోలు, 7న 2,112 కిలోలు, 8న 3,641 కిలోల బైవోల్టిన్ పట్టుగూళ్లను విక్రయానికి రైతులు తీసుకెళ్లారు. అలాగే కర్ణాటకలోని రామనగర మార్కెట్‌కూ భారీగా బైవోల్టిన్ పట్టుగూళ్లు చేరుతున్నాయి. అమ్మకానికి ఈ నెల 6న 22,173 కిలోలు, 7న 29,913 కిలోలు, 8న 24,590 కిలోల బైవోల్టిన్ పట్టుగూళ్లు అమ్మకానికి వచ్చినట్లు అక్కడి అధికారులు తెలిపారు.

గత మూడు రోజులుగా హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

తేదీ	కనిష్ఠం (కిలో)	గరిష్ఠం (కిలో)
6న	రూ.540	రూ.763
7న	రూ.551	రూ.760
8న	రూ.480	రూ.745

కర్ణాటకలోని రామనగర్ మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు

తేదీ	కనిష్ఠం (కిలో)	గరిష్ఠం (కిలో)
6న	రూ.471	రూ.811
7న	రూ.412	రూ.793
8న	రూ.400	రూ.789

ధర పెరగడంతో బయటపడ్డాం



రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టు గూళ్ల ధరలు పెరగడంతో కష్టాల నుంచి బయటపడినట్లైంది. లేకపోతే పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ధరలు నిలకడగా ఉండాలని కోరుకుంటున్నాం.
– సోమ్‌కుమార్, పట్టు రైతు, మడకశిర

ప్రోత్సాహక ధనం అందించాలి



బైవోల్టిన్ పట్టు రైతులకు ప్రోత్సాహక ధనం అందలేదు. రూ.కోట్లల్లో ప్రోత్సాహక ధనం అందాల్సి ఉంది. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరినా ఫలితం ఉండదు. రైతుల బాగోగులను కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పట్టు రైతులు ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు.
– వేమారెడ్డి, పట్టు రైతు, పాపసానిపల్లి, మడకశిర మండలం



ధనుష్, రాజ్‌కుమార్ రావ్, రితేష్ దేశ్‌ముఖ్



ఫర్హాన్ అక్తర్, అగస్త్య నందా, యామీ గౌతమ్, రణ్‌దీప్ హుడా

బయోపిక్

• సిల్వర్ స్క్రీన్‌పై ప్రముఖుల జీవితాలు

మిస్సైల్ మేన్ అబ్దుల్ కలామ్ జీవితం గురించి తెలుసుకోవాలని ఎవరికి ఉండదు? మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ ధైర్య సాహసాలు చూడాలని ఎవరికి ఉండదు? ట్రాజెడీ క్వీన్ మీనా కుమారి జీవితం గురించి తెలుసుకోవాలని ఎవరికి ఉండదు? కొందరు లెజెండ్స్ జీవితాలు అందరికీ ఆసక్తిదాయకంగానే ఉంటాయి. అందుకే వారి జీవితాలకు వెండితెర రూపం ఇస్తే... ఆ బయోపిక్‌కి ఉండే క్రేజే వేరు. ప్రస్తుతం బాలీవుడ్‌లో పలువురు లెజెండ్స్ జీవితాలతో సినిమాలు రూపొందుతున్నాయి. ఆ ప్రముఖుల 'బయోపిక్స్' గురించి తెలుసుకుందాం.

మిస్సైల్ మేన్‌లా...

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డా. ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా 'కలామ్' చిత్రం రూపొందనుంది. ఈ మిస్సైల్ మేన్ పాత్రను ధనుష్ పోషించనున్నారు. 'ఆది పురుష్' దర్శకుడు ఓం రౌత్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ని ఈ ఏడాది మేలో ఫ్రాన్స్‌లో జరిగిన కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఆవిష్కరించారు. 'ది మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియా' అనేది 'కలాం' సినిమా టైటిల్‌కి ట్యాగ్‌లైన్‌గా నిర్ణయించింది యూనిట్. అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్‌కుమార్, క్రిషణ్ కుమార్, గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. భారత అంతరిక్ష, రక్షణ కార్యక్రమాలకు అబ్దుల్ కలాం చేసిన సేవను ఈ చిత్రంలో చూపించనున్నారు. రామేశ్వరం నుండి రాష్ట్రపతి భవన్ వరకు కలాం స్ఫూర్తిదాయక జీవితాన్ని ప్రపంచానికి చూపించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ని ఎప్పుడు ఆరంభిస్తారనేది తెలియాల్సి ఉంది.

యువర్ హానర్...

లాయర్‌గా కోర్టులో ఎలా వాదించాలో శిక్షణ తీసుకుంటున్నారు రాజ్‌కుమార్ రావ్. ఎందుకంటే 'యువర్ హానర్' అంటూ అసలు సిసలైన లాయర్‌గా ఒదిగిపోవడానికి. భారతదేశ ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్ జీవితం ఆధారంగా రూపొందనున్న చిత్రంలో రాజ్ కుమార్ రావ్ నటించనున్నారు. ఉజ్వల్ నికమ్ కెరీర్‌లో అత్యంత కీలకమైన ముంబై 26/11 ఉగ్రవాద దాడుల్లో అజ్మల్ కసబ్‌పై జరిగిన విచారణ నేపథ్యంలో ప్రధానంగా ఈ సినిమా సాగుతుంది. అవినాష్ అరుణ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని దినేష్ విజన్ నిర్మించనున్నారు. ఎంతో పేరు, ప్రతిష్ఠలు ఉన్న ఉజ్వల్ నికమ్ పాత్రలో తన నటన గౌరవప్రదంగా ఉండటానికి రాజ్ కుమార్ రావ్ ప్రత్యేకంగా వర్క్‌షాప్‌కి హాజరై, శిక్షణ తీసుకుంటున్నారట. ఈ చిత్రం షూటింగ్‌ని అక్టోబరులో ఆరంభించాలనుకుంటున్నారు. ''ఉజ్వల్ నికమ్‌లాంటి గౌరవప్రదమైన న్యాయవాదికి గొప్ప నివాళిగా ఈ చిత్రం ఉంటుంది'' అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు.

మరాఠా యోధుడు శివాజీ జీవితంతో...

డ్రీమ్ ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు రితేష్ దేశ్‌ముఖ్. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జీవితాన్ని వెండి తెరపై ఆవిష్కరించాలని, శివాజీ పాత్రను తానే చేయాలనీ రితేష్‌కి కొంత కాలంగా ఉన్న కల. ఆ కల నెరవేర్చుకుంటున్నారు. 'రాజా శివాజీ' టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో రితేష్ నటించడం మాత్రమే కాదు... దర్శకత్వం వహిస్తుండటం విశేషం. మూడు నాలుగు నెలల క్రితం విడుదల చేసిన ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి స్పందన లభించింది. మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మే 1న విడుదల చేయనున్నారు. మరాఠీ, హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ''ఛత్రపతి శివాజీకి గొప్ప నివాళిగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, ఫర్దీన్ ఖాన్, భాగ్యశ్రీ... ఇలా భారీ తారాగణంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం ఒక చారిత్రక వ్యక్తి మాత్రమే కాదు... లక్షలాది మంది హృదయాలలో నివసించే భావోద్వేగం. ఆయన అసాధారణ జీవిత కథలో ఒక భాగాన్ని చెప్పగలగడం గౌరవం, గొప్ప బాధ్యత'' అని రితేష్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు.

మేజర్ షైతాన్ సింగ్

పరమ వీర చక్ర పురస్కారగ్రహీత మేజర్ షైతాన్ సింగ్‌గా ఒదిగిపోవడానికి ఓ నటుడిగా ఏమేం చేయాలో అన్నీ చేస్తున్నారు ఫర్హాన్ అక్తర్. ఎందుకంటే ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టంతో రూపొందిస్తున్న '120 బహదూర్'లో షైతాన్ సింగ్ భాటీ పాత్ర పోషిస్తున్నారు ఫర్హాన్ అక్తర్. 1962లో ఇండియా–చైనాల మధ్య జరిగిన యుద్ధంలో 'రెజాంగ్ లా' పోరాట ఘట్టం ముఖ్యమైనదిగా చెప్పుకుంటారు. ఈ ఘటన ప్రధానాంశంగా రూపొందుతున్న చిత్రం '120 బహదూర్'. ఈ సినిమాలో ఇండియా–చైనా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్‌గా ఫర్హాన్ అక్తర్ నటిస్తున్నారు. రజనీష్ ఘాయ్ ఈ సినిమాకు దర్శకుడు. ''ఇది మన సైనికుల వీరత్వం, ధైర్యాన్ని చాటి చెప్పే కథ'' అని పేర్కొన్నారు ఫర్హాన్. ఈ సినిమాను ఈ ఏడాది నవంబరు 21న రిలీజ్ చేయనున్నామని మేకర్స్ ప్రకటించారు.

62 ఏళ్ల వయస్కురాలిగా యామీ

62 ఏళ్ల వయసులో తనకు విడాకులు ఇచ్చిన భర్త నుంచి భరణం కోరుకుంటుంది షా బానో. అయితే అతను ససేమిరా అంటాడు. చేసేదేం లేక ఈ మహిళ కోర్టు మెట్లు ఎక్కుతుంది. భరణం కోసం న్యాయ పోరాటం చేస్తుంది. 1985లో జరిగిన ఈ కేసు ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రానికి సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో 62 ఏళ్ల వృద్ధురాలు షా బానో పాత్రను యామీ గౌతమ్ చేశారు. ఆమె భర్త అహ్మద్ ఖాన్ పాత్రను ఇమ్రాన్ హష్మీ పోషించారు. ఈ పాత్ర యామీకి ఓ సవాల్ లాంటిది. ఎందుకంటే మూడు పదుల వయసులో ఉన్న యామీ అంతకు రెండింతలు వయసు ఉన్న మహిళగా ఒదిగిపోవడం అంటే ఫిజికల్‌గా చాలా ట్రాన్స్‌ఫార్మ్ కావాలి... అలాగే ప్రోస్థెటిక్ మేకప్‌కి ఎక్కువ సమయం కేటాయించారు. నటనపరంగా కూడా చాలా జాగ్రత్త తీసుకున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబరు లేదా నవంబరులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఆపరేషన్ ఖుక్రి

యునైటెడ్ పీస్ కీపింగ్ మిషన్‌లో భాగంగా వెస్ట్ ఆఫ్రికాకి వెళ్లిన 233 మంది భారతీయ సైనికులు అక్కడి రెబల్ ఫోర్స్ ట్రాప్‌లో చిక్కుకుంటారు. ఆ తర్వాత 75 రోజుల పాటు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ సైనికుల రెస్క్యూ ఆపరేషన్‌ని రాజ్ పాల్ పునియా లీడ్ చేశారు. 2000లో ఈ ఆపరేషన్ జరిగింది. ఈ ఆపరేషన్ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ఆపరేషన్ ఖుక్రి'. రాజ్‌పాల్ పునియా పాత్రను రణ్‌దీప్ హుడా పోషిస్తున్నారు. 'ఆపరేషన్ ఖుక్రి: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ది ఇండియన్ ఆర్మీస్ బ్రేవెస్ట్ పీస్ కీపింగ్ మిషన్ అబ్రాడ్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రానికి రణ్‌దీప్ హుడా ఓ నిర్మాతగానూ వ్యవహరిస్తున్నారు. ''నా హృదయాన్ని చాలా బలంగా తాకిన కథ ఇది'' అని రణ్‌దీప్ ఇటీవల పేర్కొన్నారు. అయితే ఈ చిత్రం ఆగిందనే టాక్ వినిపిస్తోంది. చిత్రదర్శకుడు అమిత్ శర్మ ఈ సినిమాని వదిలి, వేరే ప్రాజెక్ట్ చేపట్టడమే దీనికి కారణం అనే ప్రచారం జరుగుతోంది.

అగస్త్య నందాకి భలే చాన్స్

బిగ్ బి అమితాబ్ బచ్చన్ మనవడు (అమితాబ్ కుమార్తె శ్వేత కుమారుడు) అగస్త్య నందాకి నటుడిగా రెండో సినిమాకే మంచి అవకాశం దక్కింది. 'ఆర్చీస్' (2023) చిత్రంతో నటుడిగా కెరీర్ ఆరంభించారు అగస్త్య. అయితే ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలైంది. ఇక రెండో చిత్రంగా 'ఇక్కీస్' చిత్రానికి అవకాశం వచ్చింది. 1971 భారత్–పాక్ యుద్ధంలో పోరాడిన భారతీయ సైనికుడు అరుణ్ ఖేత్రపాల్ జీవితం ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రంలో అరుణ్ ఖేత్రపాల్ పాత్రను అగస్త్య చేశారు. భారత దేశపు అతి పిన్న వయస్కుడైన పరమ వీర చక్ర పురస్కారగ్రహీత అరుణ్ ఖేత్రపాల్ శౌర్యం, త్యాగాన్ని ఆవిష్కరించేలా ఈ చిత్రాన్ని దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కించారు. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు ధర్మేంద్ర కూడా నటించారు. ఈ చిత్రం అక్టోబరు 2న విడుదల కానుంది.

ఇవే కాదు... ఇంకొందరు ప్రముఖుల జీవితాలతో కొన్ని బయోపిక్స్ రూపొందుతున్నాయి.

- డి.జి. భవాని

ట్రాజెడీ క్వీన్ ఎవరు?

'ట్రాజెడీ క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమా' మీనా కుమారి కనబర్చిన నటనను నాటి తరం ప్రేక్షకులు అంత సులువుగా మరచిపోలేరు. భావోద్వేగం నిండిన బలమైన పాత్రల్లో ఆమె తనదైన ముద్ర వేశారు. ఎమోషనల్ క్యారెక్టర్స్‌లో ఆమె కనబర్చిన నటన మీనా కుమారికి 'ట్రాజెడీ క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమా' అనే పేరు తెచ్చింది. మీనా కుమారి జీవితం ఆధారంగా 'కమల్ ఔర్ మీనా' టైటిల్‌తో దర్శకుడు సిద్ధార్థ్ పి. మల్హోత్రా ఓ సినిమా తెరకెక్కించాలనుకుంటున్నారు. మీనా కుమారి పాత్రకు కియారా అద్వానీ బెస్ట్ చాయిస్ అని భావించి, ఆమెకు కథ కూడా వినిపించారట. కియారా కూడా ఈ పాత్ర పట్ల ఆసక్తి కనబర్చారనే వార్త బాలీవుడ్‌లో ప్రచారం అయింది. అయితే, సిద్ధార్థ్ మల్హోత్రాతో పెళ్లి, ఆ తర్వాత గర్భవతి కావడం, ఇటీవలే ఓ పాపకు జన్మనివ్వడం వంటి కారణాల వల్ల కియారా తన యాక్టింగ్ కెరీర్‌పై ప్రస్తుతానికి ఫోకస్ పెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో మీనా కుమారి పాత్రకు కృతీ సనన్ కూడా బాగుంటుందని సిద్ధార్థ్ పి. మల్హోత్రా ఈ బ్యూటీని సంప్రదించారట. ఫైనల్‌గా సిల్వర్ స్క్రీన్‌పై ఈ ట్రాజెడీ క్వీన్‌గా ఎవరు కనిపిస్తారో చూడాలి. ఇదిలా ఉంటే... ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా కూడా మీనా కుమారి జీవితం ఆధారంగా సినిమా తెరకెక్కించాలనుకున్నారు. అయితే ఈ సినిమా చేసే ఉద్దేశం లేదని ఆ తర్వాత ఆయన పేర్కొన్నారు.







భాగ్యశ్రీ, దుల్కర్

పసి మనసే... వినదసలే...

'హే పసి మనసే... వినదసలే... మహిమిది నీదే నీదా... హే..' అంటూ మొదలవుతుంది 'కాంత' సినిమాలోని 'హే పసి మనసే...' పాట. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ సినిమా ఇది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 12న విడుదల కానుంది. శనివారం ఈ సినిమాలోని 'హే పసి మనసే..' అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. 'ఏకాంతం ఈ పూట... ఆనందం ఈ చోట... మోహాలే నా నిండ... మౌనంగా నీతో ఉంటా...' అంటూ సాగే ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, ప్రదీప్ కుమార్ - ప్రియాంకా ఎన్‌కే పాడారు. ఈ సినిమాకు సంగీతం: ఝూను చంతర్.

నీకే ట్యాగ్ అయ్యానే!

''ఇన్‌స్టా ఆపేశానే... ట్విట్టర్ మానేశానే... నీకే ట్యాగ్ అయ్యానే... మలయాళీ పిల్లా....' అంటూ మొదలవుతుంది 'కే-ర్యాంప్' సినిమాలోని 'ఓనమ్' పాట లిరికల్ వీడియో. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'కే-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ సినిమా దీపావళి సందర్భంగా అక్టోబరు 18న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'ఓనమ్' పాట లిరికల్ వీడియోను శనివారం రిలీజ్ చేశారు. సురేంద్ర కృష్ణ ఈ పాటకు సాహిత్యం అందించగా, సాహితీ చాగంటితో కలిసి ఈ చిత్రసంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ ఈ మెలోడీ పాటను పాడారు. ''వైబే వచ్చేసిందే నిన్నే చూడగానే, లెఫ్టే ఉన్న గుండె రైటు రైటందే... పంచె కట్టులోనే నిన్నే చూడగానే... క్లాస్ మాస్ ఇలా మిక్స్ అయ్యిందే...', 'కేరళ కుట్టి నీకే బ్యానరు కట్టించాలే... చూపుతో చంపే నీకే హారతులివ్వాలే...' వంటి లిరిక్స్‌తో ఈ పాట సాగుతుంది.



• కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా

సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా...



• సంతోష్, మానస

'ఒకప్పటి సాధారణ క్షణాలన్నీ జ్ఞాపకాలుగా మారడమే జీవితం..' అనే క్యాప్షన్ 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రం టీజర్ చివర్లో కనిపిస్తుంది. సంతోష్ శోభన్, మానసా వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం ఇది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో అశ్విన్ చంద్ర శేఖర్ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళంలో విడుదలకు సిద్ధమవుతోంది. నెల్లూరుకు చెందిన శివ (సంతోష్ శోభన్) ఇంటీరియర్ డిజైనింగ్ చేసి, సరైన ఉద్యోగం లేక చెన్నై నగరంలో ఇబ్బందులు పడుతుంటాడు. ఖర్చుల కోసం బైక్ పూలింగ్ చేస్తుంటాడు. ప్రీతి (మానస వారణాసి) శివ బైక్ పై జర్నీ చేస్తుంది. అపరిచితులుగా కలిసిన శివ, ప్రీతి ప్రేమికులుగా మారడం వంటివి టీజర్‌లో ఆవిష్కరించారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, కో ప్రొడ్యూసర్: అజయ్ కుమార్ రాజు .పి.

చాయ్‌వాలా ప్రయాణం



• రాజీవ్, శివ

ప్రేమ, వారసత్వం ప్రధానాంశాలుగా రూపొందుతున్న చిత్రం 'చాయ్ వాలా'. శివ కందుకూరి, రాజీవ్ కనకాల లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ సినిమాకు ప్రమోద్ హర్ష దర్శకుడు. రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి, టీజర్‌ను త్వరలో రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ''భావోద్వేగాలు, సంప్రదాయం, కలలతో నడిచిన అద్భుతమైన ప్రయాణంగా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: ప్రశాంత్ ఆర్. విహారి.

సెమీకండక్టర్ల మార్కెట్ @ రూ. 9.6 లక్షల కోట్లు

దేశీయంగా 2030 నాటికి రెండు రెట్లు వృద్ధి

- అంతర్జాతీయ సప్లై చెయిన్‌లో కీలకంగా భారత్
- పరిశ్రమ అంచనాలు



న్యూఢిల్లీ: దేశీయంగా సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి 100-110 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9.6 లక్షల కోట్లు) స్థాయికి చేరనుంది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం రెండు రెట్లు వృద్ధి చెందనుంది. 2023లో 38 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ మార్కెట్ 2024-25లో 45-50 బిలియన్ డాలర్లకు చేరినట్లు పరిశ్రమ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ప్రస్తుతం ఈ రంగంపై తైవాన్, దక్షిణ కొరియా, జపాన్, చైనా, అమెరికా తదితర దేశాల ఆధిపత్యం ఉంటోందని వివరించాయి. సెమీకండక్టర్ల అవశ్యకత, కోవిడ్ మహమ్మారి కాలంలో నిర్దిష్ట ప్రాంతాలపై ఆధారపడటం వల్ల ఆటోమొబైల్ తదితర సెగ్మెంట్లు ఎదుర్కొన్న సంక్షోభ పరిస్థితులు, సవాళ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పరిశ్రమ స్పందన తదితర అంశాల గురించి ఇందులో తెలిపాయి. అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థలో విశ్వసనీయ భాగస్వామిగా భారత్ ఎదగాల్సిన అవసరాన్ని ప్రస్తావించాయి. ప్రకటన ప్రకారం.. ప్రపంచంలో తయారయ్యే మొత్తం సెమీకండక్టర్లలో తైవాన్ 60 శాతం ఉత్పత్తి చేస్తోంది. అత్యంత అధునాతన సెమీకండక్టర్ల ఉత్పత్తిలో తైవాన్ వాటా ఏకంగా 90 శాతం ఉంటోంది. ఒకే ప్రాంతంపై భారీగా ఆధారపడటమనేది అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలకు రిస్కులతో కూడుకున్న వ్యవహారమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. కోవిడ్ తరహా మహమ్మారులు, ప్రకృతి విపత్తులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల్లాంటి అనేకానేక అంశాల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించాయి. దీన్ని గుర్తించే చాలా దేశాలు ప్రస్తుతం సురక్షితమైన, వైవిధ్యమైన సరఫరా వ్యవస్థలను ఏర్పర్చుకుంటున్నాయని పేర్కొన్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్, దక్షిణ కొరియా దేశీయంగా చిప్‌ల తయారీని ప్రోత్సహించేందుకు, ఒకే ప్రాంతంపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు జాతీయ స్థాయిలో వ్యూహాలు అమలు చేస్తున్నాయని వివరించాయి. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న మార్పుల్లో భారత్ కూడా కీలకమైన, విశ్వసనీయమైన భాగస్వామిగా ఎదుగుతోందని పేర్కొన్నాయి.

1 ట్రిలియన్ డాలర్లకు గ్లోబల్ మార్కెట్ ..

పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం 2030 నాటికి అంతర్జాతీయంగా సెమీకండక్టర్ల మార్కెట్ 1 ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్లకు చేరనుంది. భారత్ ఇందులో గణనీయమైన వాటా దక్కించుకునే అవకాశం ఉంది. సెమీకండక్టర్ల తయారీ సరఫరా వ్యవస్థకు మూడు ప్రధాన మూల స్తంభాలైన పరికరాలు, మెటీరియల్స్..సర్వీసులు, పరిశోధన-అభివృద్ధి కార్యకలాపాల విభాగాల్లో కీలక భాగస్వామిగా ఎదిగే సత్తా భారత్‌కి ఉంది. సెమీకండక్టర్ల ఎక్విప్‌మెంట్‌కి అవసరమైన విడిభాగాలను ఉత్పత్తి చేసేందుకు చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్ఎంఈ) ఉపయోగించుకోవచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. సెమీకండక్టర్ సప్లై చెయిన్ కంపెనీలకు అవసరమైన రసాయనాలు, లోహాలు మొదలైనవి మన దగ్గర సమృద్ధిగా ఉన్నాయని వివరించాయి. ఇక సర్వీసుల విషయానికొస్తే ఆర్ అండ్‌డీ, లాజిస్టిక్స్, సరఫరా వ్యవస్థకు సంబంధించి కృత్రిమ మేధ, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)లాంటి విభాగాల్లోనూ భారత్ పటిష్టంగా ఉందని పేర్కొన్నాయి.

ప్రభుత్వం దన్ను..

అంతర్జాతీయంగా ఎలక్ట్రానిక్స్ వేల్యూ చెయిన్‌లకి భారత్‌ను మరింతగా అనుసంధానం చేసే దిశగా సెమీకండక్టర్ల ఫ్యాబ్రికేషన్, డిస్‌ప్లేల తయారీ, చిప్ డిజైన్ మొదలైన వాటిల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పరిశ్రమకు ఆర్థిక మద్దతు కల్పించేలా 2021 డిసెంబర్‌లో రూ. 76,000 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను ఆవిష్కరించింది. అమెరికాకు చెందిన మెమొరీ చిప్‌ల తయారీ దిగ్గజం మైక్రాన్, టాటా సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (టీఎస్ఏటీ), కేనెస్ సెమీకాన్, హెచ్‌సీఎల్-ఫాక్స్‌కాన్‌లతో పాటు తైవాన్ సంస్థ పవర్‌చిప్ సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ (పీఎస్ఎంసీ) భాగస్వామ్యంలో టాటా ఎలక్ట్రానిక్స్ (టీఈపీఎల్), రెనిసాస్ అండ్ స్టార్స్ భాగస్వామ్యంలో సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ ప్రైవేట్ లిమిటెడ్ మొదలైనవి భారత్‌లో సెమీకండక్టర్ల ఉత్పత్తి కోసం రూ. 1.55 లక్షల కోట్ల పైగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద చిప్ డిజైనింగ్ కోసం రూ. 1,000 కోట్లతో డిజైన్ ఆధారిత ప్రోత్సాహకాలకు కూడా ఐఎస్ఎం ప్రొవిజనింగ్ ఏర్పాటు చేసింది. అర్హత కలిగిన స్టార్టప్‌లకు ఆర్థికంగా మద్దతునిచ్చేందుకు ఇందులో రూ. 234 కోట్లు కేటాయించారు. '22 కంపెనీలు ప్రతిపాదించిన చిప్ డిజైన్ ప్రాజెక్టులకు కేంద్రం రూ. 234 కోట్ల మద్దతుకి హామీ ఇచ్చింది. ఈ మొత్తం ప్రాజెక్టుల వ్యయం రూ. 690 కోట్లుగా ఉంటుంది. ఈ చిప్‌లను సీసీటీవీ కెమెరాలు, మొబైల్ నెట్‌వర్క్‌లు, ఉపగ్రహాలు, కార్లు, స్మార్ట్ డివైజ్‌లు మొదలైన వాటిలో ఉపయోగిస్తారు. దేశీయంగా చిప్‌ల తయారీ వ్యవస్థను అభివృద్ధి చేసే క్రమంలో సెమీకండక్టర్ ఎక్విప్‌మెంట్ అండ్ మెటీరియల్స్ ఇంటర్నేషనల్ (సెమీ) భాగస్వామ్యంతో కేంద్రం సెమీకాన్ ఇండియా సదస్సుకు కూడా మద్దతునిస్తోంది' అని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ సదస్సులో అంతర్జాతీయ పరిశ్రమ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, విద్యావేత్తలు, అంకుర సంస్థలు కూడా పాల్గొంటాయి. పెట్టుబడులు, వ్యూహాత్మక భాగస్వామ్యాలపై చర్చలకు ఇది వేదికగా నిలుస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ 2 నుంచి 4 వరకు సెమీకాన్ ఇండియా 4వ ఎడిషన్ న్యూఢిల్లీలో జరుగనుంది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం), సెమీ కలిసి సెమీకాన్ ఇండియా 2025ని నిర్వహించనున్నాయి. అంతర్జాతీయంగా సెమీకండక్టర్ల వ్యవస్థలో భారత్ పాత్ర గురించి చాటి చెప్పే విధంగా ఈ సదస్సు ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఈయూతో ఒప్పందంపై దూకుడు పెంచాలి

సంస్కరణలు వేగవంతం చేయాలి

- 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల మోత నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) కుదుర్చుకోవడంపై భారత్ దూకుడు పెంచాలని 16 ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగారియా చెప్పారు. అదే సమయంలో అధిక వృద్ధి సాధించే దిశగా భూ, కార్మిక మార్కెట్ సంస్కరణలను వేగవంతం చేయడంతో పాటు నియంత్రణల భారాన్ని తగ్గించడంపై మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు. 'ఒక మార్కెట్ దాదాపు మూసుకుంటున్నప్పుడు మరో మార్కెట్ వైపు మళ్లాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈయూతో ఒప్పందం కుదుర్చుకోవడం చాలా, చాలా ముఖ్యం. అదే సమయంలో భూ, కార్మిక మార్కెట్‌కి సంబంధించి సంస్కరణలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది' అని ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పనగారియా చెప్పారు. 'మనపై టారిఫ్‌లు అమెరికా మార్కెట్లో ఎక్కువగా ఉండి యూరోపియన్ యూనియన్‌లో తక్కువగా ఉంటే.. మన ఎగుమతులను అమెరికా నుంచి ఈయూకి మళ్లించాలి. మార్కెట్లలో లాభాపేక్ష చాలా బలంగా ఉంటుంది. ఎంట్రప్రెన్యూర్లు చాలా స్మార్ట్‌గా వ్యవహరిస్తారు. చాలా వేగంగా సరఫరా వ్యవస్థల్లో మార్పులకు అనుగుణంగా సర్దుకుంటారు' అని చెప్పారు.

'ప్రస్తుత పరిస్థితి ఒక రకంగా 1991 నాటి పరిస్థితులను తలపిస్తోంది. అమెరికా భారీ టారిఫ్‌ల వల్ల సంక్షోభ పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో అప్పట్లో మనం ఏం చేశామనేది ఒకసారి గుర్తు చేసుకుని, ఏం చేయగలమనేది ఆలోచించాలి. చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. సంస్కరణల అజెండాలో చాలా చేశాం. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయి' అని సంపన్న దేశంగా ఎదగాలంటే భారత్ తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ స్థాయిలో మరిన్ని వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలని, ఎగుమతుల కోసం ఆసియా మార్కెట్లపై ఫోకస్ చేయాలని, అలాగే చైనాపై మన వైఖరిని కూడా పునఃసమీక్షించుకోవాలని పనగారియా సూచించారు.

డెడ్ ఎకానమీ .. అత్యధిక వృద్ధి..

భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీ (నిర్వీర్యంగా) అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై పనగారియా స్పందించారు. 'భారత ఎకానమీ నిజంగా నిర్వీర్యమైపోతే.. 7 శాతం స్థాయిలో అత్యధిక వృద్ధి సాధించదు. డాలర్ల మారకంలో చూస్తే మన వృద్ధి బహుశా ఇంకా ఎక్కువే ఉంటుంది. డెడ్ ఎకానమీకి ఆయన నిర్వచనం ఏమిటో నాకు తెలియదు. బహుశా (ఆయన ఉద్దేశం ప్రకారం) మృత దేహాల్లోనూ కదలిక ఉంటుందేమో' అని వ్యాఖ్యానించారు.

చిన్న సంస్థలకు.. పెద్ద కష్టం!!

అమెరికా టారిఫ్‌లతో ఎంఎస్ఎంఈలకు రిస్కులు

- ఎగుమతిదారులకు 35 శాతం పెరగనున్న వ్యయాలు
- ఆదుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: భారత ఎగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించాలన్న అమెరికా నిర్ణయం.. చిన్న, మధ్య తరహా సంస్థలను (ఎంఎస్ఎంఈ) కలవరపరుస్తోంది. దీని ప్రభావం తమపై చాలా తీవ్రంగా ఉంటుందని అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. టారిఫ్‌ల పెంపు .. వార్షికంగా దాదాపు 30 బిలియన్ డాలర్ల మేర వ్యాపార నష్టానికి దారి తీస్తుందని స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఫోరం (ఎస్ఎంఈ ఫోరం) ప్రెసిడెంట్ వినోద్ కుమార్ వెల్లడించారు. దీనివల్ల అత్యధికంగా నష్టపోయేది చిన్న సంస్థలేనని ఆయన చెప్పారు. వాటి ఆర్థిక స్తోమత, సామర్థ్యాలు పరిమిత స్థాయిలోనే ఉండటమే ఇందుకు కారణమని వివరించారు. టారిఫ్ షాక్ అనేది ఎంఎస్ఎంఈ ట్రేడర్లను చాలా కఠినతరమైన పరిస్థితుల్లోకి నెట్టివేసిందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ సెక్రటరీ జనరల్ అనిల్ భరద్వాజ్ చెప్పారు. 'గతంలో విధించిన 25 శాతానికి మరో 25 శాతం టారిఫ్‌లు తోడు కావడం వల్ల భారతీయ ఎగుమతిదారులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇతర దేశాల పోటీ సంస్థలతో పోలిస్తే మన ఎగుమతిదారుల వ్యయాలు 30-35 శాతం పెరిగిపోతాయి' అని తెలిపారు. దీని వల్ల, ఆగస్టు 27లోగా (అదనపు టారిఫ్‌లు అమల్లోకి వచ్చే తేదీ) తగిన పరిష్కారం కనుగొనకపోతే, అమెరికాకు ఎగుమతులు 40-50 శాతం పడిపోయే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈల వాటా దాదాపు 45 శాతంగా ఉంటుంది.

పరిశ్రమకు మేల్కొలుపు..

టారిఫ్‌ల పెంపు అనేది ఇటు విధాన నిర్ణేతలు, అటు ఎగుమతిదారులకు ఓ మేల్కొలుపులాంటిదని కుమార్ చెప్పారు. దీన్ని ఒక అవాంతరంగా చూడకుండా అవకాశంగా మల్చుకోవడంపై దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. అంతగా ఎగుమతులు లేని, అధిక వృద్ధికి అవకాశాలున్న ప్రాంతాలకు కొత్తగా లింకేజీలను ఏర్పర్చుకోవడం, అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరించడం ద్వారా భారతీయ ఎంఎస్ఎంఈలు వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంపై ఫోకస్ చేయొచ్చని సూచించారు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, సెంట్రల్ ఏషియా, తూర్పు యూరప్, పసిఫిక్ ద్వీప దేశాలు, కరీబియన్ దీవులు మొదలైన మార్కెట్ల వైపు చూడొచ్చని చెప్పారు. ఈ మార్కెట్లకు 60 బిలియన్ డాలర్ల పైగా ఎగుమతులు చేసేందుకు అవకాశాలు ఉంటాయని కుమార్ చెప్పారు. భారతీయ ఎంఎస్ఎంఈలు ఇప్పటికే పటిష్టంగా ఉన్న రంగాల్లో నమ్మకమైన సరఫరాదారుల కోసం ఈ ప్రాంతాల్లోని సంస్థలు అన్వేషిస్తున్నాయని తెలిపారు. ఫార్మా, వ్యవసాయ-వ్యవసాయేతర మెషినరీ, ప్రాసెస్డ్ ఫుడ్స్, దుస్తులు మొదలైన రంగాలు వీటిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే ద్రవ్యపరమైన, ద్రవ్యయేతరమైన చర్యలు ప్రకటించాలని కుమార్ విజ్ఞప్తి చేశారు. అలాగే పరిశ్రమ ఇతరత్రా మార్కెట్ల వైపు కూడా మళ్లేందుకు ప్రోత్సహించడంపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ దిశలో బ్రిటన్, ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్‌లతో వాణిజ్య ఒప్పందాల పరిధిని మరింతగా విస్తరించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. మనకు అనువైన మార్కెట్లను గుర్తించి, ఎగుమతి చేసే క్రమంలో కఠినతరమైన నాణ్యత, ప్యాకేజింగ్, నిబంధనల ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది కాబట్టి ఈ విషయాల్లో తగు గైడెన్స్ అవసరమవుతుందని కుమార్ పేర్కొన్నారు. ఇన్ని సవాళ్లను ఎదుర్కొంటున్న ఎంఎస్ఎంఈలను పటిష్టం చేసేందుకు ఇండియా ఎస్ఎంఈ ఫోరం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తోంది. డిజిటల్ ట్రేడ్ ప్లాట్‌ఫాంలను అందుబాటులోకి తేవడం, సకాలంలో..తక్కువ వడ్డీపై ఎగుమతులకు ఫైనాన్సింగ్ అందించడం, రియల్ టైమ్‌లో మార్కెట్ వివరాలను అందించడం వంటి అంశాలపై కసరత్తు చేస్తోంది.

బిజినెస్ రీల్

పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్ రెండేళ్లు పొడిగింపు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎం ఈ-డ్రైవ్ స్కీమును కొన్ని వాహన విభాగాలకు రెండేళ్ల పాటు 2028 మార్చి వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎలక్ట్రిక్ బస్సులు, ఈ-అంబులెన్స్‌లు, ఈ-ట్రక్కులు వీటిలో ఉన్నాయి. వాస్తవానికి ఈ స్కీము గడువు 2026 మార్చితో ముగియాల్సి ఉంది. ఈ స్కీము పరిమాణం రూ. 10,900 కోట్లకు మాత్రమే పరిమితమవుతుందని, ఒకవేళ గడువు లోగా నిధులు పూర్తిగా వినియోగించేసిన పక్షంలో.. సంబంధిత సెగ్మెంట్లు లేదా స్కీము కూడా ముగిసిపోతుందని కేంద్రం వివరించింది. మరోవైపు, రిజిస్టర్డ్ ఈ-టూవీలర్లు, ఈ-రిక్షాలు, ఈ-కార్టులు, ఈ-త్రీ వీలర్లకు ఆఖరు తేదీ యథాప్రకారంగా 2026 మార్చి 31గా ఉంటుందని పేర్కొంది.

టెక్స్‌టైల్స్ పీఎల్ఐ స్కీము పోర్టల్ పునఃప్రారంభం



న్యూఢిల్లీ: పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు టెక్స్‌టైల్స్ రంగానికి సంబంధించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీము పోర్టల్‌ను మళ్లీ తెరిచినట్లు కేంద్రం వెల్లడించింది. ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. గతంలో నిర్దేశించిన మార్గదర్శకాలే కొత్త దరఖాస్తులకు కూడా వర్తిస్తాయి. ఆసక్తి గల కంపెనీలన్నీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టెక్స్‌టైల్స్ శాఖ సూచించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-8-2025

విశాఖ	505-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	505-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

ఐసీఐసీఐ బ్యాంక్ మినిమం బ్యాలెన్స్ మోత

సేవింగ్స్ ఖాతాలపై అయిదు రెట్లు పెంపు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ కొత్త సేవింగ్స్ అకౌంట్లలో పాటించాల్సిన కనీస బ్యాలెన్స్‌ని (ఎంఏబీ) ఏకంగా అయిదు రెట్లు పెంచింది. మెట్రోలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 50,000గా చేసింది. సెమీ-అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఇది వరుసగా రూ. 25,000, రూ. 10,000గా ఉంటుంది. ఆగస్టు 1న, ఆ తర్వాత తెరిచిన ఖాతాలకు ఈ పెంపు వర్తిస్తుంది. అంతకు ముందు తెరిచిన సేవింగ్స్ ఖాతాలకు నెలవారీ కనీస బ్యాలెన్స్ రూ. 10,000గా ఉంటుంది. ఎంఏబీ నిబంధనలను పాటించకపోతే, తగ్గిన మొత్తానికి సంబంధించి ఆరు శాతం లేదా రూ. 500 (ఏది తక్కువైతే అది) మేర చార్జీలు వర్తిస్తాయి. శాలరీ ఖాతాలు, పీఎం జన్‌ధన్ ఖాతాలు, బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాలకు అధిక ఎంఏబీ వర్తించదు. అధిక ఎంఏబీ వర్తించే ఖాతాదారులకు ఉచిత నెఫ్ట్ ఫండ్ ట్రాన్స్‌ఫర్, కాంప్లిమెంటరీగా నెలకు మూడు నగదు లావాదేవీలు (ఆ తర్వాత నుంచి ప్రతి లావాదేవీపై రూ. 150) మొదలైన ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు పెనాల్టీలను క్రమబద్ధీకరించడమో లేదా పూర్తిగా తొలగించడమో చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ నిజాంపేటలోని 800 పడకల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహణకు సంబంధించి ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్, అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నాయి. కార్డియాక్ సైన్సెస్, ఆంకాలజీ మొదలైన వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టే ఈ ఆసుపత్రి దశలవారీగా అందుబాటులోకి వస్తుందని ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ చైర్మన్ దండు శివరామ రాజు తెలిపారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను అఫోర్డబుల్‌గా అందుబాటులోకి తెచ్చే దిశగా ఇదొక కీలక మైలురాయని సంస్థ ఈడీ డీవీఎస్ సోమరాజు చెప్పారు. సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్‌తో భాగస్వామ్యం తోడ్పడుతుందని అజింక్యా డీవై పాటిల్ హెల్త్‌కేర్ చైర్మన్ అజింక్యా పాటిల్ తెలిపారు.

ఐపీఓకు టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్

సెబీకి ముసాయిదా పత్రాలు



ముంబై: వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్ సేవల సంస్థ, టెక్నోక్రాఫ్ట్ వెంచర్స్ ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు సన్నద్ధమవుతోంది. ఇందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఇష్యూలో భాగంగా 95.05 లక్షల తాజా ఈక్విటీలు జారీ చేయనుంది. ప్రమోటర్ కంపెనీ కార్తికేయ్ కన్‌స్ట్రక్షన్స్ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద 23.76 లక్షల షేర్లను విక్రయించనుంది. సమీకరించే రూ.138 కోట్ల నిధులను మూలధన వ్యయ అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించుకుంటామని కంపెనీ ముసాయిదా పత్రాల్లో తెలిపింది. ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా ఖంబట్టా సెక్యూరిటీస్, రిజిస్ట్రార్‌గా బిగ్‌షేర్ సర్వీసెస్‌లు సంస్థలు వ్యవహరించనున్నాయి. టెక్నోక్రాఫ్ట్ 2025 జూన్ 30 నాటికి రూ.685.83 కోట్ల విలువైన ఆర్డర్లు కలిగి ఉంది. ఆర్థిక సంవత్సరం 2025లో రూ.28.20 కోట్ల నికర లాభం, రూ.279.56 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది.

రూ. 1,400 కోట్ల పబ్లిక్ ఇష్యూకి సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్



న్యూఢిల్లీ: ఎలక్ట్రికల్ ఉత్పత్తుల సంస్థ సిల్వర్ కన్జూమర్ ఎలక్ట్రికల్స్ తాజాగా పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,400 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా పత్రాలను మార్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. వీటి ప్రకారం రూ. 1,000 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, రూ. 400 కోట్ల విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ప్రమోటర్లు విక్రయించనున్నారు. 2023-2025 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో కంపెనీ ఆదాయం వార్షికంగా 95 శాతం వృద్ధి చెందింది. పంపులు, మోటర్ల ఉత్పత్తికి సంబంధించి 24,00,000 యూనిట్లు, 72,00,000 ఫ్యాన్ల స్థాపిత సామర్థ్యంతో సంస్థకు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ప్లాంటు ఉంది.

అయిదో భారీ ఏవియేషన్ మార్కెట్‌గా భారత్

ఐఏటీఏ గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ: గతేడాది 24.1 కోట్ల మంది ప్యాసింజర్లతో ప్రపంచంలోనే అయిదో అతి పెద్ద ఏవియేషన్ మార్కెట్‌గా భారత్ ఆవిర్భవించింది. అత్యంత రద్దీగా ఉండే జంట విమానాశ్రయాల జాబితాలో ముంబై-ఢిల్లీకి చోటు దక్కింది. 2024 సంవత్సరానికి గాను అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సమాఖ్య ఐఏటీఏ విడుదల చేసిన వరల్డ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం గతేడాది భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య 2023తో పోలిస్తే 11 శాతం పెరిగి 21.1 కోట్లుగా నమోదైంది. అత్యధికంగా 87.6 కోట్ల మంది ప్యాసింజర్లతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, 74.1 కోట్ల మందితో చైనా రెండో స్థానంలో ఉంది. ఇక యునైటెడ్ కింగ్‌డం మూడో స్థానంలో (26.1 కోట్ల మంది) స్పెయిన్ 4వ స్థానంలో (24.1 కోట్ల మంది ప్రయాణికులు) నిల్చాయి. టాప్ 10 జంట ఎయిర్‌పోర్టుల్లో 59 లక్షల మంది ప్రయాణికులతో ముంబై-ఢిల్లీ జత 7వ ర్యాంకులో ఉంది. అంతర్జాతీయంగా ప్రీమియం క్లాస్ ప్రయాణాలు (బిజినెస్, ఫస్ట్ క్లాస్) 11.8 శాతం, ఎకానమీ ట్రావెల్ 11.5 శాతం పెరిగాయి. మొత్తం ఇంటర్నేషనల్ ప్యాసింజర్లలో ప్రీమియం క్లాస్ ట్రావెలర్లు 6 శాతం పెరిగి 11.69 కోట్లకు చేరింది. ప్రాంతాలవారీగా చూస్తే ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రీమియం ప్యాసింజర్ల సంఖ్య 22.8 శాతం పెరిగి 2.1 కోట్లకు చేరింది. యూరప్, లాటిన్ అమెరికా, మధ్య ప్రాచ్యం, ఉత్తర అమెరికాల్లో ప్రీమియం ప్రయాణికుల సంఖ్య, ఎకానమీ తరగతి వారికన్నా అధికంగా నమోదైంది.

క్యూ1 ఫలితాలు

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ. 26 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ. 26 కోట్లకు (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) చేరింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో ఇది సుమారు రూ. 24 కోట్లు. మరోవైపు సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం దాదాపు రూ. 314 కోట్ల నుంచి రూ. 353 కోట్లకు పెరిగింది.

ఎన్‌బీసీసీకి అధిక ఆదాయం దన్ను

నికర లాభం రూ.135 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌బీసీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.135.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది క్యూ1లో నమోదు చేసిన రూ.107.19 కోట్లతో పోలిస్తే 26% అధికం. ఆదాయం గణనీయంగా పెరగడమే లాభాల వృద్ధికి కారణమని కంపెనీ తెలిపింది. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ.2,196.20 కోట్ల నుంచి రూ.2,465.48 కోట్లకు పెరిగింది. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ), రియల్ ఎస్టేట్ వ్యాపార విభాగాల్లో ఎన్‌బీసీసీ కార్యకలాపాలు సాగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ. 12,273 కోట్ల ఆదాయంపై రూ. 557.42 కోట్ల లాభం ప్రకటించింది.



ట్రోఫీతో న్యూజిలాండ్ జట్టు

న్యూజిలాండ్ రికార్డు విజయం

ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో జింబాబ్వే చిత్తు

- ఫౌల్‌కెస్, హెన్రీ విజృంభణ
- 2-0తో టెస్టు సిరీస్ కైవసం

బులవాయో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన న్యూజిలాండ్ జట్టు... తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అతిపెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జింబాబ్వేతో జరిగిన రెండో టెస్టులో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ ఫార్మాట్‌లో పరుగుల పరంగా కివీస్‌కు ఇదే అతి పెద్ద గెలుపు కాగా... 2012లో జింబాబ్వేపై ఇన్నింగ్స్ 301 పరుగులతో సాధించిన విజయం రెండో స్థానంలో ఉంది. మరోవైపు జింబాబ్వేకు ఈ ఏడాది ఇది వరుసగా ఆరో టెస్టు ఓటమి. తొలి ఇన్నింగ్స్‌లో కొండంత స్కోరు చేసిన న్యూజిలాండ్... ఓవర్‌నైట్ స్కోరు 601/3 వద్దే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో 476 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఏమాత్రం పోరాటం కనబర్చలేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకు ఆలౌటైన ఆ జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ పేసర్ల ధాటికి కేవలం 28.1 ఓవర్లలోనే 117 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో రెండున్నర రోజుల్లోనే ఫలితం తేలిపోగా... రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకుంది. నిక్ వెల్చ్ (71 బంతుల్లో 47 నాటౌట్; 7 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయగా... అతడికి సహచరుల నుంచి కనీస తోడ్పాటు దక్కలేదు. వెల్చ్ మినహా కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (17) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు. బ్రియాన్ బెనెట్ (0), బ్రెండన్ టేలర్ (7), సీన్ విలియమ్స్ (9), సికందర్ రజా (4), తఫద్జ్వా ట్సిగా (5), విన్సెంట్ (4) పెవిలియన్‌కు వరసకట్టారు. కివీస్ బౌలర్లలో అరంగేట్ర పేసర్ జకారీ ఫౌల్‌కెస్ 5 వికెట్లు పడగొట్టగా... మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫీ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. ఈ క్రమంలో అరంగేట్ర మ్యాచ్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసుకున్న న్యూజిలాండ్ బౌలర్‌గా ఫౌల్‌కెస్ నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన అతడు ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో 9 వికెట్లు పడగొట్టాడు. భారీ సెంచరీ చేసిన ఓపెనర్ కాన్వేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', రెండు మ్యాచ్‌ల్లో కలిపి 16 వికెట్లు పడగొట్టిన హెన్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కాయి. మొత్తంగా ఈ పర్యటనలో ముక్కోణపు టి20 సిరీస్‌తో పాటు టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ అజేయంగా నిలిచింది.

1 న్యూజిలాండ్ టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా ఇదే (ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో) అతిపెద్ద గెలుపు. 2012లో నెపియర్‌లో జింబాబ్వేపై ఇన్నింగ్స్ 301 పరుగుల తేడాతో సాధించిన విజయం రెండో స్థానంలో ఉంది.

3 క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా ఇది మూడో అతిపెద్ద గెలుపు.

9/75 ఈ మ్యాచ్‌లో ఫౌల్‌కెస్ గణాంకాలు. న్యూజిలాండ్ తరఫున టెస్టు అరంగేట్రంలో ఇవే అత్యుత్తమం. విలియమ్ రూర్కె 9/93 (2024లో దక్షిణాఫ్రికాపై) రెండో స్థానంలో ఉన్నాడు.



చాంపియన్ పంజాబ్

చెన్నై: జాతీయ సబ్ జూనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో పంజాబ్ 4-3 గోల్స్ తేడాతో జార్ఖండ్ జట్టును ఓడించింది. తొలి క్వార్టర్‌లో రెండు జట్లు ఖాతా తెరవలేకపోయాయి. రెండో క్వార్టర్‌లో జార్ఖండ్ దూకుడు పెంచి మూడు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేసి 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 21వ నిమిషంలో ఆశిష్ గోల్‌తో ఖాతా తెరిచిన జార్ఖండ్... 24వ నిమిషంలో అనీశ్ దుంగ్‌డుంగ్ గోల్‌తో 2-0తో ముందంజ వేసింది. అయితే పంజాబ్ కూడా తగ్గేదేలే అన్నట్లు ఆడింది. నిమిషం తేడాలో రెండు గోల్స్ చేసి స్కోరును 2-2తో సమం చేసింది. 29వ నిమిషంలో అక్షిత్ సలారియా గోల్‌తో బోణీ కొట్టిన పంజాబ్, 30వ నిమిషంలో వరీందర్ సింగ్ గోల్‌తో స్కోరును సమం చేసింది. 42వ నిమిషంలో సుఖ గురియా గోల్‌తో జార్ఖండ్ 3-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు నిమిషాల తర్వాత మన్‌దీప్ సింగ్ (45వ నిమిషంలో) గోల్‌తో పంజాబ్ స్కోరును 3-3తో సమం చేసింది. మ్యాచ్ మరో ఏడు నిమిషాల్లో ముగుస్తుందనగా మన్‌దీప్ సింగ్ (53వ నిమిషంలో) గోల్ చేసి పంజాబ్‌కు 4-3తో ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత పంజాబ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని టైటిల్‌ను దక్కించుకుంది. అంతకుముందు జరిగిన కాంస్య పతక పోరులో ఉత్తరప్రదేశ్ 5-3 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్‌ను ఓడించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

సెమీస్‌లో హరియాణా, ఛత్తీస్‌గఢ్

యూపీ, జార్ఖండ్ కూడా • జాతీయ జూనియర్ మహిళల హాకీ





సాక్షి, కాకినాడ: జూనియర్ మహిళల జాతీయ హాకీ చాంపియన్‌షిప్‌లో హరియాణా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తర ప్రదేశ్ జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో హరియాణా 4-1తో ఒడిశాపై ఘనవిజయం సాధించింది. హరియాణా జట్టులో కాజల్ (2వ ని.), సుప్రియా (27వ ని.), శశి ఖాస (36వ ని.), సాది (60వ ని.) తలా ఒక గోల్ చేశారు. ఒడిశా తరఫున నమోదైన ఏకైక గోల్‌ను అమిషా ఎక్కా 47వ నిమిషంలో సాధించింది. ఛత్తీస్‌గఢ్ 2-1తో పెనాల్టీ షూటౌట్‌లో మధ్య ప్రదేశ్‌పై గెలిచింది. నిర్ణీత సమయంలో ఛత్తీస్‌గఢ్ నుంచి యశోద (2వ ని.), మధ్యప్రదేశ్ తరఫున హుడా ఖాన్ (15వ ని.) గోల్ చేయడంతో 1-1తో డ్రా అయింది. మరో క్వార్టర్స్‌లో జార్ఖండ్ 3-1తో పంజాబ్‌ను ఓడించింది. పంజాబ్ జట్టులో పవన్‌ప్రీత్ కౌర్ (6వ ని.) గోల్ చేయగా, జార్ఖండ్ జట్టులో స్వీటి డంగ్‌డంగ్ (7వ ని), శాంతి కుమారి (22వ ని.), రోషిణి ఐంద్ (46వ ని.) తలా ఒక గోల్ చేశారు. ఆఖరి క్వార్టర్ ఫైనల్లో ఉత్తర ప్రదేశ్ 2-1తో మహారాష్ట్రపై నెగ్గింది. యూపీ తరఫున సల్లు పుఖ్రంబమ్ (36వ ని.), రష్మీ పటేల్ (55వ ని.) చెరో గోల్ చేయగా, మహారాష్ట్ర జట్టులో దీక్షా షిండే (45వ ని.) ఒక గోల్ సాధించింది.

మురళీ శ్రీశంకర్‌పై భారత్ ఆశలు

ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్



భువనేశ్వర్: సొంతగడ్డపై తొలిసారిగా జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ పోటీల్లో భారత అథ్లెట్లు అన్ను రాణి, మురళీ శ్రీశంకర్, అనిమేశ్ కుజుర్ ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు. నేడు ఒక రోజు మాత్రమే జరిగే ఈ తృతీయ శ్రేణి ఈవెంట్‌లో 15 దేశాలకు చెందిన 150 పైచిలుకు అథ్లెట్లు ఇందులో పోటీపడుతున్నారు. టోర్నీ ప్రైజ్‌మనీ 25,000 డాలర్లు (రూ.21.89 లక్షలు) కాగా... కళింగ స్టేడియంలో ఆదివారం పోటీలు నిర్వహిస్తారు. లాంగ్‌జంపర్ మురళీ శ్రీశంకర్ వరుస విజయాలతో జోరుమీదున్నాడు. ఇదే పట్టుదలను ఇక్కడా కొనసాగిస్తే మరో విజయం ఖాయమవుతుంది. ఈ సీజన్‌లో మెరుగైన వ్యక్తిగత ప్రదర్శన కనబరిచిన 2023 ఆసియా క్రీడల చాంపియన్, జావెలిన్ త్రోయర్ అన్ను రాణి... స్వర్ణంపై కన్నేసింది. ఇటీవలే పోలండ్‌లో జరిగిన మీట్‌లో ఆమె 62.59 మీటర్ల దూరంలో ఈటెను విసిరింది. టోక్యో ప్రపంచ చాంపియన్‌షిప్ లక్ష్యంగా తన ఆటతీరుకు మెరుగులు దిద్దుకుంటున్న అన్ను మరోమారు 60 ప్లస్ మీటర్ల ప్రదర్శనను కనబరచాలని ఆశిస్తోంది. భువనేశ్వర్‌లోని వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే తన ప్రదర్శన మరింత మెరుగవుతుందని ఆమె భావిస్తోంది. వచ్చే నెల టోక్యోలో జరిగే ఈవెంట్‌లో ప్రపంచ టాప్ 36 జావెలిన్ త్రోయర్లు అర్హత సాధిస్తారు. అయితే ఇప్పటికే 64 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌తో 11 మంది అథ్లెట్లు అర్హత పొందారు. ఇక మిగతా 25 మంది జావెలిన్ త్రోయర్లు ప్రపంచ ర్యాంకింగ్, ప్రదర్శన ద్వారా అర్హత సాధిస్తారు. ఈ నెల 24న జపాన్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌తో ఆ 25 మంది అథ్లెట్ల బెర్తులు ఖాయమవుతాయి. భారత స్ప్రింటర్ అనిమేశ్ కుజూర్ 200 మీటర్ల పరుగు పందెంలో జాతీయ రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానంలో ఉన్న కుజూర్ కూడా టోక్యో బెర్తుపై గంపెడాశలతో ఉన్నాడు. 21 ఏళ్ల ఈ స్ప్రింటర్ నేడు జరిగే ఈవెంట్‌లో 20.16 సెకన్ల టైమింగ్ నమోదు చేస్తే గనక నేరుగా టోక్యో పోటీలకు అర్హత సంపాదిస్తాడు. మహిళా లాంగ్‌జంపర్లు శైలీ సింగ్, అన్సీ సోజన్‌లతో పాటు మొహమ్మద్ అఫ్జల్ (800 మీ. పరుగు), సచిన్ యాదవ్ (జావెలిన్ త్రో), శ్రీలంకకు చెందిన సుమేద రణసింఘే (జావెలిన్ త్రో), రుమేశ్ తరంగ (జావెలిన్ త్రో) ఈ పోటీల బరిలో ఉన్నారు.

పాకిస్తాన్ విజయం

తొలి వన్డేలో 5 వికెట్లతో వెస్టిండీస్ ఓటమి



టరోబా: వెస్టిండీస్‌పై టి20 సిరీస్ హస్తగతం చేసుకున్న పాకిస్తాన్ జట్టు... వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో పాకిస్తాన్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి 1-0తో ముందంజ వేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 49 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌటైంది. ఎవిన్ లూయిస్ (62 బంతుల్లో 60; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (77 బంతుల్లో 55; 4 ఫోర్లు), రోస్టన్ ఛేజ్ (54 బంతుల్లో 53; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలు సాధించగా... గుడకేశ్ మోతీ (18 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ షాట్లతో విజృంభించాడు. పాకిస్తాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 4, నసీమ్ షా 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 48.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హసన్ నవాజ్ (54 బంతుల్లో 63 నాటౌట్), కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ (69 బంతుల్లో 53; 4 ఫోర్లు) అర్ధశతకాలు సాధించారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (47; 5 ఫోర్లు, 1 సిక్స్), హుసేన్ తలత్ (41 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్), అబ్దుల్లా షఫీఖ్ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. పాకిస్తాన్ విజయానికి 18 బంతుల్లో 27 పరుగులు అవసరమైన దశలో తలత్ 6, 4 కొట్టగా... హసన్ నవాజ్ కూడా ఓ సిక్స్, ఫోర్ బాది మ్యాచ్‌ను ముగించాడు.

దక్షిణాఫ్రికా X ఆస్ట్రేలియా

నేటి నుంచి టి20 సిరీస్

డార్విన్ (ఆస్ట్రేలియా): వచ్చే ఏడాది జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ప్రపంచకప్ కోసం ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటి నుంచే అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. 2026 ఫిబ్రవరిలో భారత్, శ్రీలంక వేదికగా టి20 వరల్డ్ కప్ జరగనుండగా... దానికి ముందు సన్నాహకంగా ఈ రెండు జట్ల మధ్య నేటి నుంచి మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్ జరగనుంది. 2023 తర్వాత ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య అంతర్జాతీయ టి20 మ్యాచ్ జరగలేదు. గతేడాది టీమిండియా చాంపియన్‌గా నిలిచిన వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఆకట్టుకోలేకపోగా... దక్షిణాఫ్రికా ఫైనల్లో ఓడింది. ఇరు జట్ల మధ్య ఇటీవల ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ జరగగా... అందులో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఆ తర్వాత జింబాబ్వేలో పర్యటించిన సఫారీ జట్టు... ముక్కోణపు టి20 సిరీస్ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు ఆస్ట్రేలియా జట్టు వెస్టిండీస్ గడ్డపై 5-0తో టి20 సిరీస్ గెలుచుకుంది. ఆ సిరీస్‌కు అందుబాటులో లేని ట్రావిస్ హెడ్ తిరిగి ఆసీస్ జట్టులో చేరనుండగా... ఎయిడెన్ మార్క్‌రమ్, కగిసో రబాడ దక్షిణాఫ్రికా జట్టులో పునరాగమనం చేస్తున్నారు. ఆసీస్ ప్రధాన పేసర్లు మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్ ఈ సిరీస్‌కు కూడా దూరంగా ఉండనుండగా... జోష్ హాజల్‌వుడ్ పేస్ భారాన్ని మోయనున్నాడు. 2008 తర్వాత డార్విన్‌లో అంతర్జాతీయ మ్యాచ్ నిర్వహించనుండటం ఇదే తొలిసారి కాగా... మిచెల్ మార్ష్ ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఇటీవల విండీస్‌తో సిరీస్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన మార్ష్... హెడ్‌తో కలిసి వచ్చే ఏడాది వరల్డ్‌కప్‌లో ఇన్నింగ్స్ ప్రారంభించనున్నట్లు శనివారమే ప్రకటించాడు. 'హెడ్‌తో కలిసి ఓపెనింగ్ చేస్తా. చాన్నాళ్లుగా మేం కలిసి ఆడుతున్నాం. మా మధ్య మంచి అనుబంధం ఉంది. టి20 వరల్డ్‌కప్‌లోనూ ఇదే కొనసాగుతుంది' అని మార్ష్ అన్నాడు. ఇన్‌గ్లిస్, కామెరూన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మిచెల్ ఓవెన్‌తో ఆసీస్ బలంగా ఉంది. యువ ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్‌పై దక్షిణాఫ్రికా భారీ ఆశలు పెట్టుకుంది. మార్క్‌రమ్, రికెల్టన్, డసెన్, బ్రెవిస్, స్టబ్స్, లిండె, బాష్‌తో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ బలంగా ఉంది. రబాడ, బర్గర్, ఎంగిడి బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు.


మార్క్‌రమ్


మార్ష్

'నా కల... ప్రపంచకప్‌లో ఆడటం'

- ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించడంతో నమ్మకం పెరిగింది
- భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ప్లేయర్ మనీషా వ్యాఖ్య



గువాహటి: 'ఫిఫా' ప్రపంచకప్, ఒలింపిక్స్ వంటి ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లలో జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగడం తన కల అని భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు స్టార్ ప్లేయర్ మనీషా కల్యాణ్ పేర్కొంది. ఇటీవల చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరగనున్న ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించింది. దీంతో భవిష్యత్తులో ఒలింపిక్స్, ప్రపంచకప్ టోర్నీల్లో పాల్గొనగలమనే నమ్మకం పెరిగిందని మనీషా వెల్లడించింది. శుక్రవారం గువాహటిలో జరిగిన 'అస్మిత' అండర్-13 బాలికల లీగ్ ప్రారంభోత్సవంలో మనీషా పాల్గొంది. ఈ సందర్భంగా 23 ఏళ్ల మనీషా మాట్లాడుతూ... 'యంగ్‌ప్లేయర్లు తమ కలలను సాకారం చేసుకునేందుకు 'అస్మిత' ఒక్క చక్కటి వేదిక. వరల్డ్‌కప్‌లో పాల్గొనాలనేది నా చిరకాల కల. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాలో జరగనున్న ఆసియా కప్‌నకు అర్హత సాధించడంతో ఆ దిశగా మరింత నమ్మకం పెరిగింది' అని పేర్కొంది. మారుమూల ప్రాంతాల పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించేందుకు 'అస్మిత' తోడ్పడుతోందని వెల్లడించింది. అస్మిత గువాహటి లెగ్ పోటీల్లో 8 జట్లు పాల్గొంటుండగా... మనీషా ప్లేయర్లతో కాసేపు సరదాగా ఫుట్‌బాల్ ఆడింది. యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యూఈఎఫ్ఏ) చాంపియన్స్ లీగ్‌లో పాల్గొన్న ఏకైక భారత మహిళా ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన మనీషా... 'అస్మిత'వంటి వేదికతో యువ ఆటగాళ్లకు నాణ్యమైన మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కుతుందని చెప్పింది. 'అస్మిత' లీగ్ ద్వారా వెలుగులోకి వచ్చిన రేఖ కటాకీ, డాసోమి రోటియాను మనీషా ప్రత్యేకంగా అభినందించింది. 'ఈశాన్య రాష్ట్రాల ప్రజల రక్తంలోనే ఫుట్‌బాల్ ఉంది. స్టార్ ప్లేయర్ బాలాదేవి ఆట చూస్తూ పెరిగాను. ప్రస్తుత భారత మహిళల ఫుట్‌బాల్ జట్టులో 11 మంది ఈశాన్య రాష్ట్రాల ప్లేయర్లు ఉన్నారు. ఇక్కడి ప్లేయర్లలో ఎంత నైపుణ్యం ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. మరో ఐదేళ్లలో ఈ చిన్నారుల్లో నుంచి కూడా కొందరు రాష్ట్ర, జాతీయ జట్లకు ప్రాతినిధ్యం వహించవచ్చు. కష్టపడి పనిచేస్తే ఫలితం తప్పక ఉంటుంది. ఫిట్‌నెస్, నైపుణ్యం పెంపొందించుకుంటే ఏదైనా సాధ్యమే. ప్రభుత్వ సహకారంతో ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడా మౌలిక వసతులు పెరుగుతున్నాయి. దీంతో మరింత మంది వెలుగులోకి వస్తున్నారు' అని మనీషా వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఈశాన్య రాష్ట్రాల ఆటలకు ప్రాధన్యత నిస్తున్న కేంద్ర ప్రభుత్వం... తాజా 'ఖేలో ఇండియా' క్రీడల్లో వాటిని చేర్చింది. ఈ పరిణామాన్ని మనీషా ఆహ్వానించింది. దీనివల్ల కేవలం ఫుట్‌బాల్‌కు కాకుండా... మిగిలిన ఆటలకు కూడా ఆదరణ పెరుగుతందని వెల్లడించింది.


రాష్ట్రపతి భవన్‌లో విద్యార్థికి రాఖీ కడుతున్న ద్రౌపదీ ముర్ము


ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాఖీలు కడుతున్న బాలికలు

పసుపుతో మధుమేహానికి చెక్

- దాల్చిన చెక్క మిశ్రమంతో మంచి ఫలితాలు
- పసుపు ఔషధ గుణాలపై ఐసీఎంఆర్ మోనోగ్రాఫ్
- వెల్లడించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సాగయ్యే పసుపులో అద్భుత ఔషధ గుణాలున్నట్లు వివిధ సంస్థలు చేపట్టిన పరిశోధనల్లో మరోసారి రుజువైందని కేంద్రం తెలిపింది. పసుపులో ఉండే కర్క్యుమిన్ అనే కీలక రసాయనానికి వివిధ ఆరోగ్య సమస్యలకు ఉపశమనం కలిగించే సత్తా ఉన్నట్లు తేలిందని వెల్లడించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) పసుపుపై మోనోగ్రాఫ్‌ను తయారు చేసిందని తెలిపింది. ఇందులో ఔషధ గుణాలు, బయోయాక్టివిటీస్, ఫైటోకెమికల్స్, దుష్ప్రభావాలు తదితర అంశాలను పొందుపరిచిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పసుపు-దాల్చినచెక్క మిశ్రమంతో డయాబెటిస్ పీడిత జంతువులపై జరిపిన ప్రయోగాల్లో రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గినట్లు కోజికోడ్‌లోని భారత సుగంధ ద్రవ్యాల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) వెల్లడించింది.

పసుపుతో ఎలాంటి దుష్ప్రభావం లేదు: ఆయుర్వేదిక పరిశోధన మండలి ఆధ్వర్యంలో పసుపులో ఉండే 22 ఔషధ లక్షణాలకు సంబంధించిన 15 వ్యాధులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించామని తెలిపింది. ఇవి ప్రభావవంతంగా పనిచేసినట్లు తేలిందని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అంతేగాక, పసుపు వల్ల కాలేయానికి హాని, రక్తం సరిగ్గా గడ్డకట్టకపోవడం వంటి ప్రభావాలపై జంతువులపై జరిపిన పరీక్షల్లో నెగిటివ్ ప్రభావాలు లేవని తేలిందని ఐఐఎస్ఆర్ తెలిపింది.

కర్క్యుమిన్ శాతం అధ్యయనం: మరోవైపు ఫార్మకలాజికల్ ఉపయోగానికి సరైన కర్క్యుమిన్ శాతం ఉన్న పసుపు రకాలపై ఐసీఏఆర్ పరిశోధన చేసింది. ప్రతిభ, ప్రగతి, అలెప్పీ సుప్రీమ్, రోమా, రాజేంద్ర సోనియా వంటి రకాలలో 5 శాతం కంటే ఎక్కువగా కర్క్యుమిన్ ఉందని పేర్కొంది. ఈ రకాలను రైతులు అనేక రాష్ట్రాల్లో సాగుచేస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లోని లకాడాంగ్, మహారాష్ట్రలో వైగాన్ టర్మెరిక్ రకాలూ అధిక కర్క్యుమిన్ శాతం కలిగి ఉన్నాయని వెల్లడించారు. కాగా, పిప్పలాద్యాసవం, హరిద్రాఖండం, కల్యాణకఘృతం, నల్పమరాది తైలం, నిసా-ఆమలకి చూర్ణం వంటి అనేక ఆయుర్వేద ఔషధాల్లో పసుపు ముఖ్యమైన పదార్థంగా వాడుతున్నట్లు ప్రకటించారు. మొత్తంగా, పసుపు ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ గుణాలపై కేంద్రం విస్తృత పరిశోధనలు నిర్వహించిందనీ, తగిన సమాచారాన్ని సేకరించిందని కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ ఇటీవల లోక్‌సభలో బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో వివరించారు.

రికార్డు స్థాయికి దేశీయ రక్షణ ఉత్పత్తులు

విలువ రూ.1,50,5900 కోట్లు

- గత ఆర్థిక సంవత్సరంలో 18% వృద్ధి నమోదు
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం దిశగా మరో ముందడుగు
- వివరాలు వెల్లడించిన కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: భారత రక్షణ తయారీ రంగం చరిత్ర సృష్టించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ రక్షణ ఉత్పత్తి విలువ అక్షరాలా రూ.1,50,590 కోట్లకు చేరింది. ఇది 2023-24లో నమోదైన రూ.1.27 లక్షల కోట్లతో పోలిస్తే 18 శాతం అధికం. 2019-20లో ఉన్న రూ.79,071 కోట్లతో పోలిస్తే ఇది 90 శాతం పెరుగుదల. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రక్షణ ఉత్పత్తి విభాగం, డీపీఎస్‌యూలు, పబ్లిక్ సెక్టర్ తయారీ సంస్థలు, ప్రైవేట్ పరిశ్రమల కృషి ఫలితమే ఈ విజయమని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రశంసించారు. దేశ రక్షణ పారిశ్రామిక వేదిక బలపడుతున్నదనడానికి ఇది ఒక స్పష్టమైన సూచిక అని కేంద్రమంత్రి అభిప్రాయపడ్డారు.

పబ్లిక్-ప్రైవేట్ రంగాల వాటా

దేశీయ రక్షణ మొత్తం ఉత్పత్తిలో ప్రభుత్వ రంగ సంస్థల వాటా 77% ఉండగా, ప్రైవేట్ రంగం వాటా 23%గా ఉంది. ఇది గత ఏడాది 21% నుంచి పెరుగుదల నమోదైంది. కాగా పబ్లిక్ సెక్టర్ ఉత్పత్తి 16%, ప్రైవేట్ రంగ ఉత్పత్తి 28% పెరిగింది. దీర్ఘకాలిక విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం, స్వదేశీ ఉత్పత్తి (ఇండిజినైజేషన్)పై దృష్టిసారించడం దేశీయ రక్షణ ఉత్పత్తి పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. మరోవైపు 2024-25లో రక్షణ ఎగుమతులు రూ.23,622 కోట్లకు చేరాయి. ఇది 2023-24లో నమోదైన రూ.21,083 కోట్లతో పోలిస్తే రూ.2,539 కోట్లు (12.04%) ఎక్కువ. ప్రభుత్వ ప్రోత్సాహం, ప్రైవేట్ రంగం పెరుగుతున్న భాగస్వామ్యం, ఎగుమతి అవకాశాల విస్తరణతో రాబోయే ఏళ్లలో రక్షణ తయారీ రంగం మరింత వేగంగా ముందుకు సాగే అవకాశముందని కేంద్ర రక్షణ శాఖ అంచనా వేస్తోంది.

'ఆర్‌జీ కర్' నిరసనకారులపై లాఠీఛార్జి

- బాధితురాలి తల్లిపైనా పోలీసు బలప్రయోగం
- ర్యాలీలను అడ్డుకునేందుకు కోల్‌కతాలో భారీ ఏర్పాట్లు
- సెక్రటేరియట్ వైపు వెళ్లకుండా ఆందోళనకారుల అడ్డగింత


నిరసనకారులను అడ్డుకునేందుకు సంత్రాగచ్చి వద్ద ఏర్పాటైన భారీ బారికేడ్లు

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ప్రభుత్వాస్పత్రిలో ట్రెయినీ వైద్యురాలు హత్యాచారానికి గురై ఏడాది నిండిన సందర్భంగా శనివారం నిరసనకారుల ర్యాలీలు రణరంగాన్ని తలపించాయి. కోల్‌కతాలోని రాష్ట్ర సెక్రటేరియట్ 'నబన్న'దిశగా వచ్చే ఆందోళన కారులను అడ్డుకునేందుకు పోలీసులు 10 అడుగుల ఎత్తయిన బారికేడ్లను, పలు అంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. వీటిని దాటేందుకు ఆందోళన కారులు ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జి చేపట్టారు. ముందుగా నిర్దేశించిన ప్రాంతం నుంచి కాకుండా రద్దీగా ఉండే పార్క్ స్ట్రీట్ మీదుగా ర్యాలీ సాగడం ఉద్రిక్తతకు కారణమైంది. పోలీసులు అడ్డుతగలడంతో బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీకి చెందిన పలువురు నేతలు, ఎమ్మెల్యేలు నెహ్రూ రోడ్ క్రాసింగ్‌లో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు చేపట్టిన లాఠీచార్జిలో సువేందు తదితరులు సహా 100 మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు తనపై దాడి చేశారని ట్రెయినీ వైద్యురాలి తల్లి ఆరోపించారు. 'ర్యాలీలో పాల్గొన్న నన్ను పోలీసులు కొట్టారు. నా చేతి గాజులు పగిలిపోయాయి. మమల్ని ఎందుకు ఆపుతున్నారు? నా కుమార్తెకు న్యాయం కోసం సెక్రటేరియట్‌కు వెళ్లాలనుకున్నాం'అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. లాఠీచార్జీలో తమ పార్టీ ఎమ్మెల్యేలతోపాటు బాధిత ట్రెయినీ వైద్యురాలి తల్లిదండ్రులకు కూడా దెబ్బలు తగిలాయని సువేందు ఆరోపించారు. 'పోలీసులను కొట్టే సమయం దగ్గరపడింది. మా హై కమాండ్ నుంచి ఆదేశాలు వస్తే చాలు..అప్పుడిక పోలీసులు మమతా బెనర్జీ చాటున దాక్కోవాల్సిందే'అని బీజేపీ నేత, మాజీ క్రికెటర్ అశోక్ దిండా ఆగ్రహంతో అన్నారు. అయితే, నబన్న చుట్టుపక్కల ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు అమల్లోకి ఉన్నాయని పోలీసులు తెలిపారు. వేకువజామున 4 నుంచి రాత్రి 10 గంటల వరు నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను అమలు చేశారు. హౌరా బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పెద్ద సంఖ్యలో ఆందోళనకారుల తరలివస్తారన్న సమాచారంతో ముందు జాగ్రత్తగా పోలీసులు పలు చోట్ల వాటర్ కెనన్లను సిద్ధంగా ఉంచారు. కీలకమైన మార్గాల్లో భారీ కంటెయినర్లను అడ్డుగా ఉంచారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించారు. కాగా, ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో గతేడాది ఆగస్టులో చోటుచేసుకున్న దారుణం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఘటనలో సంజయ్ రాయ్ అనే పౌర వలంటీర్‌ను సీబీఐ కోర్టు దోషిగా నిర్ధారించింది.

ఆకలితో 11 మంది.. కాల్పుల్లో 21 మంది..!

గాజాలో కొనసాగుతున్న ఇజ్రాయెల్ దారుణాలు

గాజా: గాజాలో 24 గంటల వ్యవధిలో 11 మంది పాలస్తీనియన్లు ఆకలితో అసువులు బాశారని అధికారులు తెలిపారు. తాజా మరణాలతో కలిపి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో సంభవించిన ఆకలిచావులు 212కు చేరాయన్నారు. మరోవైపు, ఆహార పంపిణీ కేంద్రాల వద్దకు వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో మరో 21 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. శుక్రవారం జికింగ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో ఆరుగురు చనిపోగా 140 మందికి పైగా గాయపడ్డారని షిఫా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఐరాస మానవతా సాయం ట్రక్కులు ఈ క్రాసింగ్ మీదుగానే గాజాలోకి ప్రవేశిస్తాయి. కాగా, 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి హమాస్ లక్ష్యంగా గాజాలో ఇజ్రాయెల్ ఆర్మీ చేపట్టిన దాడుల్లో 61,369 మంది చనిపోగా 1.52లక్షల మంది క్షతగాత్రులుగా మారారని ఆరోగ్య విభాగం తెలిపింది.

ముక్కలుగా నరికి..10 చోట్ల పడేశారు..!

కర్నాటకలో మహిళ దారుణ హత్య

- పచ్చబొట్టు ఆధారంగా మృతురాలి గుర్తింపు
- హంతకుడి కోసం పోలీసుల గాలింపు

బెంగళూరు: 2022నాటి శ్రద్ధా వాకర్ దారుణ హత్యను తలపించే ఘటన ఒకటి కర్నాటకలో వెలుగు చూసింది. ఈ నెల 7వ తేదీన కొరటగెరె తాలుకాలోని ఓ గ్రామంలో వీధి కుక్క ఒకటి రక్తమోడుతున్న మనిషి చేతిని లాక్కెళుతుండగా చూసి షాక్‌కు గురయ్యారు. మరో చేయి అక్కడికి కిలోమీటర్ దూరంలో గ్రామస్తులకు కనిపించింది. గుర్తు తెలియని మహిళ తల, మొండెం తదితర భాగాలు పది వేర్వేరు ప్రాంతాల్లో పడి ఉండగా గుర్తించారు. సాధారణంగా చోటుచేసుకునే హత్య వంటిది కాదని తేల్చిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చేతిపై ఉన్న పచ్చబొట్టు ఆధారంగా మృతురాలిని గుర్తించారు. హంతకుడిని పట్టుకునే పనిలో ఉన్నారు.

10 చోట్ల 10 భాగాలు..

ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం చింపుగనహళ్లి గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం సమీపంలో రోడ్డు పక్కన కుక్క ఒకటి మనిషి తెగిన చేతిని పొదల్లోకి లాక్కెళ్తుండగా స్థానికులు గమనించారు. ప్లాస్టిక్ కవర్‌లో చుట్టిన మరో చేయి ఆ సమీపంలోనే వారికి కనిపించింది. మరికొద్ది గంటల వ్యవధిలోనే వివిధ ప్రాంతాల్లో మరికొన్ని అవయవ భాగాలు కనిపించాయి. లింగపుర రోడ్డు వంతెన వద్ద పేగులు, ఇతర అంతర్గత భాగాలు బెండోన్ నర్సరీకి సమీపంలో, ఒక కాలు రక్తంతో తడిచిన బ్యాగు జోనిగరహళ్లి వద్ద పోలీసులకు దొరికాయి. సిద్దారబెట్ట, నాగాలాల్ మధ్య రోడ్డుపై రెండు బ్యాగుల్లో మరికొన్ని శరీర భాగాలను గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం సిద్దారబెట్ట సమీపంలో హతురాలి తల లభ్యమైంది. శరీర భాగాల స్వీకొరటగెరె, కొలాల పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 10 ప్రాంతాల్లో పడి ఉండగా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. హతురాలి చేతులపై ఉన్న పచ్చబొట్లు, ముఖకవళికల ఆధారంగా ఆమెను తుమకూరు తాలుకా బెళ్లావికి చెందిన లక్ష్మీదేవమ్మ(42)అని గుర్తించారు. ఆగస్టు 3వ తేదీన ఉర్దిగెరెలో ఉన్న కుమార్తెను చూసేందుకని వెళ్లిన లక్ష్మీదేవమ్మ కనిపించకుండా పోయిందంటూ ఆమె భర్త బెళ్లావి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం ఆమెను హత్య చేసి, ముక్కలుగా నరికారని, ఆమె ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకే హంతకులు పలు ప్రాంతాల్లో శరీర భాగాలను పడేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దారుణ హత్యకు పాల్పడిందెవరు? కారణాలేమిటో తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. 2022లో ఢిల్లీలో శ్రద్ధా వాకర్ అనే యువతిని ఆమె బాయ్‌ఫ్రెండ్ ముక్కలుగా నరికి అటవీ ప్రాంతంలో పడేసిన ఘటన తీవ్ర సంచలనం రేపడం తెల్సిందే.

రాహుల్ ఆరోపణలపై దర్యాప్తు జరపాలి

శరద్ పవార్ డిమాండ్

నాగ్‌పూర్: ఓట్ల చోరీ జరిగిందంటూ ఎన్నికల కమిషన్‌పై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై సవివరంగా దర్యాప్తు చేయించాలని ఎన్‌సీపీ(ఎస్‌పీ)చీఫ్ శరద్ పవార్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ప్రతిష్ట మసకబారేలా, ఎన్నికల సమగ్రతపై అనుమానాలు కలిగేలా రాహుల్ ఆరోపణలపై నిగ్గు తేల్చాలన్నారు. ఓటరు జాబితాలో దొర్లిన తప్పులపై అఫిడవిట్‌ను సమర్పించి, ప్రమాణం చేయాలంటూ ఈసీ ఎలా షరతు పెడుతుందని పవార్ ప్రశ్నించారు. 'రాహుల్ పూర్తిగా పరిశీలించి, ఆధారాలను కనుగొన్న తర్వాతే ఆరోపణలు చేశారు. ఆయన పేర్కొన్న అంశాలపై ప్రజల్లో తలెత్తిన అనుమానాలను నివృత్తి చేసేందుకు పూర్తిస్థాయి విచారణ జరిపించాలి. దర్యాప్తుతోనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని భావిస్తున్నాను' అని శరద్ పవార్ పేర్కొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలగిన ఈసీ..రాహుల్ నుంచి ప్రత్యేకంగా డిక్లరేషన్ కోరరాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇవే ఆరోపణలను రాహుల్ పార్లమెంట్‌లోనూ చేశారని గుర్తు చేశారు. ఈసీపై రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తే, బీజేపీ నేతలకు స్పందించాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షానికి సమాధానం ఇవ్వాల్సింది ఈసీయే తప్ప, ఇతర పార్టీల నేతలు కాదని వ్యాఖ్యానించారు. ఓట్ల అవకతవకలపై హోం మంత్రి అమిత్ షా బాధ్యతాయుతంగా స్పందించడం మానేసి ఈ అంశాన్ని పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపడతాయన్నారు.

అమెరికా సీడీసీ సెంటర్ వద్ద కాల్పులు..

పోలీసు అధికారి మృతి

అట్లాంటా: అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) వద్ద జరిగిన కాల్పుల ఘటనలో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. దుండగుడు రోడ్డుకు ఆవల నిలబడి కార్యాలయంపైకి యథేచ్ఛగా కాల్పులు జరిపి, పరారయ్యాడు. కార్యాలయంలోని పలు విభాగాల కిటికీలకు బుల్లెట్ రంధ్రాలయ్యాయి. కాల్పుల భయంతో ఉద్యోగులు ఎక్కడివారక్కడే దాక్కుండిపోయారు. ప్రతిష్టాత్మక ప్రభుత్వ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనను భద్రతా విభాగాలు సీరియస్‌గా తీసుకున్నాయి. దుండగుడిని జార్జియాకు చెందిన పాట్రిక్ జోసెఫ్ వైట్‌గా గుర్తించారు. ఇతడి కాల్పుల్లో చనిపోయిన పోలీసు అధికారి డికాబ్ కౌంటీలో పనిచేసే డేవిడ్ రోజ్ అని ప్రకటించారు. ఘటన నేపథ్యంలో సోమవారం కార్యాలయానికి సెలవు ప్రకటించారు.

టైమ్స్ స్క్వేర్ వద్ద కాల్పులు..

న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వద్ద కాల్పుల ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు కారణాలు తెలియరాలేదు.

అపోలో వ్యోమగామి జిమ్ లవెల్ కన్నుమూత



వాషింగ్టన్: అపోలో 13 మిషన్‌కు నాయకత్వం వహించిన అమెరికా వ్యోమగామి జిమ్ లవెల్ 97 ఏళ్ల వయస్సులో శుక్రవారం కన్నుమూశారు. 'జిమ్ వ్యక్తిత్వం, దృఢ సంకల్పం మన దేశం చంద్రుడిని చేరుకోవడానికి, విషాదాన్ని విజయంగా మార్చడానికి సహాయపడ్డాయి, అప్పటి ఘటన నుంచి మేం ఎంతో నేర్చుకున్నాం. జిమ్ మరణానికి సంతాపం తెలియజేస్తున్నాం'అని నాసా ఒక ప్రకటనలో తెలిపింది. నాసా కార్యకలాపాలు చేపట్టిన మొదటి దశాబ్ద కాలంలో అత్యధికంగా ప్రయాణించిన వ్యోమగాములలో ఒకరు లవెల్. జెమిని 7, జెమిని 12, అపోలో 8, అపోలో 13 మిషన్లలో నాలుగుసార్లు ప్రయాణించారు.

1928లో క్లీవ్‌ల్యాండ్‌లో జన్మించారు లవెల్. 1952లో అమెరికా నేవల్ అకాడెమీలో డిగ్రీ సాధించారు. 1952లో టెస్ట్ పైలట్, 1962లో నాసాలో వ్యోమగామిగా ఎంపికయ్యారు. జెమిని 7, అపోలో 8 వంటి మిషన్లలో ఆయన భాగస్వామిగా ఉన్నప్పటికీ, 1970 నాటి అపోలో 13 మిషన్ మాత్రం లెజెండ్‌గా ఆయన్ను మార్చివేసింది. మూడో యాత్ర సందర్భంగా చంద్రుడిపైకి దిగాక ఆక్సిజన్ సిలిండర్ పేలిపోయింది. దీంతో, అందులోని సిబ్బంది భూమికి సుమారు 2 లక్షల మైళ్ల దూరంలో చిక్కుబడిపోయారు. అయినప్పటికీ ధైర్యాన్ని కోల్పోక ప్రత్యామ్నాయాలను అనుసరించి, అపాయం నుంచి బయటపడ్డారు. 'వాస్తవానికి ఆ మిషన్ విఫలమైంది. దాంతో సాధించింది కూడా ఏమీ లేదు. కానీ, దాని ద్వారా వచ్చిన ఫలితం మాత్రం అద్భుతం. అలాంటి విపత్తును సైతం ధైర్యంగా స్వీకరించి విజయవంతంగా మార్చగల సత్తా ఉందని నిరూపించడమే మేం సాధించిన విజయం'అని లవెల్ రాయిటర్స్‌కు 2010లో ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. తనతోపాటు సహచరులు జాక్ స్విగెర్ట్, ఫ్రెడ్ హయిజ్‌లు.. గడ్డకట్టించే చలి, ఆకలి, మరోవైపు కేవలం నాలుగు రోజులకు మాత్రమే సరిపడే ఆక్సిజన్ ఉన్నా ఎంతో ధైర్యంతో వ్యవహరించామన్నారు. ఆ సమయంలో స్విగెర్ట్.. 'హౌస్టన్, మాకో సమస్య వచ్చి పడింది'అంటూ నాసాకు చాలా తేలికైన సందేశమిచ్చారు. దీనినే టామ్ హాంక్స్ 1995 నాటి అపోలో 13 సినిమాలో వాడుకున్నారు. ఆ సినిమాలో లవెల్ పాత్రను టామ్ హాంక్స్ పోషించడం విశేషం. అపోలో 13 మిషన్ పసిఫిక్ సముద్రంలో సురక్షితంగా ల్యాండైంది. అప్పటికే లవెల్ పేరు ప్రపంచమంతటా మారుమోగిపోయింది. ఎన్నో తీవ్ర ఒత్తిళ్ల మధ్య నిబ్బరంగా పనిచేసిన లవెల్ మారుపేరుగా నిలిచారు. 1973లో నాసా నుంచి రిటైరయ్యారు.

జార్ఖండ్‌లో పట్టాలు తప్పిన రెండు గూడ్స్ రైళ్లు

జంషెడ్‌పూర్/కోల్‌కతా: జార్ఖండ్‌లోని సెరాయికెలా-ఖర్‌స్వాన్ జిల్లాలో శనివారం ఉదయం రెండు గూడ్స్ రైళ్లు పట్టాలు తప్పడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి. ఆగ్నేయ రైల్వేలోని ఆద్రా డివిజన్లో చండిల్-నిమ్‌డిహ్ స్టేషన్ల మధ్య ఒక గూడ్స్ రైలు బోగీలు పట్టాలు తప్పి, ఎదురుగా వస్తున్న మరో గూడ్స్ బోగీలను మధ్యలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి అపాయం వాటిల్లలేదని అధికారులు వెల్లడించారు. అయితే, ఆ మార్గంలో పలురైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను దారి మళ్లించడం, మార్గాన్ని కుదించడం చేశామన్నారు.

తీరొక్క బంధం.. అదే రాఖీ అందం


ఢిల్లీలో శనివారం ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదికి రాఖీ కట్టి, తిలకం దిద్దుతున్న విద్యార్థినులు


వాఘా సరిహద్దు పోస్టు వద్ద బీఎస్ఎఫ్ మహిళా జవానుకు రాఖీలు కడుతున్న మహిళలు


పశ్చిమబెంగాల్‌లోని నదియాలో బస్సు ప్రయాణికులకు మహిళల రక్షా బంధనం


అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన తన సోదరుడి ఫొటోకు రక్షా బంధన్ నాడు పూజ చేస్తున్న గుజరాత్‌లోని ఆనంద్‌కు చెందిన మహిళ


మహారాష్ట్రలోని థానేలో శివ ముద్ర ప్రతిష్ఠాన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో రాఖీలు కడుతున్న ముస్లిం మహిళలు


యూపీలో మధురలోని జిల్లా జైలు వద్ద తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

ఢిల్లీలో భారీ వర్షాలు.. గోడకూలి ఏడుగురు మృత్యువాత

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షాలు, వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు ప్రాంతాలు వరద నీట మునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జైత్‌పూర్‌లోని మోహన్ బాబా మందిర్ సమీపంలో శనివారం ఉదయం గోడకూలిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు వివరించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఢిల్లీలో కుండపోత వాన మొదలైంది. శనివారం ఉదయం 9 గంటల సమయంలో అందిన సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది పోలీసులతో కలిసి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. గోడను పగులగొట్టి లోపల ఇరుక్కుపోయిన 8 మందిని బయటకు తీశారు. వారిని వెంటనే సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి, ఎయిమ్స్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలికలు పరిస్థితి విషమించి చనిపోయారని పోలీసులు తెలిపారు. వీరంతా పశ్చిమబెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన వారన్నారు. వర్షం నీరు నిలిచి, గోడ నానడమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

300 విమానాలు ఆలస్యం: భారీ వర్షాల కారణంగా ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం 300కు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. కొన్నింటిని రద్దు చేశారు. విమానాలు సరాసరిన 17 నిమిషాలు ఆలస్యమయ్యాయి. ఏ ఒక్క విమానాన్ని కూడా దారి మళ్లించలేదని అధికారులు తెలిపారు. ఈ విమానాశ్రయం ద్వారా నిత్యం 1,300 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ ఏది?

స్థానిక పరిపాలనా కార్యకలాపాలను నిర్వహించే ప్రభుత్వాలను స్థానిక ప్రభుత్వాలుగా పేర్కొంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ వికాసాన్ని పెంపొందిస్తే.. స్థానిక ప్రభుత్వాలు రాజకీయ వికాసంతోపాటు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వికాసానికి తోడ్పడతాయి. వీటి ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుంది. ఈ ప్రభుత్వాలు రాజకీయ పరిజ్ఞానాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందిస్తాయి. నాయకులకు రాజకీయంగా ఎదిగేందుకు పునాదుల్లా పనిచేస్తాయి. వీటి ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని నిర్మించవచ్చు.



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

స్థానిక ప్రభుత్వాల అభివృద్ధి

భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు చారిత్రక క్రమంలో అభివృద్ధి చెందాయి. వీటిని ప్రవేశపెట్టిన మొదటి రాజవంశం 'మౌర్యులు'. చోళులు స్థానిక ప్రభుత్వాల విషయంలో ఉన్నత మార్పులు ప్రవేశపెట్టారు. వీరి కాలంలో ఈ ప్రభుత్వాలను 'నాడులు' అని పిలిచేవారు. ఢిల్లీ సుల్తాన్ల కాలంలో గ్రామ పంచాయతీలు ఉండేవి. భూమిని కొలిచి దాని ఆధారంగా పన్ను వసూలు చేసే విధానాన్ని షేర్షా ప్రారంభించాడు. మొగలుల కాలంలో 'కొత్వాల్' అనే అధికారి పట్టణ పాలనను చూసుకునేవాడు.

భారతదేశంలో స్థానిక ప్రభుత్వాలు ప్రధానంగా బ్రిటిషర్ల కాలంలోనే అభివృద్ధి చెందాయి. వీరి కాలంలో మొదటగా 1687లో మద్రాస్‌లో మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. వీటి స్థానంలో 1726లో మేయర్ కోర్టులను స్థాపించారు. బ్రిటిషర్లు జిల్లాను ఒక యూనిట్ గా తీసుకొని 1772లో కలెక్టర్ పదవిని ప్రవేశ పెట్టారు. 1793 చార్టర్ చట్టం ద్వారా కలకత్తా, మద్రాస్ స్థానిక ప్రభుత్వాలకు చట్టబద్ధత కల్పించారు. 1813 చార్టర్ చట్టం ద్వారా ఈ ప్రభుత్వాలకు పన్ను విధించే, వసూలు చేసుకునే అధికారం కల్పించారు.

ఎల్గిన్ మేయో, లార్డ్ రిప్పన్ స్థానిక ప్రభుత్వాల అభివృద్ధికి బాగా తోడ్పడ్డారు. మేయో 1870లో, రిప్పన్ 1887లో ఈ ప్రభుత్వాలకు సంబంధించి తీర్మానాలను ప్రవేశపెట్టారు. రిప్పన్ తీర్మానాన్ని స్థానిక ప్రభుత్వాల 'మాగ్నాకార్టా'గా పేర్కొంటారు. ఇతడిని 'స్థానిక ప్రభుత్వాల పితామహుడు' అంటారు.

స్థానిక ప్రభుత్వాలు ప్రారంభంలో కొంత కాలంపాటు బాగా పనిచేసి వైఫల్యం చెందాయి. వీటిని సమీక్షించడానికి 1907లో చార్లెస్ హబ్‌హౌస్ అధ్యక్షతన రాయల్ కమిషన్‌ను నియమించారు. ఈ కమిషన్ 1909లో నివేదిక సమర్పించింది. ఈ కమిటీ సిఫారసు మేరకు 1909 మింటోమార్లే సంస్కరణల చట్టం ద్వారా స్థానిక సంస్థలకు ప్రతినిధులను ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు. 1919 మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణల చట్టం ద్వారా స్థానిక ప్రభుత్వాలను రాష్ట్ర జాబితాలో అయిదో అంశంగా చేర్చారు. 1935 చట్టం ద్వారా ఈ ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలు బదలాయించి బలోపేతం చేశారు.

భారత రాజ్యాంగంలో ఈ ప్రభుత్వాలకు సంబంధించి అధికరణ 40, 243లను చేర్చారు. కానీ వీటిని వెంటనే ఏర్పాటు చేయలేదు. ఫలితంగా గ్రామీణ సమస్యలు అధికమయ్యాయి. వీటి పరిష్కారానికి వి.టి. కృష్ణమాచారి కమిషన్ సిఫారసు మేరకు 1952 అక్టోబరు 2న 55 సమితుల్లో 'సమాజ అభివృద్ధి పథకం (CDP)' ప్రవేశపెట్టారు. దీనికి అమెరికాలోని స్వచ్ఛంద సంస్థ 'పోర్డు ఫౌండేషన్' సహకారం అందించింది. ఈ పథకాన్ని మూడేళ్ల కాలానికి ప్రవేశపెట్టారు. దీనికి శాశ్వత కొనసాగింపుగా 1953 అక్టోబరు 2న జాతీయ విస్తరణ పథకాన్ని ప్రవేశపెట్టారు.

సమాజ అభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ పథకం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. వీటిని సమీక్షించి సమస్యల పరిష్కారానికి సూచనలు చేయడానికి 1957లో జాతీయ అభివృద్ధి మండలి 'బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ'ని నియమించింది. ఈ కమిటీ 1957 నవంబరులో నివేదిక సమర్పించింది. దీన్ని 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులు:

- మూడంచెల పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అవి:
  1. జిల్లా పరిషత్, 2. పంచాయతీ సమితి
  3. గ్రామ పంచాయతీ
- ప్రతి అయిదేళ్లకోసారి నియమబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి.
- ఎన్నికలను పార్టీ ప్రాతిపదికన కాకుండా స్వతంత్ర ప్రాతిపదికన జరపాలి.
- గ్రామ పంచాయతీకి ప్రత్యక్షంగా, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్‌కు పరోక్షంగా ఎన్నికలు నిర్వహించాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 1/6 వంతు నిధులను పంచాయతీలకు కేటాయించాలి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులను మొదటిసారిగా రాజస్థాన్ 1959 అక్టోబరు 2న నాగూర్ జిల్లాలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత 1959 నవంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నేటి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. నాటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి. అనంతరం మరి కొన్ని రాష్ట్రాలు వీటిని ప్రవేశ పెట్టాయి. ఇవి కొంతకాలం పాటు ఆశాజనకంగా పనిచేసినా సకాలంలో నిధులు, విధుల పంపిణీ జరగకపోవడం వల్ల లక్ష్య సాధనలో వైఫల్యం చెందాయి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులను అమలు చేసినా స్థానిక ప్రభుత్వాలు లక్ష్యసాధనలో ఆశించిన ప్రగతి సాధించలేదు. వీటిని పునఃసమీక్షించి సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వడానికి 1977లో మొరార్జీదేశాయ్ నాయకత్వంలోని జనతా ప్రభుత్వం అశోక్ మెహతా కమిటీని నియమించింది. ఈ కమిటీ 1978లో నివేదిక సమర్పించింది.

అశోక్ మెహతా కమిటీ సూచనలు:

- మూడంచెల పంచాయతీ వ్యవస్థను రద్దు చేసి దాని స్థానంలో రెండంచెల వ్యవస్థను ప్రవేశపెట్టాలి. జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్‌ను, బ్లాక్ స్థాయిలో మండల పంచాయతీని ఏర్పాటు చేయాలి.
- 1500 నుంచి 20,000 మంది జనాభా ఉన్న కొన్ని గ్రామాలను మండల పంచాయతీగా ఏర్పాటు చేయాలి.
- రెండు స్థాయిల్లో పార్టీ ప్రాతిపదికన పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి.
- పంచాయతీల కాలపరిమితిని నాలుగేళ్లుగా నిర్ణయించాలి.
- ప్రత్యేక ఆడిటింగ్ అకౌంటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

ఈ కమిటీ సిఫారసులను మొదటగా 1980లో కర్ణాటక, ఆ తర్వాత 1986లో ఆంధ్రప్రదేశ్, తర్వాత మరికొన్ని రాష్ట్రాలు ప్రవేశపెట్టాయి.

బ్లాక్ స్థాయిలో ప్రణాళికీకరణపై అధ్యయనం చేయడానికి 1978లో దంత్‌వాలా కమిటీని నియమించారు. ఈ కమిటీ సర్పంచ్‌ను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని, మధ్యస్థాయిలోని బ్లాక్ వ్యవస్థకు ప్రాముఖ్యం ఇవ్వాలని, కలెక్టర్ ప్రధాన పాత్ర పోషించాలని సిఫారసు చేసింది.

1984లో సి.హెచ్. హనుమంతరావు కమిటీని నియమించారు. ఇది జిల్లా ప్రణాళిక సంఘాలను ఏర్పాటు చేయాలని, దీని అధ్యక్షునిగా మంత్రి లేదా కలెక్టర్‌ను కొన సాగించాలని సూచించింది.

గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, పరిపాలన ఏర్పాట్లు అనే అంశాలను పరిశీలించడానికి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1985లో జి.వి.కె. రావు కమిటీని నియమించింది. ఈ కమిటీ జిల్లా అభివృద్ధికి జిల్లాను యూనిట్‌గా తీసుకోవాలని, బ్లాక్ వ్యవస్థను రద్దు చేసి జిల్లా పరిషత్‌ను పటిష్ఠం చేయాలని సూచించింది.

స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయడానికి తగిన సిఫారసుల కోసం రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో ఎల్.ఎం. సింఘ్వీ కమిటీని నియమించింది. ఈ కమిటీ 1987లో నివేదిక సమర్పించింది.

సింఘ్వీ కమిటీ ప్రధాన సిఫారసులు:

- స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలి.
- న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- సకాలంలో సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలి.
- పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలి.

గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1988లో పి.కె.తుంగన్ అధ్యక్షతన ఉప కమిటీని నియమించింది. ఈ కమిటీ స్థానిక సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని సిఫారసు చేసింది. ఎల్.ఎం. సింఘ్వీ, పి.కె. తుంగన్ కమిటీల సిఫారసుల మేరకు 1989లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం 64వ, 65వ రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టింది. 64వ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా రాజ్యసభలో వీగిపోయింది. 65వ సవరణ బిల్లు చర్చ సమయంలో లోక్‌సభను రద్దు చేశారు.

స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించే ఉద్దేశంతో 1991లో పి.వి.నరసింహారావు ప్రభుత్వం 73వ, 74వ రాజ్యాంగ సవరణలు ప్రవేశపెట్టింది. ఇవి 1992లో పార్లమెంట్ ఆమోదం పొంది, 1993 నుంచి అమల్లోకి వచ్చాయి.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి 'పంచాయతీ రాజ్ చట్టం'గా అమల్లోకి తీసుకువచ్చారు. ఈ చట్టాన్ని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. దీని గురించి అధికరణలు 243 A నుంచి O వరకు తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా IXవ భాగంలో చేర్చారు.

74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి 'నగర పాలక చట్టం'గా అమల్లోకి తెచ్చారు. దీన్ని ప్రత్యేకంగా 12వ షెడ్యూల్‌లో చేర్చారు. ఈ చట్టం గురించి అధికరణలు 243 P నుంచి Z_G వరకు తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా $IX_{(A)}$వ భాగంలో చేర్చారు.

మాదిరి ప్రశ్నలు

1. భారతీయ ప్రముఖుల్లో ఎవరిని స్థానిక ప్రభుత్వాల పితామహుడిగా పేర్కొంటారు?
   ఎ) జవహర్‌లాల్ నెహ్రూ
   బి) మానవేంద్రనాథ్ రాయ్
   సి) మహాత్మా గాంధీ
   డి) సర్దార్ వల్లభాయ్ పటేల్
2. ఏ కమిటీ సిఫారసు మేరకు స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు?
   ఎ) బల్వంత్‌రాయ్ కమిటీ
   బి) అశోక్ మెహతా కమిటీ
   సి) జి.వి.కె. రావు కమిటీ
   డి) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
3. స్థానిక ప్రభుత్వాలు ప్రస్తుతం ఏ జాబితాలో ఉన్నాయి?
   ఎ) కేంద్ర జాబితా బి) రాష్ట్ర జాబితా
   సి) ఉమ్మడి జాబితా డి) అవశిష్ట అంశం
4. 'గ్రామ స్వరాజ్య సాధనకు స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి' అని ఎన్నో అధికరణంలో పేర్కొన్నారు?
   ఎ) 243 బి) 40
   సి) 44 డి) 73
5. ప్రస్తుత పంచాయతీ రాజ్ వ్యవస్థకు మూలం ఏది?
   ఎ) అశోక్ మెహతా కమిటీ
   బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   సి) దంత్‌వాలా కమిటీ
   డి) రాజమన్నార్ కమిటీ
6. రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని నియమించేది ఎవరు?
   ఎ) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   బి) ప్రధానమంత్రి
   సి) రాష్ట్ర గవర్నర్
   డి) భారత ఆర్థిక సంఘం
7. మండల పంచాయతీ వ్యవస్థను సిఫారసు చేసిన కమిటీ ఏది?
   ఎ) అశోక్ మెహతా కమిటీ
   బి) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   సి) నరసింహన్ కమిటీ
   డి) సర్కారియా కమిటీ
8. భారతదేశ చరిత్రలో స్థానిక ప్రభుత్వాలను ప్రవేశపెట్టిన మొదటి రాజవంశం ఏది?
   ఎ) మౌర్యులు బి) చోళులు
   సి) మొగలులు డి) పల్లవులు
9. బ్రిటిషర్ల కాలంలో మొదటి స్థానిక ప్రభుత్వాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   ఎ) బొంబాయి బి) మద్రాస్
   సి) కలకత్తా డి) మచిలీపట్నం
10. మనదేశంలో స్థానిక ప్రభుత్వాల 'మాగ్నాకార్టా'గా దేన్ని పేర్కొంటారు?
    ఎ) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ నివేదిక
    బి) అశోక్ మెహతా కమిటీ నివేదిక
    సి) 1887 రిప్పన్ తీర్మానం
    డి) 1870 ఎల్గిన్ మేయో తీర్మానం

సమాధానాలు

1) డి; 2) డి; 3) బి; 4) బి; 5) బి; 6) సి; 7) ఎ; 8) ఎ; 9) బి; 10) సి;

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   సి) మండల పరిషత్ అధ్యక్షులు
   డి) జిల్లాలో ఉన్న సర్పంచ్‌లు
2. భారత్‌లో మొదటిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థను 1959 అక్టోబరులో ఎక్కడ ప్రవేశ పెట్టారు?
   ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
   సి) కేరళ డి) కర్ణాటక
3. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు?
   ఎ) మార్చి-24 బి) అక్టోబరు-24
   సి) ఆగస్టు-24 డి) ఏప్రిల్-24
4. బ్లాక్ లెవల్ ప్లానింగ్ (బ్లాకు స్థాయి ప్రణాళిక)ను ఏ కమిటీ సిఫారసు చేసింది?
   ఎ) జి.వి.కె. రావు కమిటీ
   బి) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
   సి) కె. సంతానం కమిటీ
   డి) దంత్‌వాలా కమిటీ
5. స్థానిక ప్రభుత్వాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
   ఎ) మహాత్మా గాంధీ బి) సర్దార్ పటేల్
   సి) లార్డ్ రిప్పన్ డి) ఎల్గిన్ మేయో

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) డి; 5) సి.

'మాతృభావన' పాఠ్యభాగంలో ఇతివృత్తం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

మాదిరి ప్రశ్నలు

1. నన్నయ ఎవరి ఆస్థాన కవి?
   1) మనుమసిద్ధి
   2) రాజరాజ నరేంద్రుడు
   3) ప్రోలయ వేమారెడ్డి
   4) మాధవ వర్మ
2. నన్నయ రాసిన శాసనం ఏది?
   1) వేంగీ శాసనం
   2) మైదవోలు శాసనం
   3) నందంపూడి శాసనం
   4) కందుకూరి శాసనం
3. భారతాంధ్రీకరణలో నన్నయకు సహకరించిన లేఖకుడు ఎవరు?
   1) గురునాథుడు
   2) నారాయణభట్టు
   3) పావులూరి మల్లన
   4) గణపతి
4. దుందుభి పాఠ్య భాగంలోని ఇతివృత్తం?
   1) సంస్కృతి విలువలు
   2) పర్యావరణ ప్రాధాన్యం
   3) నైతిక విలువలు
   4) సామాజిక చైతన్యం
5. మహబూబ్‌నగర్ జిల్లా గంగాపురం ప్రాంతంలో దుందుభి నదిని ఏ పేరుతో పిలుస్తారు?
   1) జయసేన 2) హరిసేన
   3) విజయసేన 4) దేవసేన
6. కిందివాటిలో నన్నయ కవితా గుణం కానిది ఏది?
   1) అక్షర రమ్యత 2) సూక్తి వైచిత్రి
   3) నానారుచిరార్థ సూక్తి నిధిత్వం
   4) ప్రసన్న కథా కలితార్థయుక్తి
7. 'మన సంస్కృతి' పాఠ్యభాగ రచయిత?
   1) నార్ల వేంకటేశ్వరరావు
   2) కాళోజీ
   3) డాక్టర్ బిరుదురాజు రామరాజు
   4) డాక్టర్ పి. యశోరెడ్డి
8. వేంకటేశ శతక కర్త?
   1) తాళ్లపాక అన్నమయ్య
   2) తాళ్లపాక పెద తిరుమలాచార్యులు
   3) చిన తిరుమలాచార్యులు
   4) తరిగొండ వెంగమాంబ
9. 'మిత్ర సాహస్రి' శతక కర్త?
   1) అందె వెంకటరాజం
   2) ఏలూరిపాటి అనంత రామయ్య
   3) కొండూరు వీర రాఘవాచార్యులు
   4) గరికపాటి నరసింహారావు
10. 'దాశరథీ' శతకకర్త ఎవరు?
    1) ధూర్జటి 2) కంచర్ల గోపన్న
    3) దాశరథి కృష్ణమాచార్యులు
    4) రంగాచార్యులు
11. ప్రతిజ్ఞ ఖండిక శ్రీశ్రీ రాసిన ఏ గ్రంథంలోనిది?
    1) మరో ప్రస్థానం 2) ఖడ్గ సృష్టి
    3) సి.ప్రాలి 4) మహా ప్రస్థానం
12. 'హరిశ్చంద్రుడు' పాఠ్యభాగం గౌరన రచించిన ఏ గ్రంథంలోనిది?
    1) నవనాథ చరిత్ర 2) లక్షణ దీపిక
    3) హరిశ్చంద్రోపాఖ్యానం
    4) షట్చక్రవర్తుల కథ
13. గౌరన హరిశ్చంద్రోపాఖ్యానం ఏ ప్రక్రియకు చెందింది?
    1) పద్యం 2) ద్విపద
    3) మంజరీ ద్విపద 4) గేయం
14. 'అజంతా చిత్రాలు' పాఠ్యభాగ రచయిత?
    1) విద్వాన్ విశ్వం
    2) నార్ల వేంకటేశ్వరరావు
    3) సంజీవదేవ్
    4) వట్టికోట ఆళ్వారుస్వామి
15. వట్టికోట ఆళ్వారుస్వామి 'చిన్నప్పుడే' కథానికను ప్రచురించిన పత్రిక ఏది?
    1) గోల్కొండ 2) కాకతీయ
    3) తెలంగాణ 4) మిజాన్
16. ఆంధ్ర మహాభారతంలో తిక్కన రచించిన పర్వాలెన్ని?
    1) 12 2) 14 3) 15 4) 13
17. కిందివాటిలో తిక్కన కవితా గుణం కానిది?
    1) నాటకీయత 2) పాత్ర చిత్రణ
    3) తెనుగుతనం 4) అక్షర రమ్యత
18. 'సర్వేశ్వర' శతకకర్త ఎవరు?
    1) పాల్కురికి సోమన
    2) యథావాక్కుల అన్నమయ్య
    3) కూచిమంచి తిమ్మకవి
    4) బద్దెన
19. 'దుష్ట సంహార నరసింహదురిత దూర' - మకుటంతో నరసింహ శతకం రాసిన కవి?
    1) గోగుల పాటి కూర్మనాథకవి
    2) కాసుల పురుషోత్తమ కవి
    3) కాకుత్సం శేషప్పకవి
    4) మారద వెంకయ్య
20. కుమార శతక కర్త ఎవరు?
    1) బద్దెన 2) కుమార ధూర్జటి
    3) ఫక్కి అప్పల నరసయ్య
    4) ధూర్జటి
21. శ్రీ భర్గ శతక కర్త?
    1) ధూర్జటి
    2) కూచిమంచి తిమ్మకవి
    3) సర్వేశ్వర కవి 4) పాల్కురికి సోమన
22. 'ప్రబోధం' పాఠ్యభాగ రచయిత ఎవరు?
    1) రాయప్రోలు సుబ్బారావు
    2) కాళోజీ
    3) ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
    4) కనుపర్తి వరలక్ష్మమ్మ
23. కనుపర్తి వరలక్ష్మమ్మ 'ప్రబోధం' పాఠ్యాంశం ఏ గ్రంథంలోనిది?
    1) గాంధీ దండకం 2) శారద లేఖలు
    3) మా చెట్టు నీడ ముచ్చట్లు
    4) ధర్మము నా జీవము
24. 'శారద లేఖలు' మొట్టమొదట ఏ పత్రికలో ప్రచురించారు?
    1) భారతి 2) కృష్ణాపత్రిక
    3) గృహలక్ష్మి 4) వినోదవాణి
25. 'రుబాయీలు' పాఠ్యభాగ రచయిత?
    1) డాక్టర్ దాశరథి
    2) డాక్టర్ సామల సదాశివ
    3) డాక్టర్ సి. నారాయణరెడ్డి
    4) డాక్టర్ నాగభైరవ
26. 'చూడదమనే కళ' పాఠ్యభాగ రచయిత?
    1) సామల సదాశివ
    2) నార్ల వేంకటేశ్వరరావు
    3) జిడ్డు కృష్ణమూర్తి
    4) కనుపర్తి వరలక్ష్మమ్మ
27. 'చూడదమనే కళ' పాఠ్యాంశంలో ఇతివృత్తం ఏది?
    1) సామాజిక చైతన్యం
    2) ప్రకృతి పరిశీలనం
    3) గ్రామీణ జీవనం
    4) సామాజిక స్పృహ
28. జిడ్డు కృష్ణమూర్తి 'ఏ టైమ్ లెస్ స్ప్రింగ్' ఆంగ్ల రచనకు అరుణామోహన్ చేసిన అనువాదం పేరు?
    1) గరుడయానం 2) ధ్యానం
    3) అనాదిప్రోతస్సు 4) నీవే ప్రపంచం
29. కాళోజీ 'ఈప్సు' పాఠ్యభాగం ఏ ప్రక్రియకు సంబంధించింది?
    1) గేయ కవిత 2) పద్య కవిత
    3) మినీ కవిత 4) వచన కవిత
30. 'ససేమిరా' పాఠ్యభాగ రచయిత 'కొరవి గోపరాజు' ఏ శతాబ్దికి చెందినవారు?
    1) 14వ శతాబ్దం 2) 15వ శతాబ్దం
    3) 16వ శతాబ్దం 4) 13వ శతాబ్దం
31. కొరవి గోపరాజు బిరుదు ఏది?
    1) కవితా వతంస
    2) బహుభాషా ప్రవీణ
    3) చతుర్విధ కవితా శారదుడు
    4) బహుశాస్త్ర పండితుడు
32. 'బతుకు పుస్తకం' ఎవరి ఆత్మకథ?
    1) ఉప్పల లక్ష్మణరావు
    2) అబ్దుల్ కలాం
    3) నార్ల వేంకటేశ్వరరావు
    4) సావిత్రి
33. దువ్వూరి రామిరెడ్డి రాజు చేతి పాలనా దండం కంటే ఏది గొప్పదని చెప్పారు?
    1) కలం 2) నాగలి
    3) గొడ్డలి 4) గునపం
34. 'ధర్మదీక్ష' పాఠ్యభాగం పిలకా గణపతి శాస్త్రి ఏ గ్రంథంలోనిది?
    1) విశాల నేత్రాలు
    2) మణిదీపిక
    3) ప్రాచీన గాథాలహరి
    4) రత్నాపహారం
35. ఎవరి జయంతిని మాతృభాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు?
    1) గురజాడ
    2) గిడుగు రామమూర్తి పంతులు
    3) వీరేశలింగం
    4) చిలకమర్తి లక్ష్మీ నరసింహం
36. బళ్లారి రాఘవ నట ప్రతిభకు ముగ్ధుడై 'రాఘవ మహారాజ్‌కి జై' అని ప్రశంసించిన వారు?
    1) రాజాజీ
    2) రవీంద్రనాథ్ ఠాగూర్
    3) గాంధీజీ 4) నెహ్రూ
37. 'నా సమాజాన్ని, సంస్కృతినీ, దేశాన్ని, ధర్మాన్ని విశ్వయవనిక మీద ఆవిష్కరించడమే నా లక్ష్యం' అని సగర్వంగా చెప్పిన చిత్రకారుడు?
    1) సంజీవదేవ్ 2) గుర్రం మల్లయ్య
    3) కాపు రాజయ్య 4) బాపు
38. మిద్దె రాములు ఒగ్గు కళాకారుడిగా మారేందుకు స్ఫూర్తినిచ్చిందెవరు?
    1) బగ్గం ఓదేలు 2) ఒగ్గరి అయిలయ్య
    3) కంబల్ల అయిలయ్య
    4) బగ్గం ఎంకటిగాడు
39. మిద్దె రాములు పొందిన కళా పురస్కారం?
    1) కళారత్న అవార్డు
    2) రాజీవ్ ప్రతిభా పురస్కారం
    3) తెలుగు విశ్వవిద్యాలయం కళా పురస్కారం
    4) పైవన్నీ
40. ఎర్రన బిరుదులేవి?
    1) కవిబ్రహ్మ, ఉభయ కవిమిత్రుడు
    2) ఆదికవి, శబ్ద శాసనుడు
    3) శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు
    4) సహజ కవి, నవీన గుణసనాథుడు
41. చిన్నయసూరిని 'సూరి' బిరుదుతో సత్కరించినవారు?
    1) సి.పి. బ్రౌన్ 2) అర్బత్‌నాట్
    3) కాల్డ్వెల్ 4) మెకాలే
42. 'బసవేశ్వరుడి పరిణయం' పాఠ్యభాగ రచయిత ఎవరు?
    1) పండితారాధ్యుడు
    2) పాల్కురికి సోమనాథుడు
    3) గౌరన
    4) యథావాక్కుల అన్నమయ్య
43. 'మాతృభావన' పాఠ్యభాగంలో ఇతివృత్తం?
    1) మానవతా విలువలు
    2) శ్రమపట్ల గౌరవం
    3) స్త్రీలపట్ల గౌరవం
    4) భారతీయ సంస్కృతి
44. 'పన్ లక్షత్ కౌన్ ఘతో' - అనే మరాఠీ పుస్తకాన్ని తెలుగులో 'అబలా జీవితం'గా అనువదించిన రచయిత?
    1) గుంటూరి శేషేంద్ర శర్మ
    2) సామల సదాశివ
    3) సి. నారాయణరెడ్డి
    4) పి.వి. నరసింహారావు
45. గత శతాబ్దంలో స్త్రీల పోరాటాలు, ఉద్యమాలు, రాణించిన రంగాల గురించి వివరించిన పాఠ్యభాగం?
    1) ధన్యుడు 2) నగర గీతం
    3) మా ప్రయత్నం 4) ధర్మదీక్ష
46. తొలి తెలుగు శతకమైన వృషాధిప శతకకర్త?
    1) బద్దెన 2) పాల్కురికి సోమన
    3) ఎలకూచి బాల సరస్వతి
    4) పోతన
47. ప్రేరణ పాఠ్యభాగ అనువాద రచయిత?
    1) పి.వి. నరసింహారావు
    2) ధన గోపాల్ ముఖర్జీ
    3) వాడ్రేవు చిన వీరభద్రుడు
    4) అరుణామోహన్
48. ఎ.పి.జె. అబ్దుల్ కలాం పూర్తి పేరేమిటి?
    1) అవుల్ పండిట్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం
    2) అవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ అబ్దుల్ కలాం
    3) అబ్దుల్ ఫకీర్ జైనులాబ్దీన్ కలాం
    4) ఆవుల్ ఫకీర్ జైనులాబ్దీన్ కలాం
49. కాశీఖండం కృతిపతి?
    1) మామిడి సింగన
    2) వల్లభ రాయుడు
    3) వీరభద్రారెడ్డి
    4) అవచి తిప్పయ్య శెట్టి
50. హరిహర బ్రహ్మదులను తన పాతివ్రత్య మహిమతో చంటి బిడ్డలుగా చేసిన సాధ్వి?
    1) సావిత్రి 2) సుమతి
    3) అనసూయ 4) సీత
51. 'కవిరాజు' బిరుదు ఉన్న శతక రచయిత?
    1) ఉత్పల సత్యనారాయణచార్యులు
    2) నంబి శ్రీధర్‌రావు
    3) వ.సు. రాయకవి
    4) శ్రీపతి భాస్కరకవి
52. ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి ఎవరు?
    1) తిక్కన 2) నన్నయ
    3) ఎర్రన 4) పోతన
53. మనుమసిద్ధి మహారాజు ఆస్థాన కవి?
    1) తిక్కన 2) శ్రీనాథుడు
    3) మారన 4) కేతన
54. నృసింహ పురాణ కృతిపతి?
    1) ప్రోలయ వేమారెడ్డి
    2) మల్లారెడ్డి
    3) అహోబిల నృసింహస్వామి
    4) రాజరాజ నరేంద్రుడు

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 2; 5) 4; 6) 2; 7) 3; 8) 2; 9) 3; 10) 2; 11) 4; 12) 3; 13) 2; 14) 2; 15) 4; 16) 3; 17) 4; 18) 2; 19) 3; 20) 3; 21) 2; 22) 4; 23) 2; 24) 3; 25) 2; 26) 3; 27) 2; 28) 3; 29) 4; 30) 2; 31) 3; 32) 1; 33) 2; 34) 3; 35) 2; 36) 3; 37) 3; 38) 2; 39) 4; 40) 3; 41) 2; 42) 2; 43) 3; 44) 4; 45) 3; 46) 2; 47) 3; 48) 2; 49) 3; 50) 3; 51) 2; 52) 3; 53) 1; 54) 3.

సాక్షి ప్లస్
ఆదివారం। 10-8-2025

క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

భారత అంతరిక్ష కార్యక్రమం

1. ఇస్రో ఏ దేశ సౌజన్యంతో సరళ్ అనే ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఫ్రాన్స్ బి) ఇజ్రాయెల్
సి) స్విట్జర్లాండ్ డి) అమెరికా
2. హబుల్ స్పేస్ టెలిస్కోపు తరహాలో భారత్ అభివృద్ధి చేస్తున్న ఖగోళశాస్త్ర పరిశోధన ఉపగ్రహం ఏది?
ఎ) ఆదిత్య బి) ఏస్ట్రోశాట్
సి) గెలీలియో డి) ఏదీకాదు
3. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్లను నిర్మించే కేంద్రం ఏది?
ఎ) విక్రం సారాభాయ్ అంతరిక్ష కేంద్రం
బి) సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం
సి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
డి) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ & టెక్నాలజీ
4. సుదూర రోదసిలోకి ప్రయోగించే చంద్రయాన్, మంగళ్‌యాన్ లాంటి ఉపగ్రహాల నుంచి సమాచారాన్ని తీసుకోవడానికి ఉద్దేశించిన ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్ (IDSN) అనే గ్రౌండ్ వ్యవస్థను ఎక్కడ ఏర్పాటు చేశారు ?
ఎ) గాదంకి, తిరుపతి
బి) బైలాలు, బెంగళూరు
సి) తిరువనంతపురం డి) హైదరాబాద్
5. మంగళ్‌యాన్ బరువు ఎంత?
ఎ) 2562 కిలోలు బి) 3333 కిలోలు
సి) 1337 కిలోలు డి) 5555 కిలోలు
6. ఇండియన్ రీజినల్ నేవిగేషనల్ శాటిలైట్ సిస్టమ్ ఇప్పటివరకు ఎన్ని ఉపగ్రహాలను ప్రయోగించింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
7. భారత్ తొలిసారిగా రాకెట్‌ను ఎప్పుడు ప్రయోగించింది?
ఎ) 1963 నవంబర్ 21
బి) 1975 ఏప్రిల్ 1
సి) 1969 ఆగస్టు 15
డి) 1975 ఏప్రిల్ 19
8. ఇస్రో వాణిజ్య విభాగం ఏది?
ఎ) ఇస్రో శాటిలైట్ సెంటర్
బి) స్పేస్ అప్లికేషన్స్ సెంటర్
సి) యాంట్రిక్స్ కార్పొరేషన్
డి) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్
9. యురోపియన్ యూనియన్ అభివృద్ధి చేస్తున్న ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ ?
ఎ) క్వాజీజెనిథ్ బి) బిడే
సి) గెలీలియో డి) గ్లోనాస్
10. నాసా ప్రయోగించిన ఏ ఉపగ్రహం సౌర వ్యవస్థ వెలుపల అంతర నక్షత్ర ప్రాంతానికి చేరింది?
ఎ) క్యూరియాసిటీ బి) మావెన్
సి) అట్లాంటిస్ డి) వాయేజర్
11. ఇండియన్ రీజినల్ నావిగేషనల్ శాటిలైట్ వ్యవస్థ భారత భూభాగ సరిహద్దుల నుంచి ఎంత దూరం వరకు సేవలు అందిస్తుంది?
ఎ) 1500 కి.మీ. బి) 3000 కి.మీ.
సి) 5000 కి.మీ. డి) 6500 కి.మీ.
12. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థలో సేవలకు కనీసం ఎన్ని ఉపగ్రహాలు అవసరం?
ఎ) 1 బి) 2 సి) 4 డి) 6
13. ఇస్రో ప్రయోగించిన స్పాట్-6, స్పాట్-7 ఉపగ్రహాలు ఏ దేశానికి చెందినవి?
ఎ) ఫ్రాన్స్ బి) ఆస్ట్రేలియా
సి) జపాన్ డి) జర్మనీ
14. IRNSS-1D ఉపగ్రహం బరువు?
ఎ) 2,500 కిలోలు బి) 1425 కిలోలు
సి) 3,500 కిలోలు డి) 750 కిలోలు
15. దేశీయ క్రయోజనిక్ ఇంజన్‌ను విజయ వంతంగా ప్రయోగించిన నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 27
బి) పీఎస్ఎల్‌వీ సీ 25
సి) జీఎస్ఎల్‌వీ డీ 3
డి) జీఎస్ఎల్‌వీ డీ 5
16. ఉపగ్రహ ఆధారిత విమానయానానికి ఉద్దేశించిన వ్యవస్థ?
ఎ) ఆకాశ్ బి) గగన్
సి) భువన్ డి) IRNSS
17. తొలిసారిగా జీపీఎస్‌ను అభివృద్ధి చేసిన దేశం?
ఎ) బ్రిటన్ బి) ఫ్రాన్స్
సి) అమెరికా డి) రష్యా
18. 'మార్స్ వన్' కార్యక్రమానికి భారత్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కిందివారిలో దీనికి ఎవరు ఎంపిక కాలేదు?
ఎ) రితికా సింఘ్ బి) అవినాష్ సక్సేనా
సి) శ్రద్ధ ప్రసాద్
డి) తరన్‌జిత్ సంఘ్ భాటియా
19. అమెరికా అభివృద్ధి చేసిన గ్లోబల్ పొజిషనింగ్ సిస్టంలోని ఉపగ్రహాల సంఖ్య?



ఎ) 16 బి) 24 సి) 28 డి) 32
20. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ ఎక్కడ ఉంది?
ఎ) డెహ్రాడూన్ బి) ముంబై
సి) తిరువనంతపురం డి) బెంగళూరు
21. చంద్రయాన్-1 ప్రయోగాన్ని ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 2007 బి) 2008
సి) 2009 డి) 2010
22. చంద్రయాన్-1లో భారత్‌తో భాగస్వామ్యం కాని దేశం ?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) యురోపియన్ యూనియన్
డి) బెల్జియం
23. 4500-5000 కిలోల బరువున్న ఉపగ్రహాలను సైతం ప్రయోగించగలిగే భారత అంతరిక్ష నౌక?
ఎ) పీఎస్ఎల్‌వీ - XL
బి) జీఎస్ఎల్‌వీ - మార్క్ I
సి) జీఎస్ఎల్‌వీ - మార్క్ II
డి) జీఎస్ఎల్‌వీ - మార్క్ III
24. పీఎస్ఎల్‌వీ ఇప్పటివరకు వరుసగా ఎన్ని విజయాలను నమోదు చేసుకుంది?
ఎ) 30 బి) 29 సి) 28 డి) 27
25. ఇస్రో ఆధ్వర్యంలో పనిచేసే ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) అహ్మదాబాద్ బి) పుణే
సి) తిరువనంతపురం డి) శ్రీహరికోట
26. సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రంలో పూర్తిస్థాయిలో ఎన్ని రాకెట్ లాంచింగ్ పాడ్‌లు ఉన్నాయి?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
27. ఇప్పటివరకు ఎన్ని జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు నిర్వహించారు?
ఎ) 7 బి) 16 సి) 9 డి) 10
28. చుట్టూ స్ట్రాప్-ఆన్ మోటార్లు లేని పీఎస్ఎల్‌వీ కోర్ అలోన్ రూపం లిఫ్ట్-ఆఫ్ సమయంలో బరువు ఎంత?
ఎ) 294 టన్నులు బి) 320 టన్నులు
సి) 230 టన్నులు డి) 630 టన్నులు
29. అత్యధికంగా ఒకేసారి పది ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ నౌక ఏది?
ఎ) పీఎస్ఎల్‌వీ సీ 8
బి) పీఎస్ఎల్‌వీ సీ 9
సి) పీఎస్ఎల్‌వీ సీ 10
డి) పీఎస్ఎల్‌వీ సీ 11
30. నేషనల్ అట్మాస్ఫెరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ఎక్కడ ఉంది?
ఎ) హైదరాబాద్ బి) తిరుపతి
సి) చెన్నై డి) బెంగళూరు
31. ఇస్రో ప్రయోగించిన జపాన్ ఉపగ్రహం?
ఎ) టెక్సర్ బి) అజైల్
సి) యూనిబ్రైట్ డి) ప్రొ మెటరస్
32. ఇస్రో ఇప్పటివరకు కిందివాటిలో ఏ దేశ ఉపగ్రహాలను ప్రయోగించలేదు?
ఎ) అల్జీరియా బి) లక్సెంబర్గ్
సి) అర్జెంటీనా డి) నైజీరియా
33. భారత వ్యోమగామి అధికారిక పేరు?
ఎ) వ్యోమోనాట్ బి) రోదసీనాట్
సి) ఖగోళనాట్ డి) పైవేవీకావు
34. జీఎస్ఎల్‌వీ కార్యక్రమం ఎప్పుడు మొదలైంది?
ఎ) 1990
బి) 1993
సి) 1995
డి) 1997
35. అంగారక కక్ష్యలోకి విజయవంతంగా మంగళ్‌యాన్ చేరినట్లు మొదట గుర్తించింది?
ఎ) ఇండియా డీప్ స్పేస్ నెట్‌వర్క్
బి) కాన్‌బెర్రా డీప్ స్పేస్ నెట్‌వర్క్
సి) నాసా డీప్ స్పేస్ నెట్‌వర్క్
డి) యురోపియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్
36. అంగారకుడిపై ప్రధానంగా ఏ వాయువును గుర్తిస్తే జీవ సంకేతాలకు సమాచారం లభించే అవకాశముంటుంది?
ఎ) అమ్మోనియా బి) మీథేన్
సి) హైడ్రోజన్ డి) ఆక్సిజన్
37. చంద్రయాన్-1లో భాగంగా ఏ దేశానికి చెందిన పరికరం చంద్రునిపై నీటి జాడలను గుర్తించింది?
ఎ) భారత్ బి) అమెరికా
సి) బెల్జియం డి) జర్మనీ
38. ఇస్రో పీఎస్ఎల్‌వీ - సీ 18 ద్వారా ప్రయోగించిన జుగ్ను ఉపగ్రహాన్ని నిర్మించింది?
ఎ) ఐఐటీ, లక్నో బి) ఐఐటీ, చెన్నై
సి) ఐఐటీ, కాన్పూర్ డి) ఐఐటీ, ముంబై
39. ఈశాన్య రాష్ట్రాల్లో అంతరిక్ష సేవలను విస్తరించే లక్ష్యంతో ఏర్పాటైన నార్త్ ఈస్టర్న్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ ఎక్కడ ఉంది?
ఎ) యుమియం, మేఘాలయ
బి) పాకియాంగ్, సిక్కిం
సి) దిస్‌పూర్, అసోం డి) అగర్తల, త్రిపుర
40. క్రయోజనిక్ ఇంజన్‌లో వినియోగించే ప్రొపెల్లెంట్?
ఎ) ద్రవ ఆక్సిజన్
బి) డై మిథైల్ హైడ్రోజన్
సి) ద్రవ హైడ్రోజన్
డి) పాలిబ్యుటాడైఈన్
41. ఇస్రో ఇనర్షియల్ సిస్టం యూనిట్ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) అహ్మదాబాద్
సి) తిరువనంతపురం డి) ముంబై

సమాధానాలు

1) ఎ;	2) బి;	3) ఎ;	4) బి;
5) సి;	6) డి;	7) ఎ;	8) సి;
9) సి;	10) డి;	11) ఎ;	12) సి;
13) ఎ;	14) బి;	15) డి;	16) బి;
17) సి;	18) బి;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) డి;	24) సి;
25) ఎ;	26) బి;	27) బి;	28) సి;
29) బి;	30) బి;	31) డి;	32) డి;
33) ఎ;	34) ఎ;	35) బి;	36) బి;
37) బి;	38) సి;	39) ఎ;	40) సి;
41) సి;			

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎంసీ-ఏసీటీఆర్ఈసీలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

నవీ ముంబైలోని టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ)-అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ట్రీట్‌మెంట్, రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ క్యాన్సర్(ఏసీటీఆర్ఈసీ) జూనియర్ రీసెర్చ్ ఫెలోల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంఎస్సీ(లైఫ్ సైన్సెస్)లో ఉత్తీర్ణతతో పాటు సీఎస్ఐఆర్ యూజీసీ నెట్ గేట్ అర్హత సాధించడంతో పాటు పైథాన్ ప్రోగ్రామింగ్, హై-త్రోపుట్ జీనోమిక్ డేటా అనాలసిస్‌లో అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.37,000 నుంచి రూ.48,100.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** jrfpzp@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025.
» **వెబ్‌సైట్:** https://actrec.gov.in/

ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-01, డిప్యూటీ మేనేజర్-01.
» **విభాగాలు:** ప్లానింగ్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్, ఎలక్ట్రికల్ డిజైన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.08.2025.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in/

Few people practice what they...

BANK EXAMS

ENGLISH



Model Questions

Directions (Q. No. 1-6): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

It is easy for the government to control state owned companies through nods and winks. So, what really needs to be done as a first step is to put petrol pricing on a **transparent** formula. If the price of crude is x and the exchange rate y, than every month or fortnight, the government announces a **maximum** price of petrol, which anybody can work out from the x and the y. The rule has to be worked out to make sure that the oil-marketing companies can, in general, cover their costs. This will mean that if one company can innovate and cut costs, it will make greater profits. Hence, firms will be more prone to innovate and will be more efficient under this system. Once the rule is announced there should be no **interference** by the government. If, this is done for a while, private companies will reenter this market. And once a sufficient number of them are in **fray**, we can remove the rule based pricing and leave it truly to the market.

1. According to the passage an oil company can make greater profits, if a transparent pricing for petrol pricing is announced every fortnight or month, by
a) Promoting its sales
b) Undertaking innovation
c) Cutting costs
d) Selling its equity shares at higher prices
Which of the statements given above is/are correct?
1) a only 2) b & c
3) c & d 4) a, b, & d 5) c only
2. According to the passage, private oil companies reenter the market if
a) A transparent rule based petrol pricing exists
b) There is no government interference in the oil producing market
c) Subsidies are given by the government
d) Regulations of anti-trust are removed
Which of the statements given above are correct?
1) a & b 2) b & c
3) c & d 4) b & d 5) a & c
3. The synonym of **transparent** is
1) Opaque 2) Visible 3) Obscure
4) Dense 5) Thick
4. The synonym of fray is
1) Scrimmage 2) Amicable
3) Harmony 4) Accord
5) Concord
5. The synonym of interference is
1) Prying 2) Preying
3) Praying 4) Praising
5) Pricking
6. The antonym of maximum is
1) Optimum 2) Zenit
3) Pinnacle 4) Least
5) Summit

Directions (Q. No. 7-10): Choose the word which is wrongly spelt from the five options given.

7. 1) servitude 2) debenture
3) promiscous 4) reminiscence
5) juvenile
8. 1) comitment 2) session
3) garage 4) gargle
5) phlegm
9. 1) rendevous 2) bourgeois
3) repertoire 4) memoir
5) aficionado
10. 1) avalanche 2) bouqet
3) boutique 4) chameleon
5) veracity

Directions (Q.No. 11 - 20): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

11. The workweek in the United States (1)/ have steadily increased to the point (2)/ that the average worker now puts in (3)/ an estimated 164 extra hours of paid labor a year. (4)/ No error (5)
12. Astronomers studying (1)/ the newly discovered star (2)/ said that it provides clues (3) / about our galaxy's origin. (4)/ No error (5)
13. Building large new hospitals (1)/ in this area (2)/ would constitute (3)/ the wasteful use of resources. (4)/ No error (5)
14. Corporations will soon be required (1)/ to report to the government (2)/ whether they had the necessary reserves (3)/ to pay the pension benefits. (4)/ No error (5)
15. For most consumers, (1)/ the price of automobile insurance (2)/ continues (3)/ to raise annually. (4)/ No error (5)
16. Geologists believe that the warning signs from a major earthquake (1)/ may include sudden fluctuations (2)/ in local seismic activity, (3)/ tilting and other deformations of the Earth's crust. (4)/ No error (5)
17. Humans have been damaging (1)/ the environment for centuries (2)/ by overcutting trees (3)/ and farming to intensively. (4)/ No error (5)
18. If industrial pollution continues to deplete the ozone layer, (1)/ the result increase in ultraviolet radiation (2)/ will endanger human health, (3)/ causing a rise in the incidence of skin cancer and eye disease. (4)/ No error (5)
19. Ignoring the admonitions of his staff, (1)/ the chief financial officer (2)/ accepted the advice (3)/ if the consulting company. (4)/ No error (5)
20. In a plan to stop the erosion of East Coast beaches, (1)/ the Army Corps of Engineers (2)/ proposed building parallel to shore (3)/ breakwater of rocks. (4)/ No error (5)

Directions: (Q No. 21 -25): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

21. When I entered the room, I saw a snake crawling <u>on the ground</u>.
1) On the floor
2) In the ground
3) In the flooring
4) On the land
5) No correction required
22. I get a monthly allowance <u>of hundred rupees</u>.
1) Hundred rupees
2) A hundred rupees
3) For hundred rupee
4) Hundreds rupee
5) No correction required
23. My sister and <u>myself</u> are pleased to accept your invitation to dinner.
1) Ourselves 2) Mine
3) I 4) Me
5) No correction required
24. Harish has read almost <u>each book</u> of the college library.
1) Many books 2) All book
3) Much books 4) Every book
5) No correction required
25. He never has, <u>and never will permit</u> such practices in his office.
1) Permitted nor ever will permit
2) Permitted nor will ever permit
3) And will never permit
4) Nor will permit
5) No correction required

Directions (Q.No. 26 - 35): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

26. I shall acquaint you —— the facts.
1) of 2) about 3) with
4) for 5) from
27. My uncle —— speak five languages.
1) ought 2) might 3) used
4) could 5) will
28. Progressive Muslims were —— when the Prime Minister bought a bill to —— the Muslim fundamentalists.
1) Taken after… appear
2) Taken for… please
3) Taken in… impress
4) Taken back… appease
5) Taken to… amaze
29. In order to keep his position ——, the politician —— his colleague to the wolves.
1) Safely…through
2) Safety…thorough
3) Safe… thrown
4) Secure…threw
5) Safer… made
30. Few people practice what they ——.
1) Urge 2) Preach 3) Lecture
4) Deliver 5) Advocate
31. —— to increase in wage of labourers, many farmers were forcing their children to involve them in—— activities.
1) Owing…farm
2) Because… farming
3) As… agriculture
4) Remaining… subsequent
5) Schedule… prosperous
32. Every day, in some part of our world, a scientific —— happens.
1) Break away 2) Break off
3) Breakthrough 4) Break even
5) Break upon
33. The huge procurement —— all the more necessary with the —— of the food security act.
1) Is becoming…importance
2) Becomes… implementation
3) Became… production
4) Become… prevention
5) Becoming… propulsion
34. The problems that ——higher education in India today are low rates of enrolment and poor —— of infrastructure.
1) Confront… quality
2) Encounter… quantity
3) Belong… property
4) Come… value
5) Pursuit… rate
35. There is a —— control over food supply in India.
1) Deal 2) duel 3) dual
4) drool 5) lot

Directions (Q. No. 36-40): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) I was the seventh child in a family of four pairs of brothers and sisters.
B) Today perhaps your only association with the word 'polio' is the Sabin Oral Vaccine that protects children from the disease.
C) I was also considered to be the healthiest of the brood.
D) If somebody had predicted, when I was born that this would happen to me, no one would have believed it.
E) The dreaded disease, which mainly affects the brain and the spinal cord, causes stiffening and weakening of the muscles, crippling and paralysis – which is why I am in a wheelchair today.
F) Fifty five years ago, this was not so.

36. What is the FIRST sentence after rearrangement?
1) C 2) B
3) D 4) E 5) F
37. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B
3) D 4) F 5) E
38. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C
3) D 4) E 5) F
39. What is the FIFTH sentence after rearrangement?
1) B 2) A 3) D
4) E 5) F
40. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D
4) E 5) F

Answers

1) 2	2) 1	3) 2	4) 1	5) 1
6) 4	7) 3	8) 1	9) 1	10) 2
11) 2	12) 3	13) 4	14) 3	15) 4
16) 1	17) 4	18) 2	19) 4	20) 5
21) 1	22) 2	23) 3	24) 4	25) 1
26) 3	27) 4	28) 4	29) 4	30) 2
31) 1	32) 3	33) 2	34) 1	35) 3
36) 2	37) 5	38) 3	39) 2	40) 5